సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 17 | సంచిక: 248

శుక్రవారం | 29-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



బేర్ మెరుపుదాడి

సెన్సెక్స్ 1,190 పాయింట్లు క్రాష్.. నిఫ్టీ 361 పాయింట్లు డౌన్ -15లో



ఆకతాయిలపై సైబర్ గస్తీ!

అత్యాధునిక టూల్స్‌తో సైబర్ పెట్రోలింగ్.. పీ సైబర్ ల్యాబ్ కీలక పాత్ర -16లో



సీఎంగా హేమంత్ ప్రమాణం

జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేత హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు.


వివరాలు 6లో ▸



ఎంపీగా ప్రియాంకా గాంధీ..

వయనాడ్ లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలుపొందిన ప్రియాంక గాంధీ వాద్రా ఎంపీగా ప్రమాణంచేశారు.

వివరాలు 6లో ▸



'వక్ఫ్ సవరణ'పై గడువు పెంపు

వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటు చేసిన జాయింట్ కమిటీ గడువును వచ్చే బడ్జెట్ సమావేశాల చివరిరోజు దాకా పొడిగించారు.

వివరాలు 6లో ▸



పదవులపై మల్లగుల్లాలు

మహారాష్ట్రలో అధికారపీఠాన్ని దక్కించుకున్న మహాయుతి కూటమి పార్టీలు అధికార పంపిణీపై మల్లగుల్లాలు పడుతున్నాయి.

వివరాలు 6లో ▸

పల్లెల్లో ఇథనాల్ చిచ్చు!

రాష్ట్రంలో ఇథనాల్ బ్లెండింగ్ పరిశ్రమలపై వ్యతిరేకత

కాలుష్యకారక పరిశ్రమలు వద్దంటూ రైతుల ఆందోళన

తమ ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందంటూ నిరసనలు

31 రాష్ట్రంలో ధాన్యం, మొలాసిస్ ఆధారిత ఇథనాల్ తయారీ కోసం కంపెనీల దరఖాస్తులు

28 సంస్థలకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

- ఇప్పటికే చిత్తనూరులోని జూరాల ఆర్గానిక్ ఫార్మ్‌లో ఇథనాల్ తయారీ
- మక్తల్, గద్వాలలో నిర్మాణం ప్రారంభం.. మరికొన్నిచోట్ల సన్నాహాలు
- జనం వ్యతిరేకతతో దిలావర్‌పూర్ యూనిట్ అనుమతులపై సర్కారు వెనక్కి
- కాలుష్యం వెలువడుతోందంటూ రైతు కమిషన్‌కు ఫిర్యాదులు



అనుమతులిచ్చింది నాటి సర్కారే

గత సర్కారు దిలావర్‌పూర్‌లో ఇథనాల్ కంపెనీకి నిబంధనలు ఉల్లంఘించి అనుమతులు ఇచ్చిందని కాంగ్రెస్ సర్కారు అంటోంది. కేంద్రం కోరిన ఇథనాల్ ఫ్యూయల్ తయారీకి బదులుగా.. ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్సల్యూట్ ఆల్కాహాల్ వంటి ఇతర ఉత్పత్తులకు రాష్ట్ర మంత్రివర్గం 2022లో అనుమతి ఇచ్చిందని చెబుతోంది. ఈ క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ పంచాయతీ నుంచి ఎన్‌ఓసీ, పర్యావరణ అనుమతులు, ఇతర ఉత్పత్తులకు లెటర్ ఆఫ్ ఇండెంట్ జారీ అంశాల్లో పీఎంకే డిస్టిలేషన్స్ నిబంధనలను ఉల్లంఘించిందని అధికారులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి కేటాయింపులు మాత్రమే జరిగాయని చెబుతున్నారు.

సాక్షి, హైదరాబాద్: పెట్రోలియం దిగుమతుల భారాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్' తెలంగాణ పల్లెల్లో చిచ్చు పెడుతోంది. పెట్రోల్‌లో కలిపేందుకు అవసరమైన ఇథనాల్ తయారీ కోసం కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. చెరుకు నుంచి చక్కెర తీయగా మిగిలే మొలాసిస్, ధాన్యం నుంచి అవి ఇథనాల్‌ను తయారు చేస్తాయి. అయితే రాష్ట్రంలో ఈ యూనిట్ల ఏర్పాటుకు స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏడాది క్రితం నారాయణపేట జిల్లా చిత్తనూరులో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. తాజాగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై స్థానికులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపట్టడంతో.. పనులు నిలిపివేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాలుష్య రహితంగా (జీరో లిక్విడ్ డిశ్చార్జి) ఏర్పాటు కావాల్సిన ఇథనాల్ ఫ్యాక్టరీలు నిబంధనలు పాటించట్లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇథనాల్ ఫ్యాక్టరీలు వాయు, జల కాలుష్యానికి కారణమై తమ ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందంటూ చిత్తనూరు, దిలావర్‌పూర్ ప్రాంత వాసులు ఆందోళనలు చేపట్టారు.

రాష్ట్రంలో 28 సంస్థలకు గ్రీన్ సిగ్నల్

విదేశాల నుంచి శిలాజ ఇంధనాల దిగుమతిని తగ్గించడం, విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం 2018లో నేషనల్ బయో ఫ్యూయల్ పాలసీని ప్రవేశపెట్టింది. 2025–26 నాటికి మొలాసిస్ లేదా ధాన్యం నుంచి ఏటా 1,080 కోట్ల లీటర్ల ఇథనాల్‌ను ఉత్పత్తి

మిగతా 2వ పేజీలో ▸

పోలింగ్‌లో అంతటి వ్యత్యాసం..

నిజంగా ఆందోళనకరం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వివాదంపై ఇండియాటుడే ఇంటర్వ్యూలో మాజీ సీఈసీ ఖురేషీ



- ఎంత పోలింగ్ అయిందీ ఎప్పటికప్పుడు ఫారం–17సీలో నమోదవుతూనే ఉంటుంది.. అలాంటప్పుడు మర్నాటికల్లా పోలింగ్ శాతం భారీగా ఎలా పెరిగిపోయింది?
- ఇదెలా సాధ్యమో అర్థం కావడం లేదన్న మాజీ సీఈసీ
- దీనిపై ఈసీ కచ్చితంగా వివరణ ఇవ్వాల్సిందేనన్న ఖురేషీ
- ఈవీఎంలపై దేశవ్యాప్తంగా అనుమానాలున్నాయని వ్యాఖ్య

3లో

పోలింగ్ ముగిశాక 7% ఓటింగ్ ఎలా పెరిగింది?

ఈసీ సమాధానం చెప్పాలి: నానా పటోలే డిమాండ్ 6లో

చారిత్రక నిర్ణయాలతో..

సంపద సృష్టించాం

చంద్రబాబు పాలనలో సంపద ఆవిరైంది



కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆగ్రహం

- సెకీతో కారుచౌకగా యూనిట్ రూ. 2.49కే కొనుగోలు చేయడం ద్వారా రూ. 1.10 లక్షల కోట్లు ఆదా చేశాం.. ఇది సంపద సృష్టి కాదా?
- 17 మెడికల్ మెడికల్ కాలేజీలు, రూ. 13 వేల కోట్లతో మూడు పోర్టుల నిర్మాణం.. భవిష్యత్‌లో వీటి వల్ల వచ్చే ఉద్యోగాలు, పెరిగే జీఎస్‌డీపీ, అభివృద్ధి తదితర అంశాల ద్వారా భారీగా పెరగనున్న సంపద

3లో



సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా గురువారం ఎన్యుమరేటర్‌కు తన వివరాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

విద్యార్థుల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే వేటే

ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై అధికారులకు సీఎం రేవంత్ హెచ్చరిక

- ఎన్నిసార్లు హెచ్చరించినా ఎందుకిలా జరుగుతోంది?
- స్కూళ్లు, హాస్టళ్లు, గురుకులాలను కలెక్టర్లు తరచూ తనిఖీ చేయాలి
- అప్రతిష్ట పాల్జేసేందుకే కొందరు హాస్టళ్లలో ఆహారంపై వదంతులు సృష్టిస్తున్నారని మండిపాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్‌తో వరుసగా అస్వస్థతకు గురవుతున్న అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. పలుమార్లు హెచ్చరించినా ఇలాంటి ఘటనలు జరగడాన్ని తీవ్రంగా పరిగణించారు. విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, వారికి అందించే ఆహారం విషయంలో

మిగతా 11వ పేజీలో ▸

ఆహార నాణ్యతపై టాస్క్‌ఫోర్స్ 11లో

టెన్త్‌లో ఇంటర్నల్ మార్కుల ఎత్తివేత



గ్రేడింగ్ విధానానికి కూడా స్వస్తి

100 మార్కులకు ప్రశ్నపత్రం

సాక్షి, హైదరాబాద్: పదవతరగతి పరీక్ష విధానంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ప్రస్తుతం ఉన్న గ్రేడింగ్‌ను ఎత్తివేసింది. దీని స్థానంలో గతంలో మాదిరిగానే మార్కులను వెల్లడించనున్నారు. ఇప్పటి వరకూ ఉన్న 20 అంతర్గత మార్కులను కూడా ఎత్తివేశారు. ఇక నుంచి వంద మార్కులకు పరీక్ష పేపర్ ఉంటుంది. ఈ మార్పులతో కూడిన ఉత్తర్వులను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం

మిగతా 5వ పేజీలో ▸



రైతన్నలూ.. ఆయిల్‌పాం

సాగు చేయండి

మొదటి మూడేళ్లు పెట్టుబడి ప్రభుత్వానిదే.. అంతర పంటలు వేస్తే బోనస్

- మీ బతుకుల్లో వెలుగులు నింపుతాం.. లేకుంటే ఏ శిక్షకైనా సిద్ధం
- మహబూబ్‌నగర్ రైతు సదస్సులో వ్యవసాయ మంత్రి తుమ్మల
- యాంత్రీకరణ, కొత్త పంటలపై స్టాళ్ల ద్వారా రైతులకు అవగాహన

5లో

ఫిబ్రవరిలో 'స్థానిక' సమరం!

జనవరి 14న నోటిఫికేషన్?

ఈసారి ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారికీ పోటీకి చాన్స్! 2లో

అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలకు

'ధరణి' పవర్స్

సర్క్యులర్ జారీ చేసిన సీసీఎల్‌ఏ

వివరాలు 5లో

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు కేసీఆర్ సన్మానం


శ్రీనివాస్‌రెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న కేసీఆర్. చిత్రంలో కేసీఆర్ సతీమణి శోభ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు అమెరికాలో స్థిరపడనున్న సందర్భంగా.. వారిని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సత్కరించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో ఆయనను శ్రీనివాస్‌రెడ్డి దంపతులు కలిశారు. అమెరికాలో తన కుమారుడు స్థిరపడటంతో.. ఇకపై అక్కడే ఉండాలని శ్రీనివాస్‌రెడ్డి నిర్ణయించుకున్నారు. ఆయనకు అమెరికా పౌరసత్వం కూడా లభించినట్లు సమాచారం. ఈ సందర్భంగా అమెరికాకు వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డితో తన ఆత్మీయ అనుబంధాన్ని కేసీఆర్ నెమరువేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీనివాస్‌రెడ్డి పాత్రను గుర్తు చేసుకుంటూ.. ఘనంగా వీడ్కోలు పలికారు.

ఉద్యమ స్ఫూర్తి రగిలించేలా ‘దీక్షా దివస్’

సర్వశక్తులూ ఒడ్డుతున్న బీఆర్ఎస్

నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో గులాబీ శ్రేణుల సమావేశాలు

- బసవతారకం ఆస్పత్రి నుంచి నిమ్స్ వరకు ర్యాలీ
- నిమ్స్‌లో అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ
- కరీంనగర్ జిల్లాలో కేటీఆర్, సిద్దిపేటలో హరీశ్, నిజామాబాద్‌లో కవిత..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో తిరిగి రగిలించడమే లక్ష్యంగా ‘దీక్షా దివస్’ నిర్వహిస్తామని ప్రకటించిన బీఆర్ఎస్.. దానిని విజయవంతం చేసేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. తెలంగాణ సాధన కోసం 2009 నవంబర్ 29న పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షను గుర్తు చేస్తూ బీఆర్ఎస్ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లో ‘దీక్షా దివస్’ నిర్వహించనుంది. కేడర్‌ను సమీకరించేందుకు ఇప్పటికే పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు, కీలక నేతలను జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లుగా ప్రకటించి బాధ్యతలు అప్పగించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగే దీక్షాదివస్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు ఇతర కీలక నేతలు పాల్గొంటారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై జైలు నుంచి విడుదలైన ఎమ్మెల్సీ కవిత సుదీర్ఘ విరామం తర్వాత దీక్షాదివస్‌లో పాల్గొనేందుకు తెలంగాణభవన్‌కు రానున్నారు. కేటీఆర్ కరీంనగర్ జిల్లా అలుగునూర్‌లో, హరీశ్‌రావు సిద్దిపేటలో, కవిత నిజామాబాద్‌లో ఉదయం జరిగే దీక్షాదివస్‌లో, మాజీ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమ తమ జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. దీక్షాదివస్ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని బసవతారకం ఆస్పత్రి నుంచి తెలంగాణ భవన్‌కు భారీ ర్యాలీ నిర్వహిస్తారు. కేసీఆర్ దీక్ష విరమించిన రోజును గుర్తు చేస్తూ డిసెంబర్ 9న మేడ్చల్‌లో కేటీఆర్ చేతుల మీదుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

జాతీయ పార్టీలే లక్ష్యంగా...

బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి కేడర్ ను సమీకరించి దీక్షాదివస్ నిర్వహించనుంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ లక్ష్యంగా శుక్రవారం జరిగే సమావేశాల్లో విమర్శలు సంధించి పార్టీ కేడర్‌లో జోష్ నింపాలని భావిస్తోంది. ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేలా దీక్షాదివస్ సమావేశాలు ఉంటాయని పార్టీవర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ వైఫల్యాలపై కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉంటున్న తీరును కేడర్‌కు విడమరిచి చెప్పాలని పార్టీ ఆదేశించింది. రైతు భరోసా, రైతు రుణమాఫీ, ధాన్యం బోనస్, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం తదితరాలపై ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించిన బీఆర్ఎస్.. వాటిని మరింత బలంగా దీక్షాదివస్ వేదికగా ప్రశ్నించనుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడంలో దీక్షాదివస్ తొలిఅంకమని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత నిస్తేజంగా మారిన పార్టీ కేడర్‌లో కదలిక తెచ్చేందుకు ఈ సమావేశాలు ఉపయోగపడుతాయని భావిస్తున్నారు.

క్లుప్తంగా...

ఇథనాల్‌కు అనుమతి ఇచ్చి ఇప్పుడు ఆందోళనలా?

మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ కంపెనీకి తమ ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇచ్చిన బీఆర్ఎస్.. ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్‌పై నిందలు వేసే ప్రయత్నం చేస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. ఆమె గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ సంతకాలతో అనుమతులున్నాయని స్పష్టం చేశారు. డైరెక్టర్‌గా మాజీ మంత్రి తలసాని కొడుకు తలసాని సాయి ఉండటంపై కేటీఆర్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తలసాని శ్రీనివాస్ వియ్యంకుడు పుట్టా సుధాకర్ కూడా ఇథనాల్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉంటే.. కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం దివాలా కోరుతనమన్నారు. గురుకులాల్లో మంచి సౌకర్యాల కోసం మంత్రులు, అధికారులు ప్రయత్నం చేస్తున్నారని సీతక్క చెప్పారు.

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్‌దే

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధీమా



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాన్ని తిరిగి కాంగ్రెస్ చేజిక్కించుకుంటుందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై ఇందులో చర్చ జరిగింది. సమావేశం అనంతరం మంత్రి సురేఖ, షబ్బీర్ అలీతో కలిసి జీవన్‌రెడ్డి విలేకరులకు వివరాలను వెల్లడించారు. పట్టభద్రుల ఎన్నికకు ప్రస్తుతం ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఎవరికి వారు అభ్యర్థిగా ప్రకటించుకుంటే కాదని, అధిష్టానం అభ్యర్థిని ఎంపిక చేస్తుందని స్పష్టం చేశారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. అభ్యర్థి ఎంపికపై కమిటీ వేస్తామని చెప్పారు. మరోసారి పోటీ చేయాలని జీవన్ రెడ్డిని పార్టీ నేతలు కోరారని, ఈ మేరకు అధిష్టానానికి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నిందితుడు (ఏ–6) ఏ.శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. గత నెల పాస్‌పోర్టు అథారిటీ శ్రవణ్ పాస్‌పోర్టును రద్దు చేసింది. ఆయన ఏ విమానాశ్రయంలో దిగినా హైదరాబాద్ పోలీసులకు సమాచారం వచ్చేలా చర్యలు చేపట్టారు. ట్రయల్ కోర్టు కూడా ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో శ్రవణ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత తీర్పును రిజర్వు చేశారు.



పల్లెల్లో ఇథనాల్ చిచ్చు!

▶ మొదటి పేజీ తరువాయి

చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో తెలంగాణకు 43 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించింది. ఇథనాల్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే సంస్థలకు ‘ఇథనాల్ ఇంటరెస్ట్ సబ్‌వెన్షన్ స్కీమ్’ కింద వడ్డీ రేటులో 4 శాతం నుంచి 50శాతం వరకు రాయితీ ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణలో ఇథనాల్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు 31 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో 2018 నుంచి 2022 మధ్యకాలంలో 28 సంస్థలకు అనుమతి ఇచ్చింది. మొత్తంగా రోజుకు 5,256 కిలోలీటర్ల (కేఎల్‌పీడీ) ఇథనాల్ తయారీ ప్రతిపాదనలను ఆమోదించింది. వీటిలో నారాయణపేట జిల్లా చిత్తనూరులో వీటిలో ప్రస్తుతం 400 కేఎల్‌పీడీ సామర్థ్యమున్న జూరాల ఆర్గానిక్ ఫార్మ్ ఒక్కటే నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించింది. జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో మరో ఇథనాల్ కంపెనీ నిర్మాణ పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి, నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోనూ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్టు తెలిసింది. అయితే కేంద్రం నుంచి ఆమోదం పొందిన సంస్థల్లో ఎన్ని నిర్మాణ పనులు ప్రారంభించాయనే సమాచారం తమ వద్ద లేదని అధికారులు చెప్తున్నారు.


చిత్తనూరులోని జూరాల ఆర్గానిక్ ఫామ్స్ ఇథనాల్ యూనిట్

అనుమతులపై అధికారుల మౌనం

నేషనల్ బయో ఫ్యూయల్ పాలసీ కింద ఇథనాల్ తయారీ యూనిట్లకు ఇచ్చిన అనుమతులతో తమకు సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. గతంలో ఉమ్మడి జాబితాలో ఉన్న ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ (ఐడీఆర్ యాక్ట్) కేంద్ర ప్రభుత్వ జాబితాలోకి వెళ్లిపోయిందని... దీంతో అందులో అంతర్భాగమైన ఇథనాల్ తయారీపై తమకు సమాచారం లేదని అంటున్నాయి. నిజానికి ఐడీఆర్ యాక్ట్ కేంద్ర జాబితాలోకి వెళ్లడాన్ని దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు ఆమోదించగా.. తెలంగాణ, ఏపీ మాత్రం దూరంగా ఉన్నాయి. మరోవైపు ఇథనాల్ తయారీని ఉమ్మడి కోటాలో చేర్చి పర్యవేక్షక బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని సుప్రీంకోర్టు పది రోజుల క్రితమే ఆదేశించింది. కానీ రాష్ట్రంలో ఏర్పాటయ్యే ఇథనాల్ యూనిట్లకు నిర్మాణ అనుమతులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని... లైసెన్సు, రవాణా, మార్కెటింగ్, భూ కేటాయింపులు వంటి అంశాలతో రాష్ట్రానికి సంబంధం లేదని పరిశ్రమల శాఖ అధికారులు చెప్తున్నారు. ఇందులో టీజీఐపాస్ కింద ఎన్ని సంస్థలు దరఖాస్తులు చేసుకున్నాయి, వాటి స్థితిగతులు ఏమిటనే సమాచారం తమ వద్ద లేదనే పేర్కొంటున్నారు. కేంద్రం దేశవ్యాప్తంగా 1,213 సంస్థలకు 1,37,342 కేఎల్‌పీడీ సామర్థ్యం కలిగిన ఇథనాల్ యూనిట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అందులో ఎక్కువగా మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోనే ఉన్నాయి.

అవగాహన లేకనే వ్యతిరేకత అంటున్న పరిశ్రమలు

ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుపై స్థానికులకు అవగాహన లేనందునే వ్యతిరేకత వస్తున్నట్టు పారిశ్రామిక వర్గాలు చెప్తున్నాయి. ఇథనాల్ యూనిట్లను వ్యతిరేకిస్తున్న ప్రజా సంఘాలు, స్థానికులు ఇటీవల హైదరాబాద్‌లో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలసి అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇథనాల్ యూనిట్ల ఏర్పాటుపై వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని అనుమతులను తిరిగి పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.


జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ అగ్రనేతలు, ఇండియా కూటమి ముఖ్యమంత్రులు, ఇతర నేతలతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కేటీఆర్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు

- బీఆర్ఎస్ గురివింద గింజ తరహాలో వ్యవహరిస్తోంది
- కాంగ్రెస్‌తో కలిసి పనిచేసింది వారే: కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ‘గురివింద గింజ తరహాలో.. బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన వారిని కాంగ్రెస్‌లోకి.. చేతి గుర్తుపై గెలిచిన వారిని గులాబీ పార్టీలోకి పంపించుకుని.. మంత్రి పదవులు తీసుకున్నప్పుడు ఎవరు ఎవరితో కలిసినట్లో కేటీఆర్ చెప్పగలరా?’ అని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్ట్‌పై గురువారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి స్పందిస్తూ... ‘కేటీఆర్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేసింది వారు. ప్రభుత్వంలో భాగంగా ఉన్నది వారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నది వారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తమ పార్టీలో చేర్చుకుంటోంది. ఇప్పుడు బురద జల్లడం కోసం మాపైన ఆరోపణలు చేస్తున్నారు. కేటీఆర్ వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు’ అని వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ అనుసరించిన మోసపూరిత విధానాలనే.. ఇవాళ కాంగ్రెస్ కాపీ కొట్టి ఏడాదిగా అనుసరిస్తున్న మాట వాస్తవం కాదా? కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ మొదలైన బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన కుంభకోణాలు, కేసుల విషయంలో పురోగతి లేకపోవడమే ఎవరితో ఎవరు కలిసున్నారని చెబుతోంది’ అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ ఒక సిద్ధాంతం ఆధారంగా ఎదిగిన పార్టీ అని.. జాతీయవాదం, అంత్యోదయ వంటి నినాదాలతో పనిచేసే పార్టీ తమదని అన్నా రు. కుటుంబపాలన, అవినీతి వంటివి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలని.. అందుకే ఎవరికి ఎవరు దోస్తులనేది తెలంగాణ సమాజానికి తెలిసిపోయిందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

ఫిబ్రవరిలో ‘స్థానిక’ సమరం..?

జనవరి 14న నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఎన్నికల నిర్వహణకు ప్రాథమిక కసరత్తు కూడా కొంత ప్రారంభమైనట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. కొత్త సంవత్సరంలో సంక్రాంతి పండుగ సమయంలో జనవరి 14న ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తే, ఆ తర్వాత 21 రోజుల్లో (ఫిబ్రవరి మొదటి వారంలో) ఎన్నికలు నిర్వహించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఈ ఎన్నికలను బ్యాలెట్ పత్రాలతో మూడు విడతల్లో నిర్వహించే విషయంలో మాత్రం ఇప్పటికే ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన అమల్లో ఉండగా... ఈసారి ఇద్దరికంటే ఎక్కువ పిల్లలున్నవారు కూడా పోటీ చేసేందుకు అవకాశం కల్పించనున్నట్టు సమాచారం. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి మండలానికి కనీసం ఐదు గ్రామపంచాయతీలు (ఎంపీటీసీ స్థానాలు) ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. డిసెంబర్ రెండోవారంలో నిర్వహించనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ రెండు అంశాలపై బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకొనేందుకు పంచాయతీరాజ్‌శాఖ కసరత్తు ప్రారంభించినట్టు సమాచారం.

బీసీ రిజర్వేషన్లపై మల్లగుల్లాలు

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌పార్టీ హామీ ఇచ్చింది. ప్రస్తుతం గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 22 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. దానిని 42 శాతానికి పెంచడం వల్ల అన్ని రకాల రిజర్వేషన్లు 50 శాతానికి మించుతాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పునకు అడ్డంకిగా మారుతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. జనాభా మేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసి కుల గణనను చేపట్టిన సంగతి విదితమే. తాజా లెక్కలకు అనుగుణంగా బీసీల రిజర్వేషన్ల శాతాన్ని ఖరారు చేస్తూ బీసీ కమిషన్ తుది నిర్ణయం తీసుకోవాలి. ఆ రిజర్వేషన్ల వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపిస్తే.. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేస్తుంది. ఈ నోటిఫికేషన్ జారీ అయ్యాక 21 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. గత జనవరి 31తో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. జూలై మొదటివారంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్ల పదవీ కాలం కూడా ముగిసింది. గ్రామపంచాయతీ పాలక మండళ్ల పదవీకాలం ముందుగా ముగిసినందున, ఎన్నికలు కూడా ముందుగా వాటికే నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారని సమాచారం. రాష్ట్రంలో మొత్తం 12,751 గ్రామ పంచాయతీలు, 538 జడ్పీటీసీలు, 5,817 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

కాంగ్రెస్‌తో బీజేపీ నేతలు కలిసికట్టుగా పనిచేస్తున్నారు

చీకటి రాజకీయ ప్రయోజనాల కోసం చేతులు కలిపారు

- అన్నదాతలను నిండా ముంచి రైతు పండుగ చేస్తున్నారు
- జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమంలో కేటీఆర్


తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలసి భోజనం చేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ‘మీ కమలం నేతలు కాంగ్రెస్ నేతలతో కలిసికట్టుగా పనిచేస్తున్నారు. చోటేభాయ్‌కు వ్యూహకర్తలుగా, కాంగ్రెస్ కట్టర్ కార్యకర్తలుగా విశ్రమించకుండా పనిచేస్తున్నారు. చీకటి రాజకీయ ప్రయోజనాల కోసం చేయి కలిపి చోటేభాయ్‌తో కలిసి పనిచేస్తున్నారు’ అని బీజేపీ నేతలను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలు కలిసి కట్టుగా పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ‘ఎక్స్’వేదికగా విమర్శలు చేశారు. ‘రాష్ట్రంలో ఎన్ని అరాచకాలు జరిగినా ఒక్కరూ నోరు మెదపరు. రేవంత్ మీద ఈగ వాలకుండా కాపాడుకుంటారు. హైడ్రా మంచిదని, మూసీ కావాలని అంటారు. పిల్లలు చనిపోయినా, రైతు గుండె పగిలినా, గిరిజనులను చెరపట్టినా, చప్పట్లు కొడతారు. తెలంగాణలో కాంగ్రెస్ చేతిలోనే కమలం ఉంది. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. సమస్యలపై నిలదీస్తే నిర్బంధం విధిస్తూ.. బడి పిల్లలకు బాసటగా నిలిచిన వారిపై కేసులు పెడుతున్నారు. గురుకుల విద్యా సంస్థల్లో సమస్యలు, విద్యార్థుల ఆత్మహత్యలు, పిల్లల మరణాలపై గళమెత్తితే గొంతు నొక్కుతున్నారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు’ అని కేటీఆర్ విమర్శించారు. ‘రైతు భరోసాకు ఎగనామం పెట్టి రుణమాఫీ పేరిట పంగనామాలు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా రైతు పండుగలు చేస్తోంది. రైతులను నిండా ముంచి విజయోత్సవాలు చేసుకుంటోంది. కాకిలెక్కలు, కల్లబొల్లి కబుర్లతో ఎల్లకాలం వెళ్లదీయాలనే ప్రభుత్వ కుట్రలు ఎంతోకాలం సాగవు’అని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో జరిగిన మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని నివాళి అర్పించారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో జరిగే దీక్షాదివస్ ఏర్పాట్లను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, పొన్నాల లక్ష్మయ్యతో కలిసి కేటీఆర్ పరిశీలించారు.

ఇథనాల్ కంపెనీతో మాకు సంబంధం లేదు

మాజీ మంత్రి తలసాని


మీడియాతో మాట్లాడుతున్న తలసాని

సాక్షి, హైదరాబాద్: దిలావర్‌పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీతో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. తన కుమారుడికి సంబంధం ఉందంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి సీతక్క చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తెలంగాణ భవన్‌లో గురువారం తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ‘ఇథనాల్ కంపెనీ వద్దంటూ దిలావర్‌పూర్ ప్రజలు చేసిన ధర్నాపై ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. రాజమండ్రి సమీపంలోని ఓ డిస్టిలరీ కంపెనీలో గతంలో నా కుమారుడు డైరెక్టర్‌గా ఉంటూ 2016లో రాజీనామా చేసి బయటకు వచ్చారు. ఆ కాగితాలను చూపుతూ మాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నా కుటుంబానికి చెందినట్లుగా నిరూపిస్తే ప్రభుత్వానికే రాసిస్తా. బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. ఇథనాల్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తుందనే కనీస అవగాహన కూడా కాంగ్రెస్ నేతలకు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ప్రజలకు నయాపైసా ప్రయోజనం కలగలేదు’అని తలసాని విమర్శించారు.

సర్కార్ హామీల అమలు కోసం బీసీ చైతన్యయాత్ర

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు పోరాటం చేస్తామని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలు అమలుచేసేలా బీసీ చైతన్య యాత్ర నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో... మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మూసీపై మోసపు ప్రకటనలు

పార్లమెంటును తప్పుదోవ పట్టించిన రేవంత్ సర్కార్

- బాధితులకు పరిహారంపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- తప్పుడు సమాచారంపై పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్
- మాజీ మంత్రి హరీశ్‌రావు


మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

సాక్షి, హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు బాధితులకు పునరావాసం కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని, పార్లమెంటునే కాకుండా మొత్తం దేశాన్నే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. నిర్వాసితులకు ‘భూసేకరణ చట్టం– 2013’ ప్రకారం పరిహారం ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్తూ వాస్తవాలను దాచిపెడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పార్టీ నేతలు మల్కాపురం శివకుమార్, విప్లవ్‌కుమార్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో గురువారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానంతో రాష్ట్రంలో కాంగ్రెస్ మోసపూరిత వైఖరి బయటపడిందని అన్నారు. కేంద్రానికి తప్పుడు సమాచారం ఇస్తూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరొక రీతిలో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిహారంపై ఎక్కడైనా చర్చకు సిద్ధం

మూసీ బాధితులకు పరిహారం చెల్లింపు విషయంలో పార్లమెంటుకు రేవంత్ సర్కారు ఇచ్చిన సమాచారంపై ఏ వేదిక మీద అయినా చర్చకు తాను సిద్ధమని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మీడియా, సచివాలయం, అఖిల పక్ష సమావేశం.. ఎక్కడైనా సరే మాట్లాడతా నని ప్రకటించారు. ‘మూసీ పునరుజ్జీవాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకించడం లేదు. కానీ ఈ ప్రాజెక్టు ముసుగులో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కొల్లగొట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాం. పార్లమెంటులో ప్రభుత్వం అవాస్తవాలు చెప్పడంపై మా ఎంపీ సురేశ్‌రెడ్డి, ఇతర ఎంపీలు ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెడతారు. పేదల పక్షాన న్యాయస్థానానికి వెళ్లడంతోపాటు చట్ట ప్రకారం పేదలకు సాయం చేసేందుకు కృషి చేస్తాం. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తాం’అని హరీశ్‌రావు తెలిపారు.

భారత రాజ్యాంగంపై బీజేపీ బుల్డోజర్

ఆర్ఎస్ఎస్ సూచనల ప్రకారమే మోదీ పాలన: బృందాకరత్


గుస్సాడీ కళాకారులతో బృందాకరత్

కైలాస్‌నగర్: భారత రాజ్యాంగంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్‌ను ప్రయోగిస్తోందని రాజ్యసభ మాజీ సభ్యురాలు, సీపీఎం నేత బృందాకరత్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, కేంద్రంలో నడుస్తోంది మోదీ ప్రభుత్వం కాదని, ఆర్ఎస్ఎస్ మనుస్మృతి ప్రకారం పరిపాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కాదని, రాష్ట్రీయ సర్వనాశన్ సమితి అని మండిపడ్డారు. ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు కల్పించిన హక్కులను హరించేలా పార్లమెంట్‌లో రాజ్యాంగాన్ని సవరిస్తున్నారని ఆరోపించారు. దేశ సంపదనంతా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని కేంద్రం తీరుపై మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు సంబంధించి లక్షా 70 వేల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలు, ఆశాలు, ఎండీఎం కార్మికుల వేతనాలను పెంచేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. ఈ సభలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్‌లో అంతటి వ్యత్యాసం.. ఆందోళనకరం



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వివాదంపై మాజీ సీఈసీ ఎస్వై ఖురేషీ

న్యూఢిల్లీ: ఈవీఎంల పనితీరుపై దేశమంతటా నెలకొన్న అనుమానాలను, ఆందోళనలను మరింత పెంచే మరో పరిణామం చోటుచేసుకుంది. వాటి విశ్వసనీయతపై స్వయంగా భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్వై ఖురేషీ కీలక సందేహాలు లేవనెత్తారు. తాజాగా ముగిసిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతానికి సంబంధించి నెలకొన్న వివాదంపై గురువారం ప్రముఖ న్యూస్ చానల్ ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కీలక వ్యాఖ్య లు చేశారు. మహారాష్ట్రలో నవంబర్ 20న రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరగడం తెలిసిందే. 'ఆ రోజు సాయంత్రం 5 గంటలకల్లా 55 శాతం మేరకు ఓటింగ్ (ప్రొవిజనల్ ఓటర్ టర్నౌట్-పీవోటీ) నమోదైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. కానీ.. మర్నాడు ఈసీ ప్రకటించిన తుది గణాంకాల్లో అది కాస్తా ఏకంగా 66.05 శాతానికి పెరిగిపోయింది' అని రాజ్‌దీప్ పేర్కొనగా.. ఇంతటి వ్యత్యాసం అత్యంత ఆందోళన కలిగించే అంశమని ఖురేషీ చెప్పారు. దీనిపై తన అనుమానాలు, అభ్యంతరాలు, ఆందోళనలను ఖురేషీ ఈ సందర్భంగా పంచుకున్నారు. ఓటింగ్ శాతం గణాంకాలు ఎప్పటికప్పుడు (రియల్ టైమ్) నమోదవుతూనే ఉంటాయని ఖురేషీ గుర్తు చేశారు. అలాంటప్పుడు పోలింగ్ నాటి సాయంత్రానికి, మర్నాటికి ఇంతటి వ్యత్యాసం కచ్చితంగా అత్యంత ఆందోళన కలిగించే విషయమేనని స్పష్టం చేశారు.

'ఓటింగ్ శాతం ఇలా నమోదవుతుంది'

పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ శాతం నమోదు ప్రక్రియ ఎలా జరుగుతుందో మాజీ సీఈసీ ఖురేషీ ఈ సందర్భంగా వివరించారు. 'ఓటేయడానికి వచ్చే ప్రతి ఒక్కరి హాజరునూ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి విధిగా ఫారం-17సీలో నమోదు చేస్తారు. పోలింగ్ ముగిశాక ఆనాటి పరిణామాలన్నిటినీ అందులో నమోదు చేస్తారు. అలా ఫారం-17సీని పూర్తిగా నింపి, దానిపై అభ్యర్థులకు సంబంధించిన పోలింగ్ ఏజెంట్ల సంతకం తీసుకున్న తర్వాతే ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ బూత్‌ను వీడతారు' అని వివరించారు. 'ప్రతి పోలింగ్ బూత్‌లోనూ పోలైన మొత్తం ఓట్ల సంఖ్యను 17సీ నమోదు చేస్తుంది. పైగా ఇది అదే రోజు, రియల్ టైమ్ (ఎప్పటికప్పుడు)లో నమోదయ్యే డేటా' అని ఖురేషీ తెలిపారు. అలాంటప్పుడు పోలింగ్ జరిగిన మర్నాడు అది మారడం ఎలా సాధ్యమన్నది తనకే అర్థం కావడం లేదని ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఇది చాలా ఆందోళన కలిగించే, ఎన్నో సందేహాలకు తావిచ్చే పరిణామమని ఆయన కుండబద్దలు కొట్టారు. 'దీనిపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చి తీరాల్సిందే. ఇప్పటికే ఆ పనిచేసి ఉండాల్సింది. ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియడం లేదు' అని అన్నారు. 'కీలకమైన ఈ సందేహాలకు ఈసీ ఇప్పటికైనా బదులివ్వాలి. మహారాష్ట్రలో పోలింగ్ ముగిసిన మర్నాడు ఓటింగ్ శాతం ఇంతగా ఎలా పెరిగిందో ఇప్పటికైనా వివరణ ఇవ్వాల్సిందే. జాతీయ మీడియాను పిలిచి పోలింగ్ గణాంకాలకు సంబంధించిన అన్ని గణాంకాలకూ పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలి' అన్నారు. 'ఈవీఎంల పనితీరు తదితరాలపై ఇప్పటికే దేశమంతటా అనుమానాలు వ్యాప్తి చెందుతున్నాయి. వాటిని ఈసీ వెంటనే తీర్చకపోతే జనాల మెదళ్లలోకి మరింతగా చొచ్చుకుపోతాయి. అప్పుడు మొత్తం వ్యవస్థల మీదే ప్రజలకు విశ్వాసం పోతుంది' అంటూ ఖురేషీ ఆందోళన వెలిబుచ్చారు. ఓటింగ్ శాతంలో అనూహ్య పెరుగుదల అంశం ఐదేళ్ల కింద సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని గుర్తు చేశారు. ఈసీ తుది గణాంకాల మేరకు మహారాష్ట్రలో సాయంత్రం 5 గంటల తర్వాత ఏకంగా 11 శాతం ఓటింగ్ జరిగినట్టు భావించాలని కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ అన్నారు. ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ అనుమానాలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు ఖురేషీ చెప్పారు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చాల్సిన అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. ఆయన 2010-12 మధ్య కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా పనిచేశారు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పోలింగ్ శాతంలో 12.54 శాతం తేడా

ఆంధ్రప్రదేశ్‌లో మే 13న నాలుగో దశలో ఎన్నికలు నిర్వహించగా.. అదే రోజున రాత్రి 8 గంటలకు 68.12 శాతం పోలింగ్ జరిగినట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆ తర్వాత రాత్రి 11.45 గంటలకు 76.50 శాతం పోలింగ్ జరిగినట్టు ప్రకటించింది. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన నాలుగు రోజులకు అంటే మే 17న తుది పోలింగ్ శాతం 80.66 అని ప్రకటించింది. అంటే.. తొలుత ప్రకటించిన పోలింగ్ శాతానికి తుది పోలింగ్ శాతానికి మధ్య 12.54 శాతం పెరుగుదల ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఎన్నికల సంఘం తొలుత ప్రకటించిన పోలింగ్ శాతానికి, ఆ తర్వాత వెల్లడించిన పోలింగ్ శాతానికి భారీ తేడా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా.. ఒడిశా (12.48 శాతం) రెండో స్థానంలో నిలిచాయి. పోలింగ్ శాతం పెరుగుదలకు ప్రధాన కారణం ఈవీఎంలను హ్యాకింగ్ చేయడం లేదా ఈవీఎంలు మార్చేయడం లేదా ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవడం వంటి ఏదో ఒకటి అయి ఉండొచ్చని ఏడీఆర్ (అసోషియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్), వీఎఫ్‌డీ (వోట్ ఫర్ డెమొక్రసీ) సంస్థల ప్రతినిధులు అనుమానం వ్యక్తం చేశారు. ఇదే ఫలితాలను తారుమారు చేసిందని ఆరోపించారు. పోలింగ్ శాతంలో భారీగా తేడా ఉండటం వల్ల పోలైన ఓట్లలో 49 లక్షల ఓట్లు పెరిగాయి. రాష్ట్రంలో 25 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. పోలింగ్ శాతంలో పెరుగుదల వల్ల ఒక్కో లోక్‌సభ స్థానంలో సగటున 1.96 లక్షల ఓట్లు అదనంగా పోలయ్యాయి. ఇది లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని వీఎఫ్‌డీ సంస్థ వెల్లడించింది. ఎన్నికల సంఘం పోలింగ్ శాతం తొలుత వెల్లడించిన దానికీ, ఆ తర్వాత ప్రకటించిన దానికీ తేడా ఉండకపోయి ఉంటే ఎన్‌డీఏకు 14, వైఎస్సార్‌సీపీకి 11 లోక్‌సభ స్థానాలు దక్కేవని స్పష్టం చేసింది.

48 గంటల్లోగా క్షమాపణ చెప్పండి

- లేదంటే రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తా
- ఈనాడు, ఆంధ్రజ్యోతిలకు వైఎస్ జగన్ అల్టిమేటం

> కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ.. ఏపీ ప్రభుత్వం, డిస్కంల మధ్య ఒప్పందం జరిగితే.. ఇక్కడ థర్డ్ పార్టీకి ఎక్కడ చోటు ఉంది? రేపు అమెరికా కంపెనీ వ్యాపారం చేయడానికి రాష్ట్రానికి వచ్చిందనుకుందాం. ప్రభుత్వం భూములు, సౌకర్యాలు కల్పిస్తుంది. జీఎస్టీ మినహాయింపులు, ప్రోత్సాహకాలు ఇస్తుంది. అలాగని అమెరికా అధ్యక్షుడు బైడెన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి ప్రోత్సాహకాలు ఇప్పించారని అంటారా? అలా అనొచ్చా? వాస్తవాలు తెలియకుండా దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. వీటికి ముగింపు ఉండట్లేదు. - వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'సెకీ' విద్యుత్ ఒప్పందాలపై వాస్తవాలను దాచిపెట్టి, నిత్యం అసత్యాలు ప్రచారం చేస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల యాజమాన్యాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుతో కలిసి కుట్ర పూరితంగా తన పరువుకు భంగం కలిగించేలా దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి క్షమాపణలు చెప్పాలని, లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని అల్టిమేటం జారీ చేశారు. ఒక్కో పత్రికపై రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేస్తానని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేస్తే పిచ్చోళ్లు అవుతారని అన్నారు. 'అమెరికాలో వచ్చిన ఆరోపణల్లో ఎక్కడా కూడా నా పేరు లేదు. మీరు చెక్ చేసుకోవచ్చు. ఇక్కడ పత్రికల్లో నా పేరు రాసిన వాళ్లనే అడగండి. కొందరు వాస్తవాలతో పని లేకుండా మూర్ఖంగా ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఒప్పందంలో నేను ఎప్పుడూ ఎవ్వరినీ కలవలేదు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి, డిస్కంలకు, సెకీ మధ్య మాత్రమే ఒప్పందం కుదిరింది. మేము సెకీ నుంచే విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాం. అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను మినహాయింపు ఇచ్చింది నాకు కాదు.. రాష్ట్ర ప్రభుత్వానికి' అంటూ మరో ప్రశ్నకు బదులిచ్చారు. 'రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం.. పరిశ్రమల స్థాపన కోసం పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రులు సమావేశం కావడం సాధారణం. అలాంటి సమావేశాలు తరచుగా జరుగుతుంటాయి. పెట్టుబడి సదస్సులు కూడా ప్రభుత్వాలు నిర్వహిస్తాయి. ఒక రాష్ట్రం వేరే రాష్ట్రంతో పోటీ పడాలంటే పరిశ్రమలను ప్రోత్సహించాలి. అదానీ.. నాతో కలవడం సహజంగానే జరిగింది. నా ఐదేళ్ల పాలనలో సెకీ ఒప్పందానికి ముందు.. తర్వాత కూడా చాలా సార్లు కలిశారు. ఏపీలో అదానీ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. నేను ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రానికి సంబంధించి పరిశ్రమలపై చర్చలు జరిపామే తప్ప.. వేరు దురుద్దేశాలు ఉండవు. సెకీ చాలా రాష్ట్రాలకు లేఖలు రాసింది. అలాగే మాకూ రాసింది. మేము సానుకూలంగా స్పందించాం. అది మా బాధ్యత.. సెకీ మాతో పాటే తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ఇలా చాలా రాష్ట్రాలకు లేఖలు రాసింది. చౌక విద్యుత్‌ను అందించాలనేది ప్రతి రాష్ట్రం కల. ఇలాంటి మంచి రేటును మేము కాదనలేదు' అని మరో ప్రశ్నకు బదులు ఇచ్చారు.

థర్డ్ పార్టీకి చోటెక్కడ?: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ.. ఏపీ ప్రభుత్వం, డిస్కంల మధ్య ఒప్పందం జరిగితే.. ఇక్కడ థర్డ్ పార్టీకి ఎక్కడ చోటు ఉందని వైఎస్ జగన్ ప్రశ్నించారు. 'రేపు విదేశీ కంపెనీలకు ఇక్కడ భూములిచ్చి, సౌకర్యాలు కల్పించి.. జీఎస్టీ మినహాయింపులు, ప్రోత్సాహకాలు ఇస్తే.. ఆ దేశ అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి ప్రోత్సాహకాలు ఇప్పించారని అంటారా? ఇలా అనొచ్చా?' అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. 'వాళ్ల (అమెరికా దర్యాప్తు సంస్థ) దగ్గర ఎటువంటి డాక్యుమెంట్లు ఉన్నాయో నాకు తెలీదు. ఇక్కడ ఏదైనా అమెరికన్ కంపెనీ వారు వ్యాపారం చేస్తూ బైడెన్ పేరు చెబితే.. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నా సీబీడీతో కేసులో బైడెన్ పేరు రాయించొచ్చా? ఎవరైనా ఏదైనా ఇస్తున్నప్పుడు అతనికి ఏదో లాభం చేకూరాలి. ఇక్కడ చేకూరిన లబ్ధి ఏంటంటే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చౌకగా సౌర విద్యుత్ ఇవ్వడం. అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను మినహాయించి మరీ ఇవ్వడం. అయినా సరే ఏదో జరిగిపోయినట్లుగా ఎల్లో గ్యాంగ్ దుష్ప్రచారం చేస్తోంది' అంటూ మండిపడ్డారు. 'చంద్రబాబు బడ్జెట్‌లో రూ.6.46 లక్షల కోట్లు రాష్ట్ర అప్పుగా చూపించారు. అసెంబ్లీలో పెట్టిన కాగ్ రిపోర్టులోనూ అదే ఉంది. అదే చంద్రబాబు బయట కొచ్చి.. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు, రూ.11 లక్షల కోట్లు, రూ.14 లక్షల కోట్లు అప్పు అంటూ మాట్లాడతాడు. చంద్రబాబు అబద్ధాలకు అంతం ఎక్కడ ఉంటుంది?' అంటూ వ్యంగోక్తులు విసిరారు. 'సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా.. మరొకరికి పంపినా పీడీ యాక్టు పెడతామంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందో అర్థమవుతుంది. పోస్టు చేసినా, వచ్చిన పోస్టును ఫార్వర్డ్ చేసినా పీడీ యాక్టు పెడతారా? దీనిపై దేశ వ్యాప్తంగా చర్చ జరగాలి? చంద్రబాబు అసెంబ్లీలో బలం ఉందని చట్టాన్ని బుల్డోజ్ చేశారు. ఇది ప్రజాస్వామ్యం మనుగడకు ప్రమాదకరం' అని వైఎస్ జగన్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ప్రతి రంగంలోనూ విప్లవం

- అసాధ్యమనుకున్నవి గత ఐదేళ్లలో సాధ్యం చేసి చూపాం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల ఇంటి వద్దకు పాలన
- లంచాలు, వివక్ష లేకుండా దాదాపు 540 రకాల సేవలు
- ప్రభుత్వ స్కూళ్ల స్థితిగతులను పూర్తిగా మార్చేశాం
- ఇంగ్లిష్ మీడియం మొదలు ఐబీ వరకు ప్రయాణం
- వైద్య రంగంలో నవశకం తీసుకొచ్చాం
- ఆర్బీకేల ద్వారా రైతన్నకు అండగా నిలిచాం
- ఇదివరకెన్నడూ లేని రీతిలో పోర్టులు, 17 మెడికల్ కాలేజీల నిర్మాణం... ఇలా నిజమైన సంపద సృష్టించింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ఇప్పుడు యథేచ్ఛగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రెడ్ బుక్ పాలన... లిక్కర్ స్కాం.. ఇసుక స్కాం మొదలు ప్రతి నియోజకవర్గంలో పేకాట క్లబ్బులు
- ఎక్కడ ఏ గని తవ్వాలన్నా, పరిశ్రమ నడపాలన్న ఎమ్మెల్యే కింత.. చంద్రబాబు కింత ముట్టజెప్పాల్సిందే

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చారిత్రక నిర్ణయాలతో సంపద సృష్టించాం

నిజమైన సంపద సృష్టి జరిగింది మా హయాంలోనే: వైఎస్ జగన్

అత్యంత చౌకగా రూ.2.49కే విద్యుత్తు కొనుగోలుతో రూ.1.10 లక్షల కోట్లు ఆదా

> "అంతరాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలు (ఐఎస్‌టీఎస్) నుంచి మినహాయింపుతో అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49 చొప్పున 25 ఏళ్లపాటు సౌర విద్యుత్ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ(సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో ఒప్పందం చేసుకున్నాం. రాష్ట చరిత్రలో ఇంత తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ఇదో చరిత్రాత్మక ఒప్పందం.. చారిత్రక ఘట్టం"
>
> "గతంలో రాష్టంలో సగటు విద్యుత్ కొనుగోలు ధర యూనిట్‌కు రూ.5.10 కాగా మేం దాని కంటే యూనిట్ రూ.2.61 తక్కువకు కొనుగోలు చేశాం. దీనివల్ల ఏడాదికి రూ.4,400 కోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదా అవుతుంది. ఈ లెక్కన 25 ఏళ్లకు రూ.1.10 లక్షల కోట్లు ఆదా అవుతుంది. సంపద సృష్టించడమంటే ఇదీ"
>
> "చంద్రబాబు హయాంలో 2014-19 మధ్య సౌర విద్యుత్ యూనిట్ సగటున రూ.5.90 చొప్పున కొనుగోలు చేస్తూ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు(పీపీఏలు) చేసుకున్నారు. మేం సెకీ నుంచి కొనుగోలు చేసిన దానికంటే యూనిట్ రూ.3.41 అధికంగా కొన్నారు. దీనివల్ల ఏడాదికి రూ.3,500 కోట్లు చొప్పున 25 ఏళ్లలో రూ.87,500 కోట్ల భారం ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుంది. మరి 25 ఏళ్లకు రూ.1.10 లక్షల కోట్లను ఖజానాకు ఆదా చేసి సంపద సృష్టించిన వైఎస్ జగన్ గొప్పా..? లేక రూ.87,500 కోట్లు ఖజానాపై భారం వేసి సంపదను ఆవిరి చేసిన చంద్రబాబు గొప్పా?"
>
> - వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంపద సృష్టిలో భాగంగా విప్లవాత్మక అడుగులు వేశామని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. నిజమైన సంపద సృష్టి జరిగింది, రాష్ట్రానికి అదనపు ఆదాయాలు పెరిగింది, అదనపు ఆస్తులు సమకూరింది వైఎస్సార్ సీపీ హయాంలోనేనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో కారుచౌకగా యూనిట్ రూ.2.49కే సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోవడం రూ.1.10 లక్షల కోట్లను ఆదా చేసి సంపద సృష్టించామన్నారు. అధిక ధరలతో పీపీఏల ఒప్పందాల గుదిబండ వల్ల సీఎం చంద్రబాబు రూ.87,500 కోట్లు ఆవిరి చేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో 15 కొత్త మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టడంతోపాటు దాదాపు రూ.13 వేల కోట్లతో మూడు కొత్త పోర్టుల నిర్మాణాన్ని చేపట్టామని.. వైద్య కళాశాలలు, పోర్టులు భవిష్యత్తులో రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల సంపద సృష్టించే ఆస్తులుగా మిగులుతాయని పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు.

చరిత్రలో నిలిచే ఒప్పందం..

సుస్థిర వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా, రైతుల జీవనోపాధులు పెంచడమే ధ్యేయంగా వ్యవసాయ పంపుసెట్లకు పగటి పూట 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్న మా ప్రభుత్వ ఆశయాన్ని కేంద్రం సైతం అభినందించింది. రైతులకు మంచి చేస్తూ మీరు తలపెట్టిన ఈ గొప్ప కార్యక్రమానికి మా వంతు తోడ్పాటు అందిస్తామని చెప్పింది. ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఇస్తూ యూనిట్ విద్యుత్ అత్యంత చౌకగా రూ.2.49కే సరఫరా చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూ కేంద్ర సంస్థ సెకీ లేఖ రాసింది. నాడు ఆ ప్రతిపాదనకు నేను ఒప్పుకోకుండా ఉంటే ఇదే చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5తో కూడిన ఎల్లో బ్యాచ్ నాపై ఏరకంగా దుమ్మెత్తిపోసేవారో అందరూ ఒక్కసారి ఆలోచించండి. చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి నాపై ఇలా దుష్ప్రచారం చేయడం ధర్మమేనా? ఇంత తక్కువ ధరకు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. ఏ ఒక్కరూ చేయలేనిదాన్ని , వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయగలిగింది. ఒక చరిత్ర సృష్టించాం. చరిత్రలో నిలిచిపోయే ఒప్పందం ఇది.

డిస్కంలను బాబు సంక్షోభంలోకి నెడితే.. మేం నిలబెట్టాం

రైతన్నలకు దాదాపుగా 18 లక్షల వ్యవసాయ పంపు సెట్ కనెక్షన్లు ఉన్నాయి. ఉచిత విద్యుత్‌ను రైతన్నలకు ఇచ్చేందుకు ఏటా దాదాపు రూ.9 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. పెట్టుబడి ఖర్చు తగ్గించగలిగితే రైతన్న ఆదాయాలు పెరుగుతాయి. అందులో ఉచిత విద్యుత్ ప్రధాన భూమిక పోషిస్తుంది. దీనివల్ల ప్రతి రైతన్నకు ఏటా దాదాపు రూ.40 వేల నుంచి రూ.45 వేలు ప్రయోజనం చేకూరుతుంది. డిస్కంల పరిస్థితి చూస్తే చంద్రబాబు అధికారంలోకి రాకముందు అంటే 2014 నాటికి రూ.29 వేల కోట్లు అప్పులు, బకాయిలు ఉండగా ఆయన దిగిపోయే నాటికి అంటే 2019కి ఏకంగా రూ.86 వేల కోట్లకు ఎగబాకాయి. దాదాపుగా 23.88 శాతం వార్షిక అప్పు పెరుగుదల (సీఏజీఆర్)తో చంద్రబాబు హయాంలో డిస్కంల పరిస్థితి దయనీయంగా ఉంది. డిస్కంలను ఆదుకునేందుకు ఆయన చేసిన సాయం రూ.13,255 కోట్లు మాత్రమే. అదే వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.47,800 కోట్లు డిస్కంలకు అందించి ఆదుకున్నాం.

రైతులకు హక్కుగా ఉచిత విద్యుత్ లక్ష్యంగా..

రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంల మీద భారం పడకుండా.. మరో 25 ఏళ్ల పాటు రైతన్నలకు ఢోకా లేకుండా ఉచిత విద్యుత్తు అందించడంలో భాగంగా గతంలో ఎప్పుడూ చేయని విధంగా ఆలోచన చేశాం. 2020 నవంబర్‌లో 6,400 మెగావాట్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీజీఈసీఎల్) ఆధ్వర్యంలో సోలార్ పార్కులు రాష్ట్రంలో నెలకొల్పేందుకు టెండర్లు పిలిచాం. రూ.2.49 నుంచి రూ.2.58 చొప్పున విద్యుత్ సరఫరా చేయడానికి ఎన్టీపీసీ లాంటి పెద్ద పెద్ద సంస్థలు అందులో పాల్గొన్నాయి. దాదాపు 24 బిడ్లు దాఖలయ్యాయి. అయితే చంద్రబాబు అనే చంద్రగ్రహణం కారణంగా న్యాయ వివాదాలు తలెత్తి ఈ ప్రక్రియ ఆగిపోయింది.

తియ్యటి కబురుతో కేంద్రం లేఖ..

చంద్రగ్రహణం పట్టిన సోలార్ బిడ్ల వ్యవహారంపై దాదాపు 10 నెలలు కోర్టుల్లో పోరాటాలు చేస్తుండగా.. 2021 సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి తియ్యటి కబురు మాదిరిగా కేంద్ర ప్రభుత్వం నుంచి లేఖ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అంటే సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి లేఖ వచ్చింది. రైతులకు పగటి పూటే ఉచితంగా 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ప్రశంసిస్తూ, అభినందిస్తూ ఆ లేఖలో ఉంది.సెకీ రాసిన ఆ లేఖలో యూనిట్ రూ.2.49 కే ట్రేడింగ్ మార్జిన్‌తో కలిపి ఇస్తామని ఉంది. రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మీ ఉద్దేశాన్ని అభినందిస్తూ ఈ ప్రతిపాదన చేస్తున్నామని ఆ లేఖలో సెకీ పేర్కొంది. వారు చెప్పిన అత్యంత ముఖ్యమైన మరో అంశం ఏమిటంటే.. కేంద్ర ప్రభుత్వం స్పెషల్ ఇన్సెంటివ్ కింద ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం(ఐఎస్‌టీఎస్) చార్జీలు 25 ఏళ్ల పాటు మాఫీ అవుతాయని లేఖలో పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్‌లో 3 వేల మెగావాట్లు, 2025 సెప్టెంబర్‌లో 3 వేల మెగావాట్లు, 2026 సెప్టెంబర్‌లో 3 వేల మెగావాట్లు చొప్పున మొత్తంగా 9 వేల మెగావాట్లు సౌర విద్యుత్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని సెకీ తెలిపింది. దీనివల్ల మీకు చాలా మేలు జరుగుతుందని పేర్కొంది. టెండర్ల ద్వారా రాష్ట్రంలో కట్టాలనుకుంటున్న సోలార్ పార్కులకు సంబంధించిన భూమి మిగులుతుంది. దాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చు. మౌలిక సదుపాయాలకు పెట్టే ఖర్చు కూడా ఆదా అవుతుంది. తమ ప్రతిపాదనపై సాధ్యమైనంత త్వరగా స్పందన తెలియచేయాలని సెకీ లేఖలో కోరింది.

సెకీ లేఖలో ముఖ్యాంశాలు ఇవీ..

1. ఇందులో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మినహా థర్డ్ పార్టీ(మూడో పక్షం) లేదు.
2. రూ.2.49కే యూనిట్ ఇవ్వడం. ఇంత తక్కువ ధరకు విద్యుత్ రావడం అనేది రాష్ట్ర చరిత్రలో లేదు.
3. ఈ ప్రాజెక్టుకు మాత్రమే ఐఎస్‌టీఎస్ చార్జీలు ఉండవు అని కేంద్ర ప్రభుత్వం స్పెషల్ ఇన్సెంటివ్ ఇస్తామంటూ లేఖలో స్పష్టం చేయడం.

ఇది సంపద సృష్టి కాదా?

గతంలో రాష్ట్ర సగటు విద్యుత్ కొనుగోలు ధర రూ.5.10. మనకు 17 వేల మిలియన్ యూనిట్లను యూనిట్ రూ.2.49కే ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. అంటే రూ.5.10కు బదులు రూ.2.49 రావడం వల్ల రూ.2.61 ప్రతి యూనిట్‌కు తగ్గుతోంది. రూ.2.61 చొప్పున 17 వేల మిలియన్ యూనిట్లకు సంవత్సరానికి రూ.4400 కోట్లు మిగులుతుంది. 25 సంవత్సరాలు సరఫరా చేస్తామన్నారు కాబట్టి దాదాపు రూ.1.10 లక్ష కోట్లు ఆదా అవుతుంది. ఇది సంపద సృష్టి కాదా?

రూ.6.99కు కొన్న బాబు గొప్పా..? రూ.2.49కు నేను కొంటే తప్పా?

- చంద్రబాబు హయాంలో పవన్ విద్యుత్(విండ్ పవర్)కు సంబంధించి 2014-19 మధ్య 3494 మెగావాట్ల విద్యుత్ కోసం 133 పీపీఏలు చేసుకున్నారు. సగటున యూనిట్ రూ.4.84 చొప్పున కొనుగోలు చేసుకునేందుకు ఒప్పందాలు చేసుకున్నారు. 2014లో మాత్రం రూ.4.70 చొప్పున కొన్నారు.
- సోలార్ విద్యుత్ సంబంధించి 2014-19 మధ్య 2500 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు కోసం 35 పీపీఏలు చంద్రబాబు చేసుకున్నారు. యూనిట్ రూ.5.25 నుంచి రూ.6.99 చొప్పున కొనుగోలు చేసుకునేందుకు ఒప్పందాలు చేసుకున్నారు. 2014లో 649 మెగావాట్ల కోసం 30 పీపీఏలు చేసుకోగా యూనిట్ రూ.6.49కు కొన్నారు. 2015లో రూ.5.96కు, 2016లో వరుసగా యూనిట్ రూ.6.80కు, రూ.5,99, రూ.4.61,రూ.4.50 చొప్పున కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకున్నారు. అంటే చంద్రబాబు హయాంలో సోలార్ విద్యుత్‌ను సగటున యూనిట్ రూ.5.90 చొప్పున కొన్నారు.
- 2019-20లో ఏపీఈఆర్‌సీ టారిఫ్ ఆర్డర్ చూస్తే విండ్ పవర్ సగటు ధర యూనిట్ రూ.4.63, సోలార్ పవర్ సగటు ధర యూనిట్ రూ.5.90కు కొనేందుకు అనుమతినిస్తే.. మా హయాంలో రూ.2.49 చొప్పున అత్యంత చౌక ధరకు 7 వేల మెగావాట్లు సౌర విద్యుత్ కొనుగోలుకు ఒప్పందాలు చేసుకుంటే నాపై బురద జల్లడం ఎంతవరకు సమంజసం? ఆత్మనిర్భర్ కింద సోలార్ ప్యానళ్ల తయారీని ప్రోత్సహించేందుకు దేశంలో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ కింద కేంద్రం గొప్ప అడుగు వేసింది.
- రాష్ట్రానికి మంచి చేయాలన్న తపనతో చరిత్రలో ముందెన్నడూ లేనంత చౌక ధరకు విద్యుత్ కొనుగోలు కోసం సెకీతో ఒప్పందం చేసుకున్న నేను మంచోడినా? లేక అంత దిక్కుమాలిన రేట్లకు పీపీఏలు చేసుకున్న చంద్రబాబు మంచోడా?

మేం సంపద సృష్టించాం.. ఆవిరి చేసింది చంద్రబాబే

మాట్లాడితే సంపద సృష్టిస్తానంటూ ప్రచారం చేసుకునే చంద్రబాబు తన హయాంలో సంపద ఏ విధంగా ఆవిరి చేశాడో ఒక్కసారి మీరే చూడండి. 2500 మెగావాట్ల సోలార్ పవర్,, 3494 మెగావాట్ల విండ్ పవర్ కోసం చేసుకున్న పీపీఏలను.. మా హయాంలో యూనిట్ రూ.2.49కే సరఫరా చేసేందుకు చేసుకున్న పీపీఏతో పోల్చి చూస్తే ఎవరు సంపద సృష్టించారన్నది అందరికీ అర్థమవుతుంది. సాధారణంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వాలపై భారం పడుతుంది. చంద్రబాబు హయాంలో 3494 మెగావాట్ల పవన విద్యుత్ కోసం చేసుకున్న పీపీఏలను పరిశీలిస్తే సగటున యూనిట్ రూ.4.84 చొప్పున చేసుకున్నారు. మా హయాంలో అదే విద్యుత్ యూనిట్ రూ.2.49కే వచ్చింది. మా హయాంతో పోలిస్తే బాబు హయాంలో చేసుకున్న ఒప్పందాల వలన రూ.2.35 అదనంగా భారం పడుతుంది. 3,494 మెగావాట్లు అంటే 9 వేల మిలియన్ యూని ట్లు! యూనిట్ రూ.2.35 చొప్పున చూస్తే ఏడాదికి రూ.2 వేల కోట్లు అదనపు భారం పడింది. ఆ లెక్కన 25 ఏళ్లకు అక్షరాల రూ.50వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుంది. ఇక 2500 మెగావాట్ల సోలార్ పవర్ కోసం చేసుకున్న పీపీఏలను పరిశీలిస్తే.. సగటున యూనిట్ విద్యుత్ రూ.5.90 చొప్పున కొనేందుకు ఒప్పందాలు చేసుకు న్నారు. 2500 మెగావాట్లు అంటే 4200 మిలియన్ యూనిట్లు. మన హయాంలో చేసుకున్న పీపీఏల ప్రకారం యూనిట్ రూ.2.49లతో పోల్చి చూస్తే.. చంద్రబాబు హయాంలో సోలార్ పవర్ యూనిట్ విద్యుత్ రూ.3.41 పైసల చొప్పున అదనంగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. అంటే ఏడాదికి రూ.1500 కోట్ల చొప్పున 25 ఏళ్లలో రూ.37,500 కోట్ల అదనపు భారం పడుతుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49 చొప్పున కొనుగోలు చేయడం వలన రాష్ట్ర ప్రభుత్వానికి 25 ఏళ్లలో రూ.1.10 లక్షల కోట్లను ఆదా చేయడం ద్వారా ఆ మేరకు నేను సంపద సృష్టిస్తే.. అదే చంద్రబాబు హయాంలో చేసుకున్న సోలార్, విండ్ పీపీఏల వల్ల 25 ఏళ్లలో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.87,500 కోట్ల భారం పడటం వల్ల ఆ మేరకు సంపద ఆవిరి అయిపోతుంది. ఈ తేడా గమనించాలని అందరినీ కోరుతున్నా.

అంబరాన్నంటేలా సంబురాలు!

- ప్రజాపాలన- ప్రజావిజయోత్సవాలకు భారీ కసరత్తు
- డిసెంబర్ 1 నుంచి 9 వరకు రోజువారీ కార్యక్రమాలు
- షెడ్యూల్ ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7వ తేదీతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు 2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్స వాల్లో భాగంగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు రోజువారీగా నిర్వహించనున్న కార్యక్రమాల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. డిసెంబర్ 1న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల 2వ దశ పనులకు శంకుస్థాపన చేయటంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. డిసెంబర్ 9న సచివాల యంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి. రోజువారీగా నిర్వ హించనున్న కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి..

డిసెంబర్ 1, 2024

- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ 2వ దశకు శంకుస్థాపనలు. ➤ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు. ➤ సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభం (డిసెంబర్ 1 నుంచి 8 వరకు)

డిసెంబర్ 2, 2024

- 16 నర్సింగ్, 28 పారా మెడికల్ కళాశాలల ప్రారంభోత్సవం. ➤ 213 కొత్త అంబులెన్సులు ప్రారంభం.
- 33 ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ల ప్రారంభం. ➤ ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లపై పైలట్ ప్రాజెక్టు.

డిసెంబర్ 3, 2024

- హైదరాబాద్ రైజింగ్ కార్యక్రమాలు.
- ఆరాంఘర్ నుండి జూపార్క్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభం. ➤ రూ.150 కోట్ల విలువైన బ్యూటిఫికేషన్ పనుల ప్రారంభం.➤ కేబీఆర్ పార్క్ చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

డిసెంబర్ 4, 2024

- తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భవన శంకుస్థాపన. ➤ వర్చువల్ సఫారీ, వృక్ష పరిచయ కేంద్రం ప్రారంభం. ➤ 9,007 మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ.

డిసెంబర్ 5, 2024

- ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం. స్వయం సహాయక గ్రూపుల చర్చలు. ➤ మేడ్చల్, మల్లేపల్లి, నల్లగొండలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రారంభం.
- ఘట్‌కేసర్‌లో బాలికల ఐటీఐ కాలేజీ ప్రారంభం.

డిసెంబర్ 6, 2024

- యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రారంభం. ➤ 244 సబ్ స్టేషన్లకు శంకుస్థాపన.

డిసెంబర్ 7, 2024

- స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం.
- పోలీస్ బ్యాండ్ ప్రదర్శన. ➤ తెలంగాణ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

డిసెంబర్ 8, 2024

- 7 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులు ప్రారంభం.
- 130 కొత్త మీ-సేవ కేంద్రాల ప్రారంభం.
- ఏఐ సిటీకి భూమి పూజ
- స్పోర్ట్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన.
- తెలంగాణ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక వేడుకలు.

డిసెంబర్ 9, 2024

- లక్షల మంది మహిళా శక్తి సభ్యుల సమక్షంలో సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ.
- ట్యాంక్ బండ్‌పై ముగింపు వేడుకలు. డ్రోన్ షో, ఫైర్ వర్క్స్, ఆర్ట్ గ్యాలరీ, వివిధ స్టాళ్ల ఏర్పాటు.

ఆయనే రాత్రిని పగటిలోకి ప్రవేశింప జేస్తున్నాడు మరియు పగటిని రాత్రిలోకి ప్రవేశింప జేస్తున్నాడు మరియు సూర్య–చంద్రులను నియమబద్ధులుగా చేసి ఉన్నాడు. ఆయనే అల్లాహ్! మీ ప్రభువు. విశ్వ సామ్రాజ్యాధికారం ఆయనదే!

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 29 నవంబర్ 2024

కోర్టులు కదిపిన తేనెతుట్టెలు

దేవుడు అంతటా, అందరిలో ఉన్నాడని నమ్మే గడ్డపై... ఆయనను నిర్ణీత స్థల, కాలాలకే పరిమితం చేసే సంకుచిత రాజకీయ స్వార్థాలు చిచ్చు రేపుతూనే ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య విద్వేషాగ్ని రగిలిస్తున్న ఈ ప్రయత్నాలకు తాజా ఉదాహరణ – యూపీలోని సంభల్ జామా మసీదు వివాదం, దరిమిలా అక్కడ రేగిన హింసాకాండ, ఆస్తి, ప్రాణనష్టం. ఈ ఏడాది జనవరిలో జరిగిన అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపనతో మందిరం – మసీదు వివాదాలు ముగిసిపోతాయని ఎవరైనా ఆశపడితే అది వట్టి అడియాసని మరోసారి తేలిపోయింది. మత రాజకీయాలకూ, వర్గ విభేదాలకూ ప్రార్థనా స్థలాలు కేంద్రాలు కారాదనే సదుద్దేశంతో చేసిన ప్రార్థనా స్థలాల పరిరక్షణ చట్టం–1991 స్ఫూర్తికే విఘాతం కలిగింది. ప్రార్థనా మందిరాల నిర్మాణమూలాలను తెలుసుకోవాలన్న ఒక వర్గం ఉత్సాహం తప్పేమీ కాదంటూ సర్వోన్నత న్యాయస్థానం ఒక దశలో అదాటున చేసిన వ్యాఖ్యలు చివరకు ఇక్కడకు తెచ్చాయి. వివాదం వస్తే చాలు... దేశంలో ప్రతి చిన్న కోర్టూ అనాలోచితంగా సర్వేలకు ఆదేశించేలా ఊతమిచ్చాయి. ఇది అత్యంత దురదృష్టకర పరిణామం.

తాజా ఘర్షణలకు కేంద్రమైన సంభల్‌లోని షాహీ జామా మసీదు 16వ శతాబ్దికి చెందిన రక్షిత జాతీయ కట్టడం. వారణాసిలోని జ్ఞానవాపి, యూపీలోని మథురలో నెలకొన్న ఈద్గా, మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఉన్న కమాల్ మౌలా మసీదుల్లో లానే దీనిపై రచ్చ మొదలైంది. అక్కడ కేసులు వేసినవారే ఇక్కడా కోర్టుకెక్కారు. మొఘల్ చక్రవర్తి బాబర్ కాలంలో కట్టిన 3 మసీదుల్లో (పానిపట్, అయోధ్య, సంభల్) ఇదొకటి. ప్రాచీన హరిహర మందిర్ స్థలంలో ఈ మసీదును నిర్మించారని పిటిషనర్ల వాదన. జిల్లా కోర్టులో ఈ నెల 19న కేసు వస్తూనే జడ్జి మసీదులో ఫోటో, వీడియో సర్వేకు ఆదేశిస్తూ, 29వ తేదీ కల్లా నివేదిక సైతం సమర్పించాలన్నారు. తొలి సర్వే ప్రశాంతంగా సాగినా, నవంబర్ 24 నాటి రెండో సర్వే భారీ హింసకు దారి తీసింది. సర్వేకు వచ్చినవారిలో కొందరు జై శ్రీరామ్ నినాదాలు చేశారనీ, దాంతో నిరసనకారులు రాళ్ళురువ్వారనీ వార్త. కాల్పుల్లో అయిదుగురు మరణించారు. అమాయకుల ప్రాణాలు, పట్నంలో సామరస్య వాతావరణం గాలికెగిరి పోయాయి.

శతాబ్దాల తరబడి అన్ని వర్గాలూ కలసిమెలసి జీవిస్తున్న చోట విద్వేషాగ్ని రగులుకుంది. ఎన్నో ఏళ్ళుగా ఉన్న అయోధ్య, వారణాసి వివాదాలకు భిన్నంగా సంభల్ కథ చిత్రంగా ఈ ఏడాదే తెర మీదకొచ్చింది. పశ్చిమ యూపీలో సంభల్ జిల్లా మూడు దశాబ్దాలుగా సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి కంచుకోట. 1980ల నుంచి అక్కడ అధికారం కోసం బర్క్, మెహమూద్ కుటుంబాలు వేర్వేరు పార్టీల పక్షాన పరస్పరం తలపడుతూ వచ్చాయి. తర్వాత 1990ల నుంచి రెండు వర్గాలూ ఎస్పీతోనే అనుబంధం నెరపుతున్నాయి. అధికారంలో పైచేయి కోసం ఒకే పార్టీలోని ఈ రెండు వర్గాల మధ్య పోరాటమే తాజా హింసకు కారణమని బీజేపీ ప్రచారం చేస్తోంది. హిందూ – ముస్లిమ్‌ల తర్వాత, ఇక ముస్లిమ్‌లలోని ఉపకులాల మధ్య చీలికలు తీసుకురావడానికే కాషాయ ధ్వజులు ఈ ప్రచారం చేస్తున్నారని ఎస్పీ ఖండిస్తోంది. మొఘల్ శిల్పనిర్మాణ శైలికి ఈ మసీదు ప్రతీకైతే, ఈ సంభల్ ప్రాంతం విష్ణుమూర్తి పదో అవతారమైన కల్కి వచ్చే ప్రదేశమని హిందువుల నమ్మిక. భిన్న విశ్వాసాల మధ్య సొంత లాభం చూసుకొనే కొందరి రాజకీయంతో సమస్య వచ్చి పడింది.

నిజానికి, 1947 ఆగస్ట్ 15కి ముందున్న ధార్మిక విశ్వాసాల ప్రకారమే అన్ని ప్రార్థనా ప్రదేశాలూ కొనసాగాలి. ఒక్క అయోధ్య రామజన్మభూమి – బాబ్రీ మసీదు వివాదమే దానికి మినహాయింపని దీర్ఘకాలం క్రితమే కేంద్ర సర్కార్ చేసిన 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టం. అయోధ్య తరహాలో మరిన్ని సమస్యలు రాకూడదన్నది దాని ప్రధానోద్దేశం. ఏ ప్రార్థనా స్థలాన్నీ పాక్షికంగా కానీ, పూర్తిగా కానీ ఒక మతవిశ్వాసం నుంచి మరోదానికి మార్పిడి చేయరాదనీ, చర్చ పెట్టరాదనీ చట్టంలోని 3వ సెక్షన్ స్పష్టంగా నిషేధించింది. అయితే, ప్రార్థనా స్థలాల ప్రాచీన స్వరూపమేమిటో నిర్ధారించడం చట్టవిరుద్ధం కాదంటూ 2002 మేలో జస్టిస్ చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు వివాదాలకు సందు ఇచ్చాయి. అనేకచోట్ల చిన్న కోర్టులు మందిర– మసీదు వివాదాలపై విచారణ చేపట్టి, పర్యవసానాలు ఆలోచించకుండా హడావిడిగా సర్వేలకు ఆదేశిస్తున్నాయి. సంభల్ ఘటన తర్వాతా అజ్మీర్‌లోని ప్రసిద్ధ షరీఫ్ దర్గాను గుడిగా ప్రకటించాలంటూ దాఖలైన కేసును రాజస్థాన్ కోర్ట్ అనుమతించడం ఓ మచ్చుతునక. సమస్యల్ని తేల్చాల్సిన గౌరవ కోర్టులే ఇలా తేనెతుట్టెల్ని కదిలించడం విషాదం.

ప్రార్థనాస్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీమ్‌లో ఇప్పటికే నాలుగు పిటిషన్లున్నాయి. దానిపై నిర్ణయానికి కేంద్రం, కోర్ట్ తాత్సారం చేస్తుంటే ఆ లోగా వారణాసి, మథుర, ధార్, సంభల్, తాజాగా అజ్మీర్... ఇలా అనేక చోట్ల అత్యుత్సాహం వ్యక్తమవుతోంది. ఇది శాంతి, సామరస్యాలకు పెను ప్రమాదం. ఈ ప్రయత్నాలను ఆపేందుకు సర్కారు కానీ, సర్వేలపై జోక్యానికి సుప్రీమ్ కానీ ముందుకు రాకపోవడం విడ్డూరం. ఒక వివాదాస్పద స్థలపు ధార్మిక స్వభావ అన్వేషణ చారిత్రక నిర్ధారణ, పురాతత్వ అన్వేషణతో ఆగుతుందనుకుంటే పొరపాటు. అది మత పరంగా, రాజకీయంగా రావణకాష్ఠమవుతుంది. కాశీ, మథురల్లో, ఇప్పుడు సంభల్ జరుగుతున్నది అదే. 'ప్రతి మసీదులో శివలింగాన్ని అన్వేషించాల్సిన పని లేద'ంటూ ఆరెస్సెస్ అధినేత రెండేళ్ళ క్రితం అన్నారు కానీ జరుగుతున్నది వేరు. అధికార వర్గాల అండదండలతోనే ఈ విభజన చిచ్చు రగులుతోందన్నదీ చేదు నిజం. 2019 నవంబర్‌లో ప్రార్థనా స్థలాల చట్టాన్ని సమర్థించిన సుప్రీమ్ మరోసారి గట్టిగా ఆ పని చేయకుంటే కష్టమే. ఓ హిందీ కవి అన్నట్టు, మసీదులు పోనివ్వండి... మందిరాలు పోనివ్వండి... కానీ రక్తపాతం మాత్రం ఆపేయండి. మతాలకు అతీతంగా మనిషినీ, మానవత్వాన్నీ బతకనివ్వండి!

అణుయుద్ధంగా మారనుందా?

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం 1,000 రోజుల మార్కును దాటేసింది. అమెరికా అనూహ్యంగా ఇచ్చిన అనుమతితో ఉక్రెయిన్ ఏటీఏసీఎంఎస్ క్షిపణులను రష్యా మీద ప్రయోగించింది. ఉత్తర కొరియా దళాలను ఈ యుద్ధంలో చేర్చిందనీ, ఇరాన్ సరఫరా చేసిన డ్రోన్‌లను ఉపయోగిస్తోందనీ రష్యా మీద ఆరోపణలు వచ్చాయి. దీనివల్ల యుద్ధ పరిధి రెండు దేశాలను దాటి, బహుళజాతి స్వభావానికి విస్తరించినట్టయింది. దీనికితోడు పుతిన్ తమ అణ్వాయుధ సిద్ధాంతాన్ని సవరించడం ద్వారా ఆందోళనను రేకెత్తించారు. 1962 క్యూబా సంక్షోభంలో అమెరికా, రష్యాల్లోని రాబందులు ఘర్షణను తీవ్రతరం చేయాలని కోరినప్పటికీ, అధినేతలు వివేకంతో వ్యవహరించారు. కానీ, ఈ అస్థిర కాలంలో అలాంటి వివేకం సాధ్యమా?

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నవంబర్ 19 నాటికి 1,000 రోజుల మార్కును దాటేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నవంబర్ 17న అమెరికా సైన్యపు టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్(ఏటీఏసీఎంఎస్)ను ఉపయోగించే అధికారాన్ని ఉక్రెయిన్‌కు కట్టబెట్టగానే ఆ యుద్ధం పరాకాష్ఠకు చేరుకుంది.

ఈ నిర్ణయం ద్వారా, 'అంకుల్ జో' ఎట్టకేలకు 'ధైర్య ప్రదర్శన' చేసినట్లుగా కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది కాకతాళీయమో, ఉద్దేశ పూర్వకమో గానీ యుద్ధంలో ఆకస్మికమైన, ప్రమాదకరమైన పెరుగుదల స్పష్టంగా కనబడుతోంది.

తీవ్రతను పెంచిన జో!

దీర్ఘ–శ్రేణి పాశ్చాత్య తయారీ క్షిపణులను ఉపయోగించే ఆమోదం కోసం ఉక్రెయిన్ చాలా కాలంగా ఎదురుచూస్తోంది. అయితే యుద్ధాన్ని ఇద్దరు ప్రత్యర్థులకే పరిమితం చేసే వివేకంతో, సంయమనం చూపుతూ వాషింగ్టన్ దీనిని నిలిపి ఉంచింది. అలాంటిది బైడెన్ అధ్యక్షత దాని 'అత్యంత బలహీన' దశలో ఉన్నప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగింది. వైట్ హౌస్ పీఠం కోసం నవంబర్ మొదట్లో అమెరికా ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత, జనవరి 20న కొత్త అధ్యక్షుడు (డోనాల్డ్ ట్రంప్) బాధ్యతలు స్వీకరించే సంధి కాలం ఇది.

ఉక్రెయిన్ తన కొత్త ఆయుధాలను ఉపయోగించడంలో ఎక్కువ సమయాన్ని పోగొట్టుకోలేదు. నవంబర్ 20న రష్యాలోని లక్ష్యాలపై ఏటీఏసీఎంఎస్ క్షిపణులను ప్రయోగించింది. పైగా, బ్రిటన్ సరఫరా చేసిన స్టార్మ్ షాడో క్షిపణులతో అనంతర దాడిని కొనసాగించింది. అంతకుముందు, ఉత్తర కొరియా దళాలను ఈ యుద్ధంలో చేర్చిందనీ, ఇరాన్ సరఫరా చేసిన డ్రోన్‌లను కూడా ఉప యోగిస్తుందనీ రష్యా మీద ఆరోపణలు వచ్చాయి. తద్వారా రష్యా– ఉక్రెయిన్ మధ్య నుండి యుద్ధ పరిధి రెండు దేశాలను దాటి, విస్తృత బహుళ జాతి స్వభావానికి విస్తరించినట్టయింది.

భయాన్ని పెంచిన రష్యా

అయితే మాస్కో దాదాపు వెంటనే ప్రతీకారం తీర్చుకుంది. నవంబర్ 21న రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ తమ సైన్యం తూర్పు ఉక్రేనియన్ నగరమైన డ్నిప్రోపై 'కొత్త సాంప్రదాయిక మధ్యంతర శ్రేణి క్షిపణి'ని ఉపయోగించి దాడి చేసిందని ప్రకటించారు. దీన్ని ఒరేష్నిక్‌గా వర్గీకృతమైన ప్రయోగాత్మక మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణిగా గుర్తిస్తున్నారు.

అమెరికన్, బ్రిటిష్ దీర్ఘ–శ్రేణి ఆయుధాల వినియోగానికి ప్రతిస్పందనగా, నవంబర్ 21న రష్యన్ సాయుధ దళాలు ఉక్రెయిన్ సైనిక–పారిశ్రామిక సముదాయాలలో ఒకదానిపై దాడిని నిర్వహించాయని పుతిన్ పేర్కొన్నారు. 'హైపర్‌సోనిక్ ఒరేష్నిక్ క్షిపణిని ఉపయోగించడానికి కారణం ఏమిటంటే, అమెరికా నేతృత్వంలోని కూటమి ఈ యుద్ధాన్ని మరింత మారణ హోమంవైపు పెంచాలని



నిర్ణయించుకుంటే, రష్యా దృఢమైన రీతిలో ప్రతిస్పందిస్తుంది. రష్యా ఎలాంటి పరిణామాలకైనా సిద్ధంగా ఉంది. ఎవరైనా ఇప్పటికీ దీనిని అనుమానించినట్లయితే, వారలా చేయకూడదు. ఎల్లప్పుడూ రష్యా ప్రతిస్పందన తగురీతిలో ఉంటుంది' అని పుతిన్ పేర్కొన్నారు.

ఈ ప్రతిస్పందన అణ్వాయుధ సహితంగా ఉంటుందా? అనేక ఐరోపా దేశాలు భయపడే ఘోరమైన దృష్టాంతం ఇది. పుతిన్ తమ అణ్వాయుధ సిద్ధాంతాన్ని సవరించడం ద్వారా ఈ ఆందోళనను మరింతగా రేకెత్తించారు.

రష్యా మునుపటి అణు సిద్ధాంతం, సాంప్రదాయ నమూనాలో రూపొందినది. అంటే అణ్వాయుధం అంతటి విధ్వంసకరమైన సామర్థ్యాన్ని ఉపయోగించడం గురించి ఆలోచించకుండా, కేవలం ప్రత్యర్థిని, అంటే అమెరికాను 'నిరోధించడానికి' మాత్రమే ఉద్దేశించబడింది. రెండవ షరతు ఏమిటంటే, రాజ్య ఉనికికి ముప్పు కలిగించే సాంప్రదాయ సైనిక దాడిని తిప్పికొట్టడం.

అయితే, మాస్కో సవరించి ప్రకటించిన నవంబర్ సిద్ధాంతం మొత్తం పరిధిని విస్తరించింది. అణుశక్తి మద్దతు ఉన్న అణుయేతర శక్తి ద్వారా ఎదురయ్యే ఏ దాడినైనా సరే... ఉమ్మడి దాడిగా పరిగణిస్తామని రష్యా పేర్కొంది. అలాగే, మిలిటరీ కూటమిలోని ఒక సభ్య దేశం (ఈ సందర్భంలో, అమెరికా నేతృత్వంలోని కూటమి) చేసే ఏ దాడినైనా మొత్తం కూటమి చేసిన దాడిగా పరిగణిస్తామని కూడా రష్యా స్పష్టం చేసింది.

2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ యుద్ధం ప్రారంభ దశ నుండి కూడా మాస్కో తన అణు సామర్థ్యం గురించి యోచిస్తోంది. అయితే, ఒక అవగాహన ప్రకారం రష్యా ఈ రెడ్ లైన్‌ను దాటదనీ, దీనిని కేవలం ఒక బెదిరింపుగా మాత్రమే చూడాలనీ కొందరు పాశ్చాత్య వ్యాఖ్యాతలు కొట్టేశారు. కానీ అలాంటి ఆత్మసంతృప్తి తప్పుదారి పట్టించేదీ, ప్రమాదకరమైనదీ కావచ్చు.

వివేకం కలిగేనా?

అమెరికాకూ, మునుపటి సోవియట్ యూనియన్ కూ మధ్య 1962 క్యూబా క్షిపణి సంక్షోభం ఆ సంవత్సరం అక్టోబర్ మధ్యలో ప్రారంభమై ప్రపంచాన్ని దాదాపుగా అణుయుద్ధంలోకి నెట్టింది. అమెరికా అధ్యక్షుడు జాన్ కెన్నెడీ, సోవియట్ అధ్యక్షుడు నికితా కృశ్చేవ్ అనే ఇద్దరు నాయకులు చివరి నిమిషంలో ప్రదర్శించిన వివేకం కారణంగా ఈ విధ్వంసకరమైన పరస్పర హనన కార్యక్రమం నిలిచి పోయింది. వారు 1962 నవంబర్ 20న సంయుక్తంగా దీనికి 'మంగళం పాడేయాలని' నిర్ణయించుకున్నారు.

రెండు దేశాల్లోని రాబందులు ఆ ఘర్షణను తీవ్రతరం చేయాలని కోరినప్పటికీ, శిఖరాగ్ర స్థాయిలో అధినేతలు దృఢమైన రాజకీయ నిర్ణయం తీసుకున్నారు. సోవియట్ జలాంతర్గామి కెప్టెన్ ప్రదర్శించిన వ్యూహాత్మక సంయమనం కారణంగా అదృష్టవశాత్తూ అణు నిషేధం ఉల్లంఘనకు గురికాలేదు. ప్రస్తుత అస్థిర కాలంలో అలాంటి సంయమనం పాటిస్తారా?

ఒరేష్నిక్‌ను ఆవిష్కరించడం ద్వారా, రేడియేషన్ లేకుండా అణ్వాయుధానికి దగ్గరగా ఉండే అసాధారణ సామర్థ్యాన్ని రష్యా ప్రదర్శించింది. ఒరేష్నిక్ అనేది 2,500 కి.మీ. పరిధి కలిగిన కొత్త తరం రష్యన్ మధ్యంతర శ్రేణి క్షిపణి అనీ, దీన్ని 5,000 కి.మీ. పరిధి వరకు విస్తరించవచ్చనీ రష్యన్ మీడియా నివేదించింది.

సహజసిద్ధంగా హైపర్ సోనిక్ అయిన ఈ క్షిపణి వేగం 'మాక్ 10–మాక్ 11' మధ్య ఉంటుంది (గంటకు 12,000 కి.మీ. కంటే ఎక్కువ). అంటే దీన్ని గుర్తించడం కష్టం. పైగా, ప్రస్తుత క్షిపణి నిరోధక సాంకేతికత ఈ క్షిపణిని అడ్డగించలేదు. కాలినిన్‌గ్రాడ్‌లోని రష్యన్ స్థావరం నుండి దీన్ని ప్రయోగిస్తే యూరోపియన్ రాజధానులను చాలా తక్కువ సమయంలో (సెకన్లలో) ఢీకొంటుంది: వార్సా 81; బెర్లిన్ 155; పారిస్ 412; లండన్ 416. రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ అక్టోబర్ 3న ప్రకటన చేస్తూ, అణ్వాయుధ శక్తుల మధ్య ప్రత్యక్ష సాయుధ ఘర్షణ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయలేమని పేర్కొన్నారు.


రష్యా, ఉక్రెయిన్ యుద్ధం 1,000 రోజుల మార్కును దాటింది. ఇది క్లిష్టమైన శిఖరాగ్రానికి సిద్ధంగా ఉంది. ఒక పొర అణు ప్రమాదం లేదా ఉద్దేశపూర్వక సైనిక సంఘటన రెండూ విపత్తుతో కూడి ఉంటాయి. పైగా అమెరికా పాలనలో అత్యంత బలహీనమైన ప్రస్తుత దశ ఏ సంభావ్యతకూ అవకాశం ఇవ్వకూడదు. బైడెన్ పాలన తర్వాత వస్తున్న ట్రంప్ 2.0 అధ్యక్షత విఘాతం కలిగించేదిగానూ, దుస్సాహసికంగానూ ఉంటుంది. మొత్తం మీద 2025 సంవత్సరం మరింత అల్లకల్లోలంగా ఉండబోతోంది.

వ్యాసకర్త ఢిల్లీలోని సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదే ముఖ్యమా?



ఇప్పుడు అజ్మీర్ దర్గా కింద శివ మందిరం! విభజన, ద్వేషంతో కూడిన సమస్యలను చేపట్టడంలో మన న్యాయస్థానాలు చాలా చురుకుగా ఉంటున్నాయి. మన దేశం ముందుకు సాగుతున్న తీరు దిగ్భ్రాంతికరం. ఆరోగ్యం, విద్య, ఉపాధి లాంటి ముఖ్యమైన అంశాలు అటకెక్కాయి. ద్వేషం మాత్రమే సర్వోన్నతంగా మారింది.

– ఎస్. ఇర్ఫాన్ హబీబ్, చరిత్రకారుడు

సమస్య కాదా?



నేను పేర్లు చెప్పనుగానీ, చాలామంది ప్రముఖ ఉదారవాదులు బంగ్లాదేశ్‌లో హిందువుల మీద జరుగుతున్న హింస గురించి మాట్లాడలేదు. అదే భారతదేశంలోని ముస్లిం వ్యతిరేక హింసను యాక్టివిస్టులు ప్రపంచ సమస్యగా మార్చగలిగారు. అదే న్యాయం బంగ్లా హిందువులకు ఎందుకు వర్తించకూడదు? ఇది ప్రపంచ సమస్య కాదా?

– సంజుక్తా బసు, జర్నలిస్ట్


రెండు ముఖాలు



ఒక పాలనకు సైన్యం మద్దతు ఇచ్చినప్పుడు, ఆ పాలన వ్యతిరేక నిరసనలను సైన్యం ఘోరమైన శక్తితో అణచివేస్తుంది. పాకిస్తాన్ హత్యలు అదే చూపుతున్నాయి. అదే సైన్యం ఒక పాలన మార్పు కోరుకున్నప్పుడు, నిషేధాలను అమలు చేయడానికి నిరాకరించడం ద్వారా హింసాత్మక నిరసనలకు అండగా ఉంటుంది. బంగ్లాదేశ్‌లో జరిగిందదే!

– బ్రహ్మ చెల్లానీ, వ్యాఖ్యాత

దయే స్వస్థత



పవిత్రత దేవుడి బహుమతి; ఆయనే మనలను పవిత్రం చేస్తాడు. కాబట్టి మనల్ని పవిత్రంగా మార్చమనీ, మన హృదయాలను తన హృదయంలా చేయమనీ ప్రభువును కోరుతాం. దేవుని దయ మనల్ని స్వస్థపరుస్తుంది. ఆయన మనలను ప్రేమిస్తున్నట్లుగా మనం ప్రేమించకుండా నిరోధించే అన్నింటి నుండి విముక్తి చేస్తుంది.

– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

వృద్ధికి అడ్డు



చిన్న స్టార్టప్‌లు వచ్చినప్పుడు కొన్ని పెద్ద కుటుంబాలకు అహం తలెత్తుతుంది. ఎందుకంటే అవి పోటీ పడేలా చేస్తాయి. కాబట్టి స్టార్టప్‌లను దెబ్బతీయడానికి తమ మొత్తం శక్తియుక్తుల్ని ఉపయోగిస్తాయి.

– దీపక్ షెనాయ్, ఆంట్రప్రెన్యూర్

చరిత్ర గతినే మార్చిన ఆమరణ దీక్ష

సందర్భం



జూలూరు గౌరీశంకర్

స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకమైన మలుపు తిప్పిన రోజు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన 2009 నవంబర్ 29వ తేదీ. 'కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో'నని నినదించి 11 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమాన్ని విజయ తీరాలకు మరల్చిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్వరాష్ట్ర ఉద్యమ చరిత్రగా నిలిచారు. కట్టలు తెగుతున్న ప్రజాగ్రహాన్నీ, ప్రజాసంఘాల పటుత్వాన్నీ రాజకీయ ప్రక్రియగా మరల్చి, కేంద్రం మెడలు వంచి స్వరాష్ట్ర లక్ష్యం నెరవేర్చిన ఆయన సంకల్ప దీక్ష చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన తెలంగాణ ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యలకు స్వరాష్ట్ర సాధనే పరిష్కారమని అసెంబ్లీ సాక్షిగా చెప్పి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని స్థాపించాడు. ఉద్యమ ఎగుడు దిగుళ్లను చూసుకుంటూ చివరి ప్రయత్నంగా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నాడు. తెలంగాణ అంతా భగ్గుమంది.

14 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో ఉద్యమ నాయకుని ఆమరణ నిరాహార దీక్ష స్వరాష్ట్ర సాధనకు దారి చూపింది. ఆ సత్యాగ్రహి చరిత్రను ఎవ్వరూ చెరిపేయలేరు. వాట్సాప్‌లో ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు పంపుకొనే చెత్త వాదనల అభూత కల్పనలు చరిత్ర కాదు. చరిత్ర తెలుసుకోవాలంటే 78 ఏళ్లకు పూర్వమే తెలంగాణ స్వతంత్ర రాష్ట్రమన్న విషయం తెలిసి ఉండాలి. 1953లో ఆనాటి సీమాంధ్ర నాయకులు కొందరు చేసిన కుతంత్రాలు తెలుసుకోవాలె. పచ్చటి తెలంగాణ ఎడారిగా ఎందుకయ్యిందో తెలవాలె. పంట భూముల తెలంగాణ... బీడు భూములై, ముంబై బొగ్గుబాయ్, దుబాయ్ వలస బతుకులుగా ఎట్లా మారిందో; అందుకు కారకులెవరో తెలుసుకోవాలి. కేసీఆర్ 'జై తెలంగాణ' అంటే తెలంగాణ సమాజమంతా జై జై అన్నది. ఆయన అడుగుల్లో అడిగేసి నడిచింది.

తెలంగాణ విద్రోహాల కుట్రలను ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉద్యమాన్ని నిత్య నదిలా మార్చి ప్రవాహ పరుగుగా మారాడాయన. గాంధీ మార్గంలో ఆమరణ దీక్షకు దిగి తెలంగాణ రాష్ట్ర సాధన ప్రకటన వచ్చేలా చేసిన మలిదశ తెలంగాణ ఉద్యమ యోధుడు. తలవంచని, వెన్నుచూపని యోధుల వెంటే తెలంగాణ నిలిచింది. శ్రీకాంతాచారి, యాదయ్య, కానిస్టేబుల్ కిష్టయ్య వంద లాది మంది యువత ఆత్మ బలిదానాలు చేసుకుంటుంటే గుక్క పట్టి ఏడ్చి 'బిడ్డలారా! మీ కోసమే తెలంగాణ. మీరు ఆత్మ బలిదానాలు చేసుకోవద్దు. ఆకాశం బద్దలు కొట్టయినా తెలంగాణ తెస్తా'నని రాష్ట్రం వచ్చేదాకా మడమ తిప్పన'ని స్వరాష్ట్ర కలను సాకారం చేసిన యోధుడు కేసీఆర్. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ స్వరాష్ట్ర సాధన ప్రకటనయ్యింది. ఇదీ చరిత్ర! ఇది మనమందరం ఉద్యమమై ఉద్యమించిన చరిత్ర.



తల్లి స్తన్యం బిడ్డ కందనప్పుడు వేసిన కేక తెలంగాణ. నా తెలంగాణ కోటి రతనాల వీణే కాదు. నా తెలంగాణ కోటి కత్తుల వాన, ఉద్యమ ఉద్విగ్న వీణయని పిడికిలెత్తి నిలిచిన స్వరాష్ట్ర ఉద్యమ సమరయోధుడు సలిపిన ఉద్యమ చరిత్రను మననం చేసుకోవాలి. దగా పడ్డ తెలంగాణకు రాష్ట్ర సాధన ఒక్కటే విముక్తి దారని చెప్పిన యోధుడి చరిత్రను చదవాలి. జలదృశ్యంలో పురుడు పోసుకున్న తెలంగాణ ఉద్యమ పార్టీ పిడికిలిని చూడాలి. ఓ బక్క మనిషి పిలిస్తే తెలంగాణ ఎలా కదిలిందో చరిత్ర. అసెంబ్లీ, పార్లమెంట్‌లు అచ్చెరువై చూసి స్వరాష్ట్ర సాధన ప్రకటనలు చేసే దాకా తీసుకుపోయిన తెలంగాణ జయుడి కథను రాబోయే తరాలు తెలుసుకోవాలి. ప్రతి ఊరు ఉద్యమ 'ధూంధాం'గా మారిన చరిత్రను తప్పక తరతరాలు తెలుసుకోవాలి.

కరీంనగర్ సింహ గర్జనల సభలు, వరంగల్‌లో పోటెత్తిన లక్షలాదిమంది సభలు, ఆదిలాబాద్ అడవుల్లో ఇంద్రవెల్లి స్తూపాలు పరవశించిన కథలు, గోదావరిలోయ ప్రతి ఘటనా పోరు దారులన్నీ పొంగి పరవశించిన గాథలు, నగారా మోగించిన నల్లగొండ, మహబూబ్‌నగర్‌లు; మెతుకు సీమ మెదక్ బిడ్డల ఆకాంక్షలు, ఖమ్మం తొలిదశ ఉద్యమ నిప్పును రాజేసిన నిజామాబాద్ సకలజనుల సమ్మెలు, సాగర హారాలైన హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల జనయాత్రలూ.... అన్నింటినీ రాజకీయ ప్రక్రియగా మార్చి స్వరాష్ట్ర ఉద్యమాన్ని జాతీయ ఉద్యమంగా మలిచిన ఉద్యమ చరిత్రను కాదనగలరా?

ఉద్యమ జ్యోతి ఆగిపోకుండా, ఉద్యమ వేడి తగ్గకుండా పద్నాలుగేళ్ల స్వరాష్ట్ర ఉద్యమాన్ని గాంధేయ మార్గంలో నడిపించిన కేసీఆర్‌ను మరుస్తదా బిడ్డా తెలంగాణ గడ్డ? ప్రపంచీకరణ కాలంలో కోట్లమందిని ఒక్కతాటిపైకి తెచ్చిన ఆయన 'దీక్షా దివస్' చరిత్రలో చెక్కు చెదరనిది.

వ్యాసకర్త తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు (2009లో స్వరాష్ట్ర సాధనకు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రోజు నేడు)

మద్దతు ధరకు చట్టబద్ధత తప్పనిసరి!

అభిప్రాయం



తలకోల రాహుల్ రెడ్డి

కనీస మద్దతు ధరల చట్టం ... దశాబ్దాలుగా రైతులు కంటున్న కల! ప్రపంచంలో గుండు సూది నుంచి విమానం వరకు ఏ వస్తువుకైనా ధరను నిర్ణయించే అధికారం వాటిని ఉత్పత్తి చేసే వారికే ఉంటుంది. కానీ ఇంటిల్లి పాది రెక్కలు ముక్కలు చేసుకొని సాగు చేసే పంటలకు ధరలు నిర్ణయించుకునే అధికారం రైతులకు లేదు. రిటైల్ ధరలలో మూడో వంతు కూడా సాగు దారులకు దక్కని దుస్థితి కొనసాగుతోంది. రైతులు పండించే పంట ఉత్పత్తులపై ఆధారపడి జీవించే దళారులు, టోకు, రిటైల్ వ్యాపారులతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ వర్గాలు మాత్రం కోట్లు గడిస్తున్నారు.

ఏటా పెరుగుతున్న పెట్టుబడులు రైతులకు తలకు మించిన భారంగా మారాయి. ఏటా పెరిగే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలకు తోడు కూలీల కొరత రైతులను వేధిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు, వాతావరణ మార్పుల వల్ల వచ్చే తెగుళ్లు, పురుగులు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. మార్కెట్ మాయాజాలం కారణంగా పంట కోతకొచ్చే నాటికి గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. పంట సాగు ఖర్చుకు ఒకటిన్నర రెట్లు ఆదాయం అందాలనీ, అప్పుడే రైతుకు న్యాయం జరుగుతుందనీ డా॥ స్వామినాథన్ కమిటీ 2005లో నాటి యూపీఏ ప్రభుత్వానికి చేసిన సిఫార్సులు ఇప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. వాస్తవానికి 23 పంటలకు కనీస మద్దతు ధర (ఎమ్ఎస్పీ)తో చట్టబద్ధత కల్పించాలనీ, ఈ విషయాన్ని ప్రభుత్వం రైతుల ఆర్థిక కోణంలో చూడాలనీ రైతులు కోరుతున్నారు. అయితే ఇందుకు ఏమాత్రం తలొగ్గని కేంద్రం ఏటా 10–15 పంటలకు మాత్రమే మద్దతు ధరలను ప్రకటిస్తోంది. ఎమ్ఎస్పీకి చట్టబద్ధత కల్పిస్తే కేంద్రంపై ఏటా రూ. 12 లక్షల కోట్లకు పైగా అదనపు భారం పడుతుందని నీతి ఆయోగ్ చెబుతున్న విషయాన్ని సాకుగా చూపి కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడానికి ముఖం చాటేస్తోంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అధ్యయనం ప్రకారం... డెయిరీ రంగంలో పాడి రైతులు తమ ఉత్పత్తులకు రిటైల్ ధరలలో 60–70 శాతం పొందగలుగుతున్నారు. మాంసం రిటైల్ ధరలో 60 శాతం పొందుతున్నారు. టమోటా రైతులు 33 శాతం, ఉల్లి రైతులు 36 శాతం పొందుతున్నారు. ఇక పండ్ల విషయానికి వస్తే అరటి పండ్లకు 31 శాతం, మామిడి పండ్లకు 43 శాతం, బత్తాయి, కమల వంటి పండ్లకు 40 శాతం పొందుతున్నారు. మార్కెట్లో కిలో రూ. 50–75 మధ్య పలికే బియ్యం (ధాన్యం) పండించే రైతులకు మాత్రం ఆ ధరలో కనీసం 10–20 శాతం కూడా దక్కని దుస్థితి నెలకొంది.



రైతుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయినట్లు 77 జాతీయ నమూనా సర్వే వెల్లడిస్తోంది. ఈ సర్వే ప్రకారం దేశంలో సన్నకారు రైతు కుటుంబాల నెలసరి ఆదాయం సగటున రూ. 10,218 మాత్రమే. రైతు కూలీల సగటు నెలవారీ ఆదాయం రూ. 4 వేలకు మించిలేదు. ఆదాయాలు పెరగకపోవడంతో వారి రుణభారంలో తగ్గుదల కనిపించడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాక, రుణ భారం తట్టుకోలేక రైతులు, రైతు కూలీల ఆత్మహత్యలు ఏటా పెరుగుతున్నాయి.

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత గడచిన 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా... కేంద్రం ప్రకటించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించడమే కాదు... మార్కెట్‌లో ధర లేని సమయంలో 'మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్' కింద మద్దతు ధర దక్కని ఉత్పత్తులను కొనుగోలు చేసి మద్దతు ధర దక్కేలా కొంత మేర కృషి చేయగలిగింది ఏపీలో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. గ్రామ స్థాయిలో ఏర్పాటైన ఆర్బీకే వ్యవస్థ, రైతులకు వెన్ను దన్నుగా నిలవగా, వాటికి అనుబంధంగా దాదాపు రూ. 16 వేల కోట్ల అంచనా వ్యయంతో కోల్డ్ స్టోరేజ్‌లు, కలెక్షన్ రూములు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు బీజం పడింది. మద్దతు ధరల నిర్ణయం, కల్పన, అమలు కోసం జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఏపీ ఫామ్ ప్రొడ్యూస్ సపోర్టు ప్రైస్ ఫిక్సేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్టు–2023'కు రూపకల్పన చేసింది. కానీ అధికారుల తీరు వల్ల అసెంబ్లీలో చట్టరూపం దాల్చలేక పోయింది.

ఏపీ తయారు చేసిన చట్టాన్ని మరింత పకడ్బందీగా జాతీయ స్థాయిలో తీసుకొస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ విషయంలో జాప్యం చేసే కొద్దీ మద్దతు ధర దక్కని రైతులు వ్యవసాయానికి మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుత వ్యవసాయదారుల్లో 60 శాతం మంది లోటు ఉత్పాదకత కారణంగా సాగును వదలి వేయాలని నిర్ణయించుకున్నట్లు దేశంలోని 21 రాష్ట్రాల్లో అధ్య యనం చేసిన ఓ జాతీయ సర్వే సంస్థ ఇటీవల తేల్చింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలోనే ఈజ్ ఆఫ్ డూయింగ్ ఫార్మింగ్ దిశగా అడుగులు వేసి ఈ రంగాన్ని బలోపేతం చెయ్యాలి.

వ్యాసకర్త మార్కెట్ ఎనలిస్ట్, కన్సల్టెంట్

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.7.51 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** స్వాతి ఉ.10.23 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** సా.4.31 నుండి 6.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.30 నుండి 9.18 వరకు, తదుపరి ప.12.13 నుండి 1.01 వరకు, **అమృత ఘడియలు:** రా.2.55 నుండి 4.40 వరకు, మాసశివరాత్రి; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.16, **సూర్యాస్తమయం:** 5.20.



మంత్రి శ్రీధర్‌బాబుతో బన్యన్ నేషన్ ప్రతినిధులు

‘బన్యన్ నేషన్’తో 500 మందికి ఉద్యోగాలు

- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమతో సర్క్యులర్ ఎకానమీ (వృత్తాకార ఆర్థిక వ్యవస్థ)కి తోడ్పడుతున్న అంకుర సంస్థ ‘బన్యన్ నేషన్’ రూ.200 కోట్ల పెట్టుబడితో భారీ విస్తరణ చేపట్టేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ విస్తరణ పూర్తయితే మరో 500 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. గురువారం సచివాలయంలో సంస్థ ప్రతినిధులు శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో ‘బన్యన్ నేషన్’రీ సైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తోందని, దీనిని 45 వేల టన్నులకు విస్తరించడానికి ఏర్పాట్లు చేసుకుంటోందని చెప్పారు. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌ను ఈ సంస్థ యూనిలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తోందని తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న ‘బన్యన్ నేషన్’లాభాల్లో నడుస్తోందని, కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం వారు మరికొంత భూమిని అడుగుతున్నారని, దీనిపై టీజీఐఐసీ నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఐటీ విభాగం సలహాదారు సాయికృష్ణ, టీజీఐఐసీ సీఈవో వి.మధుసూదన్, బన్యన్ నేషన్ సీఈవో మణి వాజ్‌పేయ్, సీవోవో రాజ్ కిరణ్ మదనగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలూ.. ఆయిల్‌పాం సాగు చేయండి

- మొదటి మూడేళ్లు పెట్టుబడి ప్రభుత్వానిదే.. అంతర పంటలు వేస్తే బోనస్
- మహబూబ్‌నగర్ రైతు సదస్సులో వ్యవసాయ మంత్రి తుమ్మల



వ్యవసాయ పండుగ స్టాల్‌ను ప్రారంభిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటరెడ్డి. చిత్రంలో చిన్నారెడ్డి, తుమ్మల, కోదండరెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ‘రైతులంతా ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టాలి. మొదటి మూడేళ్లు మీకు పెట్టుబడి పెట్టే బాధ్యత మాది. అంతర పంటలు వేస్తే బోనస్ ఇచ్చే బాధ్యత కూడా మాదే. మీ పంటను ఇంటి వద్దే కొనిపించే బాధ్యత తీసుకుంటాం. వెంటనే మీ ఖాతాలో డబ్బులు వేస్తాం. పామాయిల్ పంట వేయండి.. మీ బతుకుల్లో వెలుగులు నింపలేకపోతే వ్యవసాయ శాఖపరంగా మీరు ఏ శిక్ష విధించినా దానికి సిద్ధంగా ఉంటాం. రైతులకు నష్టం రాకుండా చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది’ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో మూడు రోజుల రైతు పండుగ సదస్సును పద్మశ్రీ అవార్డుగ్రహీత, రైతు వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సదస్సులో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, ఆహార పదార్థాలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేలా మైదానంలో ఏర్పాటు చేసిన 117 స్టాళ్లు, ఎగ్జిబిట్‌లను తిలకించిన అనంతరం సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడారు. రాష్ట్రానికి అప్పులు, కష్టాలు ఉన్నా రైతాంగాన్ని ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నట్లు తెలిపారు.

అనుకున్నవన్నీ నాలుగేళ్లలో చేస్తాం..

రైతులు తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని, వచ్చే నాలుగేళ్లలో అనుకున్న వన్నీ చేసి అన్నదాతల చేత శెభాష్ అనిపించుకుంటామని మంత్రి తుమ్మల చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు పదేళ్లు వ్యవసాయాన్ని ఎలా ఆగం చేశారో, ఈ పది నెలల్లో ఏ రకంగా ఆదుకున్నామో ఈ నెల 30న జరిగే సభలో సీఎం రేవంత్‌రెడ్డి చెబుతారని తుమ్మల తెలిపారు. రైతులను సమీకరించి సంక్రాంతికి ముందే రైతు పండుగను నిర్వహించుకుంటామన్నారు.

సాగు దండగ కాదు.. పండగని వైఎస్ నిరూపించారు: దామోదర

ఉమ్మడి ఏపీలో 2003–04లో వ్యవసాయం దండగ అని ప్రచారం జరిగితే 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమైన ప్రాజెక్టులను చేపట్టి కొంత వరకు పూర్తి చేశారని.. వ్యవసాయం దండగ కాదు.. పండగని నిరూపించారని మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసినా ప్రస్తుత ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకొని వాటిని సాకారం చేసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు తగ్గి లాభాలు పెరుగుతాయన్నారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాజీపేట్‌లో ఇంటిగ్రేటెడ్
రైల్ కోచ్ ఫ్యాక్టరీ

- రైల్ వ్యాగన్ రిపేర్ ఫ్యాక్టరీని అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్ర సర్కార్ నిర్ణయం
- విభజన చట్టం హామీలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో సమీక్ష
- హాజరైన సీఎస్ శాంతికుమారి, ఇతర కార్యదర్శులు

సాక్షి, న్యూఢిల్లీ: కాజీపేట్‌లోని రైల్ వ్యాగన్ రిపేర్ ఫ్యాక్టరీని ఇంటిగ్రేటెడ్ రైల్ కోచ్ ఫ్యాక్టరీగా అప్ గ్రేడ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఆగస్టులోగా ఈ పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. అదేవిధంగా ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్ రెండో దశను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపింది. గురువారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన విభజన చట్టం షెడ్యూల్13లోని అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లో తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ అంశాలను పరిష్కరిస్తామని కేంద్రం ఈ సమావేశంలో తెలిపింది. శాంతి కుమారితో పాటు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఫైనాన్స్ కె.రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్, పంచాయితీరాజ్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేందర్ మోహన్, గనుల శాఖ కార్యదర్శి ఎ.శరత్, తెలంగాణ భవన్ ఆర్సీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు 50 నిమిషాల పాటు జరిగిన ఈ సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా షెడ్యూల్ 13 లోని ట్రైబల్, హార్టికల్చర్ యూనివర్సిటీల ఏర్పాటు, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, ఎన్టీపీసీ సెకండ్ ఫేజ్‌లో 4వేల మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్ వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలకు ‘ధరణి’ పవర్స్

- సర్క్యులర్ జారీ చేసిన సీసీఎల్‌ఏ

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌కు వచ్చిన వివిధ కేటగిరీల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా వాటికి తుది ఆమోదం తెలిపే అధికారాలను అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలకు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్త మార్గదర్శకాలను ప్రకటిస్తూ భూపరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్‌మిట్టల్ ఈ నెల 26న సర్క్యులర్ జారీచేశారు. ధరణి కమిటీ సిఫారసుల అమల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నారు.

అదనపు కలెక్టర్లకు 4 కొత్త అధికారాలు

అదనపు కలెక్టర్లు(రెవెన్యూ) కొత్తగా ధరణి సాఫ్ట్‌వేర్‌లోని నాలుగు మాడ్యూల్స్‌కు తుది ఆమోదం తెలిపే అధికారం పొందనున్నారు. మ్యూటేషన్ దరఖాస్తులు(టీఎం3), పీపీబీ–కోర్టు కేసు(టీఎం24), ఇళ్లు/ఇంటి స్థలంగా పేరు ఉన్న సందర్భంలో పీపీబీ/నాలా కన్వర్షన్ జారీ(టీఎం31), పాస్‌బుక్‌లో తప్పుల దిద్దుబాటు/పేరు మార్పు(టీఎం 33)కు సంబంధించిన దరఖాస్తులకు ఆయన స్థాయిలోనే పరిష్కరిస్తారు. ఈ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను సైతం సీసీఎల్‌ఏ ప్రకటించింది. తొలుత తహసీల్దార్లు దరఖాస్తుదారులను విచారించి తమ ఆదేశాలను అప్‌లోడ్ చేయడం ద్వారా వారి దరఖాస్తులను ఆర్డీఓలకు పంపించాలి. ఆర్డీఓలు దరఖాస్తులను పరిశీలించి తమ ఆదేశాలను అప్‌లోడ్ చేయడం ద్వారా అదనపు కలెక్టర్లకు ఫార్వర్డ్ చేయాలి. తహసీల్దార్/ఆర్డీఓ సిఫారసుల ఆధారంగా అదనపు కలెక్టర్లు దరఖాస్తులను ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే అదనపు కలెక్టర్లు అందుకు సరైన కారణాలు తెలపాలి.

ఆర్డీఓలకు మరిన్ని అధికారాలు..

ఆర్డీఓలకు ఇప్పటికే ఉన్న ధరణి మాడ్యూల్ అధికారాలకు అదనంగా మరో నాలుగు మాడ్యూల్స్‌కు తుది ఆమోదం తెలిపే అధికారాన్ని ప్రభుత్వం కట్టబెట్టింది. అసైన్డ్ భూములతో సహా పట్టా భూముల వారసత్వ బదిలీ దరఖాస్తులు(టీఎం4), పెండింగ్ నాలా దరఖాస్తులు (టీఎం27), సర్వే నెంబర్ డిజిటల్ సైనింగ్(టీఎం 33), సర్వే నెంబర్ డిజిటల్ సైనింగ్(జీఎల్‌ఎం) దరఖాస్తులకు తుది ఆమోదం తెలిపే అధికారాన్ని వారికి కల్పించింది. గత ఫిబ్రవరి 28న ప్రకటించిన గడువుల్లోగానే దరఖాస్తులను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకొని ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించింది.

రాజ్యాంగం ప్రకారమే ఉత్తర్వులు

- ‘ఫిరాయింపుల’ మీద కేఏ పాల్ పిటిషన్‌పై స్పష్టం చేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: న్యాయస్థానాలు రాజ్యాంగం, చట్టప్రకారం మాత్రమే ఉత్తర్వులు ఇవ్వగలవని హైకోర్టు స్పష్టం చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. ఈ మేరకు దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. ఒక పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన శాసనసభ్యులు వెంటనే మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారని.. ఇలాంటి వారి శాస నసభ సభ్యత్వాన్ని రద్దు చేసేలా ఎన్నికల కమిషన్‌కు ఆదే శాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా, రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు ఫిరాయింపు ఎమ్మెల్యేలు హాజరుకాకుండా ఆదేశాలివ్వాలని పాల్ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీని వాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా నిషేధం విధించాలని కేఏ పాల్ కోరారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మహిపాల్ రెడ్డి తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. స్పీకర్ అధికారాల్లో జోక్యం కోరుతూ వేసిన ఈ పిటిషన్ చెల్లదని, మధ్యంతర ఉత్తర్వులు కోరలేరని అన్నారు. పలువురి అనర్హత పిటిషన్లు స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది.

సీఎం సభపై సీఎస్ సమీక్ష

- 30న రైతుపండగ సభ ఏర్పాట్లకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఇందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సీఎం సభ ఏర్పాట్లను టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. 30న సాయంత్రం 4 గంటలకు సభ వేదికకు ముఖ్యమంత్రి చేరుకుంటారని చెప్పారు. మధ్యాహ్నం రెండున్నర వరకే రైతులు వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గురువారం ప్రారంభమైన రైతు పండగ వేదికలో దాదాపు 150 స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీఎం సభకు హాజరయ్యే రైతులకు తగు సీటింగ్, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సభకు కనీసం 25 వేలకు పైగా మహిళా రైతులు హా జరయ్యే అవకాశం ఉన్నందున వారికి కూడా తగు ఏ ర్పా ట్లు చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రంలోగా ఏర్పాట్లన్నీ పూర్తి కావాలన్నారు. ప్రతీ జిల్లా, మండలం నుండి వచ్చే బస్సుల్లో ఒక కానిస్టేబుల్, ఒక ప్రత్యేక లైజన్ అధికారిని నియమించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, అడిషినల్ డీజీ మహేష్ భగవత్, సమాచార శాఖ కమిషనర్ హరీశ్, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పదేళ్లపాప మృతి



సమన్విత

జన్నారం: ఉదయం పాఠశాలకు వెళ్లడానికి సిద్ధమవుతున్న పదేళ్ల పాప గుండెపోటుతో మృతిచెందింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోటిగూడ గ్రామంలో గురువారం ఈ విషాదకర ఘటన జరిగింది. గ్రామానికి చెందిన దిగుట్ల నాగరాజు, అనూష దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు సమన్విత (10) జన్నారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఉదయం పాఠశాలకు వెళ్లడానికి సిద్ధమయ్యే క్రమంలో బ్రష్ చేసుకుంటూ గుండెలో నొప్పి వస్తోందంటూ కుప్పకూలింది. తల్లిదండ్రులు వెంటనే జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే పాప మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారి మృతితో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.


టెన్త్‌లో ఇంటర్నల్ మార్కుల ఎత్తివేత

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల చేశారు. టెన్త్ పరీక్ష ఫలితాల్లో 2014 వరకూ మార్కులు ఇచ్చేవారు. ప్రైవేటు స్కూళ్ల ప్రచారం నేపథ్యంలో మార్కుల స్థానంలో గ్రేడింగ్ విధానం తీసుకొచ్చారు. తొలిసారి 2014లో మార్కులు, గ్రేడింగ్ ఇచ్చారు. 2015 నుంచి కేవలం గ్రేడింగ్ మాత్రమే ఉండేది. 75% మార్కులు దాటితే వంద మార్కుల వరకూ ‘ఏ’గ్రేడ్ ఇచ్చే వారు. అయితే, సీబీఎస్‌ఈ, ఇతర స్కూళ్లు ఇప్పటికీ మార్కులు ఇస్తున్నాయి. కొన్ని పరీక్షలకు టెన్త్ మార్కులు కోరుతున్నారు. ఇవన్నీ సాంకేతిక సమ స్యలు తెస్తున్నాయని భావించిన ప్రభుత్వం పాత విధానాన్ని తీసుకొచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ప్రతీ సబ్జెక్టులోనూ ఇప్పటి వరకూ 20 ఇంటర్నల్ మార్కులు ఉండేవి. సంవత్సరంలో 4 సార్లు జరిగే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఆధారంగా ఈ మార్కులు వేసేవారు. దీనిపై పూర్తిస్థాయి పారదర్శకత లోపించిందనే ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రైవేటు స్కూళ్లు ఇష్టానుసారం 20 మార్కులూ వేసుకుంటున్నాయని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్నల్ మార్కులను కూడా తీసివేసినట్టు విద్యాశాఖ తెలిపింది. విద్యార్థులు పరీక్ష రాయడానికి 24 పేజీలతో బుక్‌లెట్‌ను కొత్తగా పరిచయం చేస్తున్నారు.

నింగిలోకి కృత్రిమమేధ ప్రయోగశాల

సంసిద్ధమైన హైదరాబాద్‌లోని అంతరిక్ష రంగ సంస్థ ● పీఎస్‌ఎల్‌వీ-ఎక్సెల్ నౌకలో నింగిలోకి దూసుకెళ్లనున్న ల్యాబొరేటరీ ● ఏర్పాట్లు చేస్తున్న ఇస్రో



పలు విజయవంతమైన ప్రయోగాలతో అంతరిక్షరంగంలో తనదైన ముద్ర వేసిన భారత్ మరో ఘనత సాధించేందుకు సిద్ధమవుతోంది. ఈ సాహసోపేత కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంతరిక్షరంగ సంస్థ కీలక భాగస్వామిగా ఉండటం విశేషం. భారత్‌లో తయారుచేసిన కృత్రిమమేధ పరిశోధనశాలను అంతరిక్షంలోకి ప్రయోగించనున్నారు. హైదరా బాద్ కేంద్రంగా పనిచేస్తున్న టేక్‌మీటూస్పేస్ సంస్థ తయారుచేసిన 'మై ఆర్బిటార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టెక్నాలజీ డెమోన్‌స్ట్రేటర్ (ఎంఓఐ-టీడీ)' ల్యాబ్‌ను నింగిలోకి పంపనున్నారు. పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ఈ కృత్రిమమేధ ల్యాబ్‌ను ప్రయోగిస్తున్నారు. వాస్తవానికి ఇది ఉపగ్రహం అయినప్పటికీ పూర్తిస్థాయి పరిశోధనశాలలాగా పనిచేయగల సత్తా దీని సొంతం. అందుకే అంతరిక్షంలో పనిచేయనున్న భారత మొట్టమొదటి కృత్రిమమేధ ల్యాబ్‌గా ఇది చరిత్ర సృష్టించనుంది. డిసెంబర్ నాలుగో తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న ప్రయోగకేంద్రం నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగిస్తారు. కక్ష్యలో తిరుగుతూ ఎప్పటికప్పుడు డేటాను ప్రాసెసింగ్ చేయడం ద్వారా అంతరిక్ష పరిశోధనలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చే ఉద్దేశంతో ఏఐ ల్యాబ్‌ను పంపుతున్నారు. ప్రైవేట్, విదేశీ ఉపగ్రహాల ప్రయోగ బాధ్యతలను చూసుకునే భారత ప్రభుత్వ మరో విభాగమైన 'ఇన్-స్పేస్' వారి టెక్నాలజీ సెంటర్ నుంచి ఎంఓఐ-టీడీకి కీలకమైన సాయం అందింది. అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేసే ఇన్-స్పేస్ సంస్థ ఎంఓఐ-టీడీ టెస్టింగ్ తదితర బాధ్యతలను చూసుకుంది. అత్యంత భారీ డేటాను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసి భూమి మీదకు పంపడం ఉపగ్రహ కార్యక్రమాల్లో పెద్ద సవాల్‌తో కూడిన వ్యవహారం. ప్రస్తుతం ఏదైనా శాటిలైట్ గరిష్టంగా రోజుకు 1 పెటాబైట్ డేటాను మాత్రమే సంగ్రహించగలదు. ప్రస్తుతం 'క్లౌడ్ కవర్' దృగ్విషయం కారణంగా 40 శాతం ఉపగ్రహ సమాచారం నిరుపయోగం అవుతోంది. వచ్చిన డేటాను ప్రాసెస్ చేయడానికి వారాల తరబడి వేచి ఉండక తప్పని పరిస్థితి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఏఐ ల్యాబ్‌ను రంగంలోకి దించారు. అత్యంత వేగంగా డేటా ప్రాసెసింగ్‌కు ఈ ఏఐ ల్యాబ్ సుసాధ్యం చేయనుంది.

అంతరిక్ష డేటా సెంటర్ల ఏర్పాటుకు..


రియాక్షన్ వీల్స్, మ్యాగ్నటార్కర్స్, ఏఐ యాక్సిలిరేటర్లు, అత్యాధునిక కంట్రోల్ సిస్టమ్‌తో ఏఐ ల్యాబ్‌ను అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దారు. ఏఐ ల్యాబ్ త్వరగా 'కౌడ్ డేటా' వంటి అంతరిక్ష డేటా సెంటర్ల ఏర్పాటుకూ బాటలువేయనుంది. ఎర్త్ అబ్జర్వేషన్ సామర్థ్యాలను ద్విగుణీకృతం చేయడమేకాకుండా అంతరిక్ష ఆధారిత కంప్యూటింగ్ టెక్నాలజీల అభివృద్ధికి ఇదొక వేదికగా అక్కరకు రానుంది. ల్యాబ్‌కు అదనంగా సౌర ఫలకాలను అమర్చారు. ఇవి భవిష్యత్తులో దీనికి అనుసంధానంగా రాబోయే శాటిలైట్ల ఇంధన అవసరాలను తీర్చగలవు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రోబా-3 మిషన్‌లో భాగంగా డిసెంబర్‌లో ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్‌లోనే ఏఐ ల్యాబ్‌నూ అమర్చుతున్నారు.

ఎన్నెన్నో ఉపయోగాలు

అక్కడి శాటిలైట్లు సేకరించే సమాచారాన్ని ఈ ఏఐ ల్యాబ్ వేగంగా ప్రాసెస్‌చేసి సంబంధిత యూజర్లకు అనువుగా అందిస్తుంది. దీంతో పర్యావరణంపై పర్యవేక్షణ తో పాటు అడవుల నరికివేత, హరితఉద్గారాల పరిమాణం తదితర ఎన్నో అంశాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందొచ్చు. దీంతో భిన్న రంగాలకు సంబంధించిన పరిశోధకులు తమకు కావాల్సిన సమాచారాన్ని ఆర్బిట్‌ల్యాబ్ నుంచి నేరుగా సంప్రతింపులు జరిపి పొందొచ్చు. వేర్వేరు అప్లికేషన్లకు సంబంధించిన కృత్రిమమేధ మాడ్యూళ్లను అప్‌లోడ్ చేసి ఈ వెబ్ ఆధారిత కన్సోల్‌తో అనుసంధానం కావచ్చు. ఇప్పటికే మలేసియా విశ్వవిద్యాలయంతోపాటు భారతీయ విద్యార్థుల బృందమొకటి ఇందుకోసం తమ పేర్లను నమోదుచేసుకుంది. ఎక్కువ మంది యూజర్లు పెరిగేకొద్దీ ఆయా పరిశోధకులయ్యే ఖర్చు సైతం భారీగా తగ్గనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

జార్ఖండ్ సీఎంగా హేమంత్



ఇది చారిత్రక దినం

రాంచీ: జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)కు చెందిన గిరిజన నేత హేమంత్ సోరెన్(49) ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని రాంచీలోని మొరాబాది మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించారు. తెల్లని కుర్తా పైజామా, నెహ్రూ జాకెట్ ధరించిన హేమంత్ ముందుగా జేఎంఎం చీఫ్, తన తండ్రి శిబూ సోరెన్‌ను కలుసుకున్నారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష ఇండియా కూటమి అగ్ర నేతలు హాజరయ్యారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజనులు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా రాంచీలోని పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ, తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ దంపతులు ఉన్నారు. పంజాబ్ సీఎం మాన్, సీపీఐఎంఎల్ లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య, ఎస్పీ చీఫ్ అఖిలేశ్, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్ కూడా హాజరయ్యారు. కాగా, సీఎంగా హేమంత్ ప్రమాణం చేయడం ఇది నాలుగోసారి.

ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని హేమంత్ సోరెన్ 'ఎక్స్'లో..'ఇది చారిత్రక దినం..రాష్ట్ర ప్రజలు ఐకమత్యమే ఆయుధంగా చేసుకుని ఎన్నికల్లో తిరుగులేని తీర్పిచ్చారు. మా గొంతు నొక్కేందుకు వాళ్లు ప్రయత్నించిన ప్రతిసారీ ఉద్యమం మరింతగా తీవ్రతరమైంది. జార్ఖండ్ వాసులు ఎవరికీ తలొంచరు. తుది శ్వాస వరకు మా పోరాటం కొనసాగుతుంది'అని బీజేపీను ద్దేశించి వ్యాఖ్యానించారు. ఇటీవలి ఎన్నికల్లో అసెంబ్లీలోని 81 సీట్లకు గాను జేఎంఎం సారథ్యంలోని కూటమి అత్యధికంగా 56 సీట్లను సొంతం చేసుకుంది. 43 స్థానాల్లో పోటీకి దిగిన జేఎంఎం మొదటిసారిగా ఏకంగా 34 చోట్ల విజయకేతనం ఎగురవేసింది.

ఎంపీగా ప్రియాంక

గ్యాలరీ నుంచి తిలకించిన సోనియా, ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన 52 ఏళ్ల కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రా ఎంపీగా గురువారం ప్రమాణంచేశారు. సోదరుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీతో కలిసి గురువారం సభకు వచ్చిన ఆమె ఉదయం సభా కార్యక్రమాలు మొదలైన వెంటనే ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు కేరళ సంప్రదాయక బంగారు అంచు ధవళవర్ణ చీరకట్టులో ప్రియాంక తొలిసారిగా లోక్‌సభలోకి అడుగుపెట్టారు. ఎరుపు, నలుపు రంగు రాజ్యాంగ ప్రతిని చేతబూనిన ఆమె హిందీలో ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం 'జైహింద్' అని నినదించారు. ఈ సందర్భంగా తోటి కాంగ్రెస్ ఎంపీలు 'జోడో జోడో భారత్ జోడో' అని నినదించారు. ప్రియాంక ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తల్లి సోనియాగాంధీ, భర్త రాబర్ట్‌వాద్రా, పిల్లలు రెహాన్, మిరాయా, ప్రియాంక అత్త మౌరీన్ వాద్రా, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేలు గ్యాలరీలో కూర్చొని తిలకించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాత ప్రియాంక తోటి కాంగ్రెస్ ఎంపీలతోపాటు నాలుగో వరసలో కూర్చున్నారు. తర్వాత సభాకార్యక్రమాలు మొదలుకాగానే అదానీ అంశంపై చర్చలు ప్రతిపక్షాలు పట్టుబట్టిన సమయంలో ప్రియాంక తన సీటులోంచి లేచి తోటి ఎంపీలకు మద్దతుగా నిలిచారు. సభ వాయిదా పడ్డాక రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలను పలకరించారు. గాంధీల కుటుంబంలో ముగ్గురు ఒకేసారి పార్లమెంట్‌లో సభ్యులుగా కొనసాగడం విశేషం. తల్లి సోనియా రాజ్యసభలో, అన్నాచెల్లెలు రాహుల్, ప్రియాంక లోక్‌సభలో ఆసీనులయ్యారు. '' దేశ సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎలుగెత్తి చాటుతా. దేశం కోసం పోరాడతా. రాజ్యాంగం నియామావళితో కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ వేదికగా బలపరుస్తా. మాకు రాజ్యాంగం కంటే మించింది మరోటి లేదు. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం కొనసాగుతుంది' అని ప్రమాణస్వీకారం తర్వాత మీడియాతో ప్రియాంక వ్యాఖ్యానించారు.

ఆగని వాయిదాల పర్వం

ఉభయ సభలు నేటికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ అంశంపై విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడంతో పార్లమెంట్ ఉభయ సభలు మూడో రోజు సైతం ఎలాంటి చర్చలు జరగకుండానే వాయిదా పడ్డాయి. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే నూతన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ సహా పార్టీ సహా విపక్ష ఎంపీలు అడ్డుతగిలారు. అదానీ వ్యవహారంతోపాటు మణిపూర్, సంభాల్ హింసా కాండపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. సభలో ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నినదాలు చేశారు. విపక్ష ఎంపీలు సంయమనం పాటించాలని, సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ పదేపదే విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండాపోయింది. దాంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా గందరగోళం కొనసాగింది. విపక్ష సభ్యులు వెల్‌లోకి చేరుకొని బిగ్గరగా నినాదాలు చేశారు. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకున్నారు. బీఏసీలో తీసుకున్న నిర్ణయం మేరకు సభకు విపక్షాలు సహకరించాలని కోరారు. సభా నిబంధనలు పాటించకుండా కార్యక్రమాలను అడ్డుకోవడం తగదని చెప్పారు. కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకుండా వారి హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎంపీలపై మండిపడ్డారు. అనంతరం ఒకవైపు సభలో గందరగోళం కొనసాగుతుండగానే వక్ఫ్ సవరణ బిల్లు కోసం జేపీసీ గడువును పెంచే తీర్మానాన్ని ఆమోదించారు. ఆ తర్వాత సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి ప్రకటించారు. ఇక రాజ్యసభలోనూ విపక్షాల ఆందోళన కారణంగా సభ రెండుసార్లు వాయిదా పడింది. అదానీ వ్యవహారంపై చర్చించడానికి విపక్ష ఎంపీలు నోటీసు ఇవ్వగా చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ప్రతిపక్ష సభ్యులు ఎంతకీ శాంతించకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

వక్ఫ్ కమిటీ గడువు పెంపు

లోక్‌సభలో తీర్మానం ఆమోదం

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో విపక్షాల వినతి పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ బిల్లుపై ఏర్పాటు చేసిన జాయింట్ కమిటీ గడువును వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరిరోజు దాకా పొడిగించింది. ఈ మేరకు గురువారం లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు. కమిటీ చైర్మన్, బీజేపీ సభ్యుడు జగదాంబికా పాల్ ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో తీర్మానం ఆమోదం పొందింది. వాస్తవానికి జాయింట్ కమిటీ గడువు శుక్రవారం ముగియనుంది.

కే4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: అణు సామర్థ్యం కలిగిన కే4 బాలిస్టిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. విశాఖపట్నం తీరంలో అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి భారత నావికాదళం ఆధ్వర్యంలో బుధవారం ఈ పరీక్ష చేపట్టినట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. కే4 బాలిస్టిక్ క్షిపణి 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలదు. దేశంలో మొట్టమొదటిగా జలాంతర్గామి నుంచి నిర్వహించిన తొలి సబ్‌మెరైన్ లాంచ్డ్ బాలిస్టిక్ మిస్సైల్ ఇదే. ఈ క్షిపణి రాకతో మన దేశ అణ్వాయుధ సామర్థ్యం మరింత పెరిగినట్లు అధికారులు చెప్పారు. అణ్వాయుధ క్షిపణిని భూమి నుంచి, సముద్ర అంతర్భాగం నుంచి, నింగి నుంచి ప్రయోగించే సామర్థ్యం కలిగిన అతికొద్ది దేశాల జాబితాలో భారత్ కూడా చేరడం విశేషం. బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే అణు జలాంతర్గాములు అమెరికా, రష్యా, యూకే, ఫ్రాన్స్, రష్యా వద్ద ఉన్నాయి. ఇప్పుడు భారత్ కూడా వీటిని సమకూర్చుకుంది.

ప్రధాని నరేంద్ర మోదీని హత్య చేస్తాం

- ముంబై ట్రాఫిక్ పోలీసులకు బెదిరింపు ఫోన్‌కాల్
- 34 ఏళ్ల మహిళ అరెస్టు

ముంబై: ప్రధానమంత్రి మోదీని హత్య చేయబోతున్నామని, ఇందుకోసం ఆయుధం కూడా సిద్ధం చేసుకున్నామంటూ ముంబై ట్రాఫిక్ పోలీసు కంట్రోల్‌రూమ్‌కు ఫోన్‌కాల్ రావడం తీవ్ర కలకలం సృష్టించింది. బెదిరింపు కాల్ బుధవారం ఓ మహిళ నుంచి వచ్చినట్లు అధికారులు చెప్పారు. వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, ముంబై నగర శివారులోని అంబోలీ నుంచి ఈ ఫోన్‌కాల్ వచ్చినట్లు గుర్తించామని వెల్లడించారు. ఫోన్ చేసిన మహిళ ఆచూకీ గుర్తించి, అరెస్టు చేశామని గురువారం వెల్లడించారు. 34 ఏళ్ల ఆ మహిళ మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేనట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ఆమెకు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని వివరించారు. తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నామని స్పష్టంచేశారు. మహిళ చేసిన ఫోన్‌కాల్‌ను ప్రాంక్ కాల్‌గా పరిగణిస్తున్నట్లు చెప్పారు.

మంత్రి పదవులపై మల్లగుల్లాలు

- ఢిల్లీలో అమిత్ షాతో ఫడ్నవిస్, అజిత్ పవార్, షిండే చర్చలు
- కొలిక్కిరానున్న మహారాష్ట్ర నూతన ప్రభుత్వ మంత్రుల శాఖల కేటాయింపులు
- ఫడ్నవిస్‌కు లైన్ క్లియర్ !

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఘన విజయంతో అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న మహాయుతి కూటమి పార్టీలు అధికార పంపిణీపై మాత్రం మల్లగుల్లాలు పడుతున్నాయి. అయితే సీఎం పదవిపై స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. ఫడ్నవిస్‌కు సీఎం పదవి ఇవ్వడంలో అడ్డంకులన్నీ తొలగిపోయినట్లు సమాచారం. కీలక పోర్ట్‌ఫోలియోలపై మూడు పార్టీలూ కన్నేయడంతో నేరుగా కూర్చుని మాట్లాడుకునేందుకు శివసేన, ఎన్సీపీ సారథులు బీజేపీ అధిష్టానంతో చర్చలు జరిపారు. గురువారం ఢిల్లీకి చేరుకున్న ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండేలు మహారాష్ట్ర బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి బీజేపీ అగ్రనేత అమిత్‌షాను కలిశారు. కృష్ణమీనన్ మార్గ్‌లోని షా నివాసంలో చర్చలు జరిపారు.

సామాజిక సమీకరణాలతోనే పోస్టులు

సామాజిక సమీకరణాలను బట్టే మంత్రి పదవులను కట్టబెట్టాలని బీజేపీ యోచిస్తోంది. బీజేపీలోని ఓబీసీ లేదా మరాఠా నేతకే సీఎం పదవి కట్టబెట్టాలని చూస్తోందని తొలుత వార్తలొచ్చాయి. అన్ని పార్టీల్లో మరాఠా వర్గానికి చెందిన వాళ్లే అత్యధికంగా ఎమ్మెల్యేలుగా గెలిచినా ఆర్ఎస్ఎస్ లాబీయింగ్ బలం పనిచేస్తే బ్రాహ్మణ వర్గానికి చెందిన ఫడ్నవిస్‌కే మళ్లీ సీఎం పీఠం దక్కుతుందని ఢిల్లీలోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అజిత్, షిండే డిప్యూటీ సీఎంలుగా ఉంటారని వార్తలొచ్చాయి. అయితే సీఎం, డిప్యూటీ సీఎం పదవులపై ఇంతవరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఎవరేం కోరుతున్నారు?

పోర్ట్‌ఫోలియోలపై ఎవరికివారు కర్చీఫ్ వేసేస్తున్నారు. తమ పార్టీకి ఈ శాఖలే కావాలని పట్టుబడుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం పట్టణాభివృద్ధి, వ్యవసాయం, ఆరోగ్య శాఖలు తమకు కేటాయించాలని ఏక్‌నాథ్ షిండే కోరుతున్నారు. కీలకమైన ఆర్థిక శాఖ తమకు ఇవ్వాలని ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ వర్గం డిమాండ్‌చేస్తోంది. అయితే మెజారిటీ సీట్లు గెలిచిన తమ వద్దే కీలకమైన శాఖలను అట్టిపెట్టుకోవాలని బీజేపీ భావిస్తోంది. గెలిచిన ప్రతి ఆరు సీట్లకు ఒక కేబినెట్ పోస్ట్ చొప్పున మంత్రి పదవులను పంచాలని ఒక సూత్రప్రాయ అంగీకారానికి వచ్చినట్లు వార్తలొచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమిలో బీజేపీ 132, శివసేన(షిండే) 57, ఎన్సీపీ(అజిత్ పవార్) 41 చోట్ల గెలిచాయి. ఒక్కో పార్టీ గెలిచిన సీట్ల సంఖ్యను బట్టి కేబినెట్ పోస్టులు కేటాయించాలని భావిస్తున్నారు. ఇన్నాళ్లూ సీఎంగా చేసిన షిండే ఇకపై డిప్యూటీ సీఎం పదవి చేబడితే పట్టణాభివృద్ధి శాఖతోపాటు మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శాఖనూ తన వద్ద అట్టిపెట్టుకోవాలని చూస్తున్నారు. రెవిన్యూ, వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, సామాజిక న్యాయ శాఖలను తమ పార్టీకే కేటాయించాలని డిమాండ్‌చేస్తున్నారు.

అజిత్ డిమాండ్లు ఏంటి ?

డిప్యూటీ సీఎం పోస్ట్‌తోపాటు ఆర్థికశాఖ తనకే ఇవ్వాలని ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ కోరుతున్నట్లు వినికిడి. అయితే కీలకమైన ఆర్థికశాఖతోపాటు ప్రణాళిక శాఖను తన వద్దే ఉంచేసుకోవాలని బీజేపీ ఆశిస్తోంది. వ్యవసాయం, ఆహార, పౌర సరఫరాలు తదితర శాఖలు తమకు కేటాయించాలని అజిత్ అడుగుతున్నారని తెలుస్తోంది.

బీజేపీ మాటేంటి?

కూటమిలో అత్యధిక సీట్లు గెలిచినందున కీలకమైన ఏ శాఖనూ కూటమి పార్టీలకు ఇచ్చేది లేదని బీజేపీ పట్టుదలగా ఉందని తెలుస్తోంది. హోం, గృహ, పట్టణాభివృద్ధి, ఆర్థికం, నీటిపారుదల, విద్యుత్, నైపుణ్యాభివృద్ధి శాఖలు తమ ఆధ్వర్యంలోనే కొనసాగాలని బీజేపీ ఆశిస్తోంది. గెలిచిన ప్రతి ఆరు సీట్లకు ఒక కేబినెట్ పోస్ట్ చొప్పున మంత్రి పదవులను పంచాలన్న సూత్రాన్ని అమలుచేస్తే బీజేపీకి 21 లేదా 22, శివసేనకు 10 లేదా 12, ఎన్సీపీకి 8 లేదా 9 మంత్రి పదవులు దక్కుతాయి.

పోలింగ్ ముగిశాక 7 శాతం ఓటింగ్ ఎలా పెరిగింది?


ఈసీ సమాధానం చెప్పాలి: నానా పటోలే



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం ముగిసిపోయాక ఏకంగా 7 శాతం పోలింగ్ ఎలా పెరిగిందో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే డిమాండ్ చేశారు. నవంబరు 20వ తేదీన వివిధ సమయాల్లో విడుదల చేసిన పోలింగ్ శాతంలో తేడాలుండటం ఈసీ పనితీరును ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. పటోలే గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబరు 20న సాయంత్రం ఐదు గంటలకు 58.22 శాతం పోలింగ్ శాతం నమోదైందని ఈసీ వెల్లడించిందని, అయితే రాత్రి 11:30 గంటలకు మరో 7.83 శాతం పోలింగ్ అదనంగా నమోదైనట్లు తెలిపిందని, ఇంత భారీ వ్యత్యాసానికి కారణాలేమిటేది ఈసీ తెలుపాలని డిమాండ్ చేశారు. ఈ అసాధారణ పెరుగుదల ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను ప్రశ్నార్థకం చేసిందని పటోలే అన్నారు. 'ఇది ప్రజల ఓట్లను కొల్లగొట్టడమే. దీనిపై న్యాయపోరాటం చేస్తాం. వీధుల్లోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తాం' అని పటోలే పేర్కొన్నారు. రాత్రి 11:30 గంటల దాకా పోలింగ్ జరిగిన కేంద్రాల ఫోటోలను ఈసీ విడుదల చేయాలన్నారు. ఎవరు గెలిచారు, ఎవరు ఓడారనేది ఇక్కడ సమస్య కాదని, ప్రజాస్వామ్యాన్ని బతికించడమే ముఖ్యమని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జిగా మన్‌మోహన్

సిఫారసు చేసిన కొలీజియం



న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మన్‌మోహన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా నియమించాలని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం ఇటీవల సమావేశమై జస్టిస్ మన్‌మోహన్ పేరును సిఫారసు చేసిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎ.ఎస్.ఓకా సుప్రీంకోర్టు కొలీజియంలోని ఇతర సభ్యులు. సుప్రీంకోర్టులో మొత్తం జడ్జిల సంఖ్య 34 కాగా.. ప్రస్తుతం 32 మందే ఉన్నారు. మాజీ సీజేఐ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీల పదవీ విరమణతో ఈ రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. జస్టిస్ మన్‌మోహన్ డిసెంబరు 17, 2009లో ఢిల్లీ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న ఢిల్లీ సీజేగా పదోన్నతి పొందారు.

అజ్మీర్ దర్గాపై కొత్త వివాదం



- శివాలయం కూల్చేసి దర్గా నిర్మించారు
- అక్కడ హిందువులు పూజలు చేసుకొనే అవకాశం కల్పించాలి
- స్థానిక సివిల్ కోర్టులో పిటిషన్
- అజ్మీర్ దర్గా కమిటీ, మైనార్టీ వ్యవహారాల శాఖ, ఏఎస్ఐకి కోర్టు నోటీసులు
- పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశం

అజ్మీర్/న్యూఢిల్లీ: రాజస్తాన్‌లోని ప్రఖ్యాత అజ్మీర్ దర్గాపై కొత్త వివాదం మొదలైంది. ప్రస్తుతం దర్గా ఉన్న స్థలంలో గతంలో శివాలయం ఉండేదని పేర్కొంటూ కొందరు స్థానిక సివిల్ కోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. శివాలయాన్ని కూల్చివేసి, సూఫీ సాధువు ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ పేరిట దర్గా నిర్మించారని వారు పేర్కొన్నారు. దర్గా ప్రాంగణాన్ని దేవాలయంగా గుర్తించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. దీనిపై న్యాయస్థానం స్పందించింది. పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ బుధవారం అజ్మీర్ దర్గా కమిటీకి, మైనార్టీ వ్యవహారాల శాఖకు, భారత పురావస్తు సర్వే విభాగానికి(ఏఎస్ఐ)కి నోటీసులు జారీ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పట్టణంలో షాహీ జామా మసీదు సర్వే వ్యవహారంలో ఘర్షణ జరిగి నలుగు మృతిచెందిన కొన్ని రోజులకే అజ్మీర్ దర్గాపై కోర్టు నోటీసులు జారీ చేయడం గమనార్హం. అజ్మీర్ సైతం మత ఘర్షణలకు కేంద్రంగా మారుతుందా? అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

సమాజంలో అలజడి సృష్టించడానికే పిటిషన్

ఇదిలా ఉండగా, అజ్మీర్ దర్గా వివాదం రాజకీయ రంగు పులుముకుంటోంది. దీనిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్పందించారు. మతాల పేరిట చిచ్చురేపి, సమాజంలో అలజడి సృష్టించడానికి ఉద్దేశపూర్వకంగానే ఈ పిటిషన్ దాఖలు చేశారని అజ్మీర్ దర్గాను పర్యవేక్షించే అంజుమన్ సయీద్ జద్గాన్ కార్యదర్శి సయీద్ సర్వర్‌చిష్తీ ఆరోపించారు. మతాలవారీగా సమాజాన్ని ముక్కలు చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మత సామరస్యానికి, లౌకికవాదానికి ప్రతీక అయిన అజ్మీర్ దర్గా మైనార్టీ వ్యవహారాల శాఖ పరిధిలోకి వస్తుందని, దీంతో ఏఎస్ఐకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఏమిటీ వివాదం?: అజ్మీర్ దర్గాను సంకట్ మోచన్ మహాదేవ్ ఆలయంగా ప్రకటించాలని కోరుతూ సెప్టెంబర్ నెలలో అజ్మీర్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. అక్కడ పూజలు చేసుకొనే అవకాశం ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన తర్వాత తదుపరి విచారణను కోర్టు డిసెంబర్ 20వ తేదీకి వాయిదా వేసింది. అజ్మీర్ దర్గాకు ఏదైనా రిజిస్ట్రేషన్ ఉంటే వెంటనే రద్దు చేయాలని హిందూ సేన అధ్యక్షుడు విష్ణు గుప్తా డిమాండ్ చేశారు. ఏఎస్ఐ ద్వారా అక్కడ సర్వే చేపట్టాలని, దర్గా ప్రాంగణంలో పూజలు చేసుకొనే హక్కు హిందువులకు కల్పించాలని పేర్కొన్నారు. దర్గా ఉన్నచోట శివాలయం ఉండేదని, హరవిలాస్ సర్దా రాసిన పుస్తకంలో ఈ విషయం ప్రస్తావించారని గుర్తుచేశారు.

సర్వే చేస్తే నష్టమేంటి? గిరిరాజ్ సింగ్

అజ్మీర్ దర్గాలో సర్వే చేయాలని కోర్టు ఉత్తర్వు ఇచ్చిందని, సర్వే చేస్తే వచ్చిన సమస్య ఏమిటి? కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రశ్నించారు. మొఘల్ రాజులు మన దేశంపైకి దండెత్తి వచ్చారని, ఇక్కడి ఆలయాన్ని కూల్చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ 1947లోనే ఈ బుజ్జగింపు రాజకీయాలు ఆపేసి ఉంటే ఇప్పుడు కోర్టుకు వెళ్లాల్సిన అవసరం వచ్చేది కాదన్నారు.

దేశాన్ని అస్థిరపర్చడానికి కుట్రలు: ఒవైసీ

అజ్మీర్ దర్గా 800 ఏళ్లుగా ఉందని ఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఉర్స్ సందర్భంగా ప్రధానమంత్రి అక్కడ చాదర్ సమర్పించడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పటిదాకా పనిచేసిన ప్రధానులంతా ఈ సంప్రదాయం పాటించారని వెల్లడించారు. దేశాన్ని అస్థిరపర్చడానికి కుట్రలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వ్యక్తులే ఇలాంటి వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యవహారాలతో దేశానికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రార్థనా స్థలాల చట్టం-1991 ప్రకారం 1947 ఆగస్టు 15 నాటికి ఉన్న ప్రార్థనా స్థలాలను యథాతథంగా కొనసాగించాలని, వాటిలో ఎలాంటి మార్పులు చేయరాదని ఒవైసీ తేల్చిచెప్పారు.

దేశాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నాం: కపిల్ సిబల్

అజ్మీర్ దర్గా విషయంలో రగడ జరుగుతుండడం బాధాకరమని ఎంపీ కపిల్ సిబల్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. మన దేశాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నాం? ఇదంతా ఎందుకు? అని ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనా? అని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి మెజార్టీ రాకపోవడంతో కొందరు వ్యక్తులు ఓ వర్గం ప్రజలను లక్ష్యంగా చేసుకొని, గొడవలు సృష్టిస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ మొహిబుల్లా నద్వీ ఆరోపించారు. సివిల్ కోర్టు ఉత్తర్వును పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ, పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజ్జాద్‌గనీ లోన్ తప్పుపట్టారు.

డిగ్రీ కోర్సుల గడువు విద్యార్థుల ఇష్టం

- పెంచుకోవచ్చు.. తగ్గించుకోవచ్చు
- యూజీసీ చైర్మన్ జగదీష్ కుమార్ వెల్లడి



న్యూఢిల్లీ: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు నిర్దిష్ట గడువు ఉంటుంది. డిగ్రీ కోర్సులు సాధారణంగా మూడేళ్లలో పూర్తవుతాయి. తమ వెసులుబాటును బట్టి కోర్సుల గడువును తగ్గించుకొనే లేదా పెంచుకొనే అవకాశం అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఇలాంటి ఐచ్ఛికాన్ని విద్యార్థులకు ఇవ్వడానికి వీలుగా ఉన్నత విద్యా సంస్థలకు అనుమతి మంజూరు చేయబోతున్నట్లు విశ్వవిద్యాలయ నిధుల సంఘం(యూజీసీ) చైర్మన్ జగదీష్ కుమార్ చెప్పారు. యాక్సిలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఏడీపీ), ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఈడీపీ)ను ఆఫర్ చేసే విషయంలో ప్రామాణిక నియమావళికి యూజీసీ ఇటీవల ఆమోదముద్ర వేసింది. దీనిపై ప్రజల నుంచి సలహాలు సూచనలు ఆహ్వానించనున్నారు. ప్రామాణికమైన గడువు కంటే తక్కువ వ్యవధిలో లేదా ఎక్కువ వ్యవధిలో పూర్తి చేసినప్పటికీ ఆయా డిగ్రీలను సాధారణ డిగ్రీలుగానే పరిగణిస్తారు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగ నియామకాలకు అవి యథాతథంగా చెల్లుబాటు అవుతాయి.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 29 । నవంబర్ । 2024



చంపి అత్యాచారం చేశాడు!
సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రమణమ్మ సహా అయిదుగురిని హత్య చేసిన రాహుల్ జాట్ విచారణలో గుజరాత్ అధికారులు కీలక విషయాలు గుర్తిస్తున్నారు. -8లో



రేర్ బర్డ్స్.. నో వర్డ్స్..
కొందరు సిటిజనులు పక్షుల కిలకిలల కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. విహంగాల వైవిధ్య భరిత విశేషాలను తిలకిస్తూ పులకిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 29.0/16.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 29, కనిష్టంగా 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మంత్రి 'పొన్నం'ను కలిసిన ఆర్టీఏ అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: రవాణా శాఖలో పదోన్నతులు పొందిన పలువురు అధికారులు గురువారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌లుగా పదోన్నతి పొందిన మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌లుగా పదోన్నతి పొందిన రవీందర్‌కుమార్, వాణి, సదానందం, కిషన్, సురేష్ రెడ్డిలు ఉన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న పదోన్నతుల సమస్యకు మంత్రి చొరవతో పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు.

ఆర్టీఏకు వచ్చిన సినీ నటుడు నాగార్జున



నటుడు నాగార్జునతో హైదరాబాద్ జేటీసీ రమేష్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. తాను కొత్తగా కొనుగోలు చేసిన కారు టయోటా లెక్సస్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జేటీసీ రమేష్, ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తంరెడ్డి, తదితరులు వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. కొత్త వాహనాన్ని 'టీజీ 09 సి 9669' నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున డిజిటల్ సంతకం చేయడంతో పాటు, ఫొటో, చిరునామా తదితర వివరాలను అందజేశారు.


మెట్రో ప్రయాణికులకు బంపర్ ఆఫర్!

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోరైలు ప్రయాణికులకు ఎల్అండ్‌టీ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. వరుసగా మూడు నెలల పాటు ప్రయాణించేవారి వివిధ రకాల మెట్రో లాయల్టీ కార్యక్రమంలో భాగంగా బహుమతులను అందజేయనున్నారు. ప్రయాణికుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు, వారితో సత్సంబంధాలను కొనసాగించేందుకు గ్రీన్ మెట్రో లాయల్టీ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. తరచుగా ప్రయాణించే వారికి బహుమతులను అందించడంతో పాటు అంతకు మించిన లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. స్మార్ట్ కార్డ్‌ను వినియోగించి పయనించేవారు కేలండర్ నెల ప్రాతిపదికగా ఎన్ని ట్రిప్పులు ప్రయాణం చేశారనే వివరాల ఆధారంగా లెక్కిస్తారు. సిల్వర్ బ్యాండ్ పొందేందుకు వరుసగా మూడు నెలల కాలంలో 21 నుంచి 35 ట్రిప్పులు, గోల్డ్ బ్యాండ్‌కు 36 నుంచి 50 ట్రిప్పుల వరకు ప్రయాణం చేయాలి. వరుసగా 3 నెలల సమయంలో 51 ట్రిప్పుల కంటే ఎక్కువ ప్రయాణం చేసిన వారికి ప్లాటినం బ్యాండ్ అందజేస్తారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు మూడు నెలల కాల వ్యవధిని ప్రామాణికంగా పరిగణిస్తారు. రానున్న ఉగాదికి బహుమతులు అందజేయనున్నారు.

9 ఏళ్లలో 2,500 స్టార్టప్‌లు

టీహబ్ ఇన్‌చార్జి సీఈఓ సుజిత్ జాగీర్దార్

రాయదుర్గం: గత 9 ఏళ్లలో 2,500 స్టార్టప్‌లు రూపుదాల్చుకునేలా ప్రోత్సహించినట్లు టీహబ్ ఇన్‌చార్జి సీఈఓ సుజిత్ జాగీర్దార్ స్పష్టం చేశారు. గురువారం బ్రిటిష్ కౌన్సిల్, సోషల్ అల్ఫా, ఎస్ఎస్ఈ, టీహబ్ సంయుక్తాధ్వర్యంలో నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో సస్టెయినబిలిటీ ఇంపాక్ట్ మ్యాటర్స్ రోడ్ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టార్టప్‌లకు సంబంధించినంత వరకు ప్రభావం అనేక విధాలుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం టీహబ్‌లో ఇంక్యుబేట్ అవుతున్న మరో 500 స్టార్టప్‌ల్లో చాలా వరకు ప్రారంభ దశలో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. స్థిరత్వం దాని ప్రభావం చాలా అవసరమని గుర్తు చేశారు. రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ అజిత్ రంగ్నేకర్ మాట్లాడుతూ.. సమాజ సమగ్ర అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీ సహ వ్యవస్థాపకుడు వివేక్ సుబ్రమణియన్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సస్టేనబిలిటీ ఇంపాక్ట్ మ్యాటర్స్ రోడ్‌షోలో పాల్గొన్న ఔత్సాహికులు

రూ. 8,340 కోట్లు

2025-26 బల్దియా బడ్జెట్‌కు రూపకల్పన

- రేపు స్టాండింగ్ కమిటీ ముందుకు..
- అంకెలు భారీగా ఉన్నా.. ప్రభుత్వ నిధులపైనే ఆశలు
- జీహెచ్ఎంసీకి తప్పని అప్పుల తిప్పలు
- హైసిటీ పనులకు రూ.2,242 కోట్లు

బడ్జెట్ ఇలా	(రూ. కోట్లు)
రెవెన్యూ ఆదాయం :	4,205
రెవెన్యూ వ్యయం :	3,936
క్యాపిటల్ ఆదాయం:	4,404
క్యాపిటల్ వ్యయం:	4,404

రెవెన్యూ వ్యయం+క్యాపిటల్ వ్యయం= బడ్జెట్: రూ.8,340 కోట్లు

కొత్త ఆశలతో..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) బడ్జెట్ రూ.7,937 కోట్లు కాగా.. ఆశించిన నిధులు సమకూరకపోయినప్పటికీ, ప్రభుత్వంపై ఆశతో రివైజ్డ్ బడ్జెట్‌ను రూ.రూ.8,150 కోట్లకు పెంచారు. కొత్త సంవత్సరంలో ప్రభుత్వం భారీ నిధులు కేటాయిస్తుందన్న ఆశతో కాబోలు దీన్ని పెంచారు. గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో చేసిన మొత్తం ఖర్చు రూ.7,082 కోట్లు.



సాక్షి, సిటీబ్యూరో: రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2025-26) జీహెచ్ఎంసీ బడ్జెట్ (ముసాయిదా)ను రూ.8,340 కోట్లతో రూపొందించారు. శనివారం దీన్ని స్టాండింగ్ కమిటీ ముందుంచనున్నారు. స్టాండింగ్ కమిటీ ఆమోదం అనంతరం పాలకమండలి సమావేశంలో ఆమోదించి, ప్రభుత్వానికి నివేదిస్తారు. వాస్తవానికి స్టాండింగ్ కమిటీలో చర్చల అనంతరం అవసరమైన మార్పుచేర్పులకు అవకాశమున్నప్పటికీ.. గత కొన్ని సంవత్సరాలుగా ముసాయిదా బడ్జెట్‌నే యథాతథంగా ఆమోదిస్తున్నారు. అదే సంప్రదాయం ఈసారి కూడా కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ.3,065 కోట్లు కేటాయించడంతో అదే ఆశతో కొత్త బడ్జెట్‌లోనూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆశలతో ఏకంగా రూ.3,800 కోట్లు ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వచ్చింది కేవలం రూ.186 కోట్లే. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న నాలుగు నెలల్లో మిగతా మొత్తం రావడం కష్టమే. ఏటికేడాది బడ్జెట్ పెరగాలనే సూత్రంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే బడ్జెట్ మొత్తాన్ని కొంత పెంచారు. ఈ ఆర్థిక సంవత్సర (2024-25)బడ్జెట్‌ను రూ.7,937 కోట్లతో ఆమోదించగా.. రాబోయే ఆర్థిక సంవత్సర కొత్త బడ్జెట్‌ను రూ.8,340 కోట్లతో రూపొందించారు. అంటే రూ.403 కోట్లు పెంచారు.

అంకెల్లోనే భారీ..

బడ్జెట్ భారీ స్థాయిలో కనిపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకనుగుణంగా లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌నే తీసుకుంటే రూ.7,937 కోట్లకుగాను ఇప్పటి వరకు సమకూరింది రూ.2643 కోట్లే.

అప్పుల కుప్ప

బడ్జెట్‌లో కేటాయింపుల్లోనూ అప్పులను అధికంగానే చూపారు. ఏకంగా రూ.1,933 కోట్లు అప్పు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే అప్పులు, వాటి వడ్డీలకు అధికమొత్తం చెల్లించాల్సి వస్తోంది. వీటితో ఈ భారం మరింత పెరగనుంది.

ఆదుకుంటోంది ఆస్తి పన్నే..

జీహెచ్ఎంసీని ప్రతియేటా ఆదుకుంటోంది, సిబ్బందికి జీతభత్యాలిచ్చేందుకు ఉపకరిస్తోంది ప్రజలు చెల్లిస్తున్న ఆస్తి పన్నే. దీనిని దృష్టిలో ఉంచుకొని కొత్త ఆర్థిక సంవత్సరంలో రూ.2,006 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.1,300 కోట్లకు పైగా ఆస్తిపన్ను వసూలైంది.

సన్నగిల్లిన టౌన్ ప్లానింగ్ ఆశలు

గతంలో జీహెచ్ఎంసీకి టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా ఎక్కువ ఆదాయం సమకూరేది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సైతం రూ.1,872 కోట్ల లక్ష్యాన్ని బడ్జెట్‌లో పేర్కొన్నా, తొలి ఆర్నెల్లలో కేవలం రూ. 425 కోట్లు మాత్రమే సమకూరాయి. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే బడ్జెట్‌లో టౌన్ ప్లానింగ్ ఆదాయ లక్ష్యాన్ని రూ.1,037 కోట్లకు తగ్గించారు.

హౌసింగ్‌కు రూ.300 కోట్లు..

బడ్జెట్‌లో హౌసింగ్ గ్రాంట్స్‌ను ప్రత్యేకంగా పేర్కొంటున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం ఊపుమీదున్నప్పుడు వేలకోట్ల పనులు జరగడంతో దాన్ని ప్రత్యేకంగా పేర్కొంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సైతం ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ పద్దు కింద రూ.500 కోట్లు చూపినప్పటికీ, తొలి ఆర్నెల్లలో ఇళ్ల మరమ్మతులకు, దొంగల పాలైన సామగ్రి కొనుగోళ్లకు దాదాపు రూ.4 కోట్లు ఖర్చు చేశారు. కొత్త ఆర్థిక సంవత్సరంపై ఆశతో ఈ పద్దు కింద రూ.300 కోట్లుగా చూపారు.

హైసిటీకి అధిక నిధులు

కొత్త బడ్జెట్‌లో హైసిటీ ప్రాజెక్ట్ కింద వివిధ పనులకు అధిక మొత్తంలో నిధులు కేటాయించారు. గతంలో ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పేరిట చేసిన పనులన్నింటినీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హైసిటీ పనులుగా మార్చింది. అందులో భాగంగా వివిధ పనులకు కేటాయింపులు ఇలా..

ఇంజినీరింగ్ ప్రాజెక్టులు : రూ.1,207 కోట్లు
రోడ్ల నిర్మాణం: రూ.650 కోట్లు
రోడ్ల నిర్వహణ పనులు: రూ.185 కోట్లు
నాలాలు, వరదనీటి కాలువలు: రూ.200 కోట్లు

- వెరసి హైసిటీ కింద పనులకు రూ. 2,242 కోట్లు కేటాయించారు.

అధిక నిధులు కేటాయించిన ఇతర పనులు

పార్కులు, పచ్చదనం (బయో డైవర్సిటీ): రూ.222 కోట్లు
హెల్త్ అండ్ శానిటేషన్: రూ. 600 కోట్లు
ఘనవ్యర్థాల నిర్వహణ: రూ.703 కోట్లు
రవాణా: రూ.105 కోట్లు
స్ట్రీట్ లైటింగ్: 344 కోట్లు
వాటర్ సప్లయ్, సీవరేజ్ లైన్లు: రూ.108 కోట్లు
ఇంజినీరింగ్ (మెయింటెనెన్స్): రూ.254 కోట్లు
కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు: రూ.431 కోట్లు

దీక్షా దివస్ ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు



దీక్షా దివస్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ గొప్ప నాయకుడు కేసీఆర్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించే కార్యక్రమం ఏర్పాట్లను గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, దీక్ష దివస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పొన్నాల లక్ష్మయ్య, సికింద్రాబాద్, అంబర్‌పేట్, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, నాంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాల ఇన్‌చార్జులు ఆనంద్‌గౌడ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. అంతకు ముందు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలోని అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ రాష్ట్రం రావాలి.. తెలంగాణ రాష్ట్రం కావాలని నినదించినట్లు వివరించారు. అటువంటి దీక్షా దివస్‌ను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని అన్ని నియోజకవర్గాల నుంచి బైక్‌లపై ర్యాలీగా బసవతారకం హాస్పిటల్ సర్కిల్ వరకు చేరుకుంటారని, అక్కడి నుంచి పాదయాత్రగా తెలంగాణ భవన్‌కు చేరుకోనున్నట్లు చెప్పారు.

'చలి'ంచని హృదయాలు!



అసహాయులకు కరువైన వసతి

- రాత్రిపూట ఫుట్‌పాత్‌లపై గజగజ
- మంచుతో వణుకుతున్న నిరాశ్రయులు
- నగరంలో వందలాది మంది నరకయాతన
- స్పందించని ప్రభుత్వం, అధికారులు

బంజారాహిల్స్: ఇళ్లల్లో ఉంటున్నవారే ప్రస్తుతం చలికి గజగజ వణుకుతూ బతుకు దేవుడా అనుకుంటూ బిర్రబిగిసిపోతున్నారు. మరి రాత్రిపూట ఫుట్‌పాత్‌లపై నిద్రించే నిరాశ్రయుల గతి ఏమిటి? వారి దయనీయ పరిస్థితి చూస్తే గుండెలు ద్రవించాల్సిందే! రోజు రోజుకూ చలిపులి పంజా విసరడం తీవ్రతరమవుతోంది. ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. సాయంత్రం 5 గంటల నుంచే చలి గజగజ వణికిస్తుండటంతో నిరాశ్రయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై నిద్రించే నిరాశ్రయులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ముందు వందలాది మంది నరకయాతన అనుభవిస్తున్నారు. కప్పుకోవడానికి దుప్పట్లు లేక.. తలదాచుకోవడానికి వసతి కానరాక మంచులోనే వణుకుతూ రాత్రంతా కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా.. వందలాది మంది ఇక్కడి ఫుట్‌పాత్‌లపై.. సెంట్రల్ మీడియన్లు.. ఖాళీ స్థలాలు, బండల మీద.. కేబీఆర్ పార్కు వాక్ వేలో.. బహిరంగ ప్రదేశాల్లో నిద్రకుపక్రమిస్తున్నారు. కానీ.. అటు ప్రభుత్వం.. ఇటు యంత్రాంగం ఏమాత్రం స్పందించడం లేదు. అభాగ్యులకు అండగా ఉండేందుకు ముందుకు రావడంలేదు.

బెడ్ షీట్ల పంపిణీ మరిచిపోయారు..

ప్రతియేటా ఈ దుస్థితి ఉన్నా జీహెచ్ఎంసీ ఏమాత్రం చర్యలు తీసుకుంటున్న పాపానపోవడం లేదు. గతంలో చలికాలం వచ్చిందంటే ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు జీహెచ్ఎంసీ బెడ్‌షీట్లను పంపిణీ చేసేది. గత నాలుగైదు ఏళ్లుగా జీహెచ్ఎంసీ అనాథలపై ఏమాత్రం మానవత్వం చూపడం లేదు. ఎవరైనా దాతలు దుప్పట్లు ఇస్తే కప్పుకోవడం, లేదంటే వణుకుతూ పడుకోవడం వీరందరికీ అలవాటైపోయింది. ఒక్క బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ముందే 300 మందికి పైగా నిరాశ్రయులు ఫుట్‌పాత్‌లపై పడుకుంటున్నారు.

సీఎం నివాసానికి కూతవేటు దూరంలోనే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి దగ్గరలో, మంత్రుల క్వార్టర్లకు కూతవేటు దూరంలో, నిత్యం జీహెచ్ఎంసీ అధికారులు రాకపోకలు సాగించే ఈ రహదారిలోనే ఇంతటి దుస్థితి నెలకొందంటే నమ్మశక్యం కాదు. కానీ.. ఇది కఠిన వాస్తవ దృశ్యం.

కోట్లాది రూపాయలు ఎటు పోతున్నట్లు..?

నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్లపై జీహెచ్ఎంసీ ప్రతియేటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చూపిస్తోంది. వీరంతా ఫుట్‌పాత్‌లపై ఉంటే షెల్టర్లలో ఖర్చులు ఎవరి పేర్లపై రాస్తున్నారని ప్రశ్నార్థకంగా మారింది. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి, రెయిన్‌బో ఆస్పత్రి, బసవతారకం కేన్సర్ ఆస్పత్రి, పంజగుట్ట చౌరస్తా, ఖైరతాబాద్ చౌరస్తా, విరించి చౌరస్తా, సాగర్ సొసైటీ చౌరస్తా, ఇందిరానగర్, శ్రీకృష్ణానగర్ ఇలా.. నగరంలోని ఎన్నో ప్రాంతాల్లో వందలాది మంది నిరాశ్రయులు ఇలా ఫుట్‌పాత్‌లపై కాలం వెళ్లదీస్తున్నారు.

మళ్లీ..'మూసీ' అలజడి!

హైకోర్టు తీర్పుతో కదలికలు

- నివాసితులకు నోటీసులు
- ఆందోళనలో బాధితులు



సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక పరిధిలో మళ్లీ అలజడి రగులుకుంటోంది. హైకోర్టు తీర్పుతో నివాసాల కూల్చివేతలు తప్పవన్న సాంకేతాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. మరోవైపు ఉన్నత స్థాయి ఆదేశాలు అందగానే రంగంలోకి దిగేలా రెవెన్యూ యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమవుతోంది. మూసీ రివర్‌బెడ్, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ జోన్లలోని నిర్మాణాలను తొలగించే సమయంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో పకడ్బందీగా అడుగులేసేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. తొలుత గుర్తించిన అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి రంగంలోకి దిగాలని భావిస్తోంది. మూసీ పునరుజ్జీవ పథకం ఫేజ్-1లో నార్సింగి నుంచి బాపు ఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవున, ఫేజ్-2 ప్రాజెక్టు నాగోల్ తట్టిఅన్నారం నుంచి బాచారం వరకు 10 కిలోమీటర్ల పొడవున చేపట్టాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. తొలి ఫేజ్‌లో భారీగా నిర్మాణాలు ఉండగా, రెండో ఫేజ్‌లో మాత్రం పెద్దగా ఆక్రమణలు లేనట్లు తెలుస్తోంది.

తాత్కాలికంగా ఆగినా..

- మూసీ నది ప్రక్షాళనలో భాగంగా పరీవాహక పరిధిలోని నివాసాల తొలగింపు వ్యవహారంలో తీవ్ర వ్యతిరేకతతో రెవెన్యూ యంత్రాంగం వెనక్కి తగ్గినా.. హైకోర్టు తీర్పుతో తిరిగి కదలిక వచ్చినట్లయింది. గత నెలలో నదీ గర్భం, బఫర్ జోన్‌లో గుర్తించిన నివాసాలకు పునరావాసం, పరిహారం అంశాలు తేల్చాకే నిర్మాణాలు తొలగింపునకు ముందడుగు వేయాలని నిర్ణయించగా, కొందరు కోర్టును ఆశ్రయించడంతో తీర్పు ప్రభుత్వానికి మరింత కలిసి వచ్చినట్లయింది.
- వాస్తవంగా మూసీ ప్రక్షాళన కోసం తొలి అడుగులోనే హంసపాదు ఎదురైంది. నదీ పరీవాహక పరిధిలో సర్వే ద్వారా గుర్తించిన నివాసాలపై రెడ్‌మార్కింగ్ వేసే ప్రయత్నమే బెడిసికొట్టాయి. నివాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురుకావడంతో, సగం ఇళ్లకు మాత్రమే రెడ్ మార్క్ వేసి వెనుకకు తగ్గక తప్పలేదు. నిర్వాసితులకు రాజకీయ పక్షాల మద్దతు మరింత కలిసి రావడంతో ఆందోళనలు ఉద్ధృతమైంది. దీంతో నదీ గర్భంలో రెడ్ మార్క్ వేసిన గృహాల జోలికి సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో తాత్కాలికంగా ప్రక్రియ ఆగిపోయింది.

12 వేలకుపైగా ఆక్రమణలు

మూసీ పరీవాహక పరిధిలో 12,184కి పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని రెండుగా వర్గీకరించి నదీ గర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీ గర్భంలో 2,166 నిర్మాణాలు ఉండగా.. 288 భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్లు వరకు బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు ఉండగా.. 1,032 భారీ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా పరిధిలో 3004 అక్రమ కట్టడాలున్నట్లు బయటపడింది.

ఇక ముందస్తు నోటీసులు

మూసీ పక్షాళనలో భాగంగా రివర్‌బెడ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న ఆక్రమణదారులకు ముందస్తు నోటీసులు జారీ కానున్నాయి. చట్టబద్ధంగా అక్రమ నిర్మాణాలున తొలగించనున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించనున్నారు. నిర్వాసితులకు సామాజిక, ఆర్థిక సర్వే ఆధారంగా పునరావాసం కల్పించనున్నారు. ఎక్కడైనా పట్టా, శిఖం పట్టా భూములు ఉంటే తగిన పరిహారం చెల్లించి వాటిని భూసేకరణ ద్వారా స్వీకరిస్తారు.. బిల్డింగ్స్ రూల్స్ - 2012ను కచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ అథారిటీలు, సంస్థలు నిర్వహించే సర్వేను, హద్దుల గుర్తింపు ప్రక్రియను అడ్డుకుంటే ఆందోళనకారులపై చర్యలు చేపట్టనున్నారు.

డిసెంబర్‌లో చర్లపల్లి టెర్మినల్‌కు గ్రీన్ సిగ్నల్

తొలుత ఈ నెల 30న ముహూర్తం

- సాంకేతిక కారణాలతో వాయిదా
- వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభానికి సన్నాహాలు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



టెర్మినల్ గోడలపై ఆకట్టుకునే చిత్రాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నాలుగో టెర్మినల్‌గా సేవలందించే చర్లపల్లి రైల్వేస్టేషన్ డిసెంబర్ మొదటి వారంలో అందుబాటులోకి రానుంది. ఈ నెల 30వ తేదీన ప్రారంభం కావాల్సి ఉండగా.. సాంకేతిక కారణాలతో వాయిదా వేసినట్లు గురువారం దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. డిసెంబర్‌లో జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆయన చెప్పారు.

ఎయిర్‌పోర్టు తరహాలో..

పర్యావరణ హితమైన ప్రమాణాలతో, ఎయిర్‌పోర్టు తరహా సదుపాయాలతో చర్లపల్లి టెర్మినల్‌ను పునర్నిర్మించిన సంగతి తెలిసిందే. సుమారు రూ.430 కోట్లతో స్టేషన్‌ను విస్తరించారు. చర్లపల్లి టెర్మినల్ వినియోగంలోకి వస్తే సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌లపైన ఒత్తిడి తగ్గనుంది. స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం దశలవారీగా రైళ్ల రాకపోకలను అందుబాటులోకి తేనున్నారు. చర్లపల్లి నుంచి 25 జతల రైళ్లు నడవనున్నాయి. ప్రతిరోజూ సుమారు 50 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ప్రయాణం చేసే అవకాశం ఉంది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఔటర్‌రింగ్ రోడ్డు మీదుగా నేరుగా చర్లపల్లికి రాకపోకలు సాగించవచ్చు. మరోవైపు సికింద్రాబాద్ పునరభివృద్ధి పనులు కూడా వేగంగా జరుగుతున్న దృష్ట్యా చర్లపల్లిని వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

అధునాతన సదుపాయాలు..

చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ హాళ్లు, స్లీపింగ్ పాడ్‌లు, కెఫెటేరియాలు, రెస్టారెంట్లు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, ఈవీ చార్జింగ్ పాయింట్లు తదితర సదుపాయాలన్నీ ఉంటాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 500 చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేశారు. వర్షపు నీటినిల్వ కోసం పెద్ద ఎత్తున ఇంకుడు గుంతలను నిర్మించారు. మురుగునీటి శుద్ధి కర్మాగారం, సోలార్ ప్యానెళ్లు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. విమానాశ్రయాన్ని తలపించేలా చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది. టెర్మినల్ గోడలపై ఏర్పాటు చేసిన కళాత్మక చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. దక్షిణమధ్య రైల్వే చరిత్రను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఎన్నో చిత్రాలను ఈ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు.

టెర్మినల్ ప్రత్యేకతలివీ..

- చర్లపల్లిరైల్వే టెర్మినల్ నాలుగో అతిపెద్ద స్టేషన్‌గా అవతరించనుంది.
- ప్రతిరోజూ 25 జతల రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. రోజుకు 50 వేల మంది ప్రయాణికులకు పైగా స్టేషన్ సేవలను వినియోగించుకుంటారు.
- చర్లపల్లి టెర్మినల్‌లో 9 ప్లాట్‌ఫాంలు, 2 పాదచారుల వంతెనలు, 5 ఎస్కలేటర్లు, 5 లిఫ్టులు ఏర్పాటు చేశారు.
- అన్ని వైపుల నుంచి ప్రయాణికులు ఔటర్ మీదుగా రాకపోకలు సాగించవచ్చు.



చర్లపల్లి టెర్మినల్

వాల్యూజోన్ హైపర్ మార్ట్ ప్రారంభం





నాచారంలో వాల్యూజోన్ హైపర్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరో బాలకృష్ణ

మల్లాపూర్: నాచారంలో ఏర్పాటు చేసిన వాల్యూ జోన్ హైపర్ మార్కెట్‌ను గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి సినీ హీరో బాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాచారంలో వాల్యూ జోన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వాల్యూజోన్‌లో ప్రతి వస్తువు దొరుకుతుందన్నారు. నాచారం ప్రాంతానికి తాను లోకల్ అని రామకృష్ణ స్టూడియోకు బైక్‌పై వచ్చే వాడినని గుర్తు చేశారు. సాంకేతికంగా విడిపోయిన తెలుగువాళ్లు ఒక్కటేనన్నారు. బీఎల్ ఆర్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్య, వైద్య రంగాల్లో పేదలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నలుగురు ఎంబీబీస్ విద్యార్థులకు బాలకృష్ణ చెక్కులను అందజేశారు. అనంతరం డైరెక్టర్లు పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి, టి.ప్రసాదరావు, మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాల్యూజోన్ అన్ని ఉత్పత్తులను అందుబాటులో ఉంచుకుందన్నారు. కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు 40 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.

సంచారజాతులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

లక్డీకాపూల్ : తెలంగాణలో సంచారజాతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కనీస అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. గురువారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర సంచారజాతుల సంఘం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాసనమండలి బీఆర్‌ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూధనాచారి , మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, బీసీ నాయకులు జాజుల శ్రీనివాస్, వకుళాభరణం కృష్ణ మోహన్, చిరంజీవులు, ప్రొఫెసర్ తిరుమలి, మురళీ మోహన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. సంచార జాతులకు చెందిన 52 కులాలు జనాభాలో 12 శాతం ఉన్నారని వారికి కనీసం వసతులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ జాతి ప్రజలకు గ్రామ పంచాయతీ, సభలు, సమావేశాలపై తెలియదన్నారు. ఓట్లేసి గెలిపించిన నాయకులను దరఖాస్తు చేసి అర్థిస్తున్నారని వాపోయారు. ప్రస్తుతం జరుగుతున్న కులగణనలో సంచార జాతుల వివరాలను కూడా సేకరించి ఆయా కులాల ప్రత్యేక జాబితాను రూపొందించాలన్నారు. సంచార జాతుల సభ్యులతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో సలహా మండలి కమిటీలను ఏర్పాటు చేసిన విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఆయా జాతులకు ప్రత్యేకంగా 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంచార జాతుల కులాలు సంఘటితమై సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సింగజోగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వ్యక్తి మృతి



మల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, అపార్ట్‌మెంట్ వాసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విద్యాసాగర్ (61) అనే వ్యక్తి మల్లాపూర్ మే ఫ్లవర్ హైట్స్ అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం అతను అకస్మాత్తుగా 5 అంతస్తు నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు హత్యా లేక ఆత్మహత్యా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

చంపి అత్యాచారం చేశాడు!

- 'రైల్వే సీరియల్ కిల్లర్' రాహుల్ జాట్ వ్యవహార శైలి
- హత్య తర్వాత మృతదేహం పక్కన గడిపే సైకోయిజం
- కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకున్న వల్సాద్ పోలీసులు
- ఆ తర్వాతే నగరానికి తరలించేందుకు అవకాశం





సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రమణమ్మ సహా ఐదుగురిని హత్య చేసిన 'రైల్వే సీరియల్ కిల్లర్' రాహుల్ జాట్ విచారణలో గుజరాత్ అధికారులు కీలక విషయాలు గుర్తిస్తున్నారు. సోమవారం అతడిని అరెస్టు చేసిన వల్సాద్ పోలీసులు న్యాయస్థానం అనుమతితో బుధవారం తమ కస్టడీకి తీసుకున్నారు. వచ్చే నెల 5 వరకు జరిగే వారి విచారణ పూర్తయిన తర్వాతే రమణమ్మ హత్య కేసులో సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులు పీటీ వారెంట్‌పై తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది. ఈ నరహంతకుడు కేవలం 35 రోజుల్లో పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణల్లో ఐదుగురిని హత్య చేసినట్లు వెలుగులోకి వచ్చిన విషయం విదితమే.

శవాన్నీ వదలడు...

రాహుల్ జాట్‌ను వల్సాద్ పోలీసులు ఈ నెల 14న జరిగిన 19 ఏళ్ల బీకాం విద్యార్థిని హత్య కేసులో సోమవారం పట్టుకున్నారు. విచారణలో భాగంగా క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం బుధవారం ఘటనాస్థలికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే అతడి వ్యవహారశైలికి సంబంధించిన కీలకాంశాలను గుర్తించారు. ఫోన్ మాట్లాడుకుంటూ ఉద్వాడ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై నడుచుకుంటూ వెళ్తున్న యువతిని బలవంతంగా సమీపంలోని మామిడి తోటలోకి లాక్కెళ్లిన రాహుల్ అత్యాచారం చేసి, గొంతు నులిమి హత్య చేసిన అక్కడి నుంచి వెళ్లిపోయాడని వల్సాద్ పోలీసులు గుర్తించారు. కొద్దిసేపటికి మళ్లీ మామిడి తోటలోకి వచ్చిన అతను విద్యార్థిని మృతదేహంపై మరోసారి అత్యాచారానికి ఒడిగట్టాడని దర్యాప్తులో తేల్చారు.

ఫ్రూట్ సలాడ్ తిని, ఎనిమిది కిమీ నడిచి...

ఆపై మృతదేహానికి సమీపంలోని పొదల్లో దాక్కున్న రాహుల్.. అప్పటికే తనతో తెచ్చుకున్న ఫ్రూట్ సలాడ్ తింటూ గడిపాడు. విద్యార్థినిని వెతుక్కుంటూ వచ్చిన ఆమె కుటుంబీకులు, స్నేహితులు వచ్చే వరకు అలానే నక్కి ఉన్నాడు. వారి ఆర్తనాదాలు వింటూ, మృతదేహాన్ని తరలించే వరకు ఆగి ఆ తర్వాత రైలు పట్టాల వెంట నడుస్తూ వెళ్లి పోయాడు. అక్కడికి దాదాపు ఎనిమిది కిమీ దూరంలో ఉన్న పర్డీ రైల్వే స్టేషన్ నుంచి రైలు ఎక్కి వడోదర వెళ్లిపోయినట్లు వల్సాద్ పోలీసులు తేల్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినా తనకు సంబంధించిన ఏ చిన్న క్లూ దొరక్కూడదనే ఇలా వ్యవహరించాడని అధికారులు చెబుతున్నారు. నేరచరిత్ర ఉన్న రాహుల్‌కు పోలీసులు దర్యాప్తు విధానాలు తెలిసి ఉండటంతో ఇలాంటి జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరిస్తున్నారు.

మృతదేహం పక్కన పడుకుంటాడు...

సైకో సీరియల్ కిల్లర్ రాహుల్‌కు మరో విచిత్రమైన లక్షణం కూడా ఉన్నట్లు వల్సాద్ పోలీసులు పేర్కొన్నారు. హత్య చేసిన తర్వాత మృతదేహం పక్కనే కాసేపు పడుకునేవాడని తెలిపారు. ఈ లక్షణాల నేపథ్యంలోనే అతడు సైకో అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రమణమ్మ సహా ఐదుగురిని రాహుల్ రైళ్లు, రైల్వే స్టేషన్లలో చంపినట్లు ఇప్పటి వరకు తేలింది. ఈ మృతదేహాలతోనూ ఇలానే ప్రవర్తించాడని వల్సాద్ అధికారులు వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో గడిచిన రెండు నెలల్లో దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ రైళ్లు, రైల్వేస్టేషన్లలో జరిగిన హత్యలు, లభించిన గుర్తుతెలియని మృతదేహాలకు సంబంధించిన కేసులనూ వల్సాద్ పోలీసులు సేకరిస్తున్నారు. వీటిని క్రోడీకరించడం ద్వారా రాహుల్ ప్రమేయాన్ని నిర్ధారించనున్నారు.

వారం రోజుల్లో సర్టిఫికెట్లు జారీ చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: ఎన్జీఓలు, శిశు విహార్ సంరక్షణ కేంద్రాల్లోని చిన్నారులకు బర్త్, క్యాస్ట్, ఆర్ఫన్, ఆధార్, ఆధార్ అప్డేషన్ ధ్రువీకరణ పత్రాలను వారం రోజుల్లోగా జారీ చేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ సీఎంఓ, ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్, డీసీపీఓ స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, శిశువిహార్ సంరక్షణ కేంద్రాల్లోని 1500 మంది చిన్నారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ఏడు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని, వారం రోజుల్లో సర్టిఫికెట్ల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. క్యాంప్ సందర్భంగా భోజనం, నీరు, వైద్యం తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ వెంకటాచారి, సీఎంఓ డాక్టర్ పద్మజ, డిడబ్ల్యూఓ అక్కేశ్వరరావు, డీసీపీఓ శ్రీనివాస్, ఇంచార్జ్ డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్ర నాథ్, ఆర్డీఓ సాయిరాం, ఎస్ఈఎం జ్యోతి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రజిత, ఎన్జీఓలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

మేడ్చల్‌రూరల్: డ్యూటీకి వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రావల్ కోల్ గ్రామానికి చెందిన కాకిపల్లి నాగరాజు(34) రాజబొల్లారం గ్రామ పరిధిలోని మోనార్క్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున అతను బైక్‌పై డ్యూటీకి వెళుతుండగా పూడూర్ చౌరస్తా సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం అతడి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కాగా మృతుడు నాగరాజుకు ఏడాది క్రితమే వివాహం జరిగింది. ప్రస్తుతం అతని భార్య గర్భవతి కావడం గమనార్హం.

ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గైర్హాజరు

సిటీ కోర్టులు : రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌పై 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. విచారణకు ఆయన గైర్హాజరు కావడంతో.. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ కేసు విచారణకు ఆయన రాలేకపోతున్నారని ఆయన తరుపు న్యాయవాది నరేందర్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం తదుపరి విచారణను జనవరి 8కి వాయిదా వేస్తున్నట్లు జడ్జి శ్రీదేవి తెలిపారు.

సంపులో పడి వ్యక్తి మృతి



క్రాంతికుమార్ (ఫైల్)

నాగోలు: అనుమానాస్పద స్థితిలో నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివనాగప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగోలు జైపురికాలనీ శివపురి కాలనీ చెందిన అత్తిలి క్రాంతి కుమార్ (38) ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. మద్యానికి బానిసైన అతను ఈ నెల 25న మద్యం కోసం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం సాయంత్రం జైపురికాలనీ సమీపంలోని కుమార్‌గౌడ్ ఇంట్లోని సంపులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు నాగోలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయడంతో అతడిని క్రాంతికుమార్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి అన్న సంతోష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని విద్యార్థిని ఆత్మహత్య

ఫిలింనగర్: కాలేజీకి వెళ్లకుండా స్నేహితులతో తిరుగుతున్నందుకు చదువు ఆపేయాలని తండ్రి మందలించడంతో మనస్తాపానికిలోనైన ఇంటర్ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మహబూబ్‌నగర్ జిల్లా, షేర్‌పల్లి గ్రామానికి చెందిన బోలా శ్రీనివాస్, శారద దంపతులు నగరానికి వలస వచ్చి షేక్‌పేట్, సీతానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2019లో శ్రీనివాస్ భార్య శారద మృతి చెందింది. అప్పటినుంచి అన్నీ తానై అయి పిల్లలను పెంచుతున్నాడు. అతడి కుమార్తె నందిని(16) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా కాలేజీకి వెళ్లకుండా స్నేహితులతో కలిసి తిరుగుతున్నట్లు తండ్రికి ఫిర్యాదు అందింది. దీంతో ఆయన బుధవారం కాలేజీకి వెళ్లనవసరం లేదని సొంత ఊరికి తిరిగి వెళుతున్నట్లు చెప్పాడు. గురువారం ఉదయం అతను పనికి వెళ్లిపోగా కొద్ది సేపటి తర్వాత తండ్రికి ఫోన్ చేసిన నందిని కాలేజీకి వెళ్లి చదువుకుంటానని కోరింది. అందుకు అతను నిరాకరిస్తూ ఇంట్లోనుంచి కాలు బయట పెట్టవద్దని హెచ్చరించాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన శ్రీనివాస్ తలుపులు తట్టగా లోపలినుంచి స్పందన లేకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా నిందిని ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. ఈ ఘటనపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌పై పరువు నష్టం కేసు 2కు వాయిదా

సిటీ కోర్టులు: మాజీమంత్రి కేటీఆర్‌పై దాఖలైన పరువు నష్టం కేసు డిసెంబర్ 2వ తేదీకి వాయిదా పడింది. తన పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త సూదిని సృజన్ రెడ్డి గతవారం నాంపల్లిలోని నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం సృజన్‌రెడ్డి వాంగ్మూలం రికార్డు చేస్తామని, అదే రోజుకు కేసు వాయిదా వేసింది. ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీతో తనకు సంబంధాలు ఉన్నాయని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశామని కేటీఆర్ పలు మీడియా చానళ్లు, పత్రికల్లో అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలతో తన పరువు పోయిందని సృజన్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ లబ్ధికోసం కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై విచారణ చేపట్టిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. అదేరోజు సృజన్‌రెడ్డి (పిటిషనర్) స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామని తెలిపారు.

నాంపల్లి కోర్టుకు మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి హాజరు

- వాంగ్మూలం రికార్డు చేసుకున్న ప్రజాప్రతినిధుల కోర్టు
- జనవరి 8కి విచారణ వాయిదా

సిటీ కోర్టులు: హుజుర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గురువారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. 2019 హుజుర్‌నగర్ ఉపఎన్నికల్లో ఆయనపై నమోదైన పలు కేసుల్లో కోర్టుకు హాజరయ్యారు. ఆయన తరుపు న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, కె.నరేందర్ సమక్షంలో సైదిరెడ్డి వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్న న్యాయమూర్తి విచారణను జనవరి 8కి వాయిదా వేశారు. హుజుర్‌నగర్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిమిత్తం 300 మందికి అనుమతి ఇవ్వాలని అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి అభ్యర్థన మేరకు పోలీసులు పర్మిషన్ ఇచ్చారు. అయితే 2019 అక్టోబర్ 4న వేలాది మంది కార్యకర్తలు, అభిమానులతో రోడ్ షో నిర్వహించారని, ఈ కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అంతేకాకుండా ఎన్నికల నియామవళిని ఉల్లగించారని ఆయనపై కేసు నమోదు చేశారు. గురువారం వ్యక్తిగతంగా విచారణకు హాజరైన ఆయన వాగ్మూలం ఇచ్చారు. తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు సాక్షులకు నోటీసులు జారీ చేసింది.

సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై కేసు నమోదు



ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో కూల్చివేసిన ఫెన్సింగ్

గచ్చిబౌలి: ప్లాట్ కబ్జా చేసేందుకు యత్నించాడనే ఫిర్యాదుతో సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి సర్వే నెంబర్ 124,125లో ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో 700 చదరపు అడుగుల విస్తీర్ణం కల ప్లాట్ నెంబర్ 84ను ఉమా దేవరాజు అనే వ్యక్తి 1998లో కొనుగోలు చేశారు. ఏడాది క్రితం ప్లాట్‌ను చదును చేసుకుని రేకులతో ఫెన్సింగ్ వేసి సీసీ కెమెరాలు అమర్చారు. ఈ నెల 26న కొందరు వ్యక్తులు సీసీ కెమెరాల వైర్లను కట్ చేయడంతో దేవరాజ్ వచ్చి ప్లాట్‌ను చూసి ఫొటోలు తీసుకుని వెళ్లాడు. 27న వచ్చి చూసే సరికి రేకుల ఫెన్సింగ్‌ను పూర్తిగా కూల్చివేసి ధ్వంసం చేశారు. ఉమా దేవరాజ్ ఫిర్యాదుతో బుధవారం రాత్రి సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావు, వెంకటేష్, సాయి కుమార్‌రెడ్డి, మరి కొందరిపై కేసులు నమోదు చేశారు. ఇది ఇలా ఉండగా ఖాజాగూడలో భగీరథమ్మ చెరువులో మట్టితో పూడ్చారని రాయదుర్గం పోలీస్ స్టేషన్ సంధ్య కన్వెన్షన్ ఎండి శ్రీధర్ రావు, మరి కొందరిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఒకే రోజు రాయదుర్గం, గచ్చిబౌలి పీఎస్‌లలో శ్రీధర్ రావుపై కేసులు నమోదు కావడం విశేషం. గతంలోనూ ఆయనపై నార్సింగి, సనత్‌నగర్ తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి.

ప్రజలు ఆందోళన చెందవద్దు

- బండచెరువును సుందరీకరిద్దాం



మౌలాలి: వినాయక్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి బండచెరువు పరిసరాల అభివృద్ధి విషయమై వినతిపత్రం అందజేశారు. అయితే హైడ్రా చర్యల నేపథ్యంలో బండచెరువు పరిసరాల ప్రజలు ఆందోళన చెందుతున్నారనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చాలాకాలం నుంచి ఉంటున్న పేద, మధ్య తరగతి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని రంగనాథ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఏ ఒక్క ఇంటిని కూల్చే పరిస్థితి రాదని హామీనిచ్చారు. హైడ్రా చేపడుతున్న చెరువుల అభివృద్ధిలో భాగంగా బండచెరువును కూడా తీసుకుని మురుగు రహిత చెరువుగా మార్చి పరిసరాలను మెరుగుపరచాలని కార్పొరేటర్ కోరారు. రెండు విడతల్లో బండచెరువు సుందరీకరణ చేపడతామని ఆయన హామీనిచ్చారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్ గైర్హాజరు

డిసెంబర్ 11కు విచారణ వాయిదా

సిటీ కోర్టు : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన పలు కేసుల్లో న్యాయస్థానం సాక్షుల వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. రాజాసింగ్ కోర్టుకు గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది కరుణసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం పలు కేసుల్లో సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయగా కోర్టు రికార్డు చేసింది. అనంతరం తదుపరి విచారణ డిసెంబర్ 11కు వాయిదా వేస్తున్నట్లు కోర్టు సూచించింది. గత ఏడాది శ్రీరామ నవమి ర్యాలీ, గత ఎన్నికల్లో నిర్వహించిన ప్రచార ర్యాలీల సందర్భంగా నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అంతేకాకుండా సోషల్‌మీడియాలో తప్పుడు స్పీచ్‌లు ఇచ్చారని ఆయనపై పలువురు నగరంలోని ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 8 కేసులపై గురువారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (ప్రజాప్రతినిధుల కోర్టు)లో విచారణ చేపట్టింది. విచారణకు రాజాసింగ్ హాజరు కాకపోవడంతో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ కేసుల్లో ఫిర్యాదుదారులు, సాక్షులను రాజాసింగ్ తరుపు న్యాయవాది క్రాస్ చేయగా జడ్జి ఎస్. శ్రీదేవి రికార్డు చేశారు. అనంతరం తదుపరి విచారణను డిసెంబర్‌కు వాయిదా వేసింది.

బీజేపీ ఎంపీ బండి సంజయ్ గైర్హాజరు..

బీఆర్ఎస్ నాయకులను దండుపాళ్యం బ్యాచ్‌గా చిత్రీకరిస్తూ , దోపిడీ దొంగలుగా అభివర్ణించారని బీజేపీ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై నమోదైన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. 2022, అక్టోబర్‌లో మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో భాగంగా అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎంసీసీ అధికారులు(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) మానిటరింగ్ కమిటీ సభ్యుడి మేరకు మర్రిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఓటుకు రూ.40 వేలు పంపిణీ చేశారా? జాగ్రత్తగా చూసుకోండి అందులో దొంగనోట్లు ఉంటాయని ప్రజలను రెచ్చగొట్టారని ఎంసీసీ అధికారి ఫిర్యాదులో పేర్కొన్నా రు. బీజేపీకి ఓటు వేస్తే రాముడికి వేసినట్లని, ఇతర పార్టీ నేతలను రాక్షసులుగా అభివర్ణించారని పేర్కొన్నారు. ఈ కేసుల విచారణకు ఆయన గైర్హాజరు కావడంతో బండి సంజయ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఆయన కోర్టుకు హాజరు కాలేకపోయారని పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం తదుపరి విచారణను డిసెంబర్‌కు వాయిదా వేస్తున్నట్లు ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఐజీపురం, బ్రాహ్మణవాడి, గ్రీహుండా, ఐతిఈ 11కెవీ ఫీడర్లు బేగంపేట, కుందన్‌బాగ్, గ్రీన్‌లాండ్స్, ఆల్విన్ సబ్ స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఐజీపురం, బేగంపేట, కట్టమైసమ్మ దేవాలయం, హెచ్‌పీఎస్ రోడ్డు, పెట్రోలు పంపు, శ్యాంలాల్ బిల్డింగ్ ఏరియా, వైట్‌హౌస్, మీనాబజార్, జీఎంఆర్, ఫ్లైఓవర్ బేకరీ, అల్లాడిన్ కోటి, ఓల్డాస్ షోరూం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ గురువారం తెలిపారు. అదే విధంగా సోమాజిగూడ, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజీ, వనమల రెసిడెన్సీ, ఇంద్రప్రస్థ 11కెవీ ఫీడర్లు గ్రీన్‌లాండ్స్, కుందన్‌బాగ్, ఆల్విన్ సబ్ స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న విద్యుత్ మరమ్మతుల కారణంగా మా టీవీ బిల్డింగ్స్, హిందుప్రెస్, పుల్లారెడ్డి, స్నేహలత బిల్డింగ్, ఎస్‌బీఐ స్టాఫ్ క్వార్టర్స్, అమృత విల్లీ, ఉదయ్‌నగర్, ఎస్‌ఆర్‌టీ, పబ్లిక్‌స్కూల్, ఇంద్రప్రస్థ, స్ట్రీట్–1 ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని గమనించగలరని పేర్కొన్నారు.

ఖైరతాబాద్‌లో..

సైఫాబాద్ డివిజన్ పరిధిలోని ఇందిరాపార్క్, నిమ్స్, ఎసీగార్డ్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, జవహర్‌నగర్, లేక్ వ్యూ సబ్‌స్టేషన్ పరిధిల్లో విద్యుత్ మెయింటెనెన్స్, చెట్ల తొలగింపులో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇందిపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్, కెనెరా బ్యాంక్ పార్క్, కల్పతరువు అపార్ట్‌మెంట్, విజయాబ్యాంక్ ఏరియా, రంగారెడ్డి డిటీఆర్ ఏరియా, దేవీ చౌక్ ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎర్రమంజిల్ ఏరియా, బాలాపూర్ బస్తీ, ఎర్రమంజిల్ చమాన్, పంచాయత్‌రాజ్ ఆఫీస్, పోస్టాఫీస్ లేన్, జీవీకెమాల్ వెనుక ప్రాంతం, ఏసీ గార్డ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో కేర్, విరించి హాస్పిటల్, సాక్షి దినపత్రిక కార్యాలయం, వాటర్ వర్క్స్ కార్యాలయం, మహేశ్వరి టవర్స్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. జవహర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు నర్మదా హాస్పిటల్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ రెసిడెన్సి ఏరియా, గాంధీనగర్, మోర్‌సూపర్ మార్కెట్ ఏరియా, విజయా బ్యాంక్, హ్యాపీ హోం అపార్ట్‌మెంట్ ఏరియా, లేక్‌వ్యూ సబ్‌స్టేషన్ పరిధిలో విజయ హాస్పిటల్ లేన్, రాజ్‌భవన్ మెయిన్ రోడ్డు, మార్వెల్ అపార్ట్‌మెంట్, విజయ ఎలక్ట్రానిక్స్, ఈనాడు కార్యాలయం, క్రిస్టల్ హోటల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని గమనించి సహకరించగలరని కోరారు.

కనులపండువగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని హరే కృష్ణ స్వర్ణ దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించి పులకించిపోయారు. అలాగే గరుడవాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది.

జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త



నివాళులు అర్పిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: కుల వివక్షతపై పోరాడిన జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కొనియాడారు. జ్యోతిబా పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఎస్పీఆర్‌హిల్స్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల వివక్షత, అన్యాయాలపై పోరాడంలో తన జీవితాన్నే ధార పోసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

మాదాపూర్ డీసీపీ వినీత్



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఫిలింనగర్: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మాదాపూర్ డీసీపీ వినీత్ అన్నారు. భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు వార్షిక క్రీడోత్సవం గురువారం ఘనంగా జరిగింది. 'మేరా భారత్' థీమ్‌తో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకలకు డీసీపీ వినీత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరా భారత్ థీమ్‌ను ఎంచుకోవడం అభినందనీయమన్నారు. విద్య అనేది అకాడమిక్స్‌లో ఒక భాగమని, జీవన నైపుణ్యాలను అర్థం చేసుకోవడం ముఖ్యమని, అప్పుడే చరిత్ర సృష్టించగలుగుతారన్నారు. విద్య విలువలను ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా ఆ విలువలను మరిచిపోవద్దన్నారు. దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు విద్యార్థులు ప్రదర్శించిన సాహిత్య, కళా నైపుణ్యాలు ఆకట్టుకున్నాయి. జానపద నృత్యాలు కట్టిపడేశాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్, స్కూల్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు గోపాలకృష్ణన్, భారతీయ విద్యా భవన్ రీజనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మదన్‌రావు, భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం ప్రిన్సిపాల్ అరుణశ్రీ, ఆత్మకూరి రామారావు స్కూల్ ప్రిన్సిపాల్ లతానాయర్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క స్కానింగ్‌తో క్షణాల్లో బిల్లులు!

- కరెంటు మీటర్లకు కొత్తగా సెన్సార్ (డాంగుల్) విధానం
- త్వరితగతిన రీడింగ్ నమోదు.. లైన్‌మెన్లకు సమయం ఆదా
- బంజారాహిల్స్ డీఈ పరిధిలో 70శాతం డాంగుల్ బిల్లింగ్‌లే



ఫిలింనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక స్కానర్ ద్వారా కరెంటు బిల్లు తీసుకుంటున్న లైన్‌మెన్..

బంజారాహిల్స్: రోజురోజుకూ అపార్ట్‌మెంట్ల కల్చర్ పెరగటంతోపాటు ఒక్కో అపార్ట్‌మెంట్‌లో 50 నుంచి 100 వరకు ఫ్లాట్ల వరకు ఉంటున్నాయి. దీంతో ఒక్కో ఫ్లాట్‌కు ఒక్కో మీటర్ ఏర్పాటు ఉండటంతో వీటి బిల్లింగ్ తీయాలంటే లైన్‌మెన్‌కు చాలా సమయం పడుతుంది. ఇటీవల కాలంలో అద్దెల కోసం వ్యక్తిగత ఇళ్లపై కూడా అంతస్తులు పెంచుతున్న యజమానులు కిరాయిదారులకు ప్రత్యేక మీటర్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వ్యక్తిగత ఇళ్లల్లో కూడా కరెంటు బిల్లులు తీసుకోవడంలో లైన్‌మెన్లకు చాలా సమయం పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని టీజీఎస్‌పీడీసీఎల్ కొత్తగా సెన్సార్ ఉన్న మొబైల్ ఫోన్లతో మీటర్ల వద్ద స్కానింగ్ చేస్తూ త్వరితగతిన బిల్లులు నమోదు చేస్తున్నారు. బంజారాహిల్స్ డీఈ పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, మాదాపూర్, ఎస్‌కేనగర్ తదితర సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానానికి డాంగుల్ బిల్లింగ్‌గా పిలుస్తున్నారు.

> మారుతున్న కాలానుగుణంగా పలు సంస్థలు టెక్నాలజీని జోడించి పనులు త్వరితగతిన చేయిస్తున్నాయి. దీని వల్ల పనులు ఈజీగా కావడంతోపాటు సమయం కూడా ఆదా అవుతోంది. దీనిలో భాగంగానే టీజీఎస్‌పీడీసీఎల్ కరెంట్ మీటర్ల బిల్లింగ్ చేసే లైన్‌మెన్లకు కొత్తగా 'డాంగుల్' విధానాన్ని తీసుకొచ్చి లైన్‌మెన్లకు బిల్లులు తీసే విధానాన్ని చాలా సులభతరం చేసింది. దీంతో ఇది వరకు ఒక్క మీటర్ రీడింగ్ తీయాలంటే మూడు నిమిషాలు పట్టేది. ఇప్పుడు కొత్త విధానంతో క్షణాల్లోనే బిల్లులు వస్తున్నాయి.

- గతంలో పాత విధానంలో బిల్లులు నమోదుకు ప్రతినెలా ఒకటో తేదీన మొదలు పెడితే 15వ తేదీ వరకు బిల్లింగ్ పూర్తయ్యేది.
- తాజాగా ప్రవేశపెట్టిన డాంగుల్ బిల్లింగ్‌తో వారం రోజుల్లోనే బిల్లులు అందిస్తున్నారు.
- గతంలో బిల్లులు నమోదు చేయాలంటే ఒక్కో లైన్‌మెన్‌కు మూడు నిమిషాల సమయం పట్టేది.
- సెన్సార్‌తో కూడిన డాంగుల్ బిల్లింగ్‌తో క్షణంలోనే బిల్లులు వస్తున్నాయి.
- లైన్‌మెన్లకు ప్రత్యేక సెన్సార్‌తో అందించిన మొబైల్ ఫోన్లతో మీటర్ వద్దకు వెళ్లి ఫోన్ మీటర్ ముందు పెట్టగానే క్షణంలో బిల్లు వస్తుంది.
- బంజారాహిల్స్ డీఈ పరిధిలో 70 మంది లైన్‌మెన్లు, పనిచేస్తున్నారు. 4500 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. 20 ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక లైన్‌మెన్‌ను కేటాయించారు.
- డాంగుల్ బిల్లింగ్‌తో కరెంటు బిల్లులు త్వరితగతిన రావడం, వినియోగదారులకు అందించడం, కలెక్షన్ చేయడం అంతా ప్రతినెలా 15వ తేదీ లోపు పూర్తవుతుంది. దీంతో మిగతా 15 రోజులు ఈ లైన్‌మెన్లు తమ పరిధిలోని 20 ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కేబుళ్లు, బాక్స్‌ల పనులు, లైన్లు సరి చూసుకోవడం చేస్తున్నారు.
- కొత్తగా ఏర్పాటు చేసిన డాంగుల్ స్కానర్‌ను మొబైల్ ఫోన్‌కు స్కాన్ చేయడంతో రీడింగ్ క్షణాల్లో తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.
- బంజారాహిల్స్ డీఈ పరిధిలో లక్షా 80 వేల మీటర్లు ఉండగా ప్రస్తుతం 70 శాతం మీటర్లకు డాంగుల్ బిల్లింగ్‌లే ఇస్తున్నారు.
- 30 శాతం మీటర్లకు మాత్రమే పాత విధానం ద్వారా బిల్లులు అందుతున్నాయి. వాటికి కూడా డాంగుల్ స్కానర్ చేసే పని త్వరలోనే పూర్తిచేస్తామని అధికారులు వెల్లడించారు.



సెన్సార్ ఉన్న మీటర్..

అంబేద్కర్ వర్సిటీ భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం

జేఏసీ సభ్యులకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ



ప్రొఫెసర్ కోదండరాంతో అంబేద్కర్ వర్సిటీ జేఏసీ బృందం

బంజారాహిల్స్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనున్నదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం జేఏసీ సభ్యులకు హామీనిచ్చారు. గురువారం ఆయనను కలిసిన జేఏసీ బృందంతో చర్చించారు. తన విన్నపాన్ని మన్నించి వంటావార్పు కార్యక్రమాన్ని వాయిదా వేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన వారిలో జేఏసీ ప్రతినిధులు వడ్డాణం శ్రీనివాస్, పల్లవీ కాంబ్లే, వెంకటేశ్వర్లు, రజని, ఉదయిని, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

కొనసాగిన నిరసన..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) సభ్యులు డిమాండ్ చేస్తూ గురువారం నిరసన కొనసాగించారు. గత 70 రోజులుగా జేఏసీ సభ్యులు, ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ముందు బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు రబింద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, హబీబుద్దీన్, పాండు, షబ్బీర్, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. (కిలో.. రూపాయల్లో..) టమాటా.41, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 33, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీ మిర్చి 33, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 26, పందిరి బీర 45, క్యాబేజీ 31, క్యారెట్ 52, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 53, గోకరకాయ 35, కీర 19, దోసకాయ 23, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 36, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55లు ఉండగా ఈ ధరలు శుక్రవారం వరకే వర్తిస్తాయని అధికారులు తెలిపారు.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం

రహమత్‌నగర్: డివిజన్‌లోని హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్–1 బస్తీలోని సీతారామ భక్త సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు మహా ప్రసాద కార్యక్రమం (నిత్య అన్నదానం) నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ఈనెల 13న ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబర్ 28వ తేదీ వరకు కొనసాగనుంది. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల నిర్వహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చేనేతకారుల అభ్యున్నతికి కృషి



శ్రీనగర్‌కాలనీ: చేనేత వస్త్రాలను ధరించాలని, తెలంగాణా ప్రభుత్వం చేనేతకారుల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలంగాణా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024ను ఆమె ప్రారంభించారు. చేనేత కళాకారులను ప్రోత్సహించి వారి వస్త్రాలను ధరించాలని కోరారు. ఈ ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన డిసెంబర్ వరకూ కొనసాగుతుంది.

రూ.10.5 లక్షలతో మురుగునీటి పైప్‌లైన్ పనులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్ భోళానగర్‌లో రూ.10.5 లక్షలతో నూతనంగా నిర్మించనున్న 200 ఎంఎం డయా మురుగునీటి పైప్‌లైన్ పనులను గురువారం గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ హరిశంకర్, మేనేజర్ రాంబాబు, వాటర్‌వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

డెకరేటివ్ పోల్స్ ప్రారంభం...

కేబీఆర్ పార్కు మెయిన్ గేటు నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు ఏర్పాటు చేసిన 60 డెకరేటివ్ పోల్స్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ లైట్స్‌ను కూడా ఆమె ప్రారంభించారు.



మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు....

ఖైరతాబాద్: ఖైరతాబాద్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమావేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ యాదవ్, సచ్చిదేవ్, శ్రీకాంత్, సందీప్‌రాజ్, చందు, మహేష్‌యాదవ్, మధుకర్‌యాదవ్, రాజ్‌కుమార్, గజ్జెల ఆనంద్, గోపి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొస్టేట్ సమస్యలకు 'వాటర్ వేపర్ థెరపీ'తో ఉపశమనం

ఏఐఎన్‌యూ ఎండీ డాక్టర్ సి.మల్లికార్జున

లక్డీకాపూల్: ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ సమస్యకు వాటర్ వేపర్ థెరపీ మంచి ఫలితాలను ఇస్తుందని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున తెలిపారు. యుక్త వయసులోనే ప్రొస్టేట్ సంబంధిత సమస్యలు వచ్చిన వారికి మందులు వాడినా, శస్త్రచికిత్స చేసినా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గురువారం ఎర్రమంజిల్ కాలనీలోని మెర్క్యూరీ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన నూతన సాంకేతిక విధానాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులతో ప్రొస్టేట్ సమస్య ఉన్న వారికి కొన్నాళ్ల పాటు శస్త్రచికిత్సను వాయిదా వేయవచ్చని, కానీ ఆ తర్వాత ఐదేళ్లకో, పదేళ్లకో మళ్లీ శస్త్రచికిత్స చేయాల్సి వచ్చినప్పుడు ఆశించిన మేరకు ఫలితాలు రావటం లేదన్నారు. అయితే ఈ చికిత్స తీసుకున్న తర్వాత కొన్ని రోజులపాటు కాఫీ, చాక్లెట్లు, మద్యం జోలికి వెళ్లకపోవడం మంచిదని డాక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్, డాక్టర్ విజయ్ కుమార్ శర్మ మద్దూరి, ఏఐఎన్‌యూ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ గూడూరు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి



వెంగళరావునగర్: జోనల్ పరిధిలోని అన్ని రోడ్లకు మరమ్మతులు చేయడం, శానిటేషన్‌ను మరింత మెరుగుపరిచే ప్రక్రియలో జీహెచ్‌ఎంసీ ముందుకు పోతుందని శేరిలింగంపల్లి సెంట్రల్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ ప్రధాన రహదారి, సర్కిల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, కాలనీ నేతలు, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మధురానగర్‌కాలనీ జీ–బ్లాక్‌లో రోడ్డును విస్తరించి యూసుఫ్‌గూడకు రోడ్డు కలపాలని జీహెచ్‌ఎంసీ అధికారులతో జడ్సీ చర్చించారు. కాగా మధురానగర్ కాలనీవాసులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జీ–బ్లాకులో రోడ్డును విస్తరణ చేపడితే దాదాపు 20 గృహాల వరకు దెబ్బతినే అవకాశం ఉంటుందని, జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం పక్కనే ఉన్న రహదారిని వెడల్పు చేస్తూ యూసుఫ్‌గూడకు ప్రధాన రహదారికి కలపాలని సూచించారు. దీంతో దీనిని పరిశీలిస్తామని జడ్‌సీ తెలిపారు. అదేవిధంగా మధురానగర్‌కాలనీలో అతి తక్కువ స్థలంలో ఐదారు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా నాలాకు ఇరువైపులా రోడ్డు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు జడ్‌సీకి ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యలు విన్న జడ్‌సీ ఉపేందర్ రెడ్డి వాటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరలోనే సమస్య పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన పర్యటనలో పలు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు అధికంగా కనిపించడంతో శానిటేషన్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నారు. జోనల్ కమిషనర్ పర్యటనలో కార్పొరేటర్‌తో పాటుగా మధురానగర్ కాలనీ నేతలు సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా, ఈఈ రాజ్‌కుమార్, ఏఎంఓహెచ్ సాలోమన్, డీఈ రామచంద్రరాజు, ఏఈ అవినాష్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





మధురానగర్‌లో పర్యటిస్తున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

క్రీడా పోటీల్లో శ్రీనిధి స్కూల్ చిన్నారుల ప్రతిభ



మొదటి బహుమతి గెలుచుకున్న శ్రీనిధి స్కూల్ చిన్నారులు

వెంగళరావునగర్: రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో స్థానిక మధురానగర్‌కాలనీలోని శ్రీనిధి స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఆర్‌ఎస్‌ఎంఏ ఆధ్వర్యంలో గురువారం సనత్‌నగర్ గ్రౌండ్‌లో వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు అమీర్‌పేట, ఖైరతాబాద్ విద్యాశాఖ మండలాల పరిధిల్లోని 75 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ క్రీడల్లో భాగంగా టగ్ ఆఫ్ వార్ పోటీల్లో శ్రీనిధి స్కూల్ చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం స్కూల్‌లో వారికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ చైర్మన్, కరస్పాండెంట్ కొల్లి లక్ష్మణ్, టీచర్లు అనిత రావత్, సుమ, భవానీ, కల్పన, సీమ, కవిత, స్వరూప, యాదగిరి, నరేష్, శ్రీనివాస్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

కష్టపడి చదివితే మంచి అవకాశాలు

సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మహ్మద్ వలియుల్లా

బంజారాహిల్స్: కొవిడ్ తర్వాత ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు గతంతో పోలిస్తే మరింత మెరుగయ్యాయని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ అన్నారు. సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కళాశాల ఒరియేంటేషన్ కార్యక్రమంలో గురువారం కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఎప్పటికప్పుడు బయటి పరిస్థితులకు తగ్గట్టుగా సబ్జెక్టులను నేర్చుకుంటూ ముందుకు సాగాలని అప్పుడే మంచి విజయాలు సాధించేందుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. హైదరాబాద్‌లో ఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, సొసైటీ కోశాధికారి మీర్ అక్బర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీలో బొద్దింక



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం–3లోని టీవీ9 సమీపంలోని బిర్యానీవాలా రెస్టారెంట్ బిర్యానీలో బొద్దింక ప్రత్యక్షమైంది. బాధితుల వివరాల మేరకు... గురువారం మధ్యాహ్నం కొంతమంది స్నేహితులు బిర్యానీ ఆర్డర్ ఇచ్చి తింటున్న సమయంలో అందులో బొద్దింక కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన వారు నిర్వాహకులను ప్రశ్నించారు. ఈ క్రమంలో నిర్వాహకులకు వారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా బిర్యానీ వాలా యజమాని డయల్ 100కు ఫోన్ చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా, అదే సమయంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా అక్కడికి చేరుకొని బొద్దింక వచ్చిన బిర్యానీని సీజ్ చేసి శాంపిల్‌ను సేకరించారు. ఈ బొద్దింక ఎలా వచ్చిందనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. బిర్యానీవాలా హోటల్‌పై చర్యలకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఉపక్రమించారు.

సాక్షి
10
హైదరాబాద్, శుక్రవారం, 29 నవంబర్ 2024

సిటీ ప్లస్

పక్షుల కిలకిలల మధ్య తెల్లవారే రోజులు పోయాయి. చెవులు చిల్లులు పడే హారన్స్ మధ్య, టీవీలు, మొబైల్స్ మోతల మధ్య మరెన్నో రణగొణధ్వనుల మధ్య ఉదయిస్తున్నాం.. గందరగోళం మధ్య రోజులు గడిపేస్తున్నాం. అయితే కొందరు సిటిజనులు మాత్రం ఆ కిలకిలల అన్వేషణ కొనసాగిస్తున్నారు. విహంగాల వైవిధ్య భరిత విశేషాలను తిలకిస్తూ పులకిస్తున్నారు. శీతల గాలులతో పాటు కదిలివచ్చే వినువీధి వైవిధ్యాల కోసం బైనాక్యులర్స్ చేతబట్టి బయలుదేరుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



శాంటా మారియాలో
ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్

శేరిలింగంపల్లి: శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్ లెర్నింగ్ కార్యక్రమం ఆలోచింపజేసింది. ఇందులో హైదరాబాద్‌లోని కేంబ్రిడ్జ్ స్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఫెస్టివల్‌లో చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వర్క్‌షాప్, క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా రేసులు, జట్టు ఆటలు, తల్లిదండ్రులు–విద్యార్థుల సవాళ్లు ఆకట్టుకున్నాయి. ఈ తరహా కార్యక్రమాలు పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసి, టీమ్ వర్క్‌ను ప్రోత్సహిస్తాయని ప్రిన్సిపల్ హేమా సంజయ్ అన్నారు. ఈ ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్ లెర్నింగ్ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పలువురు తల్లిదండ్రులు కొనియాడారు.



మరోసారి పురాతన
కరెన్సీ ప్రదర్శన

చార్మినార్: పాతబస్తీలో ఇంటర్నేషనల్ కాయిన్స్ అండ్ కరెన్సీ నోట్స్ ఎగ్జిబిషన్‌ను మరోసారి ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయాన్ని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 23, 24, 25 తేదీల్లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలనుకునే వారి కోసం కొన్ని స్టాల్స్ సిద్ధంగా ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 85002 12306లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి జీఐవో ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నవంబర్ 29, 30, డిసెంబర్ 1 తేదీల్లో జీఐవో ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో మూడు రోజుల పాటు హైదరాబాద్ ఫెస్ట్, టాలెంటో 24 ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ బాధ్యులు నేహా గులాం, ఉజ్మా, అస్ఫియా ఆనమ్ గురువారం తెలిపారు. ఈ ఈవెంట్లలో అమ్మాయిల కోసం పలు రకాల పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు ఉంటాయని వివరించారు. ఈ ఈవెంట్లో విజ్ఞానాన్ని పెంపొందించే పలు రకాల కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పాశ్చాత్య సంస్కృతి దుష్ప్రభావాల నుండి చైతన్యం కల్పించి, నైతిక విలువల ప్రాముఖ్యతను వివరించే ప్రధాన ఉద్దేశంతో ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం స్త్రీలు, యువతులకు మాత్రమే ప్రవేశం ఉంటుందని వారు పేర్కొన్నారు.

హాస్పిటాలిటీ బ్రాండ్‌గా
ది లీలా

సాక్షి, సిటీబ్యూరో: దక్కన్ వైభవం, స్థానిక వారసత్వ చరిత్రను ఈ తరానికి అందించడంలో హైదరాబాద్ అద్భుత వేదికని పయనీర్ హాలిడే అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరెడ్డి తెలిపారు. నగరంలోని బంజారాహిల్స్ వేదికగా ప్రపంచంలోనే ప్రముఖ లగ్జరీ హాస్పిటాలిటీ బ్రాండ్‌గా స్థాపించిన 'ది లీలా' స్టార్ హోటల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన కీ ప్రజెంటేషన్ సెర్మనీలో ది లీలా సీఈఓ అనురాగ్ భట్నాగర్, దీప్తిరెడ్డి పాల్గొన్నారు. దక్కన్ వైభవానికి, నిజాం కాలంనాటి రాచరికపు సంస్కృతిని లీలా పునఃప్రారంభించిందని దీప్తిరెడ్డి కొనియాడారు. పాన్ ఇండియాలో తమ సేవలు కొనసాగుతున్నాయని, ఆగ్రాలో తాజ్ మహల్ సమీపంలోని లీలాను మించేలా ఇక్కడి హోటల్‌లో లగ్జరీ ఇంటీరియర్ డిజైన్ చేయించామన్నారు.





రాష్ట్రానికి, నగరానికి ఏడాది పొడవునా వలస పక్షుల రాకపోకలు ఉంటాయి. సమ్మర్‌లో కొద్దిగా మాత్రమే వస్తాయి. అయితే వర్షాకాలం నుంచి పెరుగుతూ.. వింటర్‌లో బాగా ఎక్కువగా 2, 3 రెట్లు ఎక్కువగా పక్షులు వలస వస్తాయి. ఒకప్పుడు ఇలాంటి వలస పక్షులకు నగరంలో చాలా స్పాట్స్ ఉన్నాయి. కానీ కాలక్రమంలో లేక్స్ కనుమరుగవుతుండడం వల్ల వీటికి ఆవాసాలు దొరకడం లేదు.

హైదరాబాద్ వైబ్స్

రేర్ బర్డ్స్.. నో వర్డ్స్..

వింటర్‌లో రాష్ట్రానికి విహంగాల జోరు

- నగరంలోని బర్డ్ వాచర్స్ హుషారు
- ఈ సీజన్‌లో అరుదైన పక్షుల వీక్షణకు ఛాన్స్
- రాష్ట్రంలో 430కిపైగా పక్షి వెరైటీల గుర్తింపు
- జనవరి నుంచి బర్డ్ అట్లాస్ పేరిట పక్షుల గుర్తింపు



వర్డియర్ ఫ్లై క్యాచర్



రెయిన్ క్వాయిల్



జాకొబిన్ కుకూ



బార్ హెడెడ్ గూస్



పెయింటెడ్ ఫ్రాంకొలిన్



చిరునామాలివే..

నగరం చుట్టు పక్కల పక్షుల వీక్షణకు వీలు కల్పించే ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఒకప్పుడు అమీన్‌పూర్‌లేక్, జనవాడ వైపు గండిపేట్‌లేక్, మోకిలా వంటి ప్రాంతాల్లో విపరీతంగా కనిపించేవి. ఇప్పుడు బాగా తగ్గిపోయాయి. ఇప్పటికీ కాలుష్య కాసారాలుగా మారిన లేక్స్‌లో కూడా పక్షులు కనిపిస్తున్నాయి. వాటిని కాలుష్యరహితంగా మారిస్తే మరింత బాగా పెరుగుతాయి. సంజీవయ్య పార్క్ దగ్గర కూడా బోలెడు పక్షులు, డక్స్ ఉంటాయి. నగరంలో ప్రస్తుతం పక్షులు చూడాలంటే కెబిఆర్ పార్క్, బొటానికల్ గార్డెన్స్, సంజీవయ్య పార్క్‌లలో చూడొచ్చు.

చుట్టుపక్కల చెరువుల్లో..

నగరం చుట్టుపక్కల అయితే.. అనంతగిరి హిల్స్ బెస్ట్. అక్కడకు వెళ్లినప్పుడల్లా ఒక్కోసారి ఒక్కో ఆశ్చర్యకరమైన పక్షి కనబడుతుందని పక్షి ప్రేమికులు అంటున్నారు. అదే కాక ఉస్మాన్‌సాగర్, కొడకంచి లేక్, కృష్ణారెడ్డి పేట్ చెరువు.. మంజీరా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ, పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ, నర్సాపూర్ రిజర్వ్ ఫారెస్ట్, సింగూర్ డ్యామ్ కూడా బర్డ్స్‌కి కేరాఫ్ అడ్రెస్‌గా చెప్పొచ్చు. ఇటీవల సిటీలోని కొన్ని గేటెడ్ కమ్యూనిటీల్లోని కాలనీ పార్క్స్‌లో కూడా బాగా పెరుగుతున్నాయి.

సీజన్ స్పెషల్స్ ఇవే..

వానాకాలం మన సమీపానికి వచ్చే పక్షుల్లో రెయిన్ క్వాయిల్, పెయింటెడ్ ఫ్రాంకొలిన్, జాకొబిన్ కుకూ (దీనినే మాన్‌సూన్ బర్డ్ అని కూడా పిలుస్తారు. ఇది రుతుపవనాల ప్రారంభ సమయంలో వస్తుంది) వంటివి ఉన్నాయి. ఇవి మంజీరాలేక్, యంకతల.. వంటి సరస్సులు, పచ్చని పచ్చిక బయళ్లలో కనిపిస్తాయి. ఇక శీతాకాలంలో వచ్చేవాటిలో వర్డియర్ ఫ్లై క్యాచర్, ఇండియన్ బ్లూ రాబిన్, బార్ హెడెడ్ గూస్ (ఇది సరస్సుల దగ్గర బాగా కనిపిస్తుంది. ప్రస్తుతం మంజీరా లేక్ దగ్గర దీనిని చూడొచ్చు. విదేశాల నుంచి హిమాలయాల మీదుగా ఈ పక్షి నగరానికి చేరుతుందట)

తొలిసారిగా బర్డ్స్ పై బుక్..

మనకి చాలా చోట్ల పక్షులు కనిపిస్తాయి. కానీ అవేంటో వాటి ప్రత్యేకతలేమిటో తెలీదు. ఈ నేపథ్యంలో కొన్ని కామన్ బర్డ్స్ తీసి ఒక గైడ్ లాగా ఇస్తే బాగుంటుందనీ, స్టూడెంట్స్‌కి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్స్ వాళ్లకి ఇస్తే ఉపయుక్తంగా ఉంటుందనే ఆలోచనతో తొలిసారిగా మన రాష్ట్రంలో పక్షుల వెరైటీలపై ఒక పుస్తకం రూపొందింది. రాష్ట్రంలో 430పైగా వెరైటీ పక్షులు ఉంటాయి. ఇందులో 252 రకాల పక్షుల ఫొటోలు, వాటి పేర్లు, విశేషాలు ఉంటాయి. రెగ్యులర్‌గా అనంతగిరికి ట్రెక్కింగ్‌కి వెళ్తుంటారు. అలాంటివారికి ఇవి ఇస్తే ఉపయుక్తం. ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలల విద్యార్థులకు లక్ష కాపీల వరకూ ఉచితంగా పంపిణీ చేయాలనే ఆలోచన చేస్తున్నారు.



ఇండియన్ బ్లూ రాబిన్

అమెరికా నేర్పిన అలవాటు..

గతంలో ఒకసారి అమెరికాలో కొంతకాలం ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో నేనున్న ప్రాంతానికి దగ్గరలో పెద్ద అడవి ఉండేది. అక్కడ రంగు రంగుల పక్షుల్ని కళ్లార్పకుండా చూడడం అలవాటైంది. ఇక్కడకు వచ్చాక సిటీలో పక్షులను అన్వేషిస్తూ.. సంజీవయ్య పార్క్‌కు తరచూ వెళ్లేవాడిని. ప్రస్తుతం విభిన్న ప్రాంతాలకు వెళ్లి పక్షుల్ని చూడడం ఒక నిత్యకృత్యం. ఈ అభిరుచితోనే హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ప్రారంభించాం. తాజాగా బర్డ్స్ మీద బుక్ లాంచ్ చేశాం. అంతేకాకుండా జనవరి నుంచి బర్డ్ అట్లాస్ పేరుతో వైవిధ్యభరిత కార్యక్రమం చేపడుతున్నాం. నగరం చుట్టుపక్కల విభిన్న ప్రాంతాల నుంచి దీనికి కంట్రిబ్యూట్ చేస్తున్నారు. ఏ పక్షి ఎప్పుడు ఎలా కనిపిస్తుంది? అనేది రికార్డ్ చేసి ఒక మ్యాప్ తయారు చేయాలని ఆలోచన. అయితే దీన్ని పూర్తి చేయడానికి కనీసం ఏడాది పడుతుంది.

– హరికృష్ణ, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్





6 నుంచి..
హైలైఫ్ ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: అగ్రగామి ఆభరణాల బ్రాండ్స్, డిజైనర్స్ పాల్గొనే హైలైఫ్ జ్యూయల్స్ ఎక్స్‌పో నగరంలో జరగనుంది. బంజారాహిల్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో నిర్వాహక సంస్థ ప్రతినిధులు ఈ విషయాన్ని తెలిపారు. దాదాపు 100కు పైగా ఆభరణాల బ్రాండ్స్ అందుబాటులో ఉండే ఈ ప్రదర్శన మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉన్న నోవోటెల్ హోటల్ వేదికగా డిసెంబరు 6న ప్రారంభమై 3 రోజులు కొనసాగుతుందని వివరించారు. ఈ సందర్భంగా జరిగిన పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో ఔత్సాహిక సినీతారలు నిత్యాశెట్టి, ప్రీతి సుందర్, శ్రీ ప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ ఆభరణాలను ప్రదర్శించారు.

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బైకర్ క్లబ్స్ ఆసక్తిగా ఎదురు చూసే వార్షిక ఈవెంట్ ఇండియా బైక్ వీక్ డిసెంబర్ 6న ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ గల్ఫ్ సింట్రాక్ ప్రతినిధులు తెలిపారు. రైడ్ , పార్టీ, రేస్..అంటూ సిటీ బైకర్స్‌కు ఈ ఈవెంట్ పిలుపునిస్తోందని, ఈ కార్యక్రమంలో భాగంగా దేశ విదేశాలకు చెందిన రైడర్స్, క్లబ్స్ పాల్గొంటాయని వివరించారు. గోవాలోని వెగాటోర్‌లో వచ్చే నెల 6 నుంచి 2 రోజుల పాటు ఈ ఈవెంట్ ఉంటుందన్నారు. హార్లీ డేవిడ్‌సన్ వంటి టాప్ బ్రాండెడ్ బైక్స్ ఈ ఈవెంట్‌లో సందడి చేయనున్నాయని, విభిన్న రకాల రేసింగ్ పోటీలు, రూ.12లక్షల వరకూ బహుమతులూ అందించనున్నామని తెలిపారు.

గోవాలో 6 నుంచి..
ఇండియా బైక్ వీక్



లూలూ బ్యూటీ ఫెస్ట్

మిస్ ఇండియా తెలంగాణ- 2024 ప్రకృతి కంభం హాజరు

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని లూలూ మాల్‌లో గురువారం 'లూలూ బ్యూటీ ఫెస్ట్' కార్యక్రమాన్ని ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ– 2024 ప్రకృతి కంభం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అందానికి మరింత అందం తీసుకొచ్చే ప్రొడక్ట్స్ భారీగా తగ్గించి ఇవ్వడం సంతోషమన్నారు. మాల్ తెలంగాణ రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్ మాట్లాడుతూ 3 నుంచి 7 వరకూ లూలూ బ్యూటీ ఫెస్ట్–2024 జరుగుతుందని, 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు వారు ఈ ఫెస్ట్‌లో పాల్గొనవచ్చని అన్నారు. 7న గ్రాండ్ ఫినాలే ఉంటుందన్నారు. 8 వరకూ బ్యూటీ ప్రొడక్ట్స్‌పై 50 శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు.



డిస్కంల దివాలా బాట!

- తీవ్ర ఆర్థిక నష్టాల్లో దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు
- 2022–23 నాటికే రూ.6,76,681 కోట్లకు చేరిన నష్టాలు
- తెలంగాణలోని రెండు డిస్కంల నష్టాలు రూ.60,922 కోట్లు
- నష్టాల్లో దేశంలోనే ఐదో స్థానంలో తెలంగాణ డిస్కంలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఏటేటా నష్టాల్లో కూరుకుపోతున్నాయి. అత్యధిక నష్టాలున్న డిస్కంలు కలిగిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ దేశంలోనే ఐదో స్థానంలో ఉన్నది. దేశంలో ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని డిస్కంలకు కలిపి 2015–16లో రూ.3,74,099 కోట్ల నష్టాలు ఉండగా.. 2022–23 నాటికి అవి రూ.6,76,681 కోట్లకు పెరిగాయి. ఇదే కాలంలో తెలంగాణ డిస్కంల నష్టాలు రూ.16,520 కోట్ల నుంచి రూ.60,922 కోట్లకు ఎగబాకాయి. రాజ్యసభలో ఎంపీ సంజయ్‌కుమార్ ఝా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలు వెల్లడించింది. ప్రభుత్వరంగ డిస్కంల నష్టాల్లో రూ.1,62,507 కోట్లతో తమిళనాడు దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. రూ.92,070 కోట్ల నష్టాలతో రాజస్తాన్, రూ.91,632 కోట్ల నష్టాలతో ఉత్తరప్రదేశ్, రూ.64,843 కోట్ల నష్టాలతో మధ్యప్రదేశ్ వరుసగా 2,3,4 స్థానాల్లో ఉన్నాయి.

లాభాల్లో ప్రైవేటు.. నష్టాల్లో సర్కారీ సంస్థలు

దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయి దివాలా అంచున నిలువగా, ప్రైవేటు రంగ డిస్కంలు మాత్రం లాభాల్లో దూసుకుపోతున్నాయి. 2015–16 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు రంగ డిస్కంల లాభాలు రూ.12,146 కోట్లు ఉండగా.. 2022–23 నాటికి రూ.23,116 కోట్లకు పెరిగాయి. ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 12 ప్రైవేటు డిస్కంలు ఉండగా, అవన్నీ లాభాల్లోనే నడుస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో 42 డిస్కంలు ఉండగా.. గుజరాత్‌లోని మూడు, కర్ణాటక, పశ్చిమబెంగాల్‌లో ఒక్కో డిస్కం కలిపి మొత్తం ఐదు మాత్రమే లాభాల్లో ఉన్నాయి. మిగిలిన 37 ప్రభుత్వ రంగ డిస్కంలు నష్టాల్లో కూరుకుపోయాయి.

మోయలేని అప్పుల్లో దక్షిణ తెలంగాణ డిస్కం


తెలంగాణలో రెండు ప్రభుత్వ రంగ డిస్కంలున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) నష్టాలు 2015–16లో రూ.10,625 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.42,330 కోట్లకు చేరాయి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) నష్టాలు ఇదే కాలంలో రూ.5,895 కోట్ల నుంచి 2022–23 నాటికి రూ.18,592 కోట్లకు పెరిగాయి.

భారీగా పెరిగిన అప్పులు

దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ డిస్కంల అప్పులు 2015–16లో రూ.4,08,941 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.6,61,263 కోట్లకు పెరిగాయి. ఇదేకాలంలో తెలంగాణ డిస్కంల అప్పుల రూ.13,944 కోట్ల నుంచి రూ.35,883 కోట్లకు పెరిగాయి.

దేశంలోని డిస్కంల పరిస్థితి

- మొత్తం ప్రభుత్వరంగ డిస్కంలు 42
- నష్టాల్లో ఉన్న ప్రభుత్వరంగ డిస్కంలు 37
- 2022–23 నాటికి సర్కారు డిస్కంల నష్టాలు రూ.6,76,681
- లాభాల్లో ఉన్నవి 5
- దేశంలో మొత్తం ప్రైవేటు డిస్కంలు 12
- లాభాల్లో ఉన్న ప్రైవేటు డిస్కంలు 12



కలెక్టర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు.. క్షమాపణ చెప్పాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించాయి. సిరిసిల్ల కలెక్టర్‌ను 'సన్నాసి.. కాంగ్రెస్ కార్యకర్త'.. అంటూ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఒక సభలో వ్యాఖ్యానించడం తెలిసిందే. పాలనా విధానాలు, రాజ్యాంగ నిబద్ధత ఆధారంగా సివిల్ సర్వెంట్లు నిర్వర్తించే బాధ్యతలకు విరుద్ధంగా కేటీఆర్ వ్యాఖ్యలున్నాయని వారు మండిపడ్డారు. ప్రజాసేవలో అధికారి విధులను నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా, ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్వహించాల్సి ఉంటుందని సంఘాలు గుర్తు చేశాయి. కానీ ఊహించని ఇటువంటి నిరాధార ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయని తెలిపాయి. సిరిసిల్ల కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ పూర్తి మద్దతు తెలియజేస్తుందని ఐపీఎస్ అధికారుల సంఘం పేర్కొంది. సివిల్ సర్వీసు అధికారుల గౌరవం, స్వతంత్రత, నిష్పక్షపాతత్వాన్ని కాపాడేందుకు అండగా నిలబడతామని స్పష్టం చేసింది.

సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న సీఎం

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వివరాలను నమోదు చేయించుకున్నారు. గురువారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–44లోని సీఎం నివాసానికి వెళ్లిన ఎన్యుమరేటర్లు ఆయన వివరాలను నమోదు చేశారు. వారితో పాటు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సర్వే పురోగతిపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థుల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే వేటే..

▶ మొదటి పేజీ తరువాయి

ఏమాత్రం ఏమరుపాటుగా ఉండవద్దని స్పష్టం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలినా సదరు అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

తరచూ తనిఖీలు చేయండి

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందించే విషయంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై ఇదివరకే పలుమార్లు సమీక్షించానని గుర్తు చేశారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. ఈ మేరకు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరి యత్నాలు

విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని.. పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము ఇలా సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నా.. కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ప్రకటించారు. వసతి గృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా వదంతులు సృష్టిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఆహార నాణ్యతపై టాస్క్‌ఫోర్స్!

మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థలు, హాస్టళ్లు, ఆస్పత్రుల్లో పంపిణీ చేస్తున్న ఆహారం నాణ్యత పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మొదలు... సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు, వసతిగృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాల యాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభు త్వ వైద్య కళాశాలల్లో అందించే ఆహారం నాణ్య తపై నిఘా, పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ కమి టీని ఏర్పాటు చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖతోపాటు గిరిజన, బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలు, వైద్యారోగ్య శాఖ పరిధి లోకి వచ్చే అన్ని విద్యా సంస్థల్లో అందించే ఆహా రం నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను ఈ కమి టీకి అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో సభ్యులుగా ఫుడ్ సేఫ్టీ కమిషనర్ లేదా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సంబంధిత విద్యా సంస్థ ఉన్నతాధికారి/ అదనపు సంచాలకుడు, విద్యా సంస్థ జిల్లా స్థాయి అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ/ డీటీడబ్ల్యూఓ/డీబీసీడబ్ల్యూఓ/డీఈఓ) తదితరులుంటారు. ఈ కమిటీ నిర్దేశించిన విద్యా సంస్థలను సందర్శించి ఆహార భద్రత చర్యలను పరి శీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా సంస్థలో లోటుపాట్లను గుర్తిస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు బాధ్యులపై చర్యల కోసం సిఫార్సు చేయాలని సూచించింది.

విద్యా సంస్థల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు, పర్యవేక్షక అధికారి

టాస్క్‌ఫోర్స్ మాత్రమేకాకుండా విద్యా సంస్థల స్థాయిలో ఫుడ్ సేఫ్టీ కమిటీలను, పర్యవేక్షక అధికారిని సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటికి సంబంధించిన మార్గదర్శ కాలను జారీ చేసింది. విద్యా సంస్థల్లో మెరుగైన, బలవర్థకమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. కలుషిత ఆహారంతో కలిగే అనా రోగ్య సమస్యలు, తదుపరి పరిణామాల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ కమిటీలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

- ➤ ఫుడ్ సేఫ్టీ కమిటీలో విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయుడు/ ప్రిన్సిపల్/ వార్డెన్‌తోపాటు మరో ఇద్దరు సిబ్బంది సభ్యులుగా ఉంటారు.
- ➤ ఈ కమిటీ సభ్యులు ప్రతిరోజు భోజనం తయారు చేసే ముందు స్టోర్ రూమ్, వంట గదిని తనిఖీ చేయాలి. తర్వాత వంటగది నిబంధనలకు అనుగుణంగా నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నట్టు నిర్ధారించాలి.
- ➤ వంట వండిన తర్వాత ఆహార నాణ్యతను కమిటీ సభ్యులు రుచి చూసి పరిశీలించిన తర్వాతే విద్యార్థు లకు అందించాలి. ప్రతిరోజు ఈ బాధ్యతలను విధిగా పూర్తి చేయాలి.
- ➤ త్వరలో నోడల్ డిపార్టుమెంట్ యాప్‌ను తయారు చేస్తుంది. అప్పటి నుంచి తనిఖీలకు సంబంధించిన ఫోటోలను, ఇతర సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- ➤ ఇక జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి విద్యాసంస్థకు ప్రత్యేకంగా ఒక పర్యవేక్షక అధికారికి నియమిస్తారు. ఈ పర్యవేక్షక అధికారి ప్రతిరోజు భోజనం వండే ముందు, తర్వాత తనిఖీ చేస్తారు. అక్కడి పరిస్థితిని చిత్రాలు తీసి జిల్లా కలెక్టర్/ సంబంధిత ఉన్నతాధికారికి సమర్పిస్తారు.
- ➤ వీటన్నింటికి సంబంధించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.



విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ మల్హర్ మండలం మల్లారం కస్తూర్బా గాంధీ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి అల్పాహారం, భోజన సదుపాయాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఆహార నాణ్యత పరిశీలనకు ప్రతీ శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవోలు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వైద్యారోగ్య శాఖకు సీఎం అధిక ప్రాధాన్యం

వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది. భారీగా నిధుల కేటాయింపుతో పాటు ఆరోగ్యశాఖలో నియామకాలపైనా దృష్టి సారించి తదనుగుణంగా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొంది. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రెండింతలు చేసిన ముఖ్యమంత్రి.. తొలి ఏడాదిలోనే వైద్యారోగ్య శాఖలో నియామకాలు జరపడంతో పాటు నూతన వైద్య, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల మంజూరు, సీట్లు, పడకల పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వివరించింది. దేశంలో తొలిసారిగా ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల జారీకి పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన విషయాన్ని ప్రభుత్వం వివరించింది. ఈ కార్డులతో రాష్ట్ర హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, రోగి వివరాలన్నీ హెల్త్ ప్రొఫైల్‌లో పొందుపరచనున్నట్లు వెల్లడించింది.

ఏడాది కాలంలో వైద్యారోగ్యశాఖలో చేపట్టిన కార్యక్రమాల వివరాలు సాక్షి ప్లస్ (ఈ పేపర్)లో

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్ష ఫీజు గడువును మరోసారి పెంచారు. విద్యార్థులు డిసెంబర్ 5వ తేదీ వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్యపు రుసుముతో డిసెంబర్ 12 వరకు, రూ.200తో 19 వరకు, రూ.500తో డిసెంబర్ 30 వరకూ ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

నగర వార్తలు

26 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



నిరుద్యోగుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

చైతన్యపురి: వచ్చే డీఎస్సీలో 26 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన నిరుద్యోగుల సభలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు టీచర్ పోస్టుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ఏ పాఠశాలకు వెళ్లినా టీచర్ల కొరత ఉందన్నారు. ఎయిడెడ్ పాఠశాలలో 6 వేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నా వాటి భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వటం లేదని, అవి మూసివేసే దశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనారిటీ, గురుకుల పాఠశాలల్లో ఆరువేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యపై ప్రజలకు విశ్వాసం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘాల అధ్యక్షుడు రామకృష్ణ, ప్రొఫెసర్ మధు, లక్ష్మినారాయణ, రాజేందర్, అనంతయ్య, రవి యాదవ్, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లుగా విద్యార్థుల ఆవిష్కరణలు

సాక్షి, సిటీబ్యూరో: చిరెక్ విద్యార్థులు ప్రతిపాదించిన బిజినెస్ స్టార్టప్‌లను ప్రముఖ ఇండస్ట్రియల్ ఇన్వెస్టర్లతో మెంటార్ చేయనున్నట్లు ఆ సంస్థ స్ట్రాటజిక్ ఇన్షియేటివ్ హెడ్ అనీషా తెలిపారు. గత 6 వారాలుగా తమ విద్యార్థులు ఐఎస్‌బీ బృందంతో నిర్వహిస్తున్న ప్రత్యేక సెషన్లలో నిమగ్నమై ఉన్నారని అన్నారు. పరిశోధకులు, విద్యావేత్తలతో పలు అంశాలపైన చర్చిస్తూ స్టార్టప్‌లను ప్రతిపాదించారని తెలిపారు. ఇందులో భాగంగా 26 అద్భుతమైన వ్యాపారాల నిర్వహణకు రూపకల్పన చేశారని, ఇందులో కొన్ని ప్రముఖ ఇన్వెస్టర్లకు చేరువయ్యాయని వివరించారు. ఈ స్టూడెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌లో చిరెక్ ఆధ్వర్యంలో 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 26 మంది విద్యార్థులు వారి సృజనాత్మక ఆవిష్కరణలను ప్రదర్శించారని అన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఆవిష్కరణలను ప్రదర్శించిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు.

రాజ్యాధికార సాధనే లక్ష్యం

బీసీఎఫ్ ఆవిర్భావ సభలో వక్తలు

లక్డీకాపూల్: దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ (బీసీఎఫ్) ఆవిర్భావ సభలో వక్తలు అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జ్యోతిబాపూలే వర్ధంతిని పురస్కరించుకొని బీసీఎఫ్ ఆవిర్భావ సభను ఏర్పాటు చేశారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీనేత, నటుడు జైహింద్ గౌడ్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన బీసీ నాయకులు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయినా బీసీలు పాలితులుగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిట్టల భూమేష్, ప్రధాన కార్యదర్శిగా మహతి రమేష్ నాయి, కార్యదర్శిగా ప్రశాంతి యాదవ్, మహిళా అధ్యక్షురాలుగా సీతా మహాలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలిగా కొండ లతాబాయి, ప్రధాన కార్యదర్శిగా అచ్చమ్మ ఎన్నికయ్యారు. అనంతరం వారికి నియామకపత్రాలు అందజేశారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదికాలం పూర్తి అవుతున్న సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ప్రజాపాలన సంబరాలు నిర్వహించనుంది. ఈ మేరకు గురువారం ప్రిన్సిపాల్ సెక్రెటరీ దానకిషోర్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ కమిషనర్లు సర్ఫరాజ్, ఇలంబర్తి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్, డీసీపీ ఆకాంక్షయాదవ్, ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్ స్టేడియాన్ని పరిశీలించారు. – కవాడిగూడ

జర్నలిస్టు శివారెడ్డిపై కేసును ఉపసంహరించుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల రాష్ట్రంలో జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం భావప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధానకార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాజాగా సిగ్నల్ టీవీ సీనియర్ జర్నలిస్టు శివారెడ్డిపై ములుగు జిల్లా పస్రా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని కోరారు. శివారెడ్డిపై కేసును ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.రమణకుమార్ డిమాండ్ చేశారు.

బకాయిలు చెల్లించకుంటే నల్లా కనెక్షన్ కట్

సాక్షి,సిటీబ్యూరో: దీర్ఘకాలికంగా బిల్లుల బకాయిలు చెల్లించకుంటే నల్లా కనెక్షన్లు కట్ చేస్తామని జలమండలి ప్రకటించింది. ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్–2024 (ఓటీఎస్) పథకం కింది చెల్లించి ఆలస్య రుసుము, వడ్డీ నుంచి మినహాయింపు పొందాలని వినియోగదారులకు సూచించింది. ఓటీఎస్ గడువు ఈ నెల 30వ తేదీతో ముగిస్తుందని, మరోసారి పొడిగించే అవకాశాలు లేవని స్పష్టం చేసింది. గడువు పూర్తయిన తర్వాత చెల్లిస్తే, పెండింగ్ బిల్లుల మీద వడ్డీతోపాటు పెనాల్టీ కట్టాల్సి వస్తుందని పేర్కొంది. గడువు ముగిసిన అనంతరం పెండింగ్ బిల్లుల వినియోగదారులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించింది.

'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రచారానికి మద్దతు

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'బాల్ వివాహ ముక్త్ భారత్'ప్రచారానికి మద్దతునిచ్చేందుకు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్‌సీ) అలయన్స్ మద్దతు ప్రకటించింది. 25 జిల్లాల్లోని 1,750 గ్రామాల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు, కొవ్వొత్తుల ప్రదర్శన, రోడ్‌షోలు నిర్వహించి బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతిజ్ఞ చేసినట్లు జేఆర్‌సీ వ్యవస్థాపకుడు భువన్ రిభు తెలిపారు.

30న పాఠశాలల బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఈ నెల 30న బంద్ చేయనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడుఆర్ఎల్ మూర్తి గురువారం తెలిపారు. గురుకుల హాస్టల్స్, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్, విద్యార్థుల మరణాలు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బంద్ చేసి విజయవంతం చేయాలని కోరారు.

సోనూసూద్‌కు 'సంకల్ప్ కిరణ్' పురస్కారం



నటుడు సోనూసూద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న సుచిరిండియా అధినేత కిరణ్

నాంపల్లి: సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంకల్ప్ దివస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. గురువారంరాత్రి నాంపల్లిలోని తెలుగు లలిత కళాతోరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సోనూసూద్‌కు ఫౌండేషన్ అధినేత సుచిరిండియా 'సంకల్ప్ కిరణ్' పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుచిరిండియా అధినేత కిరణ్ మాట్లాడుతూ తాము రెండు దశాబ్దాలుగా సామాజికవేత్తలను, మానవతావాదులను గుర్తించి సత్కరిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో వేలాదిమంది నిరాశ్రయులకు సోనూసూద్ అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అంతటి విపత్తులో సోనూసూద్‌ని చూసి ఎంతోమంది స్ఫూర్తి పొంది సేవలు అందించారని గుర్తు చేశారు. కరోనా తర్వాత కూడా ఆయన తన ఫౌండేషన్‌ల తరఫున ఎంతోమంది పేదలకు, విద్యార్థులకు, మహిళలకు అండగా నిలిచారని అన్నారు. సోనూసూద్ మాట్లాడుతూ పంజాబ్ నుంచి వచ్చిన తనను ఆంధ్ర, తెలంగాణ ప్రజలు ఎక్కువగా ప్రేమించారని, తనకు తెలుగు వారంటే చాలా అభిమానమని అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ బధిర పాఠశాలలకు చెందిన ప్రత్యేక బాలలు హాజరై సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో భారత్–బల్గేరియా రాయబారి నికోలయ్ యాంకోవ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బిర్యానీని మించిన చరిత్ర

నాంపల్లి: హైదరాబాద్ అంటే కేవలం బిర్యానీ కాదని, నగరం వెనుక ఎంతో ఘనమైన చరిత్ర దాగి ఉందని 'బియాండ్ బిర్యానీ ది మేకింగ్ ఆఫ్ ఎ గ్లోబలైజ్డ్ హైదరాబాద్'పుస్తక రచయిత డాక్టర్ దినేస్ సి.శర్మ అన్నారు. గురువారం రెడ్‌హిల్స్ ఎఫ్‌టీసీసీఐలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ చరిత్రపై, ప్రధానంగా మూసీనదీ ప్రాశస్త్యం గురించి సుదీర్ఘ విశ్లేషణ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు వివాదంపై ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ 1908వ సంవత్సరంలో హైదరాబాద్‌ను వరదలు ముంచెత్తాయని, అప్పుడు ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇదే సందర్భంలో ప్రముఖ ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1908లో మూసీ రివర్ ఫ్రంట్ కార్యకలాపాలను ప్రతిపాదించారని వివరించారు. నాటి వరదల నుంచి నేటి ఐటీ విప్లవం వరకు హైదరాబాద్ చరిత్రలో ఎన్నో మైలురాళ్లు దాగి ఉన్నాయని అన్నారు. 1917లో ఏర్పడిన ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ సంస్థ తన చరిత్రను భద్రపరుచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 107 ఏళ్ల చరిత్రను రాసి భవిష్యత్ తరాల కోసం భద్రపరచాలని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్‌ను కోరారు. గతం లేకుండా ఉనికి లేదని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్యతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ సి.శర్మను సత్కరించారు.

అపోలో హాస్పిటల్స్ అరుదైన రికార్డు

- 24 రోజుల్లో 25 క్లిష్టమైన స్లీప్ డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్ర చికిత్సలు
- ఒకేరోజు రెండు శస్త్రచికిత్సలు.. 24 గంటల్లో డిశ్చార్జి

బంజారాహిల్స్: అపోలో హాస్పిటల్స్ అరుదైన రికార్డు సృష్టించింది. 24 రోజుల్లో 25 క్లిష్టమైన స్లీప్ డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్సలు చేసింది. ఈ క్రమంలో ఒకేరోజు రెండు శస్త్రచికిత్సలు కూడా చేసింది. ఇది ప్రపంచంలోనే అరుదైన ఘనతగా చెప్పవచ్చు. పేషెంట్లు 24 గంటల్లో డిశ్చార్జి కావడం విశేషం. జూబ్లీహిల్స్‌లోని అపోలో మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ గింజుపల్లి ధనుంజయరావు వివరాలు వెల్లడించారు. మూమెంట్ డిజార్డర్స్ వంటి పార్కిన్సన్స్ వ్యాధి, ఎసెన్షియల్ ట్రెమర్స్, డిస్టోనియా లాంటి వ్యాధులు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. పార్కిన్సన్స్ వ్యాధితో మనదేశంలో 10 లక్షలకుపైగా మంది ఇబ్బంది పడుతున్నారని, ఇది భారతదేశాన్ని న్యూరాలజికల్ వ్యాధుల ప్రధాన కేంద్రంగా మారుస్తోందని పేర్కొన్నారు. దీనిని నివారించేందుకు అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ ఫాస్ట్ ట్రాక్ డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్) శస్త్రచికిత్సను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో ప్రత్యేకమైన అస్లీప్ డీబీఎస్ శస్త్రచికిత్స అందుబాటులో ఉందన్నారు. అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ రమేష్ ప్రసాద్, నారాయణ అనే పేషెంట్లు ఈ శస్త్రచికిత్స ద్వారా తమ జీవితాలను తిరిగి గడిపే అవకాశాన్ని పొందారన్నారు. వరల్డ్ మూమెంట్ డిజార్డర్ డేను నవంబర్ 29న జరుపుతారన్నారు. కార్యక్రమంలో అపోలో హాస్పటల్స్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, న్యూరో ఇంటెన్సివిస్ట్ డాక్టర్ సుబ్బారెడ్డి, తెలంగాణ రీజియన్ సీఈవో తేజస్వీరావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- ❖ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- ❖ మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం ఉదయం 10.30నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శనకు అందుబాటులో ఉంటుంది.
- ❖ గచ్చిబౌలిలోని ఎస్సీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఇంజినీరింగ్, సాంకేతికత రంగంలో నూతన ఆవిష్కరణల ఆవశ్యకత అంశంపై జాతీయ సదస్సు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఆకట్టుకున్న 'అన్నదాత'

సుందరయ్య విజ్ఞానకేంద్రం: భారతదేశంలో రైతులేనిదే ఎవరి జీవితం లేదని, కానీ వర్తమానంలో రైతులు అనేక అవస్థలు పడుతున్నారని ప్రముఖ రచయిత, మంజీరా రచయితల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రం(ఎస్వీకే)లో జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా త్రైలోక్య ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సిధారెడ్డి రచించిన అన్నదాత నృత్యరూపకం ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ నృత్యరూపకానికి ఇందిరా పరాశ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా సిద్ధారెడ్డి మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో రైతులు మార్కెట్‌లో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సమస్యలను నృత్యరూపకంలో తీసుకువచ్చానని చెప్పారు. రైతుచట్టాలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపాల్ కె.సునందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ప్రదర్శించిన అన్నదాత నృత్యరూపకంలోని ఓ సన్నివేశం


यद्यदाचरति श्रेष्ठस्तत्तदेवेतरो जनः।
स यत्प्रमाणं कुरुते लोकस्तदनुवर्तते॥
भगवद्गीता 3-21
Government of Haryana
International
GITA
Mahotsav
2024
28 November - 15 December
Kurukshetra, Haryana
Main Programme
Venue - Purushottampura Baag, Kurukshetra
Time - 6:30 pm
Date | Programme | Presentation
5 December | Choreography | By Artists from Tanzania and Haryana
7 December | Play 'Humare Ram' | Sh. Ashutosh Rana and Team
9 December | Sand art based on Mahabharata | Smt. Manisha
9 December | Kavi Sammelan | By Dr. Kumar Vishwas and Other Poets
11 December | Play 'Draupadi' based on Mahabharata | Smt. Meenakshi Sheshadri and Team
www.internationalgitamahotsav.in
www.48koskurukshetra.com
@igmkkr
InternationalGitaMahotsav
"सभी देशवासियों को गीता जयंती की अनंत शुभकामनाएं।
श्रीमद्भगवद्गीता सदियों से मानवता का मार्गदर्शन करती आई है।
अध्यात्म और जीवन-दर्शन से जुड़ा यह महान ग्रंथ हर युग
में पथ प्रदर्शक बना रहेगा।"
- नरेन्द्र मोदी
Information, Public Relations & Languages Department, Haryana
www.prharyana.gov.in
Follow us on
@dipharyana

క్యాన్సర్‌పై పోరాటం


నల్లూరి నిర్మల

**నేను మూడుసార్లు క్యాన్సర్ బారిన పడ్డాను.
2003లో బ్రెస్ట్ క్యాన్సర్.
2022లో బ్రెయిన్ క్యాన్సర్
2024లో మళ్లీ బ్రెయిన్ క్యాన్సర్.
నా వయసు 70 ఏళ్లు.
క్యాన్సర్‌పై గెలుస్తూనే ఉన్నాను.
యోగా, ధ్యానం మనలోని శక్తులను
బయటకు తీసి స్థిరంగా ఉంచుతాయి.
ధ్యానం నాకు ఆయుధంగా పని చేసింది.
క్యాన్సర్ అనగానే కంగారు పడతారు.
చికిత్స తీసుకుంటూ పోరాడొచ్చు.. గెలవొచ్చు.
క్యాన్సర్ వచ్చిన వారి వద్దకు వెళ్లి ఆ విషయమే చెప్పి
కౌన్సెలింగ్ చేస్తుంటా' అంటున్న
హైదరాబాద్‌కు చెందిన నల్లూరి నిర్మల పరిచయం.**

దండెత్తిన క్యాన్సర్‌పై ధ్యానమే సైన్యంగా...

'యోగా మన శరీరానికి ఉండే శక్తుల్ని వెలికి తీస్తే ధ్యానం మన మనసుని నిశ్చలం చేస్తుంది. క్యాన్సర్ వంటి జబ్బులను ఎదుర్కొనడానికి శరీర బలం ఎంత అవసరమో అంతకంటే ఎక్కువగా మానసిక బలం అవసరం. క్యాన్సర్ అనగానే చాలామంది ఆందోళన చెందిన మనసును తద్వారా శరీరాన్ని బలహీన పరుచుకుంటారు. అప్పుడు వైద్యం అనుకున్నంత సమర్థంగా పనిచేయదు. అందుకే నేను నా జీవితంలో క్యాన్సర్‌ను ఎదుర్కొనడానికి యోగా, ధ్యానాలను ఆశ్రయించాను. చికిత్స సమయంలో శరీరం బలహీనంగా ఉంటుంది కనుక అన్నిసార్లు యోగా చేయలేము. కాని ధ్యానం చేయవచ్చు. నేను ధ్యానం వల్ల చాలా మటుకు అలజడిని దూరం చేసుకున్నాను. అందుకే పల్లెల్లో స్త్రీలకు అప్పుడప్పుడు యోగా, ధ్యానం గురించి ప్రచారం చేశాను. ఇక ఇప్పుడు చేస్తున్నదేమిటంటే క్యాన్సర్ బారిన పడిన వాళ్లను కలిసి వారి ఆందోళన దూరం చేయడం. నన్ను వారికి చూపించి నేను ఎదుర్కొన్నానంటే మీరూ ఎదుర్కొనగలరని ధైర్యం చెప్పడం. యోగా, ధ్యానాలను ఎలా చికిత్సలో భాగం చేసుకోవాలో సూచించడం' అన్నారు 70 ఏళ్ల నల్లూరి నిర్మల. ఆమెను చూసినా, ఆమెతో మాట్లాడినా తీవ్ర అనారోగ్యాలలో ఉన్న వారు కచ్చితంగా ధైర్యం తెచ్చుకోగలరని అనిపిస్తుంది. ఆమె అంత ప్రశాంతంగా, దిటవుగా కనిపిస్తారు.

చిన్నప్పటి నుంచి సవాళ్లే

నల్లూరి నిర్మలది ప్రకాశం జిల్లా. ఆమె తండ్రి నల్లూరి అంజయ్య ప్రజల మనిషిగా గుర్తింపు పొందారు. వీరిది కమ్యూనిస్టు కుటుంబం. ఆడపిల్లలకు చదువు ముఖ్యమని తమ గ్రామంలోనే ఒక ప్రైవేటు పాఠశాల స్థాపించాడాయన. అలా నిర్మల చదువుకొని జీవిత బీమా సంస్థలో, తర్వాత కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో, ఆ తర్వాత కోటీలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్టెనోగ్రాఫర్‌గా పని చేశారు. 1977 నుంచి 2014 వరకు దాదాపు 37ఏళ్ళు అదే బ్యాంకులో పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. అయితే నిర్మల చిన్నప్పటి నుంచి ఆరోగ్య పరమైన సవాళ్లను ఎదుర్కొన్నారు. వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక గర్భసంచి తీసేయాల్సి వచ్చింది. ఆ తర్వాత 2003లో బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడ్డారు. 'ఆ సమయంలో నా భర్త వ్యాపార పరమైన నష్టాలు ఎదుర్కొంటున్నారు. మరో వైపు నా అనారోగ్యం. అయినా సరే ఆ ఒత్తిడిని, ఈ ఒత్తిడిని ఎదుర్కొని బ్రెస్ట్ క్యాన్సర్‌ని జయించాను' అని చెప్పారు నిర్మల.

మరో రెండు సార్లు దాడి

క్యాన్సర్‌ను జయించానని భావించిన నిర్మలను మరలా ఆ జబ్బు వెంటాడింది. 2022 లో బ్రెయిన్ క్యాన్సర్ నిర్మల శరీరంలోకి ప్రవేశించింది. మొదటి సారి తట్టుకున్నంతగా నిర్మల గారి శరీరం రెండవసారి తట్టుకోలేకపోయింది. అయినా తన మానసిక శక్తితో దాన్ని ఎలా అయినా ఓడించాలన్న సంకల్పంతో క్యాన్సర్‌ను తోక ముడుచుకునేలా చేశారామె. కాని మూడవసారి 2024లో మరలా బ్రెయిన్ క్యాన్సర్ తిరగబెట్టింది. ఇప్పుడు 70 ఏళ్ళ వయసులో కూడా నిర్మల దానితో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ పోరాటానికి ఒక ఆయుధంగా 'ప్రకృతి యోగా అండ్ నేచర్ క్యూర్'ని నిర్మల ఎంచుకున్నారు. డాక్టర్ సరస్వతి దగ్గర నిర్మల యోగాలో శిక్షణ తీసుకున్నారు. దానివల్ల నిర్మల జీర్ణవ్యవస్థ మెరుగైంది. కొన్ని ఆరోగ్య సమస్యలు నెమ్మదించాయి. నిర్మల పూర్తిస్థాయి శిక్షణ తీసుకుని అందరికీ ఆరోగ్యం మీద అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో యోగా క్యాంపులు నిర్వహించారు. ఇంటి దగ్గర కూడా యోగా తరగతులు నడిపారు. అలా 'క్యాన్సర్'పై పోరాడుతూ యోగా–ప్రకృతి–ధ్యానం సమన్వయంతో జీవితాన్ని మళ్ళీ ఆరోగ్య పథంలోకి మళ్లించారు.

స్త్రీలకు ఇంటా బయటా సమస్యలే

'స్త్రీలకు ఇంటా బయటా సమస్యలే. ఆ సమస్యలను చూస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. అలా చేయొద్దని నేను కోరుతున్నాను. కుటుంబానికి సంబంధించి ఎన్ని బాధ్యతలున్నా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. ఆత్మన్యూనతా భావం విడనాడి ధైర్యంగా మసలుకోవాలి, ధ్యానం మీకు దారి చూపిస్తుంది' అంటారామె.


● స్ఫూర్తి

చదువులో 'శభాష్' అనిపించుకున్న లహరి చదువే ప్రపంచం అనుకోలేదు.

సమకాలీన సమాజం నుంచి కూడా ఎన్నో విషయాలను పాఠాలుగా నేర్చుకుంటోంది.

విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహతో ముందడుగు వేస్తోంది.

'మన కోసం మనమే కాదు ఇతరుల కోసం మనం' అనే స్పృహతో రకరకాల సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగం అవుతున్న సిద్దిపేట జిల్లా తడకపల్లికి చెందిన బందోజీ లహరి బ్యాంకాక్‌లో జరిగిన 'ఏషియా యూత్ ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్' సదస్సులో ప్రసంగించింది...

చైతన్య లహరి

'ఇది ఆడవాళ్లకు సాధ్యం కాదు' అనే మాట ఎన్నోచోట్ల విన్నది లహరి. 'ఎందుకు సాధ్యం కాదు?' అని ధైర్యంగా అడిగే వయసు కాదు. అయితే చిన్న వయసులోనే రకరకాల సందర్భాలలో శక్తిమంతమైన మహిళల గురించి విన్న లహరికి 'మహిళలకు సాధ్యం కానిది లేదు' అనే సత్యం బోధపడింది.

'ప్రతిభావంతులతో పోటీ పడితే మనలోని ప్రతిభ కూడా మెరుగుపడుతుంది' అనే పీటీ ఉష మాట ప్రభావంతో ఆటలపై ఆసక్తి పెంచుకుంది. ఎన్నో ఆటల్లో భాగం అయింది.

మదర్ థెరెసా గురించి విన్నప్పుడల్లా ఆమె చేసిన అపారమైన సేవా కార్యక్రమాలలో ఏ కొంచెం చేసినా జీవితం ధన్యం అయినట్లే అనుకునేది. 'ఇతరుల కోసం జీవించని జీవితం జీవితం కాదు' అనే మదర్ మాట లహరి మనసులో నాటుకుపోవడమే కాదు సామాజిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకునేలా చేసింది.

కరాటే...కిక్ బాక్సింగ్

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆర్జీయూకేటీలో ఈసీఈ ఫైనలియర్ చదువుతోంది లహరి. ఎప్పుడూ ఏదో నేర్చుకోవాలనే తపనతో ఉండే లహరి కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సాధించింది. 'ఖేలో ఇండియా'లో ఉషూ ప్లేయర్‌గా సత్తా చాటింది.

అత్యవసరంగా రక్తం అవసరమున్నవారికి సహాయం అందించేందుకు సిద్దిపేటలో 'లహరి బ్లడ్ ఫౌండేషన్' ఏర్పాటు చేసింది. మిత్రులతో కలిసి రక్తదానాలు చేయడం, చేయించేలా ప్రోత్సహించడం చేస్తోంది. కోవిడ్ టైమ్‌లోనూ రిస్క్ తీసుకుని సేవలందించింది. తాను నేర్చుకున్న ఆత్మరక్షణ విద్యలను విద్యార్థినులకు నేర్పిస్తోంది. బాసర ఆర్జీయూకేటీలోనూ స్టూడెంట్ గవర్నింగ్ కౌన్సిల్ (ఎస్‌జీసీ) కౌన్సిల్ మెంబర్‌గా ఉంది. ట్రిపుల్ ఐటీలో ఆపదలో ఉన్న విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన ఈ 'హోప్ హౌజ్ ఫౌండేషన్' కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటోంది.

ఇటీవల బ్యాంకాక్‌లో నిర్వహించిన 'ఏషియా యూత్ ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్' సదస్సుల్లో పాల్గొంది. 36 దేశాల నుంచి 699 మంది పాల్గొన్న ఈ సదస్సుకు మన దేశం నుంచి హాజరైన అయిదుగురిలో లహరి ఒకరు. ఈ సదస్సులో 'ఉమెన్ ట్రాఫికింగ్ అండ్ మైగ్రేషన్ స్మగ్లింగ్' అనే అంశంపై మాట్లాడిందామె.

నాన్నలాగే సైన్యంలో చేరి దేశసేవ చేయాలనేది లహరి లక్ష్యం.

ఆమె లక్ష్యం నెరవేరాలని ఆశిద్దాం.

– రాసం శ్రీధర్, సాక్షి, నిర్మల్

'ఏషియా యూత్ ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్' సదస్సులో లహరి



లెట్స్ షేప్ ఏ బెటర్ వరల్డ్

కొత్త ప్రదేశం అంటే భౌగోళిక విషయాల పరిచయం మాత్రమే కాదు. ఎన్నో విషయాలను తెలుసుకునే పుస్తక సముద్రం. 'యూత్ సమ్మిట్'లో పాల్గొనడానికి బ్యాంకాక్‌కు వెళ్లిన లహరి 'ఇక్కడ ప్రసంగించి వెళ్లిపోతే తన బాధ్యత పూర్తయిపోతుంది' అనుకోలేదు. ఇటీవల థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో 'లెట్స్ షేప్ ఏ బెటర్ వరల్డ్' నినాదంతో మొదలైన అంతర్జాతీయ యువ సమ్మేళనంలో వివిధ దేశాల నుంచి వైబ్రెంట్ డెలిగేట్స్ పాల్గొన్నారు. పర్యావరణ సంక్షోభం నుంచి సాంస్కృతిక విశేషాల వరకు ఎన్నో అంశాలపై ఎంతోమంది డెలిగేట్స్‌తో లహరి మాట్లాడింది. ఉద్యమ ప్రయాణంలో వారి అనుభవాలతో స్ఫూర్తి పొందింది. 'బ్యాంకాక్ సమ్మిట్‌లో పాల్గొనడం గొప్ప అనుభవం' అంటుంది లహరి.



హెల్దీ డైట్ పాన్ పాప్‌సికిల్స్



కావలసినవి:
తమలపాకులు – 5 (పెద్దవి);
యాలకుల పొడి– టీ స్పూన్;
సోంపు పొడి – టీ స్పూన్; **పన్నీరు**– టేబుల్ స్పూన్;
ఎండిన గులాబీ రేకులు – టీ స్పూన్ (ఆర్గానిక్ రోజ్ ఫ్లవర్స్);
కర్జూరాలు – 6; **జీడిపప్పు పలుకులు** – పావు కప్పు;
మెంథాల్ లేదా పిప్పర్‌మెంట్ ఎక్స్‌ట్రాక్ట్– ఒక చుక్క;
బాదం పాలు లేదా వెన్న తీయని పాలు– 220ఎంఎల్
మొక్కజొన్న పొడి– టీ స్పూన్

తయారీ: ● మొక్కజొన్న పొడిని పాలలో వేసి కరిగే వరకు ఉంచాలి. ఆ తర్వాత పాత్రను స్టవ్ మీద పెట్టి సన్నమంట మీద వేడి చేయాలి. మొక్కజొన్న పిండి పాత్ర అడుగున అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. మిశ్రమం చిక్కబడిన తర్వాత పాత్రను దించి చల్లారే వరకు పక్కన పెట్టాలి. ● చల్లారిన పాల మిశ్రమంలో పావు కప్పు తీసుకుని మిక్సీ జార్‌లో పోయాలి. అందులోనే మిగిలిన దినుసులన్నింటినీ వేసి మెత్తగా వచ్చే వరకు బ్లెండ్ చేయాలి. ఇప్పుడు మిగిలిన పాల మిశ్రమాన్ని కూడా వేసి మరో సారి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పాప్‌సికిల్ మౌల్డ్ లేదా కుల్ఫీ మౌల్డ్‌లో పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. ఐదారు గంటలకు గట్టిగా సెట్ అవుతుంది.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు:
● కేలరీలు –63
● కార్బొహైడ్రేట్‌లు– 10 గ్రాములు
● ప్రొటీన్ – 1.4 గ్రాములు
● ఫ్యాట్ – 3.6 గ్రాములు ● ఫైబర్– గ్రాము

బ్యూటిప్స్

ఆయిల్ స్కిన్ ప్యాక్



ఆపిల్స్ – 2 తేనె – ఒక టేబుల్ స్పూన్ ఆపిల్స్‌ని చెక్కు తీసి, గ్రైండ్ చేసుకోవాలి. తేనెలో గ్రైండ్ చేసిపెట్టుకున్న ఆపిల్ పేస్ట్‌ని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తరువాత కడిగేయాలి.

లెమన్ మాస్క్




నిమ్మకాయ – 1 ఓట్‌మీల్ – అర కప్పు, కోడిగుడ్డు – 1 (తెల్లసొన) ఒక పాత్రలో పై పదార్థాలన్నీ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.

వింటర్ ఫ్యాషన్ బ్యూటీ

గ్రాండ్ వెల్వెట్





వింటర్ టైమ్ బ్రైట్‌గా వెలిగిపోవాలన్నా, ప్రిన్సెస్‌లా హుందాగా మెరిసిపోవాలన్నా, వణికించే చలి నుంచి నైస్‌గా తప్పించుకోవాలన్నా ఈ సీజన్‌కి బెస్ట్ ఎంపికగా వెల్వెట్ డిజైనరీ డ్రెస్సులు గ్రాండ్‌గా మదిని దోచేస్తున్నాయి.



వెల్వెట్‌నే మనం మఖ్మల్ క్లాత్ అని కూడా అంటాం. మందంగా, మృదువైన పట్టులా ఉండే ఈ క్లాత్ నేత పని, వాడే మిశ్రమాల వల్ల చాలా ఖరీదైనదిగా కూడా పేరుంది. సంపన్నులు ధరించే వస్త్రంగా పేరొందిన వెల్వెట్‌కు ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. ఇప్పుడు ఈ క్లాత్ తయారీలో ఎన్నో మార్పులు చోటు చేసుకొని, అందరికీ అందుబాటులోకి వచ్చింది. ధరలను బట్టి క్లాత్ నాణ్యతలో మార్పులు ఉంటున్నాయి.

దాదాపు డిజైనర్లందరూ వెల్వెట్‌తో డ్రెస్ డిజైనింగ్‌లో ప్రయోగాలు చేస్తుంటారు. లాంగ్ అండ్ షార్ట్ గౌన్లు, కుర్తీలు, లాంగ్ ఓవర్ కోట్స్, శారీస్, బ్లౌజ్‌లను డిజైన్ చేయించుకోవచ్చు.

- ప్లెయిన్ వెల్వెట్ డ్రెస్‌లో వెస్టర్న్ ఔట్‌ఫిట్స్‌ను డిజైన్ చేస్తుంటారు. ఇవి, వింటర్ సీజన్‌లో ఈవెనింగ్ పార్టీలకు స్పెషల్‌గా రెడీ అవుతున్నాయి. వీటిలో షార్ట్ గౌన్స్, ఓవర్ కోట్స్ ఎక్కువ.
- ఎంబ్రాయిడరీ వెల్వెట్ క్లాత్‌పైన మరింత అందంగా కనిపిస్తుంది. దీనివల్ల డ్రెస్‌కి అదనపు ఆకర్షణ చేకూరుతుంది.
- సంప్రదాయ వేడుకల్లోనూ డిజైనర్ శారీతో హుందాగా ఆకట్టుకుంటుంది.
- లెహంగా, చోలీ డిజైన్లలో గ్రాండ్‌గా వెలిగిపోతుంది.
- వెల్వెట్ అనేది వంకాయ రంగులోనే కాదు పచ్చ, పసుపు, పింక్.. వివిధ రంగులలో షిమ్మర్‌తో మెరిసిపోయేవీ ఉన్నాయి.

చర్మం పదే పదే పొడిబారుతుంటే..!



చలికాలంలో చర్మం పొడిబారే సమస్య దాదాపుగా అందరూ ఎదుర్కొనేదే. ఎన్ని క్రీములు రాసినా ఏమాత్రం ఉపయోగం లేదని చాలామంది వాపోతుంటారు. ఈ సమస్యలకు పరిష్కారం కావాలంటే ముందు మన చర్మ తత్వాన్ని తెలుసుకోవాలి.

కొందరికి ఆయిల్ స్కిన్ ఉంటుంది. వీరికి సమస్య పెద్దగా ఉండకపోవచ్చు. కానీ, ఈ కాలంలో పొడి చర్మం గల వారికి పెద్ద సమస్యగా ఉంటుంది. వారి చర్మతత్వాన్ని బట్టి మాయిశ్చరైజర్లు రాసుకోవాలి.

గోరువెచ్చని నీళ్లు

ఫుల్‌క్రీమ్ లేదా అయిల్ బేస్డ్ మాయిశ్చరైజర్లు వాడాలి. స్నానం చేశాక కనీసం పది నిమిషాల్లోపు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. చలిని తట్టుకోవడానికి చాలామంది వేడినీళ్లతో స్నానం చేస్తుంటారు. దీనివల్ల చర్మంపై సహజ నూనెలను కోల్పోతాం. అందుకని, స్నానానికి గోరువెచ్చని నీళ్లు వాడాలి. నిమ్మ, చందనంతో తయారైనవి కాకుండా గ్లిజరిన్, అలోవెరా, ఓట్‌మిల్క్ బేస్డ్ సోప్స్ స్నానానికి ఎంచుకోవాలి. వింటర్‌లోనూ సన్‌స్క్రీన్‌ను ఉపయోగించాలి.

రుద్దకూడదు..

- డ్రై స్కిన్ ఉన్నవాళ్లు క్లెన్సింగ్ మిల్క్‌ని రోజుకు ఒకసారైనా ఉపయోగించాలి. స్క్రబ్స్ వంటివి ఎక్కువ ఉపయోగించకూడదు.
- కొందరు స్నానానికి మెత్తటి కాయిర్‌ను వాడుతుంటారు. ఈ కాలం దానిని వాడకపోవడం ఉత్తమం.
- పాదాలను రాత్రివేళ శుభ్రపరుచుకొని, ఫుట్ క్రీమ్ లేదా పెట్రోలియమ్ జెల్లీ రాసుకోవాలి. కాలి పగుళ్ల సమస్య ఉన్నవారు సాక్సులు వేసుకోవాలి.
- కొందరు సీరమ్స్ వాడుతుంటారు. వీటిలో యాసిడ్ కంటెంట్ చాలా తక్కువగా ఉన్నవి ఎంచుకోవాలి.
- ఆయిల్ స్కిన్ ఉన్న వాళ్లు జెల్ లేదా లోషన్ బేస్డ్ మాయిశ్చరైజర్లు ఉపయోగించుకోవాలి.
- సోరియాసిస్, వంటి చర్మ సమస్యలు ఉన్నవారు ముందుగానే వైద్యులను సంప్రదించి మందులు తీసుకోవాలి.

మేకప్‌కి ముందు మాయిశ్చరైజర్

మేకప్ చేసుకోవడానికి ముందు క్లెన్సింగ్ మిల్క్ ఉపయోగించి, తర్వాత మాయిశ్చరైజర్ వాడాలి. మేకప్ తీసేసాక మళ్లీ క్లెన్సింగ్ మిల్క్‌ను ఉపయోగించాలి.

డ్రైస్కిన్ వాళ్లు ఆయిల్ బేస్డ్ ఫౌండేషన్స్ వాడాలి.

సూప్‌లు, జ్యూస్‌లు..

ఆకుకూరలు, కూరగాయలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. నట్స్, నువ్వులు వంటివి ఈ కాలంలో ఆహారంలో చేర్చుకోవడం, ఉపయోగించడం మంచిది. సాధారణంగా చలికాలంలో చాలా మంది తక్కువ నీళ్లు తాగుతారు. కానీ, మన శరీరానికి 3–4 లీటర్ల నీళ్లు అవసరం. నీళ్లు తాగలేకపోయినా సూప్‌లు, జ్యూస్‌ల రూపంగా తీసుకోవచ్చు.



– డా. స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్


ఆ ఫ్యాక్టరీలో కథలు డ్యాన్స్ చేస్తాయి. చిత్రాలు గీస్తాయి. సంగీత పరికరాలతో ఆటలు ఆడిస్తాయి. ఆ ఫ్యాక్టరీలో కథలు ఎంతో సహజాతిసహజంగా తయారవుతాయి. చిన్నా పెద్ద అందరినీ నవ్వులలో ముంచెత్తుతాయి. పేరు 'ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ.' ఫౌండర్ రఘుదత్. హైదరాబాద్ వాసి అయిన రఘు ఆరేళ్లుగా చేస్తున్న ఈ ప్రయాణంలో 'నా స్టోరీ మీకు స్ఫూర్తినివ్వాలి, నా శరీరం కాదు' అంటూ సృజనాత్మక ఆలోచనలనూ, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు...

కథల ఫ్యాక్టరీ

''ఇటీవల వృద్ధాశ్రమంలో ఒక ప్రోగ్రామ్ చేశాం. అక్కడ ఒక పెద్దావిడ తన చిన్ననాటి స్టోరీ ఒకటి అందరి ముందు పంచుకుంది. చిన్నప్పుడు స్కూల్లో వేదికపైన మాట్లాడాలన్నా, పాట పాడాలన్నా చాలా సిగ్గుపడేవారంట. ఇప్పుడు నలుగురిలో పాట పాడటానికి సిగ్గు పడుతూ అప్పటి రోజులు గుర్తుకు తెచ్చుకుంటూ తన చిన్ననాటి కథను పంచుకున్నారు.



తాత వయసున్న ఒకతను ముందుకు వచ్చి డ్యాన్స్ చేస్తూ తన కాలేజీ రోజులను గుర్తు చేసుకుంటూ నాటి కథను షేర్ చేశారు. అవన్నీ ఎంత అద్భుతంగా ఉంటాయంటే అక్కడ ఉండి వారి కథల్లో మనమూ గొంతులు వేయాల్సిందే.

కొందరు పెయింట్ ద్వారా, మరికొందరు మ్యూజిక్ ద్వారా తమ కథలను పరిచయం చేస్తుంటారు. ఈ విధానం వల్ల అంతర్లీనంగా వారిలో ఉన్న కళ, ఆనందం తమ చుట్టూ ఉన్నవారికి పంచుతారు. 'ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ' ఉద్దేశ్యం కూడా అదే. అందరూ కథ ద్వారా బోలెడంత ఆనందాన్ని పొందాలి. అందరిలోనూ ఒక ఇన్నర్ చైల్డ్ ఉంటుంది. నెలకు ఒకసారైనా మనలో ఉన్న ఆ చైల్డ్‌ను బయటకు తీసుకు వచ్చి, ఎంజాయ్ చేయిస్తే ఇన్నర్‌లైఫ్ అంతా హ్యాపీగా మారిపోతుంది. అందుకే 'ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ కింద 'లివ్ యా స్టోరీ' అని ఉంటుంది.

రిజెక్ట్ చేశారనే...

పదేళ్లుగా విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సెలర్‌గా ట్రెయినింగ్ ఇస్తున్నాను. స్పోర్ట్స్ సైకాలజీలో కోర్సు చేశాను. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో మాస్టర్స్ చేశాను. క్రికెట్ అసోసియేషన్స్, క్రికెట్ పర్సన్స్‌కి కౌన్సెలర్‌గా చేశాను. నా స్టూడెంట్స్ కొందరు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాలలో పాల్గొనేవారు. ఒక స్టోరీ టెల్లింగ్ ప్లాట్‌ఫామ్ వాళ్లు నేను డిజేబుల్డ్ అని, సోషల్ మీడియాలో ఎక్కడా లేనని నన్ను రిజెక్ట్ చేశారని తెలిసి బాధనిపించింది. దీంతో నేనే ఓ కొత్త ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేయాలనుకున్నాను. అప్పటికే, పేరెంట్స్‌ని లేని ఒక అమ్మాయిని దత్తతు తీసుకొని చదివిస్తున్నాను. ఆ అమ్మాయి పేరు ఆఫియా. ఇప్పుడు ఇంటర్మీడియెట్ చేస్తుంది. ఆ అమ్మాయి స్టోరీకి మించినదేదీ ఉండదని తనతోనే ఫస్ట్ స్టోరీ స్టార్ట్ చేశాం. అక్కణ్ణుంచి స్కూళ్లు, కాలేజీలు, ఎన్జీవోలకు, వృద్ధాశ్రమాలకు వెళ్లి స్టోరీ ఈవెంట్స్ చేయడం మొదలుపెట్టాం. 2018లో మొదలు పెట్టిన ఈ ప్రోగ్రామ్‌లో దివ్యాంగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు.. ఇలా ఒక వర్గానికి మాత్రమే చెందినవారు ఉండకూడదని, మానవత్వంతో కూడిన కథలే ఉండాలని నియమం పెట్టాం. మా ప్లాట్‌ఫామ్ పైన ఆటిజమ్ కిడ్స్ కూడా తమ స్కిల్స్‌ను ప్రదర్శించేలా వేదికను సిద్ధం చేశాం.

లైఫ్‌స్కిల్స్‌లో శిక్షణ...

'టిజిటిఎఫ్ విద్య' పేరుతో ఇప్పుడు 20 మంది పేద పిల్లలకు స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాం. పాతిక మంది వాలంటీర్లు ఉన్నారు. స్కాలర్‌షిప్స్ ఇవ్వడమే కాకుండా లైఫ్ స్కిల్స్, వాల్యూస్, కమ్యూనికేషన్స్‌పై పిల్లలకు, యూత్‌కి స్కిల్‌డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం మొదలుపెట్టాం.

స్వచ్ఛందంగా...

ఈ యేడాది గోవాలో ఆరు రోజుల పాటు పర్పుల్ ఫెస్ట్ జరిగింది. ప్రపంచంలో ఉన్న దివ్యాంగులు అందరూ ఒక చోట చేరే సందర్భం. అందులో 'ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ' ఒక వాలంటీర్‌గా పనిచేసింది. ముందే 1200 స్టూడెంట్స్‌కి ఈ ప్రోగ్రామ్‌కి సంబంధించి ట్రెయినింగ్ ఇచ్చాం. ఆరు రోజుల ఈవెంట్‌లో 60–70 వేల మంది పాల్గొన్నారు. అందులో టిజిటిఎఫ్ పెద్ద పాత్ర పోషించింది.

వైకల్యం ఉన్న వ్యక్తి ఏదైనా సాధిస్తే గొప్పగా చూడరు. వారి బాడీలో లోపాన్ని చూపిస్తూ అదొక స్ఫూర్తిగా పరిచయం చేస్తారు. జాలిగా చూస్తారు. చాలా కష్టంగా అనిపిస్తుంది. నా స్టోరీ స్ఫూర్తినివ్వాలి, నా శరీరం కాదు'' అంటున్నారు 'ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ' రఘు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కథ ఎన్జీవో అయితే...

స్వచ్ఛందంగా ఓ పది మందిమి కలిసి ఆరేళ్లుగా ఈ కథల ఫ్యాక్టరీకి పనిచేస్తున్నాం. దీని ద్వారా కొంత మంది పేద పిల్లలకు చదువు చెప్పిస్తే బాగుంటుంది కదా అనుకున్నాం. మూడేళ్ల క్రితం 'టిజిటిఎఫ్ విద్య' పేరుతో ఎన్జీవోగా తీసుకొచ్చాం. ఈ సంస్థ ద్వారా చైల్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 20 మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నాం. యువతకు, మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ట్రెయినింగ్స్ ఇస్తున్నాం. ఈ కథల జర్నీలో ఏరుకున్న కథలెన్నో ఉన్నాయి.

– రఘు

● యంగ్ టాలెంట్

టెక్కలి 2 టీ-20


● 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అందుకుంటూ...


● విజయ్

టెక్కలి మైదానం నుంచి స్ఫూర్తి పొందిన త్రిపురాన విజయ్ క్రికెట్‌లో రాణిస్తూ భవిష్యత్ ఆశాకిరణంలా మెరుస్తున్నాడు. అద్భుత ప్రతిభతో ఉత్తరాంధ్రకు పేరు తెస్తున్నాడు. హైదరాబాద్‌లో మొదలైన సయ్యద్ ముస్తాక్ అలీ టీ 20 ట్రోఫీలో భాగంగా నాగాలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు బౌల్ చేసి 2 మేడిన్ వేసి 8 పరుగులిచ్చి 4 వికెట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు...

త్రిపురాన వెంకట కృష్ణంరాజుకు ఆటలు అంటే ఇష్టం. ఆ ఇష్టంతోనే కుమారుడు విజయ్‌ని టెక్కలిలోని మైదానానికి రోజు తీసుకువెళ్లేవాడు. అక్కడ క్రికెట్ నెట్స్‌లో తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులను చూసి స్ఫూర్తి పొందాడు విజయ్.. పదమూడు ఏళ్ళ వయసులో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరచడంతో విజయ్ విజయపరంపర మొదలైంది.

2019–20 సీజన్లో అండర్–19 మ్యాచ్‌లకు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించి అంతర్ జిల్లాల పోటీల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు 98 సాధించాడు. శ్రీకాకుళం జట్టు ట్రోఫీ గెలుపొందడంలో కీలకపాత్ర పోషించాడు. అక్కడ చూపిన ప్రతిభ ఆధారంగా ఆంధ్ర అండర్–19 రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. గ్వాలియర్ వేదికగా జరిగిన అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్లో ఆంధ్ర జట్టు తరపున ఆడి బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రా క్రికెట్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి విదర్భతో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. హైదరాబాద్ వేదికగా హైదారాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు.

– దుక్క మురళీకృష్ణా రెడ్డి, సాక్షి, విశాఖపట్నం

విరాట్ కోహ్లి స్ఫూర్తితోనే క్రికెట్ ఆటలోకి వచ్చాను. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సహకారం మరవలేనిది. ఏసీఏ కోచ్‌ల పర్యవేక్షణలో క్రికెట్‌లో మెలకువలు నేర్చుకున్నాను. భారత్ జట్టుకి ఎంపిక కావడమే నా లక్ష్యం.

– త్రిపురాన విజయ్

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్10 అల్ట్రా



రిజల్యూషన్: 1848×2960 పిక్సెల్స్ **సైజ్:** 14.6 అంగుళాలు **బరువు:** 718 గ్రా. **వోఎస్:** ఆండ్రాయిడ్ 14 **కలర్స్:** మూన్‌స్టోన్ గ్రే, ప్లాటినమ్ సిల్వర్

వాట్సాప్‌లో కొత్త ఫీచర్



వాయిస్ మెసేజ్‌లను టెక్స్ట్‌గా మార్చుకునేలా వాట్సాప్ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

వాయిస్ నోట్‌ను అందుకున్నప్పటికీ యూజర్‌లు వినలేని పరిస్థితుల్లో ఉండవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చారు. 'మీ పరికరంలోని ట్రాన్స్‌క్రిప్ట్‌లు జనరేట్ చేయబడతాయి. తద్వారా వాట్సప్‌తో సహా మరెవరూ మీ పర్సనల్ మెసేజ్‌లను చదవలేరు. వినలేరు' అని మెటా ప్రకటించింది. వాట్సాప్ వీడియో కాల్స్‌ను అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పుడు యూజర్‌లు ఫిల్టర్స్, కస్టమ్ బ్యాక్‌గ్రౌండ్స్‌ను ఉపయోగించవచ్చు. జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు ఇది బాగా సరిపోతుంది. వీడియో కాలింగ్‌లో ఆహ్లాదకరమైన అనుభవాన్ని కలిగించే ఫీచర్ ఇది.

అన్‌ఫినిష్‌డ్ మెసేజ్‌లను ఆటోమెటిక్‌గా సేవ్ చేసే కొత్త ఫీచర్‌ను కూడా తీసుకొచ్చింది వాట్సాప్. మరో సారి యాప్ ఓపెన్ చేసినప్పుడు డ్రాఫ్ట్ ఇండికేటర్ అసంపూర్ణ సందేశాలను గుర్తు చేస్తుంది. ఈ ఫీచర్ యాక్సెస్ కోసం వాట్సాప్ లెటెస్ట్ వెర్షన్ అవసరం.

థ్రెడ్స్‌లో ల్యాండ్‌స్కేప్ వీడియో

మెటా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ థ్రెడ్స్‌లో ఈ నెలలో అందుబాటులోకి వచ్చిన కొత్త ఫీచర్ ల్యాండ్ స్కేప్ వీడియో. 'థ్రెడ్స్'లో ల్యాండ్‌స్కేప్ మోడ్‌లో వీడియోలను చూడడానికి ఈ ఫీచర్ యూజర్‌లను అనుమతిస్తుంది. 'న్యూ ట్రెండింగ్ పేజ్' అనే ఫీచర్‌ను కూడా థ్రెడ్స్ పరీక్షిస్తోంది. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను ఈ ఫీచర్ చూపిస్తుంది.

అమెజాన్ ఎకో షో 21



అమెజాన్ ఇటీవల 'ఎకో షో 21' అనే భారీ వాల్ మౌంటెడ్ స్మార్ట్‌డిస్‌ప్లేను మార్కెట్‌లోకి తెచ్చింది. రెండు సంవత్సరాల క్రితం వచ్చిన 'ఎకో షో15'తో పోల్చితే ఇది వ్యూయింగ్ ఏరియాను రెట్టింపు చేస్తుంది. సౌండ్ క్వాలిటీ బాగుంటుంది. 'ఎకో షో 15'తో పోల్చితే 65 శాతం ఎక్కువ జూమ్ చేయడానికి యూజర్‌లను అనుమతిస్తుంది.

● గేమింగ్

ఆ గ్రహంలో ఆగ్రహజ్వాల

కన్‌స్ట్రక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ సిమ్యూలేషన్ వీడియో గేమ్.... ప్లానెట్ కోస్టర్ 2 ప్లానెట్ కోస్టర్(2016)కు ఇది సీక్వెల్. పాత గేమ్‌లాగే ఈ గేమ్‌లో కూడా గేమ్ కెరీర్, శాండ్‌బాక్స్, చాలెంజ్ మోడ్స్ ఉన్నాయి. క్రాస్–ప్లాట్‌ఫామ్ కోఆపరేటివ్ గేమ్‌ప్లేను జోడించారు. ఒరిజినల్ గేమ్‌తో పోల్చితే ఈ గేమ్‌లో విజువల్స్,



కస్టమైజేషన్,, న్యూ ఫీచర్‌లను మెరుగు పరిచారు.

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: కన్‌స్ట్రక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ సిమ్యూలేషన్

● ఇంగ్లీష్ ఇడియమ్స్

గెయిన్ గ్రౌండ్



ఒక పని విషయంలో, ఒక పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పు, అభివృద్ధి కనిపించే సందర్భంలో వాడే మాట....గెయిన్ గ్రౌండ్. **ఉదా:** దీ మూమెంట్ హ్యాజ్ గెయిన్‌డ్ గ్రౌండ్ ద్యూ టు ఇంక్రీజింగ్ పబ్లిక్ సపోర్ట్. **మూలం:** 'గెయిన్ గ్రౌండ్' అనేది మిలిటరీ టెక్నాలజీకి సంబంధించిన మాట. సైన్యాలు యుద్ధభూమిలో ముందుకు వెళుతున్నప్పుడు శత్రువుల నుంచి భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి ఉపయోగించే పదబంధం....గెయిన్ గ్రౌండ్. ఆ తరువాత ఇది మిలిటరీకి సంబంధించిన విషయాలలోనే కాదు ఆర్థిక, సామాజిక విషయాల్లో, ఎన్నో రంగాలకు సంబంధించి వాడుతున్నారు.

ముగిసిన ఇఫీ వేడుకలు


● రష్మిక

● ఆస్ట్రేలియా దర్శకుడు ఫిలిప్ నోయిస్‌కు లైఫ్‌టైమ్ అవార్డు
● ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌గా విక్రాంత్ మెస్సీ

ఇఫీ (ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకలు గురువారం అట్టహాసంగా ముగిశాయి. ఈ నెల 20 నుంచి 28 వరకు గోవాలో 55వ ఇఫీ వేడుకలు జరిగాయి. 'యంగ్ ఫిల్మ్‌మేకర్స్: ద ఫ్యూచర్ ఈజ్ నా' అనే థీమ్‌తో ఈ వేడుకలను నిర్వహించారు. 80 దేశాలకు చెందిన 180 సినిమాల ప్రదర్శన జరిగింది. ఇక ఈ వేడుకల్లో నటులు ఏఎన్నార్, రాజ్ కపూర్, గాయకుడు మహమ్మద్ రఫీ, దర్శకుడు తపన్ సిన్హాల శతాబ్ది వేడుకలు జరిగిన విషయం తెలిసిందే. తొమ్మిది రోజుల పాటు జరిగిన 'ఇఫీ' ఉత్సవాల్లో దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


● ఫిలిప్ నోయిస్

చివరి రోజు విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఆటా పాటలతో ముగింపు వేడుకలు ముగిశాయి. ఇక అవార్డు విజేతల వివరాల్లోకి వెళితే...

'హోలీ కౌ' చిత్రంలోని నటనకు గాను క్లైమెంట్ ఫేబో ఈ ఏడాది 'ఇఫీ' ఉత్తమ నటుడిగా నిలిచారు. బెస్ట్ ఫిల్మ్‌కి ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'ది గోల్డెన్ పీకాక్' అవార్డు లిథువేనియాకి చెందిన 'టాక్సిక్'కి దక్కింది. ఇదే చిత్రానికి గాను వెస్ట, లెవాలకు ఉత్తమ నటీమణులుగా అవార్డులు దక్కాయి. 'ది న్యూ ఇయర్ దట్ నెవర్ కమ్' చిత్రానికి గాను రొమేనియా దర్శకుడు బోగ్దాన్ మురేసాకు ఉత్తమ దర్శకుడి అవార్డు దక్కింది. 'హౌ డు ఐ బిలాంగ్ టు' చిత్రానికిగాను ఫ్రెంచ్ కమ్ ట్యూనీషియా నటుడు ఆడమ్ బెస్సాకు ఉత్తమ నటుడిగా అవార్డు (స్పెషల్ మెన్షన్) దక్కింది. 'బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ ఆఫ్ ఇండియన్ ఫీచర్ ఫిల్మ్' విభాగంలో నవజ్యోత్ బండివాడేకర్ (గుజరాతీ ఫిల్మ్ 'ఘరత్ గణపతి') అవార్డు అందుకున్నారు. 'బెస్ట్ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్'గా అమెరికన్ ఫిల్మ్ మేకర్ సారా ఫ్రైడ్‌ల్యాండ్ (ది ఫెమిలియర్ టచ్)కు, లూయిస్ కోర్వోసియర్స్‌కు స్పెషల్ జ్యూరీ అవార్డు (హోలీ కౌ సినిమాకు) అవార్డులు దక్కాయి. ప్రతిష్ఠాత్మకమైన సత్యజిత్ రే జీవిత సాఫల్య పురస్కారం ఈ ఏడాది ఆస్ట్రేలియా దర్శకుడు ఫిలిప్ నోయిస్‌కు దక్కింది. ఈ సందర్భంగా తాను ఓ ఇండియన్ ఫిల్మ్‌ను చేయబోతున్నానని కూడా ఫిలిప్ పేర్కొన్నారు. ఇక 'ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్–2024'గా బాలీవుడ్ నటుడు విక్రాంత్ మెస్సీకి ఈ ఏడాది పురస్కారం దక్కింది. మరాఠీ వెబ్ సిరీస్ 'లంపన్'కు బెస్ట్ సిరీస్‌గా , 'క్రాసింగ్' సినిమాకు యూనెస్కో గాంధీ మెడల్- 2024 పురస్కారం దక్కింది.

'ఇఫీ' ముగింపు వేడుకల్లో శ్రియా శరణ్, ప్రతీక్ గాంధీ, రష్మికా మందన్నాలతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

పుష్పరాజ్ ఎక్కడ?

'ఇఫీ' వేడుకలకు హాజరైన రష్మికా మందన్నాను 'పుష్పరాజ్' ('పుష్ప'లో అల్లు అర్జున్ పాత్ర పేరు) ఎక్కడ అని విలేకరులు అడగ్గా.. ''హైదరాబాద్‌లో బిజీగా ఉన్నారు. సుకుమార్ సార్, దేవిశ్రీ సార్... ఇలా అందరూ బిజీగా ఉన్నారు. అందుకే అల్లు అర్జున్ ఈ వేడుకకు హాజరు కాలేకపోయారు. 'పుష్ప' తరఫున నేను వచ్చాను'' అన్నారు. 'పుష్ప' కి అల్లు అర్జున్‌కి జాతీయ అవార్డు వచ్చింది కదా... మీకు 'పుష్ప 2'తో వస్తుందనుకుంటున్నారా? అని విలేకరులు అడగ్గా... 'చూద్దాం' అని నవ్వేశారు.

సినిమా

గగనాలన్నీ పూలగొడుగులు... భువనాలన్నీ పాల మడుగులు...


● రామ్‌చరణ్, కియారా

''నానా హైరానా ప్రియమైన హైరానా..' అంటూ మొదలవుతుంది 'గేమ్ ఛేంజర్' సినిమాలోని 'నానా హైరానా' పాట లిరికల్ వీడియో. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ ఛేంజర్'. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమాలో కియారా అద్వానీ, అంజలి హీరోయిన్లు. జీ స్టూడియోస్, 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన 'గేమ్ ఛేంజర్' చిత్రం జనవరి 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'నానా హైరానా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ''ఎపుడూ లేనే లేని వింతలు ఇపుడే చూస్తున్నా... గగనాలన్నీ పూల గొడుగులు... భువనాలన్నీ పాల మడుగులు...'' అంటూ సాగుతుంది తెలుగు వెర్షన్‌లోని 'నానా హైరానా...' పాట. ఇదే పాట హిందీలో 'జానా హైరాన్ సా...', తమిళంలో 'లై రానా...'గా విడుదలైంది. తెలుగు వెర్షన్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా కార్తీక్, శ్రేయా ఘోషల్ పాడారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ''ఇండియాలోనే ఇప్పటి వరకు ఎవరూ చిత్రీకరించని విధంగా ఇన్‌ఫ్రా కెమెరాతో న్యూజిల్యాండ్‌లో ఈ పాటను చిత్రీకరించాం. ప్రేమలో ఉన్న హీరో హీరోయిన్లు ఒకరిపై ఒకరు తమ మనసుల్లోని భావాలను పదాల రూపంలో అందంగా వ్యక్తపరచుకుంటున్నట్లుగా ఈ పాట ఉంటుంది. ఫ్యూజన్ మెలోడీ (వెస్ట్రన్, కర్ణాటిక్ కాంబో)గా ఈ పాటను తమన్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే చిత్రమిది

– 'అల్లరి'నరేష్


● 'అల్లరి' నరేష్, అమృతా అయ్యర్

'నాంది' సినిమా చేసినప్పుడు ఎంత హ్యాపీగా ఉన్నానో 'బచ్చల మల్లి' చిత్రం చేస్తున్నప్పుడు కూడా అంతే సంతోషంగా ఉన్నాను. నేను నటించిన 'గమ్యం, నాంది' చిత్రాల్లా 'బచ్చల మల్లి' ప్రేక్షకుల మనసులో నిలిచిపోయే సినిమా అవుతుంది'' అని హీరో 'అల్లరి' నరేశ్ చెప్పారు. సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, అమృతా అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'బచ్చల మల్లి'. రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 20న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''డైరెక్టర్ సుబ్బుగారు మూడేళ్లు ఈ సినిమాతో ప్రయాణం చేసి, అద్భుతంగా తీశారు. సుబ్బుగారు, విశాల్ దాదాపు ఆర్నెల్లు కూర్చుని ఈ సినిమా కోసం పాటల్ని సిద్ధం చేశారు.'' అని తెలిపారు. ''టీజర్‌కి వస్తున్న స్పందన చూసినప్పుడు మా సినిమా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం వచ్చేసింది'' అన్నారు అమృతా అయ్యర్. సుబ్బు మంగాదేవి మాట్లాడుతూ–''కరోనా సమయంలో హాస్పిటల్లో ఉన్న మా అమ్మగారిని చూడ్డానికి సరైన సమయంలో వెళ్లలేకపోయాను. నేను వెళ్లే సమయానికి అదే చివరి చూపు అయింది. లైఫ్‌లో సరిదిద్దుకోలేని తప్పు చేయకూడదనిపించింది. ఇలాంటి పాయింట్ మీద 'బచ్చల మల్లి' తీశాను'' అని పేర్కొన్నారు. ''ఈ సినిమా కథ విన్నప్పుడు కన్నీళ్లొచ్చాయి. చాలా ఇష్టపడి ప్రేమించి చేసిన సినిమా ఇది'' అన్నారు రాజేష్ దండా.

చంటబ్బాయిగారి తాలుకా..!


● అనన్య నాగళ్ల, రవితేజ

'వెన్నెల' కిశోర్ ప్రధాన పాత్రలో చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. చంటబ్బాయిగారి తాలూకా' క్యాప్షన్. ఈ చిత్రంలో అనన్యా నాగళ్ల, సీయా గౌతమ్ హీరోయిన్లుగా, రవితేజ మహాదాస్యం కీలకపాత్రలో నటించారు. రైటర్ మోహన్ దర్శకత్వంలో లాస్యా రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న విడుదల కానుంది. నిర్మాత వంశీ నందిపాటి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మోహన్ మాట్లాడుతూ–''ఫస్ట్ కాపీ చూసిన తర్వాత వంశీగారు చెప్పిన మార్పులు, ఆయన ఈ సినిమా తీసుకోవడం మాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చాయి'' అన్నారు. ''శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' హిట్ అవుతుందన్న నమ్మకం ఉంది'' అన్నారు వంశీ నందిపాటి. ''ఈ సినిమా ఆడియన్స్‌కు ఫుల్ మీల్స్ లాంటిది'' అన్నారు అనన్యా నాగళ్ల. ''కంటెంట్‌ని నమ్మి తీసిన చిన్న సినిమాలు '2018, కమిటీ కుర్రాళ్ళు, ఇటీవల రిలీజ్ అయిన 'క'.., ఇవన్నీ ప్రేక్షకులను అలరించాయి. నిర్మాత వంశీగారిది గోల్డెన్ హ్యాండ్. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' విజయం సాధించి, మోహన్‌గారికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు 'కమిటీ కుర్రాళ్ళు' ఫేమ్ దర్శకుడు యదు వంశీ.

పుష్ప కోసం తగ్గిన ఛావా?


● విక్కీ కౌశల్

విక్కీ కౌశల్, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఛావా'. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో దినేష్ విజన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 6న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ తొలుత ప్రకటించింది. కానీ ఆగస్టు 15 నుంచి డిసెంబరు 5కి అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప ది: రూల్' సినిమా రిలీజ్ డేట్ మారింది. దీంతో 'ఛావా' వెనక్కి తగ్గిందని, ఈ సినిమా విడుదల వాయిదా పడే చాన్స్ ఉందనీ బాలీవుడ్‌లో ఊహాగానాలు మొదలయ్యాయి. చివరికి ఈ ఊహలే నిజమయ్యాయి. 'ఛావా' చిత్రం డిసెంబరు 6 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 14కి వాయిదా పడింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా 'ఛావా'ను తెరకెక్కించారు. ఈ చిత్రంలో శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్ నటించగా, శంభాజీ భార్య ఏసుబాయి పాత్రలో రష్మికా మందన్నా నటించారు.

ఓటీటీ **ఇది చూడొచ్చు**

ఇది అన్ని టాక్ షోలలా ఉండదు

ప్రస్తుత జెనరేషన్‌కు మార్పు అన్నది ఆక్సిజన్ లాంటిది. ప్రతిక్షణం నిత్య నూతనంగానే కాదు వినూత్నంగా చూడాలని కోరుకుంటుంది నేటి తరం. మామూలుగా ఇంటర్వ్యూ, టాక్ షోలంటే ఇద్దరు ఎదురెదురుగా పద్ధతిగా కూర్చోవడం నుండి నడుస్తూ మాట్లాడడం వరకు చూశాం. నాటి దూరదర్శన్ టాక్ షోల నుండి నేటి ఓటీటీ టాక్ షోల వరకు ఇంచుమించుగా ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. కానీ వాటన్నిటికీ విభిన్నంగా నేటి తరం నేటివిటీకి దగ్గరగా 'ది రానా దగ్గుబాటి షో' ఉంది. దీనికి హోస్ట్‌గా పేరుకు తగ్గట్టే నేటి ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి వ్యవహరించడం విశేషం. ఈ కార్యక్రమం స్ట్రీమ్ అయ్యేకన్నా ముందు ప్రముఖ యాంకర్ సుమతో ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రమోషనల్ ప్రోమో ఒకటి రిలీజ్ చేశారు. ఆ ప్రోమోలోనే ఈ షోకి సంబంధించిన కాన్సెప్ట్ రిలీజ్ చేశారు. ప్రోమోలో సుమ స్టూడియోకి వచ్చి రానాను కలుస్తుంది. 'టాక్ షో అన్నావు కదా... గెస్టులు ఎవరు? దానికి సంబంధించిన అధికారిక అనౌన్స్‌మెంట్ ఇలా ఉండాలి' అని రానాకి సూచిస్తుంటే, 'నేను టాక్ షో అన్నాను కానీ అనౌన్స్‌మెంట్, ఇంట్రో అని చెప్పలేదు కదా... చాలా షోస్ ఇలానే రొటీన్‌గా చేస్తున్నావు కదా.. మా టాక్ షో వాటన్నిటికీ విభిన్నం' అని రానా చెబుతారు. రానా అన్నట్టే ఇప్పటిదాకా తెలుగులో వచ్చిన టాక్ షోస్ సంప్రదాయాన్ని 'ది రానా దగ్గుబాటి షో' బ్రేక్ చేసిందనే చెప్పాలి. ముఖ్యంగా ఈ షోలో రానా హోస్ట్ అనే కంటే వచ్చిన గెస్ట్‌లతో ఫ్రెండ్లీగా మూవ్ అవుతూ క్యాజువల్‌గా షో నడపడం చాలా బాగుంది. ఈ షో మొదటి ఎపిసోడ్‌లో భాగంగా ప్రముఖ తెలుగు హీరో నాని, 'హను–మాన్' ఫేమ్ తేజ సజ్జా, నటి ప్రియాంకా మోహన్ అతిథులుగా వచ్చారు. వారిని షోలకి పిలవడం దగ్గర నుండి వాళ్ళతో మాట్లాడడం, ఆటలాడడం అంతా సరికొత్తగా అనిపిస్తుంది. ఎదుటివారి అభిరుచిని కనిపెట్టడం మీడియాలో దర్శకులకు తెలిసినంత మరెవరికీ తెలిసుండదు. అలా వాళ్ల ప్రేక్షకుల నాడిని పడతారు కాబట్టే వారి కాన్సెప్ట్స్ ప్రేక్షకాదరణ పొందుతాయి. దానికి నిలువెత్తు నిదర్శనమే ఈ 'ది రానా దగ్గుబాటి షో'. ప్రైమ్ వీడియో ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న ఈ షో వర్తబుల్... వాచిట్.



– హరికృష్ణ ఇంటూరు

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సాక్షి బిజినెస్
శుక్రవారం
29-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,190	79,044
నిఫ్టీ ▽	361	23,914

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,060	▽	115
డోజోన్స్	44,722	▽	138
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,281	△	6
డాక్స్	19,426	△	164
షాంఘై	3,296	▽	14
నికాయ్	38,349	△	214

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,287	△	112
బంగారం (99.5 స్వచ్ఛత)	75,981	△	111
వెండి (కిలో)	87,904	▽	559

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.05	85.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.70	108.52
€	యూరో	ఎస్‌బీఐ	87.95	90.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.05	56.47
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.80	55.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.58	65.30
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.63	23.19
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.11	23.89
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.79	12.61

మేము అదానీ వెంటే...

మద్దతుగా నిలుస్తున్న ఇన్వెస్టర్లు, భాగస్వాములు



న్యూఢిల్లీ: క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌నకు ఇన్వెస్టర్లు బాసటగా నిలుస్తున్నారు. గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ తదితరులపై అమెరికాలో ఆరోపణలు వచ్చినప్పటికీ తమ పెట్టుబడుల విషయంలో పునరాలోచనేమీ లేదని అబు ధాబీకి చెందిన ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ (ఐహెచ్‌సీ) వెల్లడించింది. హరిత ఇంధనం, పర్యావరణ అనుకూల రంగాల్లో అదానీ గ్రూప్ చేస్తున్న కృషిపై తమకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొంది. ఐహెచ్‌సీ 2022లో అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్), అదానీ ట్రాన్స్‌మిషన్‌లో (ఏటీఎల్) చెరి 500 మిలియన్ డాలర్లు, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో 1 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత ఏజీఈఎల్, ఏటీఎల్‌లో ఒక శాతం పైగా వాటాలు విక్రయించినప్పటికీ అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో మాత్రం 5 శాతం పైగా వాటాలు పెంచుకుంది. మరోవైపు, అంతర్జాతీయ భాగస్వాములు కూడా అదానీ గ్రూప్‌నకు మద్దతు తెలిపారు. అదానీ గ్రూప్‌తో భాగస్వామ్యంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని శ్రీలంక పోర్ట్స్ అథారిటీ తెలిపింది. దేశంలో పోర్ట్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అదానీ గ్రూప్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించింది. అదానీ గ్రూప్ 1 బిలియన్ డాలర్లతో కొలంబో టెర్మినల్‌ను గ్రూప్ అభివృద్ధి చేస్తోంది. మరోవైపు, టాంజానియా ప్రభుత్వం కూడా అదానీ పోర్ట్స్‌తో ఒప్పందాలకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులపై ఎలాంటి ఆందోళన లేదని, కాంట్రాక్టులన్నీ దేశ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయని వివరించింది. దార్–ఎ–సలామ్ పోర్టులోని 2వ కంటైనర్ టెర్మినల్ నిర్వహణకు టాంజానియాతో అదానీ పోర్ట్స్ ఇటీవలే 30 ఏళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం అధికారులకు లంచాలిచ్చారని అదానీపై అమెరికాలో ఆరోపణలు రావడంతో గ్రూప్ కంపెనీల షేర్లు కుదేలుకావడం, అభియోగాలేమీ తీవ్రమైనవి కావని సంస్థ స్పష్టతనివ్వడంతో మళ్లీ పుంజుకోవడం తెలిసిందే.

పెగాట్రాన్‌లో వాటాలపై టాటా కన్ను

60 % కొనుగోలుకు కసరత్తు



న్యూఢిల్లీ: యాపిల్ ఉత్పత్తుల తయారీ సంస్థ పెగాట్రాన్ భారత వ్యాపారంలో వాటాలు కొనుగోలు చేయడంపై టాటా గ్రూప్ దృష్టి సారించింది. పెగాట్రాన్ కార్యకలాపాల్లో సుమారు 60 శాతం వాటాను దక్కించుకోవడంపై టాటా ఎలక్ట్రానిక్స్ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై గత ఏడాది కాలంగా ఇరు సంస్థల మధ్య చర్చలు జరుగుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. యాపిల్ ఉత్పత్తుల తయారీలో మార్జిన్లు చాలా తక్కువగా ఉండటం, ప్లాంట్లలో కార్మికుల డిమాండ్లతో సమస్యలు వస్తున్నా, అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ, సకాలంలో ఉత్పత్తులను సరఫరా చేయాల్సి రావడం కంపెనీకి సవాలుగా ఉంటోందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో భారత కార్యకలాపాలకు సంబంధించి స్థానిక కంపెనీని భాగస్వామిగా చేసుకోవాలని కంపెనీ భావిస్తున్నట్లు వివరించాయి. తమిళనాడులో ఉన్న పెగాట్రాన్ ఫ్యాక్టరీలో 10,000 మంది వర్కర్లు ఉండగా, ఏటా యాభై లక్షల ఐఫోన్ల తయారీ సామర్థ్యాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది భారత్‌లో తయారైన మొత్తం ఐఫోన్లలో 10% ఫోన్లను పెగాట్రాన్ ఉత్పత్తి చేసినట్లు అంచనా. తమిళనాడులోని హోసూర్‌లో ఏర్పాటు చేసే ప్లాంటు కోసం టాటా, పెగాట్రాన్ జట్టు కట్టనున్నట్లు సమాచారం. టాటా గ్రూప్ ఇప్పటికే మరో ఐఫోన్ల తయారీ సంస్థ విస్ట్రాన్ భారత వ్యాపారాన్ని కొనుగోలు చేసింది.

ఇక బీమాలో 100% ఎఫ్‌డీఐలు

నిబంధనల సవరణకు ఆర్థిక శాఖ ప్రతిపాదన



న్యూఢిల్లీ: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతానికి పెంచడంతో పాటు పెయిడప్ క్యాపిటల్‌ను తగ్గించే దిశగా బీమా చట్టం 1938 నిబంధనలను సవరించేలా కేంద్ర ఆర్థిక శాఖ పలు ప్రతిపాదనలు చేసింది. ప్రజలందరికీ బీమాను అందుబాటులోకి తెచ్చేందుకు, పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణకు, పరిశ్రమ అభివృద్ధికి, వ్యాపార ప్రక్రియలను క్రమబద్ధీకరించేందుకు ఇవి దోహదపడతాయని ఆర్థిక సేవల విభాగం తెలిపింది. ప్రతిపాదనల ప్రకారం బీమాలో ఎఫ్‌డీఐల పరిమితిని ప్రస్తుతమున్న 74 శాతం నుంచి 100 శాతానికి పెంచనున్నారు. అలాగే, కాంపోజిట్ లైసెన్సు జారీ కోసం నిర్దిష్ట నిబంధనను చేర్చనున్నారు. ప్రతిపాదిత సవరణలపై సంబంధిత వర్గాలు డిసెంబర్ 10లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది. దేశీయంగా ప్రస్తుతం 25 జీవిత బీమా కంపెనీలు, 34 సాధారణ బీమా కంపెనీలు ఉన్నాయి. మరిన్ని సంస్థలు రావడం వల్ల బీమా విస్తృతికి, అలాగే మరిన్ని ఉద్యోగావకాశాల కల్పనకు దోహదపడగలదని పరిశ్రమవర్గాలు తెలిపాయి.

రిలయన్స్ డిజిటల్ 'బ్లాక్ ఫ్రైడే డీల్స్'



ముంబై: రిలయన్స్ డిజిటల్ 'బ్లాక్ ఫ్రైడే సేల్' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. ఇందులో భాగంగా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాబ్‌లు, హోమ్ అప్లయెన్స్‌తో పాటు వివిధ ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలను తక్కువ ధరలకు అందిస్తుంది. ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, వన్ కార్డుల నుంచి ఎంపిక చేసిన డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోలు చేస్తే రూ. 10వేలు వరకు తక్షణ తగ్గింపు పొందవచ్చు. కన్జూమర్ డ్యూరబుల్ లోన్‌లను ఎంచుకునే వారికి, ఫైనాన్స్ భాగస్వాములైన బజాజ్ ఫిన్‌సర్వ్.. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో రూ.22,500 వరకు క్యాష్‌బ్యాక్ కూడా పొందవచ్చు. రిలయన్స్ డిజిటల్, మైజియో స్టోర్‌లలో లేదా కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లలో ఉత్పత్తులు కొనుగోలు చేయవచ్చు. ఇప్పటికే మొదలైన ఆఫర్ డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

సముద్ర గర్భ మైనింగ్ వేలం ప్రారంభం	గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ 7,500 కోట్ల పెట్టుబడులు

దలాల్ స్ట్రీట్‌పై

బేర్ మెరుపు దాడి

ఎఫ్‌అండ్‌వో ఎక్స్‌పైరీ రోజున భారీ లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 1,190 పాయింట్లు క్రాష్: మళ్లీ 80వేల స్థాయి దిగువకు

24వేల స్థాయిని కోల్పోయిన నిఫ్టీ: 361 పాయింట్లు డౌన్



ముంబై: దలాల్ స్ట్రీట్‌పై బేర్ మెరుపు దాడితో స్టాక్ సూచీలు గురువారం ఒకటిన్నర శాతం నష్టపోయాయి. బలహీన అంతర్జాతీయ సంకేతాలకు తోడు, నెలవారీ ఎక్స్‌పైరీ రోజున లాభాల స్వీకరణతో సూచీలు రెండు నెలల్లో ఒకరోజులో అతిపెద్ద పతనాన్ని చూవిచూసింది. సెన్సెక్స్ 1,190 పాయింట్లు క్షీణించి 80వేల దిగువ 79,044 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 361 పాయింట్లు కోల్పోయి 24వేల స్థాయిని కోల్పోయి 23,914 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,315 పాయింట్లు, నిఫ్టీ 401 పాయింట్లు పతనమయ్యాయి. అమెరికా ద్రవ్యోల్బణ పెరుగుదల, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై అనుమానాలు, ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలకు తోడు రష్యా- ఉక్రెయిన్ యుద్ధం తీవ్రతరమవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడయ్యాయి. ఆసియాలో జపాన్, సింగపూర్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు ఒకటిన్నర శాతం పతనమై రికవరీ అయ్యాయి. యూఎస్ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

సెన్సెక్స్ ఒకటిన్నర శాతం పతనంతో ఒక్కరోజులో మార్కెట్ క్యాప్ రూ.1.21 లక్షల కోట్లు ఆవిరై రూ. 443.27 లక్షల కోట్లకు దిగివచ్చింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెన్సెక్స్ సూచీలో 30 షేర్లకు గానూ ఎస్‌బీఐ (0.55%) మినహా అన్ని షేర్లూ నష్టాన్ని చవిచూశాయి. అత్యధికంగా ఇన్ఫోసిస్, ఎంఅండ్‌ఎం, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 3.50% - 2.50% నష్టపోయాయి. ఐటీ ఇండెక్స్ 2.35% అత్యధికంగా నష్టపోయింది.
- అధిక వెయిటేజీ షేర్లు ఇన్ఫోసిస్ (-3.50%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (-2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (-1%), టీసీఎస్(-2%), ఎంఅండ్‌ఎం(-3.50%) నష్టపోయి సూచీల పతనాన్ని శాసించాయి.
- నష్టాల మార్కెట్లోనూ అదానీ గ్రూప్ షేర్లు రాణించాయి. అదానీ టోటల్ గ్యాస్ 16%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ ఎనర్జీ గ్రీన్ 10%, అదానీ పవర్ 7%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2 శాతం లాభపడ్డాయి.

నష్టాలకు నాలుగు కారణాలు

- అమెరికాలో అక్టోబర్ వినియోగదారుల వ్యయం అంచనాలకు (0.3%) మించి 0.4% పెరిగింది. కొన్ని నెలలుగా ద్రవ్యోల్బణ నియంత్రణ చర్యలు తగ్గుతున్నాయి. దీనికి తోడు ట్రంప్ దిగుమతులపై అధిక సుంకాల విధింపు హెచ్చరికల నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యోల్బణాన్ని రెండుశాతం దిగువకు తీసుకొచ్చే లక్ష్యానికి ఆటంకం నెలకొంది.
- డిసెంబర్‌లో మూడో దఫా వడ్డీరేట్ల తగ్గింపు అంశంపై ఫెడ్ అధికారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు ఇటీవలి ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశ వివరాల్లో వెల్లడైంది. దీంతో 75 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేట్లపై కోతపై ఆశలు పెట్టుకున్న ఇన్వెస్టర్లు ఆందోళన చెందారు.
- అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు అనూహ్యంగా పెరిగాయి. డాలర్ ఇండెక్స్ 106.39 స్థాయికి చేరింది. బాండ్లపై రాబడులు పెరగడంతో భారత్ లాంటి వర్ధమాన దేశాల నుంచి అమెరికాకు పెట్టుబడులు తరలిపోతాయి. డాలర్ బలంతో విదేశీ పెట్టుబడుదారులకు వ్యయాలు పెరుగుతాయి. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది.
- దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈ వారంలో వరుస మూడు రోజులు పాటు నికర కొనుగోలుదారులుగా నిలిచి ఎఫ్‌ఐఐలు తిరిగి అమ్మకాలకు పాల్పడ్డారు. గురువారం ఏకంగా రూ. 11,756 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

తెలుగు రాష్ట్రాల్లో రెట్టింపు వ్యాపారం

నాలుగేళ్లలో స్టార్ హెల్త్ లక్ష్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వచ్చే నాలుగేళ్లలో రెట్టింపు వ్యాపారం సాధించాలని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. గత ఆర్థిక సంవత్సరం తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియం రూ. 1,352 కోట్లుగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 1,655 కోట్లు నిర్దేశించుకున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ గురువారమిక్కడ తెలిపారు. రెండు రాష్ట్రాల్లో గత అయిదేళ్లలో రూ. 3,330 కోట్ల క్లెయిమ్స్ చెల్లించామని, ప్రస్తుతం 100 శాఖలు, 1,350 మంది ఉద్యోగులు ఉన్నారని వివరించారు. దేశవ్యాప్తంగా కార్యకలాపాలకు సంబంధించి గత ఆర్థిక సంవత్సరం రూ. 15,284 కోట్ల వ్యాపారం సాధించగా, ఈసారి సుమారు రూ. 18,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సనత్ కుమార్ చెప్పారు. ఇంటి వద్దే వైద్య సేవలు పొందే విధంగా హోమ్ హెల్త్‌కేర్, టెలిమెడిసిన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. రెండు రాష్ట్రాల్లో హోమ్ హెల్త్‌కేర్ సేవలు ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు విజయవాడ, వైజాగ్ తదితర 8 నగరాల్లో కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్



భారత్‌కు రెండో విజయం

ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మస్కట్‌లో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో భారత జట్టు 3–2 గోల్స్ తేడాతో జపాన్ జట్టును ఓడించింది. భారత్ తరఫున థోక్‌చోమ్ కింగ్సన్ సింగ్ (12వ నిమిషంలో), రోహిత్ (36వ నిమిషంలో), అరిజీత్ సింగ్ హుండల్ (39వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. జపాన్ జట్టుకు నియో సాటో (15వ, 38వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించాడు. ఈ మ్యాచ్‌లో జపాన్ జట్టుకు ఏకంగా 16 పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. అయితే జపాన్ రెండింటిని మాత్రమే గోల్స్‌గా మలిచింది. భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు దక్కగా ఇందులో రెండింటిని సద్వినియోగం చేసుకుంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో అగ్రస్థానంలో ఉంది. శనివారం జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో చైనీస్ తైపీ జట్టుతో భారత్ తలపడుతుంది.

క్వార్టర్స్‌లో సింధు



లక్నో: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సింధు 21–10, 12–21, 21–15తో ఐరా శర్మ (భారత్)పై శ్రమించి గెలిచింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో చైనా ప్లేయర్ దాయ్ వాంగ్‌తో సింధు ఆడుతుంది. హైదరాబాద్‌కే చెందిన వలిశెట్టి శ్రియాన్షి సంచలనం సృష్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రియాన్షి 21–12, 21–15తో ప్రపంచ 32వ ర్యాంకర్ మాళవిక (భారత్)ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారులు, టాప్ సీడ్ లక్ష్య సేన్... రెండో సీడ్ ప్రియాన్షు రజావత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టగా... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది.



'ఇక్కడ క్రికెట్ ఆడటం చాలా ఇష్టం'

ఆస్ట్రేలియాతో సిరీస్‌పై రోహిత్ శర్మ వ్యాఖ్య

రేపటి నుంచి పీఎం ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత క్రికెట్ బృందం ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. విదేశీ జట్టు ఆస్ట్రేలియాకు వచ్చినప్పుడు ఆటగాళ్లకు అధికారిక విందు ఇచ్చే సంప్రదాయం ఈసారీ కొనసాగింది. శని, ఆదివారాల్లో భారత్, ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్ జట్ల మధ్య మనుకా ఓవల్ మైదానంలో రెండు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ (పింక్ బాల్‌తో) జరుగుతుంది. ఈ నేపథ్యంలో గురువారం పార్లమెంట్‌లో ఆల్బనీస్ ఇచ్చిన ప్రత్యేక రిసెప్షన్‌లో టీమిండియా సభ్యులంతా పాల్గొన్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ జట్టు సభ్యులను ఆస్ట్రేలియా ప్రధానికి పరిచయం చేయగా... తొలి టెస్టు విజయంలో కీలక పాత్ర పోషించిన కోహ్లి, బుమ్రాలను ఆల్బనీస్ ప్రత్యేకంగా ప్రశంసించారు. 'అద్భుతంగా ఆడుతున్న భారత జట్టుతో తలపడటం మా ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్‌కు పెద్ద సవాల్' అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. పీఎం ఎలెవన్‌కు నాయకత్వం వహిస్తున్న జాక్ ఎడ్వర్డ్స్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అనంతరం రోహిత్ శర్మ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రికెట్‌లో పాటు ఇతర రంగాల్లోనూ సుదీర్ఘ బంధం ఉందని, ఇక్కడికి వచ్చి ఆడటం తమకు ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని అతను వ్యాఖ్యానించాడు. 'ఆస్ట్రేలియాలో ఆడటం, ఇక్కడి భిన్న సంస్కృతిని ఆస్వాదించడాన్ని భారత ఆటగాళ్లంతా ఇష్టపడతారు. విభిన్న నగరాలు విభిన్న అనుభవాలను ఇస్తాయి. ఇక మైదానంలో సమరాల గురించి కొత్తగా చెప్పేదేముంది. ఆస్ట్రేలియాతో తలపడి గెలవాలని అంతా కోరుకుంటారు. ఈ పోటీతత్వమే మేం ఇక్కడ మరింత పట్టుదలగా ఆడేలా చేస్తుంది. ఆటతో పాటు పర్యటనను అన్ని రకాలుగా మేం ఆస్వాదిస్తాం. గత వారం చూపిన ప్రదర్శనను మున్ముందు కొనసాగిస్తాం. ఇరు దేశాల క్రికెట్ అభిమానులకు పూర్తి స్థాయి వినోదం అందించగలమని నమ్ముతున్నాం' అని రోహిత్ శర్మ అన్నాడు. డిసెంబర్ 6 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య అడిలైడ్‌లో రెండో టెస్టు (డే అండ్ నైట్) జరుగుతుంది.

స్వియాటెక్ 'డోపీ'

పోలాండ్ టెన్నిస్ స్టార్‌పై నెల రోజుల నిషేధం



లండన్: అంతర్జాతీయ టెన్నిస్‌లో అగ్ర స్థాయిలో మరోసారి డోపింగ్ ఉదంతం కలకలం రేపింది. ఇటీవలే పురుషుల నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) డోపింగ్‌లో పట్టుబడగా ఈసారి మహిళల స్టార్ ప్లేయర్ వంతు వచ్చింది. ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీల విజేత, ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) డోపింగ్‌లో పట్టుబడింది. అయితే అదృష్టవశాత్తూ ఆమె తక్కువ శిక్షకే పరిమితమైంది. స్వియాటెక్‌పై కేవలం నెల రోజుల నిషేధం విధిస్తున్నట్లు ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) ప్రకటించింది. ఈ ఉదంతంలో స్వియాటెక్‌పై ఇప్పటికే తాత్కాలిక నిషేధం విధించారు. ఆమె దీనిని సవాల్ చేయడానికి ముందు ఈ ఏడాది సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 4 మధ్య కాలంలో సస్పెన్షన్‌లోనే ఉంది. ఆ సమయంలో స్వియాటెక్ మూడు టోర్నీలో కొరియా ఓపెన్, చైనా ఓపెన్, వుహాన్ ఓపెన్‌లకు దూరమైంది. దాంతో మరో ఎనిమిది రోజులు మాత్రమే ఆమె శిక్ష మిగిలి ఉండగా... ఇది డిసెంబర్ 4తో ముగుస్తుంది. గత రెండు సీజన్లలో ఎక్కువ భాగం వరల్డ్ నంబర్‌వన్‌గా ఉన్న స్వియాటెక్ వరుస విజయాలతో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. టోర్నీలో లేని సమయంలో ఆగస్టులో ఆమె ఇచ్చిన శాంపిల్స్‌లో డోపీగా తేలింది. నిషేధిత ఉత్ప్రేరకం 'ట్రైమెటాజిడైన్'ను ఆమె వాడినట్లు పరీక్షలో బయటపడింది. అయితే ఇది తాను ఉద్దేశపూర్వకంగా తీసుకోలేదని పేర్కొంది. జెట్ లాగ్, నిద్రలేమి వంటి సమస్యల కోసం వాడిన మందులో ఇది ఉందని, దీని వాడకం తమ దేశంలో చాలా సాధారణమని ఆమె వివరణ ఇచ్చింది. విచారణ సమయంలో స్వియాటెక్ వివరణపై సంతృప్తి చెందిన ఐటీఐఏ ఆమె తప్పేమీ లేదంటూ స్వల్ప శిక్షతో సరిపెట్టింది. నెల రోజుల నిషేధంతో పాటు 1,58,944 డాలర్లు (రూ. 1 కోటి 34 లక్షలు) జరిమానాగా విధించింది. 23 ఏళ్ల స్వియాటెక్ ఇప్పటి వరకు కెరీర్‌లో మొత్తం 21 సింగిల్స్ టైటిల్స్ సాధించింది. ఇందులో ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీలు (ఫ్రెంచ్ ఓపెన్–2024, 2023, 2022, 2020; యూఎస్ ఓపెన్–2022) కూడా ఉండటం విశేషం.

'హైబ్రిడ్' మోడల్‌పైనే చర్చ!

- నేడు ఐసీసీ కీలక సమావేశం
- చాంపియన్స్ ట్రోఫీపై నిర్ణయం తీసుకునే అవకాశం



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ విషయంలో కీలక నిర్ణయం వెలువడే సమయం వచ్చింది. పాకిస్తాన్ వేదికగా 2025 ఫిబ్రవరి–మార్చి నెలలో ఈ టోర్నీ జరగాల్సి ఉంది. అయితే భారత క్రికెట్ జట్టు పాక్‌కు వెళ్లేందుకు నిరాకరించడంతో వేదిక విషయంపై సందిగ్ధత నెలకొంది. టోర్నీ ప్రసారకర్తలతో ఒప్పందం ప్రకారం కనీసం 90 రోజుల ముందు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు అది జరగనేలేదు. ఈ నేపథ్యంలో ఐసీసీ బోర్డు సభ్యులు శుక్రవారం సమావేశం కానున్నారు. వర్చువల్ పద్ధతిలో జరిగే ఈ సమావేశంలో చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ విషయంలో ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తారు. లేదంటే ఓటింగ్ కూడా జరపాల్సి రావచ్చు. ఎనిమిది దేశాలు పాల్గొనే ఈ వన్డే టోర్నీకి సంబంధించి ఐసీసీ వద్ద చర్చ కోసం మూడు ప్రతిపాదనలు ఉన్నాయి. మొదటిది హైబ్రిడ్ మోడల్. దీని ప్రకారం దాదాపు అన్ని మ్యాచ్‌లు పాకిస్తాన్‌లోనే నిర్వహించి భారత్ ఆడే మ్యాచ్‌ల కోసం మరో దేశంలో ప్రత్యామ్నాయ వేదికను చూడటం. భారత్ నాకౌట్ దశకు చేరితే కూడా ఇదే వర్తిస్తుంది. ప్రస్తుత స్థితిలో ఇది సరైందిగా ఐసీసీ భావిస్తోంది. గత ఏడాది ఆసియా కప్‌ను కూడా ఇలాగే నిర్వహించారు. అయితే దీనికి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ససేమిరా అంటోంది. దీనికి ఒప్పుకునేది లేదని గురువారం మరోసారి ఐసీసీకి సమాచారం అందించింది. రెండో ప్రతిపాదనతో పూర్తిగా టోర్నీలో మరో దేశంలో (యూఏఈ కావచ్చు) నిర్వహించి ఆతిథ్య హక్కులు మాత్రం పాకిస్తాన్ వద్దే ఉంచడం. అయితే ఇప్పటికే టోర్నీ కోసం లాహోర్, కరాచీ స్టేడియాలను ఆధునీకరించి సిద్ధమవుతున్న పాకిస్తాన్ దీనికి ఎలాగూ అంగీకరించదు. పైగా 1996 వరల్డ్ కప్ తర్వాత అక్కడ ఒక్క ఐసీసీ టోర్నీ జరగలేదు. టోర్నీ దేశం దాటిపోతే ఆర్థికపరంగా బాగా నష్టం కూడా. మూడోది భారత్ లేకుండా టోర్నీని జరపడం. వాణిజ్యపరమైన అంశాలను చూసుకుంటే ఇది అసాధ్యమైన ప్రతిపాదన. మరోవైపు లీగ్ దశలో భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌ను ఎక్కడ జరపాలనే అంశంపై కూడా ప్రత్యేక చర్చ జరగనుంది. హైబ్రిడ్ మోడల్‌కు తాము అంగీకరించాలంటే భారత్‌లో రాబోయే ఐదేళ్లలో జరిగే నాలుగు టోర్నీలకు కూడా దీనిని వర్తింపజేస్తామని హామీని ఇవ్వాలని... తాము భారత్‌కు వెళ్లమని పాక్ డిమాండ్ చేసే అవకాశం ఉంది.

శ్రీలంక 42 ఆలౌట్

- తమ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు నమోదు
- 7 వికెట్లతో హడలెత్తించిన జాన్సన్
- 281 పరుగుల ఆధిక్యంలో దక్షిణాఫ్రికా



జాన్సన్

డర్బన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో శ్రీలంక జట్టు పేలవ ప్రదర్శన కనబర్చింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక జట్టు 13.5 ఓవర్లలోనే 42 పరుగులకే కుప్పకూలింది. టెస్టు క్రికెట్‌లో శ్రీలంక జట్టుకిదే అత్యల్ప స్కోరు. 2004లో పాకిస్తాన్ చేతిలో లంక 71 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా పేసర్ మార్కో జాన్సన్ (7/13) ధాటికి లంక విలవిలలాడింది. కమిందు (13), లహిరు (10 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా... మిగిలిన వాళ్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 80/4తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 49.4 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటైంది. బవుమా (70; 9 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. లంక బౌలర్లలో లహిరు, అశిత చెరో 3 వికెట్లు పడగొట్టారు. 149 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న దక్షిణాఫ్రికా రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా ప్రస్తుతం 281 పరుగుల ఆధిక్యంలో ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...



సుప్రభాతం.. సూక్ష్మరూపం

- 10X15 మిల్లీ మీటర్ల పరిమాణంలో తయారీ.. నిర్మల్ కళాకారుడు రాజేంద్ర ఘనత



నిర్మల్ ఖిల్లా: నిర్మల్‌కు చెందిన కళాకారుడు సూక్ష్మరూపంలో వేంకటేశ్వరస్వామి సుప్రభాతం పుస్తకాన్ని తయారుచేసి అబ్బురపరిచారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌వాసి బిట్లింగు రాజేంద్ర ప్రస్తుతం ఉపాధి నిమిత్తం ముంబైలో ఉంటున్నారు. సూక్ష్మ కళాఖండాలను తయారు చేస్తూ మీనియేచర్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. అత్యంత సూక్ష్మ పరిమాణంలో 10x15 మిల్లీమీటర్ల సైజులో చేతిరాతతో తయారు చేసిన పుస్తకం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రాజేంద్ర గతంలోనూ బియ్యపు గింజలపై దేవతామూర్తుల విగ్రహాలను చెక్కి పలువురి ప్రశంసలు పొందారు. గతంలో సూక్ష్మరూపంలో భగవద్గీతను రూపొందించి హార్వర్డ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్నారు.

జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణ సిద్ధం

పీటీ ఉషకు తెలిపిన జితేందర్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణ సిద్ధంగా ఉందని భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, రామసహాయం రఘురాంరెడ్డి, కడియం కావ్యలతో కలిసి జితేందర్‌రెడ్డి ఆమెతో సమావేశం అయ్యారు. నేషనల్ గేమ్స్ నిర్వహించడానికి హైదరాబాద్‌లో ఉన్న అనుకూలతను, సౌకర్యాలను పీటీ ఉషకు వివరించారు. అంతకుముందు.. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియాను జితేందర్‌రెడ్డి కలిశారు. 2025లో 'ఖేలో ఇండియా' క్రీడలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారని గుర్తు చేస్తూ ఆ లేఖను అందజేశారు. సీఎం రాసిన లేఖలోని అంశాలను వివరించారు. అయితే.. 2025లో బిహార్ రాష్ట్రంలో ఈ క్రీడలు నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించామని, 2026లో హైదరాబాద్‌లో నిర్వహించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు జితేందర్‌రెడ్డికి కేంద్రమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ మేరకే 'ఖేలో ఇండియా–2026' పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని జితేందర్‌రెడ్డి తెలిపారు.

మంత్రి కొండా సురేఖకు 'పరువు నష్టం' నోటీసులు

సిటీ కోర్టులు: సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసు పిటిషన్‌ను విచారణకు అనుమతిస్తూ మంత్రి కొండా సురేఖకు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 12న కోర్టుకు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నాగచైతన్య–సమంత విడాకుల విషయంపై మంత్రి కొండా సురేఖ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున నాంపల్లిలో కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసు గత విచారణలో నాగార్జున తరఫు న్యాయవాది అశోక్‌రెడ్డి, కొండా సురేఖ తరఫు న్యాయవాది గుర్మిత్‌సింగ్ వాదనలు వినిపించగా, ఉత్తర్వులను కోర్టు రిజర్వ్ చేసింది. గురువారం విచారణ జరిపిన స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ (ప్రజాప్రతి నిధుల) కోర్టు జడ్జి శ్రీదేవి.. నాగార్జున వేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి విచారణకు ఆమె వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు.



118 మంది ఒకటే బాత్రూం

మహబూబాబాద్ అర్బన్: ఈ పాఠశాలలో మొత్తం 250 మంది విద్యార్థులు.. అందులో 132 మంది బాలురు.. బాలికలు 118 మంది.. కానీ ఉన్నది ఒక్కటే మూత్రశాల. బాలురకు చెరువు కట్టే దిక్కు కాగా, బాలికలు ఒకరి తరువాత ఒకరు క్యూలైన్ కట్టాల్సిందే. ఇదేదో మారుమూల గ్రామంలో కాదు.. జిల్లా కేంద్రం పరిధిలోని ఓ ఉన్నత పాఠశాలలో దుస్థితి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఈదులపూసపల్లి పరిధి ఒకటో వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలు, బాలురకు కలిపి ఒకే మూత్రశాల ఉంది. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగంలో ఉన్నాయి. బహిర్భూమికి వెళ్లాల్సిన పరిస్థితి వస్తే ఇంటికి పోవాల్సిందే. మగపిల్లలు సమీపంలోని చెరువుకట్టకు వెళ్తుండగా, బాలికలు క్యూలైన్‌లో నిలబడి మూత్రశాలకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో నూతన మరుగుదొడ్లు నిర్మించాలని, లేకపోతే తమ పిల్లలకు టీసీలు ఇవ్వాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారు. పలుమార్లు విద్యాశాఖ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇచ్చామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

ఆన్‌లైన్ ఆకతాయిలపై సైబర్ గస్తీ!

అత్యాధునిక టూల్స్‌తో సైబర్ పెట్రోలింగ్

- చైల్డ్ పోర్నోగ్రఫీ విక్రయిస్తున్న ముఠాల గుట్టురట్టు
- ఇతర రాష్ట్రాల్లోని 65 మంది నేరస్తుల గుర్తింపు
- కీలక పాత్ర పోషిస్తున్న షీ సైబర్ ల్యాబ్
- తెలంగాణ పోలీసుల సమాచారంతో ఇతర రాష్ట్రాల్లో 21 మంది అరెస్టు

సాక్షి, హైదరాబాద్

బస్‌స్టాప్‌లు, కార్యాలయాలు, మార్కెట్లు, సినిమాహాళ్లు.. ఇతర రద్దీ ప్రాంతాల్లో మహిళలు, యువతులను వేధించే పోకిరీలను గతంలో ఎక్కువగా చూసేవాళ్లం. ఇప్పుడు సాంకేతికత పెరిగిన తర్వాత ఆన్‌లైన్ ఆకతాయిలు ఎక్కువయ్యారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలపై అడ్డగోలుగా కామెంట్లు పెట్టడం.. వ్యక్తిగతంగా సందేశాలు పంపి విసిగించడం.. ఆన్‌లైన్‌లో అశ్లీల పనులు విపరీతంగా పెరిగాయి. ఇలాంటి ఆన్‌లైన్ ఆకతాయిల ఆట కట్టించేందుకు తెలంగాణ పోలీసులు ఆన్‌లైన్ గస్తీ నిర్వహిస్తున్నారు. పలు సోషల్ మీడియా ఖాతాలతోపాటు, టిండర్, ట్రూలీ మ్యాడ్లీ, బుమ్లే వంటి డేటింగ్ యాప్‌లలో ఫేక్ ప్రొఫైల్స్‌తో ప్రవేశించి ఆన్‌లైన్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర మహిళా భద్రత విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ సైబర్ ల్యాబ్ సిబ్బంది అత్యాధునిక సాంకేతికత, ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ టూల్స్‌ను వినియోగించి 'హద్దు దాటే' వారికి బుద్ధి చెబుతున్నారు. తెలంగాణకే పరిమితం కాకుండా తాము గుర్తించిన లీడ్స్ (సమాచారం)తో ఇతర రాష్ట్రాల్లోని నిందితులను కూడా కటకటాల వెనక్కి నెట్టడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. చిన్నారుల అశ్లీల వీడియోలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఒక వ్యక్తిని తెలంగాణ మహిళా భద్రత విభాగం ఇచ్చిన సమాచారంతో ఇటీవలే పశ్చిమబెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు.



13 రాష్ట్రాల్లోని సీఎస్ఏఎం లింకుల గుర్తింపు

షీ సైబర్ ల్యాబ్ ఇప్పటివరకు చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (సీఎస్ఏఎం)కు సంబంధించి 180 లీడ్స్‌ను గుర్తించింది. చిన్నారుల అశ్లీల వీడియోలు ఈ ముఠాలు ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నట్టు కీలక ఆధారాలు సేకరించడంతోపాటు 65 ఇంటెలిజెన్స్ రిపోర్టులను మొత్తం 13 రాష్ట్రాలకు పంపారు. వీటి ఆధారంగా దేశవ్యాప్తంగా 20 ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి, 21 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠాలు టెలిగ్రామ్‌లో గ్రూప్‌లు ఏర్పాటుచేసి, వాటి ద్వారా చిన్నారుల అశ్లీల వీడియోలు విక్రయిస్తూ.. గూగుల్‌పే, పేటీఎం ద్వారా డబ్బులు తీసుకుంటున్నట్టు గుర్తించారు.

కీలకంగా షీ సైబర్ ల్యాబ్

స్త్రీలు, పిల్లలపై జరిగే సైబర్ నేరాలను అరికట్టేందుకు మహిళా భద్రతా విభాగంలో షీ సైబర్ ల్యాబ్‌ను ఏర్పాటుచేశారు. ఇది మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక సాంకేతిక, పరిశోధనాత్మక మద్దతును అందిస్తూ, ఎక్సలెన్స్ సెంటర్‌గా పనిచేస్తుంది. సైబర్ అడ్వొకసీ, కెపాసిటీ బిల్డింగ్, ఇన్వెస్టిగేటివ్ అసిస్టెన్స్, సైబర్ క్రైమ్ సపోర్ట్‌పై దృష్టి సారిస్తోంది. తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల పోలీసు సంస్థలకు సహాయం అందిస్తోంది. నేరస్థులను గుర్తించడం కోసం డేటా అనలిటిక్స్ అందించడం ద్వారా వివిధ విభాగాలకు సహాయం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దర్యాప్తు అధికారులకు సైబర్ ఫోరెన్సిక్ మద్దతును అందిస్తోంది

వివిధ రాష్ట్రాల్లో షీ సైబర్ ల్యాబ్ గుర్తించిన లీడ్స్, ఎఫ్ఐఆర్, అరెస్టు

లీడ్స్	ఎఫ్ఐఆర్‌లు	అరెస్టులు
65	20	21

ఇతర రాష్ట్రాల్లోని నేరస్థులనూ గుర్తిస్తున్నాం



మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడుతున్న వారిపై, ఆన్‌లైన్‌లో అనుమానాస్పద చర్యలకు పాల్పడేవారిపై షీ సైబర్ ల్యాబ్ ద్వారా నిఘా పెడుతున్నాం. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల క్రిమినల్ నెట్‌వర్క్‌లను కూడా గుర్తిస్తున్నాం. మేం ఇచ్చిన సమాచారంతో ఇటీవలే పశ్చిమ బెంగాల్ పోలీసులు ఒకరిని అరెస్టు చేయటంతో చిన్నారుల అశ్లీల వీడియోలు విక్రయిస్తున్న ముఠా వివరాలు తెలిశాయి.

–శిఖా గోయల్
డీజీ, మహిళా భద్రత విభాగం

సాక్షి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో..

సివిల్స్, గ్రూప్స్ పరీక్షల కోసం ప్రత్యేక వెబ్‌నార్

సాక్షి ఎడ్యుకేషన్: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఐఈఎస్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి కోసం సాక్షి ఎడ్యుకేషన్ ప్రత్యేకంగా ఓ వెబ్‌నార్ సిరీస్‌ను నిర్వహిస్తోంది. ఈ సిరీస్‌లో భాగంగా 1857–1947 మధ్యకాలంలో బ్రిటిష్ పాలనలో 'భారతదేశం ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై నవంబర్ 30న సాయంత్రం 4:30 నుంచి 6:00 వరకు వెబ్‌నార్‌ను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసీఎఫ్ఏఐ డీన్ ప్రొఫెసర్ తమ్మా కోటిరెడ్డి, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, అస్సాం గోల్‌పారా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాష్ బర్మాన్, సెయింట్ ఆన్స్ కాలేజీ ఫర్ ఉమెన్ హెచ్‌ఓడీ సునీత ఈసంపల్లి పాల్గొంటారు. యూపీఎస్సీ, గ్రూప్స్ మొదలైన పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ వెబ్‌నార్ పూర్తయిన తర్వాత పూర్తి వీడియోను సాక్షి ఎడ్యుకేషన్ యూట్యూబ్ చానల్ (https:/ www.youtube.com/ @sakshibhavita)లో చూడొచ్చు. Sakshieducation.comలో ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవసరమైన ఇలాంటి విలువైన సమాచారాన్ని ఇస్తున్న విషయం తెలిసిందే.

జూమ్ మీటింగ్ జాయిన్ అయ్యేందుకు వెబ్‌నార్ లింక్
http://surl.li/klqtha
Meeting ID: 868 9395 5345
Passcode: 026085

వెలిగిపోతున్న వైకుంఠద్వారం



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండకు దిగువనున్న వైకుంఠద్వారం విద్యుత్ కాంతుల్లో జిగేల్‌మంటోంది. శుక్రవారం శ్రీస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి కావడంతో.. భక్తులు వైకుంఠద్వారం నుంచి గిరి ప్రదక్షిణ చేయనున్నారు. ఈ సందర్భంగా వైకుంఠద్వారం వద్ద ఉదయం 4గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. ప్రతి నెలలో వచ్చే స్వాతి నక్షత్రం రోజు గిరి ప్రదక్షిణ చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామి వారి క్షేత్రానికి వస్తున్న నేపథ్యంలో ఈ ఏర్పాట్లను ఈవో భాస్కర్‌రావు చేయించారు.

'టీ–హబ్' స్టార్టప్‌ల వ్యవస్థాపకులకు కర్మవీర్ చక్ర అవార్డులు



కర్మవీర్ చక్ర అవార్డులను పొందిన రుమానాసిన్హా సెహగల్, అక్షయ్, అభిషేక్‌లు

రాయదుర్గం: ప్రముఖ ఆంట్రప్రెన్యూర్, టీ–హబ్ మెంటర్ రుమానా సిన్హా సెహగల్‌తోపాటు టీ–హబ్ సహకారంతో స్టార్టప్‌లు నెలకొల్పిన గూడీబ్యాగ్ వ్యవస్థాపకుడు అభిషేక్ అగర్వాల్, స్విచెకో వ్యవస్థాపకుడు అక్షయ్ దేశ్‌పాండేకు అరుదైన గౌరవం లభించింది. నూతన పరిష్కారాలతో సమాజంలో సానుకూల మార్పు తీసుకొచ్చే వ్యక్తులకు ఐక్యరాజ్యసమితి (యూఎన్), ఎన్జీవోల అంతర్జాతీయ సమాఖ్య (ఐ–కాంగో) ఏటా అందించే కర్మవీర్ చక్ర అవార్డులకు వారు ఎంపికయ్యారు. ఈ నెల 25–26 తేదీల్లో ఢిల్లీ శివార్లలోని నోయిడాలో జరిగిన కార్యక్రమంలో వారు అవార్డులు అందుకున్నట్లు టీ–హబ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. రుమానాసిన్హా కర్మవీర్ చక్ర ప్లాటినమ్ మెడల్ అందుకోగా అభిషేక్ అగర్వాల్, అక్షయ్ దేశ్‌పాండే కర్మవీర్ చక్ర కాంస్య పతకాలు అందుకున్నట్లు పేర్కొంది. సెరెండిపిటీ అనే స్టార్టప్ వ్యవస్థాపకురాలు కూడా అయిన రుమానాసిన్హా తెలంగాణ నుంచి ఈ అవార్డు అందుకున్న మొదటి పారిశ్రామికవేత్తగా చరిత్ర సృష్టించారు. నగరాల సుస్థిర, పునరాభివృద్ధికి తన సంస్థ ద్వారా నూతన ఆవిష్కరణలు అందిస్తున్నారు. స్విచెకో పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్ పరిష్కారాలను అందిస్తుండగా గూడీబ్యాగ్ వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ కార్యకలాపాలు సాగిస్తోంది.

రీజనల్ రింగు ఉత్తర భాగానికి రూ.2,600 కోట్ల రుణం

- హడ్కో నుంచి తీసుకోనున్న ప్రభుత్వం?
- పరిహారంలో తన వంతు వాటాగా త్వరలో కేంద్రానికి చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు నిర్మాణ పనులను వీలైనంత తొందరలో చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఉత్తర భాగానికి సంబంధించిన భూపరిహారంలో తన వంతు వాటా రూ.2,600 కోట్లను కేంద్రానికి చెల్లించేందుకు కసరత్తు చేస్తోంది. అంత మొత్తంలో నిధులు ఇప్పటికిప్పుడు ఖజానా నుంచి కేటాయించటం కష్టంగా మారిన నేపథ్యంలో హడ్కో నుంచి ప్రభుత్వం రుణం తీసుకుంటోంది. గతంలోనే హడ్కోకు దరఖాస్తు చేసుకోగా, తాజాగా అది మంజూరైనట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం ఎన్‌హెచ్ఏఐ అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దీనిపై చర్చించినట్టు తెలిసింది. మరికొద్ది రోజుల్లో పరిహారం పంపిణీకి వీలుగా గ్రామాల వారీగా అవార్డులు పాస్ చేయనున్నారు. డిసెంబర్ నెలాఖరుకుగాని లేదా జనవరి ప్రథమార్థంలో గాని ఉత్తరభాగానికి టెండర్లు పిలవనున్నారు. ఇప్పటికే కన్సల్టెన్సీ సంస్థ టెండరు డాక్యుమెంటును సిద్ధం చేసి ఎన్‌హెచ్ఏఐకి సమర్పించింది. త్వరలో డీపీఆర్ కూడా తయారు కానుంది. ఇవన్నీ పూర్తవగానే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై చర్చించినట్టు సమాచారం. ఈ అంశంపై కూడా ఎన్‌హెచ్ఏఐ అధికారుల సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి ప్రస్తావించినట్టు తెలిసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా చేపట్టనున్న దక్షిణ భాగం రింగురోడ్డు నిర్మాణానికి కన్సల్టెన్సీ సేవలకు గాను ఇటీవలే గ్లోబల్ టెండర్లు పిలిచింది. మరోవైపు అలైన్‌మెంట్ తయారీకి అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆమేరకు కసరత్తు చేస్తోంది.

రేవంత్‌పై పరువు నష్టం కేసు 11కు వాయిదా

సిటీ కోర్టులు: బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు అయ్యారు. దీంతో తదుపరి విచారణను నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు డిసెంబర్ 11కు వాయిదా వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే, 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

మెట్రో రెండో దశతో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైల్ 7వ వార్షికోత్సవంలో ఎన్వీఎస్ రెడ్డి
రెండో దశ నిర్మాణానికి నిధుల లభ్యత పుష్కలమని వెల్లడి



హైదరాబాద్ మెట్రో రైల్ ఏడో వార్షికోత్సవం సందర్భంగా పెయింటింగ్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి, కేవీబీ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టు భాగ్యనగర అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలవనుందని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ సంస్థల ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ప్రపంచంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా, అద్భుతమైన గ్లోబల్ సిటీగా అవతరించనుందని చెప్పారు. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టును ప్రారంభించి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఆధ్వర్యంలో అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో గురువారం 7వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో రెండో దశకు ఇప్పటికే భూసేకరణ ప్రారంభమైందని.. త్వరలోనే ప్రాథమిక పనులను ప్రారంభిస్తామని చెప్పారు. రెండో దశ ప్రాజెక్టుకు నిధుల లభ్యత పుష్కలంగా ఉందని.. కేంద్రం అనుమతి లభించగానే పెట్టుబడి పెట్టేందుకు మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని ఆయన వివరించారు.

అదనపు కోచ్‌ల కోసం సన్నాహాలు...

ప్రస్తుతం రూ. 6 వేల కోట్లకుపైగా నష్టాలతో మెట్రో నడుస్తున్నప్పటికీ వచ్చే మూడు, నాలుగేళ్లలో నష్టాలను అధిగమించి లాభాల బాటలో పయనించే అవకాశం ఉందని ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మెట్రో రైళ్ల ఆపరేషన్‌ను మరింత సమర్థంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం కొత్త కోచ్‌లను తెప్పించేందుకు సన్నాహాలు చేపట్టామని.. మరో 3 నెలల్లో అదనపు కోచ్‌లకు పరిష్కారం లభిస్తుందని ఆయన వివరించారు. అయితే భద్రతా తనిఖీలు పూర్తి చేసుకొని ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చేందుకు 12–15 నెలలు పట్టొచ్చన్నారు. 10 లక్షల మంది ప్రయాణించేలా అదనపు కోచ్‌లు, రైళ్ల నిర్వహణ ఉంటుందని వివరించారు. కాగా, ఈ ఏడేళ్లలో మెట్రో రైళ్లలో 63.40 కోట్ల మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకున్నారు.

పెండింగ్ కేసులపై ఎక్సైజ్ అధికారుల దృష్టి

'ప్రచారం పీక్.. దర్యాప్తు వీక్' కథనంపై స్పందించిన అధికారులు
- 3 వేలకు పైగా పెండింగ్ కేసులు ఉన్నట్టు అంచనా

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సిబ్బందిని ఆదేశించారు. 'సాక్షి'లో ఈ నెల 27న 'ప్రచారం పీక్.. దర్యాప్తు వీక్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువగా పెండింగ్ కేసులు ఏయే స్టేషన్ల పరిధిలో ఉన్నాయి.. అందుకు కారణాలు, కేసుల దర్యాప్తును వేగవంతం చేయడానికి ఏం చర్యలు తీసుకోవాలన్నదానిపై సుదీర్ఘంగా ఓ సర్క్యులర్‌ను జారీ చేసినట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 139 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 40కి పైగా స్టేషన్లలో ఎక్కువగా ఎన్‌డీపీఎస్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. మొత్తం మూడువేలకు పైగా కేసులు దర్యాప్తులో ఉన్నట్టు తెలిసింది. కేసుల దర్యాప్తునకు సంబంధించిన యాక్షన్‌ప్లాన్‌ను మే మొదటి వారం వరకు సమర్పించాలని జిల్లా ఎక్సైజ్ అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతి వారం పెండింగ్ కేసుల పురోగతిపైనా అబ్కారీశాఖ కార్యాలయంలోని కంట్రోల్ రూంకు పంపాలని సైతం సూచించినట్టు సమాచారం.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా.. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. డిసెంబర్ 1వ తేదీకల్లా బిల్లులు విడుదల చేయకపోతే.. కుటుంబాలతో కలిసి ఎక్కడి కక్కడ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆయన గురువారం సంఘనేతలు రాంపాక నాగయ్య, గుంటి మధు సూదన్ రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సొంత నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు.. బిల్లులు అడిగితే నిర్బంధాలకు గురిచేస్తూ అరెస్టు చేయడం ప్రభుత్వానికి తగదన్నారు.

సీడ్.. ఎదుగుదల స్పీడ్

తొలిసారిగా బయోపాలిమర్ ఆధారిత సీడ్ కోటింగ్
- భూమిలోని సూక్ష్మజీవులు, పోషకాలు నాశనమైన నేపథ్యంలో పరిశోధన
- మొక్కల ఎదుగుదల, పంట దిగుబడి పెంచేందుకు 'బయోపాలిమర్'దోహదం
- శ్రీకర్, ఎడుక అగ్రిటెక్‌లతో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్

రసాయన, పురుగు మందుల వ్యవసాయంతో భూమిలోని సూక్ష్మజీవులు, పోషకాలు నాశనమై జీవవైవిధ్యం కోల్పోయిన పరిస్థితుల్లో భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్) సరికొత్త ఆవిష్కరణను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. మొక్కల పెరుగుదల, అధిక దిగుబడికి తోడ్పడేలా సూక్ష్మ పోషకాలు, క్రిమి, శిలీంద్ర సంహారక మందులు విత్తనాలపై ప్రయోగించడానికి ఐసీఏఆర్–ఐఐఓఆర్ శాస్త్రవేత్తలు దేశంలో తొలిసారిగా బయోపాలిమర్ ఆధారిత సీడ్ కోటింగ్ విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ నూతన ఆవిష్కరణకు పేటెంట్ లభించిన నేపథ్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టీఆర్. శర్మ, ఐఐఓఆర్ డైరెక్టర్ ఆర్‌కే.మాథూర్‌లతో శ్రీకర్ అగ్రిటెక్ సీఎండీ లింగా శ్రీనివాసరావు, యాదుకా అగ్రిటెక్ ఎండీ ఆదిత్యలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా బయో పాలిమర్‌తో లభించే ప్రయోజనాలను వివరించే ప్రదర్శన ఏర్పాటు చేశారు.

2015 నుంచి ప్రయోగాలు

ఇప్పటి వరకు విత్తనాలకు రసాయనాలతో కూడిన సింథటిక్ పాలిమర్‌తో సీడ్ కోటింగ్ ప్రక్రియ జరిగిన తర్వాత ఆయా కంపెనీలు విత్తన ప్యాకెట్లను మార్కెట్లోకి తీసుకొచ్చేవి. అయితే సింథటిక్ పాలిమర్ కోటింగ్‌తో వచ్చిన విత్తనాలను రైతులు విత్తినా, సరైన ఎదుగుదల లేకపోవడం, దిగుబడి రాకపోవడాన్ని నూనెగింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్) గుర్తించింది. సుమారు 60 ఏళ్లుగా సాగుతున్న రసాయన వ్యవసాయం వల్ల భూమిలో పోషకాలు, సూక్ష్మ జీవులు నశించిపోయాయని తేల్చారు. జీవవైవిధ్యం కోల్పోయి నిస్సారంగా మారిన భూమిని విత్తనాల ద్వారానే తిరిగి పునరుజ్జీవం చేయాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. తద్వారా కనీసం 35 శాతం దిగుబడిని పెంచాలని భావించారు. ఈ మేరకు ఐఐఓఆర్ ప్రధాన శాస్త్రవేత్త ఆర్‌డీ. ప్రసాద్, మరో శాస్త్రవేత్త పూర్ణ చంద్రిక 2015లో బయోపాలిమర్ ఆధారిత కోటింగ్ విధానంపై ప్రయోగాలు ప్రారంభించారు. గత ఏడాది కొత్తగా బయోపాలిమర్‌ను ఆవిష్కరించిన వీరు భారత ప్రభుత్వం నుంచి పేటెంట్ కూడా పొందారు. ఈ బయోపాలిమర్‌ను వినియోగించి విత్తనాలను అభివృద్ధి చేసేందుకు శ్రీకర్ అగ్రిటెక్, యాదుక అగ్రిటెక్ ముందుకు రావడంతో ఆ సంస్థలతో కలిసి పనిచేశారు ఈ బయో పాలిమర్ ఆధారిత విత్తనాలు వచ్చే నెల నుంచి రైతులకు అందుబాటులోకి వస్తాయని శ్రీకర్ అగ్రిటెక్ సీఎండీ లింగా శ్రీనివాస్‌రావు తెలిపారు. వేరుశనగ, సన్‌ఫ్లవర్, కుసుమ, నువ్వులు వంటి నూనె గింజెలతోపాటు కందులు, శనగలు, వరి వంగడాలను కూడా ఈ బయోపాలిమర్ కోటింగ్ ద్వారా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రి ఇన్నోవేట్ ఇండియా సీఈవో ప్రవీణ్ మాలిక్, ఆర్ఏసీ చైర్మన్ ఎస్‌కే.రావు తదితర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న శ్రీకర్ అగ్రిటెక్ ప్రతినిధులు, నూనెగింజల పరిశోధన సంస్థ అధికారులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఐటీ కాంతుల్లేని దివిటీ..పల్లి!

ఏడాదిన్నర క్రితం మహబూబ్‌నగర్ శివారు దివిటిపల్లిలో ప్రారంభం • జీ ప్లస్ 4 భవనం, మౌలిక సదుపాయాలకు రూ.50 కోట్లు ఖర్చు

మొదట్లో 9 ఐటీ కంపెనీలు వచ్చినా.. ప్రస్తుతం రెండింటికే పరిమితం • మొత్తం లక్ష చదరపుటడుగుల విస్తీర్ణంలో 32 కంపెనీలకు అవకాశం

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వెనక్కి వెళ్లిన ఏడు కంపెనీలు • 'సాక్షి' బృందం పరిశీలనలో పలు అంశాలు వెలుగులోకి..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహబూబ్‌నగర్ శివారు దివిటిపల్లిలో ఏడాదిన్నర క్రితం నిర్మించిన ఐటీ టవర్ ప్రస్తుతం నామమాత్రంగా కొనసాగుతోంది. దీనికి రూ.కోట్లు వెచ్చించి.. స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చినా ఆశించిన ఫలితాలు దక్కడం లేదు.. దీనికి ప్రధాన కారణం ఐటీ కంపెనీలు ఇక్కడికి రాకపోవడమేనని తెలుస్తోంది.. వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు 'సాక్షి'బృందం గురువారం ఐటీ టవర్‌కు వెళ్లగా వివిధ అంశాలు వెలుగులోకి వచ్చాయి.



అధునాతనంగా నిర్మించిన ఐటీ టవర్

ఎన్‌హెచ్-44కు అతి సమీపంలో ఉన్నా..

జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44)కి అతి సమీపంలోని దివిటిపల్లిలో ఐజీ గ్రీన్ కారిడార్ కోసం 2019లోనే 377 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. ఇందులో సుమారు రూ.50 కోట్లతో నాలుగు ఎకరాలలో (జీ ప్లస్4) ఐటీ టవర్‌కు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో అంకురార్పణ జరిగింది. **ఇందులో మొత్తం లక్ష చదరపుటడుగుల విస్తీర్ణం**లో.. నాలుగు అంతస్తుల భవనాన్ని అన్ని హంగులతో అత్యాధునిక పద్ధతిలో నిర్మించారు. ఒక్కొక్క అంతస్తులో 25 వేల చదరపు అడుగుల స్థలాన్ని ఎనిమిది ఐటీ కంపెనీల చొప్పున ఉండేలా వదిలారు. దీనికి 2023 మే 6న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో.. అప్పటి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. ఇక్కడ మొత్తం 32 ఐటీ కంపెనీల కోసం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. ఎన్‌హెచ్-44 చేరడానికి ప్రత్యేక **రోడ్డుతో పాటు 24 గంటల ఇంటర్‌నెట్, విద్యుత్ సర**ఫరా, తాగునీటి సౌకర్యం ఉంది. ఈ భవనం చుట్టూ లాన్‌లో పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం.. ఆపై వాహనాల పార్కింగ్ కోసం విశాల స్థలం ఏర్పాటు చేశారు. ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా క్యాంటీన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రారంభంలో తొమ్మిది ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సుమారు 300 మంది ఉద్యోగులు పనిచేసేవారు. అందరికీ శిక్షణ పేరిట **నెలకు రూ.15 వేల** నుంచి రూ.20 వేల వరకు ఆయా సంస్థల నిర్వాహకులు నియమించుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కంపెనీలు వెనక్కి..

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు ఏడు కంపెనీలు ఎలాంటి కారణాలు చెప్పకుండానే ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిపోయాయి. వీటిలో జువెన్ టెక్నాలజీ, హెచ్‌ఆర్‌ఎస్, ఇ-గ్రోవ్ సిస్టమ్స్, ఇంటిట్యూస్, ఫోర్ **ఓక్స్, ఐటీవర్షన్-360,** అర్బాన్ టెక్ ఉన్నా**యి. ఇప్పుడు** కేవలం రెండు ఐ**టీ సంస్థలు** మాత్రమే ఉండగా **44** మంది ఉద్యోగులే **మి**గిలారు. వీటిలో **గ్లో**బల్ లాజిక్ (రెండో అంతస్తు) సంస్థను అప్పట్లో 75 మంది ఉద్యోగులతో ప్రారంభించారు. ఇక్కడ ప్రస్తుతం 18 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మరో సంస్థ ముల్లర్ డాట్ కనెక్ట్ పేరిట మూడో అంతస్తులో 26 మంది ఉద్యోగులతో కొనసాగుతోంది. వీరందరూ జిల్లాకేంద్రంతో పాటు జడ్చర్ల పట్టణంలో నివసిస్తూ.. ఆయా కంపెనీలు ఏర్పాటు చేసిన క్యాబ్‌లలో ఐటీ టవర్‌కు వచ్చి పనిచేసి వెళ్తున్నారు. తమ కంపెనీ ఉద్యోగులు, ఉత్పత్తులపై 'సాక్షి'బృందానికి వివరించేందుకు నిర్వాహకులు నిరాకరించడం గమనార్హం. లోపలికి ఎవరికీ ప్రవేశం లేదని వారు చెప్పుకొచ్చారు. కనీసం ఉద్యోగుల ఫోన్ నంబర్లు అయినా ఇవ్వలేదు.



దివిటిపల్లిలోని మహబూబ్‌నగర్ ఐటీ టవర్ లోగో



లోపల ఐటీ సంస్థల కోసం అత్యాధునిక గదులు



హైదరాబాద్‌కు తరలిపోయినా.. ఐటీ టవర్‌లో కనిపిస్తున్న ఇ-గ్రోవ్ సిస్టమ్స్ బోర్డు

భారీగా నిధులు.... సిబ్బంది నియామకాలు

ఏడాది కాలంలో వైద్యారోగ్యశాఖలో పలు మార్పులు

సాక్షి, హైదరాబాద్



- రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 2014 నుంచి 2023 అక్టోబర్ వరకు నెలకు సగటున రూ.52 కోట్లు ఖర్చు చేస్తే, 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకూ నెలకు సగటున రూ.76 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది.
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. 11 సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్సల ధరల పెంపు సమస్యను 6 నెలల్లో పరిష్కరించింది.
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే 1,375 వైద్య చికిత్సల ధరలను సుమారు 20 శాతం వరకూ పెంచింది.
- కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకురావడంతో ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్య 1,835కి పెరిగింది.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే ఆరోగ్యశాఖలో 7,750 పోస్టులను భర్తీ చేసింది.
- మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ) ద్వారా మరో 6,494 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.
- మరో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 1,690 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టులు, 308 ఫార్మసిస్ట్ (ఆయుష్) పోస్టుల భర్తీకి త్వరలోనే ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ నోటిఫికేషన్లు ఇవ్వనున్నది.
- ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల కాలంలోనే 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, హాస్టళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.
- ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున, మొత్తం 400 ఎంబీబీఎస్ సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి రాగా, మొత్తం సంఖ్య 4,090కి పెరిగింది.
- కొడంగల్‌లో 50 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కాలేజీ, 50 సీట్ల కెపాసిటీతో ఫిజియోథెరపీ కాలేజీ, 30 సీట్ల కెపాసిటీతో పారామెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతులు జారీ.
- కొడంగల్‌లో 50 పడకల హాస్పిటల్‌ను 220 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది.
- మంచిర్యాలలో 600 బెడ్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేశారు.
- ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం రూ.204.85 కోట్లతో కొత్త హాస్టల్ బిల్డింగ్‌లు మంజూరు.
- 16 నర్సింగ్, 28 పారామెడికల్ కాలేజీలు అందుబాటులోకి..
- ఒక్కో పారామెడికల్ కాలేజీలో 60 సీట్ల చొప్పున, 28 కాలేజీల్లో ఏడాదికి 1,680 మంది విద్యార్థులు పారామెడికల్ కోర్సులను అభ్యసించబోతున్నారు.
- రూ.2 వేల కోట్లతో గోషామహల్‌లోని 32 ఎకరాల్లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి పూర్తయిన భూబదలాయింపు ప్రక్రియ
- రాష్ట్రంలో కొత్తగా 16 డయాలసిస్ సెంటర్ల మంజూరు. ఇప్పటికే ఉన్న 20 డయాలసిస్ సెంటర్లలో అదనంగా 89 డయాలసిస్ మిషన్లు పేషెంట్లకు అందుబాటులోకి..
- డయాలసిస్ పేషెంట్ల సర్జరీలకు సుమారు రూ.33 కోట్లతో వాస్క్యులర్ సెంటర్ల మంజూరు.
- రూ.లక్షల ఖరీదైన ఐవీఎఫ్ సేవలను ఉచితంగా గాంధీ ఆస్పత్రిలో అందుబాటులోకి. త్వరలో పేట్లబుర్జు దవాఖాన, సుల్తాన్‌బజార్ మెటర్నిటీ హాస్పిటల్, వరంగల్ ఎంజీఎంలోనూ ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం.
- రోడ్డు ప్రమాదాలు, ఇతర ఎమర్జెన్సీ సమయాల్లో బాధితుల కోసం ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు
- ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు, ప్రభుత్వ దవాఖాన్లలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీల ప్రతిపాదన.
- 136 నూతన 108 అంబులెన్స్‌లలో గిరిజన ప్రాంతాలకు 45 కేటాయించాలని నిర్ణయం. మిగతా వాటిని మండలాలు, జాతీయ, రాష్ట్ర రహదారుల ప్రాంతాలకు కేటాయింపు

60 శాతం పెన్షన్‌పై క్యాట్ ధర్మాసనం వ్యాఖ్యలు

- సుప్రీంకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమని వెల్లడి
- పలువురు అధికారులు దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

అప్పుడు అంగీకరించి.. ఇప్పుడు అభ్యంతరమా?



సాక్షి, హైదరాబాద్: పదవీ విరమణ సమయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రయోజనం పొందేటప్పుడు 60 శాతం పెన్షన్ నిబంధనలకు అంగీకరించి, ఆ తర్వాత అభ్యంతరం తెలపడం సరికాదని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు నిర్దేశించిన నిబంధనలను, చట్టాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని, హైకోర్టుల ఆదేశాలను మాత్రమే ప్రస్తావిస్తే ప్రయోజనం లేదని స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే 15 ఏళ్ల నిర్ణయం సరైందే అని తీర్పు చెప్పిందని.. అందులో ఇప్పుడు జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

ఒకేసారి ఇచ్చి.. దశలవారీగా కోత

ప్రస్తుత నిబంధన ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో ప్రభుత్వాలు ఏకమొత్తంగా కొంత సొమ్మును చెల్లిస్తున్నాయి. ఆ తర్వాత వారికి వచ్చే పెన్షన్ నుంచి 15 ఏళ్లపాటు (ఉద్యోగికి 75 ఏళ్లు వచ్చేవరకు) ప్రతి నెలా వారి మొత్తం పెన్షన్‌లో 40 శాతం కోత పెట్టి రికవరీ చేసుకొంటున్నాయి. ఈ 15 ఏళ్లపాటు ఉద్యోగులకు 60 శాతమే పెన్షనే ఇస్తున్నాయి. అయితే, తాము పొందిన మొత్తాన్ని వడ్డీతో కలిపి రికవరీ చేయడానికి ఎటువంటి అభ్యంతరం లేదని.. కానీ, 12 ఏళ్లలోపు మొత్తం సొమ్ము రికవరీ అయినప్పుడు సమస్య వస్తోందని అటవీ శాఖకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌లతోపాటు మరికొందరు క్యాట్‌లో పిటిషన్ వేశారు. దీనిపై డా.లతా బస్వరాజ్ పట్నే (న్యాయ), షాలినీ మిశ్రా (అడ్మినిస్ట్రేటివ్) బెంచ్ విచారణ చేపట్టింది. పదవీ విరమణ సమయంలో పొందుతున్నది లోన్ కాదని.. 15 ఏళ్లు 60 శాతం పెన్షన్‌కు అంగీకరిస్తేనే ముందుగా పెద్ద మొత్తం పొందుతారని పేర్కొంది. ఇప్పుడు ఆ నిబంధనను సవాల్ చేయడం సరికాదంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

రవాణా శాఖలో జేటీసీ, డీటీసీ పదోన్నతులు



సాక్షి, హైదరాబాద్: రవాణా శాఖలో ఖాళీగా ఉన్న జేటీసీ, డీటీసీ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. పదోన్నతులు కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్యలు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా రవీందర్ కుమార్, వాణి, సదానందం, కిషన్, సురేష్ రెడ్డి లకు పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన అధికారులు గురువారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీలో..: ఆర్టీసీలో ఖాళీగా ఉన్న టిడిపి పోస్టులను ఎండీ సజ్జనార్ భర్తీ చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ గా ఉన్న ఖుష్రోష ఖాన్ ను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా నియమించారు. హైదరాబాద్ ఆర్ఎం గా ఉన్న వరప్రసాద్ ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా నియమస్తూ సంస్థ అడ్మిన్ బాధ్యతలు అప్పగించారు. చేశారు ఆర్టీసీ రీజినల్ మేనేజర్లుగా ఉన్న సంతోష్ కుమార్ జ్యోత్స్న, రాజులను రీజినల్ మేనేజర్లుగా నియమిస్తూ మహబూబ్ నగర్ నిజామాబాద్, కరీంనగర్ రీజియన్ల బాధ్యతలు అప్పగించారు.


గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన 75, 76వ బ్యాచ్‌ల తెలంగాణ కేడర్ ట్రైనీ ఐపీఎస్‌లు. చిత్రంలో తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్



జ్యోతిరావు పూలేకి సీఎం నివాళి

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ పర్యటన ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యా కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా జరపనున్న పర్యటనలను గురువారం ప్రారంభించింది. ఈ పర్యటనలు డిసెంబర్ 7 వరకు జరుగుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. వివిధ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ విద్యా సంస్థలను కమిషన్ పరిశీలిస్తుంది. కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో జరిగే ఈ పర్యటనలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేశ్, జ్యోత్స్న పాల్గొంటున్నారు. పర్యటన విజయవంతం కావడానికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.. అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు కమిషన్ బృందానికి అవసరమైన లాజిస్టిక్స్, భద్రతను అందించాలని ఆదేశించారు.

'మోసాల ఉత్సవాలు జరపండి'



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు విజయోత్సవాలకు బదులు.. రైతు మోసాల ఉత్సవాలు జరపాలని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ ఎద్దేవా చేశారు. ఏడాది పాలనలో రైతులను దగా చేసి, రైతు పండుగ పేరిట మూడు రోజుల విజయోత్సవాలు జరపాలని నిర్ణయించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 9 హామీల్లో.. ఏ ఒక్కటీ అమలు చేయకుండా.. మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుకు విజయో త్సవాలు జరిపే అర్హత లేదని మండిపడ్డారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఏం ఒరగబెట్టారని సంబరాలకు సిద్ధమయ్యారని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ఏలుబడిలో సంక్షోభ హాస్టళ్లు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఏలుబడిలో సంక్షేమ హాస్టళ్లన్నీ.. సంక్షోభ హాస్టళ్లుగా మారిపోయాయని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఫుడ్ పాయిజన్ ఘటనలపై హైకోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. వివిధ గురుకులాల్లో 51 మంది విద్యార్థులు చనిపోయారని, 23 మంది విద్యార్థులు బలవన్మరణం, పదిమంది అనుమానాస్పద స్థితిలో మరణించారని వివరించారు. 38 గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే.. నలుగురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో, 14 మంది అనారోగ్యంతో చనిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందన్నారు.

పదేళ్ల తర్వాత ప్రజాపాలన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పదేళ్ల తరువాత ప్రజలు మెచ్చిన పాలన సాగుతోందని, ఇది ముమ్మాటికీ ప్రజా పాలనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్ నేత అన్నారు. ఆయన గాంధీభవన్‌లో గురువారం పార్టీ నేత చరణ్ కౌశిక్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన, ఏడాది రేవంత్‌రెడ్డి ప్రజాపాలనపై చర్చకు తాము సిద్ధమని సవాల్ చేశారు. పదేళ్లలో ఎక్కడ నిరసన తెలిపినా అక్రమంగా అరెస్టు చేశారని, ఇప్పుడు ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు తెలుపుతున్నారని స్పష్టం చేశారు. కేటీఆర్ ఇంట్లో బుధవారం రాత్రి పది గంటలకు విద్యార్థి నాయకులతో సమావేశమై.. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే కుట్రలపై చర్చించారని ఆయన ఆరోపించారు. నీచ రాజకీయాలకు వ్యూహరచన చేస్తున్నారని విమర్శించారు.

ఢిల్లీ మద్యం కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. చార్జిషీట్ సరిగా లేదని ఎమ్మెల్సీ కవిత తరుపు న్యాయవాది మోహిత్‌రావు న్యాయస్థానానికి తెలిపారు. దీంతో ఈ కేసు విచారణ వేస్తున్నట్లు న్యాయమూర్తి కావేరీ బావేజా తెలిపారు. గురువారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బావేజా కేసు విచారణ చేపట్టారు. కవిత వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. కవిత తరపున న్యాయవాది మాట్లాడుతూ, సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ సరిగాలేదని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. చార్జిషీట్ సరిచేసి మరోసారి న్యాయస్థానానికి, ప్రతివాదులకు అందజేయాలని సీబీఐని న్యాయమూర్తి ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 6కు వాయిదా వేశారు.

యూజీసీ మార్గదర్శకాల మేరకు అడ్మిషన్లు

లా కోర్సుల్లో ప్రవేశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: న్యాయ విద్య కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిర్దేశించిన కేలెండర్ ప్రకారం అడ్మిషన్లు చేపట్టేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని స్పష్టం చేసింది. అడ్మిషన్లకు సంబంధించిన కేసులో ఇరు పార్టీలు దీనికి అంగీకరించడంతో పిటిషన్‌పై విచారణను ముగించింది. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియను జూలైలోపు పూర్తి చేయడం లేదని, దీంతో తరగతుల ప్రారంభం తీవ్ర ఆలస్యం అవుతోందని హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది భాస్కర్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. తొలుత ఈ పిటిషన్‌పై సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, బీసీఐ నుంచి గుర్తింపు పొందని కాలేజీల జాబితాలో నల్సార్ కూడా ఉందన్న ప్రస్తావన రావడంతో ఆ వర్సిటీకి చాన్స్‌లర్‌గా ఉన్న తాను విచారణ జరపడం సమంజసం కాదని సీజే అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ పిల్‌పై విచారణను జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనానికి బదిలీ చేశారు. పార్టీ ఇన్ పర్సన్‌గా పిటిషనర్, ప్రభుత్వం తరపున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపించారు. ఈ ఏడాదికి న్యాయ విద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ ముగియడంతో వచ్చే సంవత్సరం నుంచి యూజీసీ, బీసీఐ మార్గదర్శకాలు పాటించాలని సర్కార్‌ను ధర్మాసనం ఆదేశించింది. దీనికి ఇరు పార్టీలు అంగీకరించాయి.

39.51 లక్షల ఇళ్ల డేటా కంప్యూటరీకరణ

సాక్షి, హైదరాబాద్: సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వే వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతమైంది. గురువారం నాటికి 39,51,469 నివాసాల సమాచారాన్ని కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. అత్యధికంగా ములుగు జిల్లాకు సంబంధించి 82.5 శాతం కంప్యూటరీకరణ పూర్తి కాగా, యాదాద్రి భువనగిరి జిల్లాలో 74.2 శాతం, సిద్దిపేట జిల్లాలో 64.5 శాతం, మహబూబ్‌నగర్ జిల్లాలో 60.60 శాతం కంప్యూటరీకరణ పూర్తయింది. సర్వే కూడా దాదాపు పూర్తి కావచ్చింది. ఇంకా 6,59,839 నివాసాల సమాచారాన్ని సేకరించాల్సి ఉందని రాష్ట్ర పౌరసంబంధాల శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 81.5 శాతం సర్వే పూర్తయింది. ఇక్కడ 4,54,240 నివాసాల సమాచారాన్ని సేకరించాల్సి ఉంది.



కబడ్డీ... కబడ్డీ..

విజయవాడలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా పురుషుల విభాగంలో కబడ్డీ ఆడుతున్న పోలీసులు. - విజయవాడ

మీ చదువులు.. మార్చాలి మన బతుకులు



తమలా పేదరికంలో తమ పిల్లలు బతకకూడదని ఏ తల్లిదండ్రులైనా కోరుకుంటారు. దీనికోసం వారు ఎంతైనా కష్టపడి వారిని చదివిస్తుంటారు. గుంటూరులోని అమరావతి రోడ్‌లో ఓ వ్యాపారి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ తోపుడు బండిపై పాఠశాల నుండి తీసుకు వస్తున్న దృశ్యం పలువురికి స్ఫూర్తిని ఇస్తోంది. - గుంటూరు

బాల్యంపై బతుకు భారం



ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన వయసులో ఓ బాలుడు ఇలా తన కుటుంబం కోసం వీధి బాట పట్టాడు. కడపలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి సెంట్రల్ జైలు రోడ్డు వద్ద ఇలా..నెత్తిన భారం మోస్తూ తన కుటుంబం కోసం కష్టబడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది. - ఎస్ కె. మహమ్మద్ రఫీ, సాక్షి ఫోటో గ్రాఫర్, కడప.

క్లుప్తంగా...

విద్యార్థులకు రాజకీయ పరిజ్ఞానం అవసరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులకు చదువుతోపాటు సమాజంలోని మంచి చెడులు, రాజకీయ పరిజ్ఞానం అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. విజయనగరంలో జరుగుతున్న 49వ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో విద్యార్థుల నుద్దేశించి ఆయన గురువారం మాట్లాడారు. స్కాంలు చేసేవారు, లంచగొండులు, అవినీతిపరులు, దుర్మార్గులు దేశాన్ని నాశనం చేస్తున్నారని, యువతరం రాజకీయాల్లోకి వచ్చి నిజాయితీ కలిగిన నేతలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. పవన్, సీఎం చంద్రబాబు బీజేపీకి తొత్తులుగా మారారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్‌రంగరాజ్, మాజీనేత జి.ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

7న సాయుధ దళాల పతాక దినోత్సవం

సాక్షి, అమరావతి: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే 7న ఫ్లాగ్ డే నిర్వహించనున్నట్లు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిధి సేకరణకు అన్ని శాఖల అధిపతులు, జిల్లా కలెక్టర్లు తమ శాఖలకు చెందిన వాహనాలు లేదా కిరాయి వాహనాలను విజయవాడలోని సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద ఉంచాలని పేర్కొన్నారు. టోకెన్/ స్టిక్కర్లు/కార్ ఫ్లాగ్ అందించేందుకు వీలైనన్ని ఎక్కువ వాహనాలను ఉంచాలని సూచించారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు తమ తమ శాఖల అధికారులందరికీ తగిన సూచనలను జారీ చేయాలని తెలిపారు.

ఐటీఐ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎంకు ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఐటీఐ కాలేజీల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఐటీఐ, డీఎల్టీసీ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టగుంట వెంకట రమేశ్‌బాబు కోరారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు ప్రమోషన్లు, కొత్తగా ఐటీఐ కాలేజీల మంజూరు, బడ్జెట్ కేటాయింపులు, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి.. ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కృష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిశాఖలో 21 పోస్టుల పునరుద్ధరణ

సాక్షి, అమరావతి: గ్రామీణాభివృద్ధి శాఖలో 21 పోస్టులను పునరుద్ధరిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ప్‌లో ప్రభుత్వ పథకాలను సమర్థంగా నిర్వహించేందుకు ఐదు డైరెక్టర్ పోస్టులు (ఎస్‌పీఎంయూ), మూడు ప్రాజెక్టు డైరెక్టర్లు, 13 అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్లు (డీపీఎంయూ స్థాయి) పోస్టులను పునరుద్ధరిస్తున్నట్టు పేర్కొన్నారు.

పాఠశాలల్లో బాల కార్మికుల చేరికపై ఆరా

సాక్షి, అమరావతి: ఈ ఏడాది అసోసియేషన్ ఫర్ వలంటరీ యాక్షన్ సంస్థ ద్వారా పాఠశాలల్లో చేరిన బాల కార్మికుల వివరాలు ఇవ్వాలని సమగ్ర శిక్ష ఏఎస్పీడీ కె.రవీంద్రనాథ్‌రెడ్డి డీఈవోలు, ఏపీసీలను ఆదేశించారు. ఈ సంస్థ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ 12 వరకు 26 జిల్లాల్లో వివిధ పనుల్లో ఉన్న 235 మంది బాల కార్మికులను రక్షించి స్థానిక పాఠశాలల్లో చేర్పించినట్లు చెబుతోంది. దీనిపై వాస్తవాలు తెలుసుకునేందుకు సమగ్ర శిక్ష అధికారులు చర్యలు చేపట్టారు. పిల్లల వివరాలను ఆయా జిల్లాల అధికారులకు పంపించి తనిఖీ చేయాలని రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు.



ఎస్.రాయవరం మండలానికి చెందిన 16 ఏళ్ల బాలికకు సమీప బంధువుతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. తాను చదువుకుంటానని ఈ వివాహం ఇష్టం లేదని ఏడ్చి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. పైగా తాము నిశ్చయించిన వివాహం చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తండ్రి హెచ్చరించడంతో బాలిక వివాహం చేసుకోక తప్పలేదు.

యలమంచిలి పట్టణంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి పదో తరగతి పూర్తయిన 15 ఏళ్ల బాలికను ప్రసవం కోసం తీసుకురావడంతో వైద్యులు నివ్వెరపోయారు. తమ వద్ద డెలివరీ చేయడానికి కుదరదని చెప్పడంతో వారు పక్క జిల్లాలో ఆస్పత్రికి బాలికను తీసుకెళ్లిపోయారు. ఈ విషయం బాలిక నివసిస్తున్న గ్రామంలో ఐసీడీఎస్, మహిళా పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

పుత్తడి బొమ్మకు.. పుస్తెల బంధనం!

చిన్నారిని చేయొద్దు పెళ్లికూతురు
జిల్లాలో కలవరపరుస్తున్న బాల్య వివాహాలు
వయసు రాకుండానే పెళ్లి పీటలెక్కుతున్న బాలికలు
చట్టాలున్నా చట్టుబండలే

151 రెండేళ్లలో ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాలు

1098 బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం టోల్ ఫ్రీ నంబర్

యలమంచిలి రూరల్: ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో ఎంత ముందుకెళ్లినా.. ఇంకా కొందరి ఆలోచనల్లో మార్పు రావడం లేదు. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల బంధనం తప్పడం లేదు. ఇందుకు నిరక్షరాస్యత, పేదరికం కొంత కారణం కాగా.. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మరో ప్రధాన కారణం. తమ బాధ్యత తీరిపోతుందని భావిస్తున్న కొందరు తల్లిదండ్రుల ఆడపిల్లలకు పెళ్లీడు రాక ముందే వివాహాలు చేస్తున్నారు. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో స్వేచ్ఛగా చదువుకోవాల్సిన బాలికల మెడల్లో పుస్తెల తాళ్లు పడుతున్నాయి. లోకం పోకడ తెలియకుండానే బిడ్డలకు బాల్యంలోనే వివాహాలు చేసి వారి జీవితాలను కొందరు తల్లిదండ్రులు చేజేతులా అగాధంలోకి నెడుతున్నారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేస్తే అనారోగ్యంతో కుంగిపోతారని వైద్యులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

అడ్డుకుంటున్నా.. ఆగడం లేదు

బాల్య వివాహాలను మాతాశిశు సంక్షేమ అధికారులు అడ్డుకుంటున్నా వివాహాలు ఆగడం లేదు. అధికారులు తమకున్న సమాచారంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాలికతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో కొంతవరకు బాల్య వివాహాలు తగ్గినట్టు కనిపిస్తున్నా, లోలోపల మాత్రం గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు చేస్తున్నారు. చాలా చోట్ల జరుగుతున్న బాల్య వివాహాలకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా తెలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడినవారు ఆర్థికంగా బలంగా ఉన్న వారికి తమ కుమార్తెలను ఇచ్చి పెళ్లి చేస్తే, అమ్మాయి జీవితం బాగుంటుందని భావిస్తున్నారు. పెద్దయితే తాము చెప్పిన సంబంధం చేసుకుంటుందో లేదో అనే ఆలోచనతో మరికొందరు, ప్రేమలో పడి తల్లిదండ్రులకు చెడ్డపేరు తెస్తుందేమోనన్న భయంతో ఇంకొందరు.. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో గత రెండేళ్లలో అధికారుల దృష్టికి వచ్చిన 151 బాల్య వివాహాలను అడ్డుకున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. అధికారుల దృష్టికి రాకుండా జరిగిపోతున్న పెళ్లిళ్లు అనేకం ఉంటున్నాయి.

- బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంది. వారు సంసారం, కుటుంబం, పిల్లల బాధ్యత మోస్తూనే అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వారు గర్భం దాలిస్తే తల్లికీ, బిడ్డకు ప్రాణాపాయం ఉంటుంది.
- ఎంతో సందడిగా ఆనందోత్సాహాలతో జరగాల్సిన పెళ్లి అధికారుల జోక్యంతో అర్థంతరంగా ఆగిపోతే రెండు కుటుంబాల వారికీ నగుబాటే కదా. అందుకే పెళ్లి వయసు రాకుండా ముహూర్తాలు పెట్టుకొని, అడ్డుకునే పరిస్థితిని తెచ్చుకోవద్దు.
- బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఏటా జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బాల్య వివాహం నేరానికి శిక్ష..

బాల్య వివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

టీనేజ్ ప్రెగ్నెన్సీలతో ప్రాణానికే ప్రమాదం



బాల్య వివాహాల వలన వచ్చే గర్భాల వల్ల బాలికలు ఎనీమియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటుతో మెటర్నల్ డెత్‌లు జరుగుతాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. 6 నెలల క్రితం యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి 17 ఏళ్ల ప్రాయంలోనే గర్భం దాల్చిన కేసు రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాను. చిన్న వయసులో గర్భం దాలిస్తే బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదమే.

–డాక్టర్ ఆర్.నిహారిక, సివిల్ అసిస్టెంట్ సర్జన్, గైనకాలజిస్ట్, యలమంచిలి సీహెచ్‌సీ

సమాచారం ఇవ్వండి



బాల్య వివాహాలు జరిగినట్టు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే ఆ సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి పెళ్లిని ఆపుచేస్తాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. తగిన వయసు లేకపోతే మానసిక, శారీరక పరిపక్వత ఉండదు.

–కె.అనంతలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, అనకాపల్లి

అందరూ బాధ్యులే..



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకులు, పురోహితులు, స్నేహితులు, అనుమతించిన పెద్దలు, సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. మైనర్ బాలికను పెళ్లి చేసుకొని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది.

–కె.వి.సత్యనారాయణ, డీఎస్పీ, పరవాడ

రాష్ట్ర 'మానవ హక్కుల కమిషన్' నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్, ఒక సభ్యుడు (జ్యుడీషియల్) మరో సభ్యుడు (నాన్ జ్యుడీషియల్)నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ గురువారం తెలిపారు. ఏపీ మానవ హక్కుల కమిషన్ చట్టం 1993 లోని సెక్షన్ 21లోని సబ్ సెక్షన్ 2 ప్రకారం కమిషన్ చైర్‌పర్సన్‌గా దరఖాస్తు చేసే వారు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా లేదా న్యాయమూర్తిగా పనిచేసి ఉండాలని తెలిపారు. మానవ హక్కుల కమిషన్ సభ్యులు (జ్యుడీషియల్) గా దరఖాస్తు చేసే వారు హైకోర్టు న్యాయమూర్తిగానూ లేదా రాష్ట్రంలో జిల్లా న్యాయమూర్తిగా కనీసం 7 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు. నాన్ జ్యుడీషియల్ సభ్యుడు నియామకానికి మానవ హక్కులకు సంబంధించిన విషయాల్లో పరిజ్ఞానం లేదా ఆచరణాత్మక అనుభవం కలిగి ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సభ్యుల పదవీకాలం మూడు సంవత్సరాలు గానీ లేదా డెబ్బై సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఏది ముందుగా అయితే అంత వరకూ ఆ పదవిలో కొనసాగేందుకు అర్హులు. 15.03.2024 నాటి మునుపటి నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారు కూడా ప్రస్తుత ఈ నోటిఫికేషన్ ప్రకారం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వక్ఫ్ బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌గా అర్హత లేని వ్యక్తి

ముస్లిం సంఘాల నేతలు నాగుల్ మీరా, అయూబ్‌ఖాన్ విమర్శ

సాక్షి, అమరావతి: హైకోర్టులో ఏపీ వక్ఫ్ బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌గా అర్హత లేని షేక్ ఖాజాబాషాను నియమించారని ముస్లిం సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఏపీ లా ఆఫీసర్స్ (నియామకం, సర్వీస్ షరతులు) నియమాలకు విరుద్ధంగా షేక్ ఖాజాబాషాను వక్ఫ్ బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పది సంవత్సరాల అనుభవం కలిగిన వారిని స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించాల్సి ఉందని, కేవలం మూడేళ్ల అనుభవం కలిగిన ఖాజాబాషాను ఎలా నియమించారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఖాజాబాషాను వక్ఫ్ బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించడానికి పెద్ద ఎత్తున నగదు చేతులు మారిందని నాగుల్‌మీరా ఆరోపించారు. అదేవిధంగా వక్ఫ్ బోర్డు తరఫున స్టాండింగ్ కౌన్సిల్‌గా ఖాజాబాషాకు ఏమాత్రం అర్హత లేదని, తక్షణమే ఆయన్ను తొలగించాలని జాతీయ మైనారిటీస్ కమిషన్ రాష్ట్ర మాజీ సలహాదారుడు ఎం.అర్షద్ అయూబ్‌ఖాన్ మరో ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ అధికారులకు, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌కు, హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఫార్మాసిటీలో జరిగిన ఘటన బాధాకరం

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో జరిగిన ఘటనపై వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. 20 మంది అస్వస్థతకు గురికావడం ఆందోళనకరమని గురువారం ఆయన ఎక్స్ ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఒక్క సంఘటనే కాదని, బాపట్లలోనూ ఇదే తరహా ఘటన జరిగిందని గుర్తు చేశారు. అక్కడ విషవాయువు లీక్ కావడంతో 107 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. భద్రతా నిబంధనలను ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్లే తరచూ ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉభయ సభలు వాయిదా పడ్డాక ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌లను ఎంపీ విజయసాయిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

మమ్మల్ని మాతృశాఖలో విలీనం చేయండి

గ్రామ పశుసంవర్ధక శాఖ సహాయకుల వినతి

సాక్షి,అమరావతి: రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న తమను మాతృశాఖలో విలీనం చేయాలని గ్రామ పశుసంవర్ధక శాఖ సహాయకుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం నేతలు గురువారం పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడును కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 7,320 మంది సహాయకులు గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు సేవలందిస్తున్నారని చెప్పారు. అదనపు విధులకు తమను వినియోగించటం వల్ల పాడి రైతులకు అందుబాటులో లేకపోతున్నామని, తమను పూర్తిగా పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

ఐదు రకాల స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నాం

టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఎస్టీ విద్యార్థులకు ఐదు రకాల స్కాలర్‌షిప్పులను కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు గిరిజన వ్యవహారాల మంత్రి జువెల్ ఓరం తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఎస్టీ విద్యార్థులు ఎంత మంది స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు? ఎంత మందికి మంజూరు చేశారని చిత్తూరు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ లోక్‌సభలో లిఖితపూర్వక ప్రశ్న అడిగారు. 9, 10 తరగతి విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఇంటర్ ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసే విద్యార్థులకు జాతీయ ఫెలోషిప్, విదేశాల్లో చదివే వారికి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌ను అందిస్తున్నట్టు మంత్రి తెలిపారు.

ఫ్యాక్టరీల్లో ప్రమాదాలపై సమీక్షించకపోవడం విచారకరం

సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఫ్యాక్టరీ ప్రమాదాలపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు సమీక్ష నిర్వహించకపోవడం విచారకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. తక్షణం కార్మిక శాఖపై సమీక్ష చేపట్టి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, దీనికి కారణమైన యాజమాన్యాల మీద చర్యలు తీసుకోవాలని సీఎంకు రాసిన లేఖను శ్రీనివాసరావు గురువారం మీడియాకు విడుదల చేశారు. ప్రమాదం జరిగినప్పుడు సానుభూతి తెలిపి, ఆర్థిక సాయం ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని, ఇది న్యాయ సమ్మతం కాదన్నారు. ఫార్మా కంపెనీల్లో సోషల్ ఆడిట్ తక్షణమే నిర్వహించి, ప్రమాదాలు జరగకుండా నివారించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తిస్తూ చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు హోదా ఇచ్చే విషయంలో దాఖలైన పిల్‌పై రాతపూర్వకమైన హామీ లేనందున దీన్ని వ్యాజ్యంగా తీసుకోలేమని హైకోర్టు బెంచ్ చెప్పడం న్యాయం కాదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వినతి

సాక్షి, న్యూఢిల్లీ: విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మూడు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈమేరకు గురువారం పార్లమెంట్‌లో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నెల్లిమర్ల జంక్షన్ నుంచి రణస్థలం వెళ్లే రహదారి, విజయనగరం నుంచి కొట్టూరు వరకు ఎన్‌హెచ్–16ను నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని, రామభద్రపురం నుంచి రాయగడ వరకు నాలుగు లేన్ల రహదారిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మిక సమాచారం

అప్పన్న సన్నిధిలో వేద వర్ధన తీర్థ స్వామీజీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఉడిపిలోని శిరూర్ మఠానికి చెందిన వేద వర్ధన తీర్థ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో అందించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్‌లో వెలసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజేశ్వర శివ పార్వతుల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ఉత్సవమూర్తులను అలంకరించి వేదికపైకి చేర్చారు. ప్రత్యేక పూజలనంతరం వేదపండితుల కల్యాణ క్రతువును జరిపించారు. రాత్రి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. మహిళలు ఆలయంలో స్వామి వారికి కాయాకర్పూరాలను సమర్పించి పూజలు చేశారు. భక్తులకు జనసేన నాయకుడు అతికారి క్రిష్ణ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఆలయ సూపరింటిండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా...వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యా సమాచారం

నేడు నన్నయ్యలో స్పాట్ అడ్మిషన్స్

రాజానగరం: ఆదికవి నన్నయ వర్సిటీలో ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను ఎంఏ, ఎం.కామ్, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు శుక్రవారం (ఈ నెల 29న) స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నాయి. ఏపీ పీజీ సెట్ రాయకపోయినా, రాసి అర్హత పొందకపోయినా ఈ స్పాట్ అడ్మిషన్స్‌లో పీజీలో చేరేందుకు అవకాశం ఉంది. డిగ్రీలో ఓసీ, బీసీ అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 45 శాతం పైబడిన మార్కులతో ఉత్తీర్ణతను పొందవలసి ఉంది. ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా పీజీలో చేరేవారికి ఎటువంటి రాయితీలు వర్తించవు.

ముగిసిన ఇంటర్ వర్సిటీ మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌గా శివాజీ యూనివర్సిటీ
- రన్నరప్‌గా ఏయూ.. స్ట్రాంగ్ ఉమన్‌గా ఏఎన్‌యూ లిఫ్టర్ రేణుక

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యాన ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో ఓవరాల్ టీం చాంపియన్‌షిప్‌ను కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ కైవసం చేసుకుంది. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ రన్నర్స్‌గా నిలిచింది. కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ మూడో స్థానం పొందింది. పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ ఫలితాలను ప్రకటించారు. బెస్ట్ లిఫ్టర్‌గా యూనివర్సిటీ ఆఫ్ ముంబైకి చెందిన లిఫ్టర్ సౌమ్య దాల్వి నిలిచింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లిఫ్టర్ టి.రేణుక స్ట్రాంగ్ ఉమెన్ కేటగిరి అవార్డును సొంతం చేసుకుంది.

కాంపిటీషన్ లా పై వర్క్‌షాప్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లాలో గురువారం 'కాంపిటీషన్ లా–తాజా సవరణలు'అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. చెన్నై నుంచి జాయింట్ డైరెక్టర్(లా)–రీజినల్ ఇన్‌చార్జి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(దక్షిణ రీజన్) కె.పి.ఆనంద్ ప్రసంగిస్తూ కాంపిటీషన్ లాలో జరిగిన తాజా సవరణలపై విస్తృతమైన, సమగ్ర వివరణ ఇచ్చారు. సవరణల వల్ల వ్యాపార, న్యాయ రంగాల్లో కలిగే ప్రభావాలను ఉదాహరణల ద్వారా వివరించారు.



● ప్రభాస్

ప్రభాస్ లాంటి కొడుకు కావాలి

- జరీనా వాహబ్

''నాకు మరో జన్మంటూ ఉంటే ప్రభాస్‌లాంటి కొడుకు కావాలని కోరుకుంటాను'' అన్నారు సీనియర్ నటి జరీనా వాహబ్. వైజాగ్‌లో పుట్టి పెరిగిన జరీనా వాహబ్ హిందీ నటుడు, నిర్మాత ఆదిత్య పాంచోలిని వివాహం చేసుకున్నారు. తెలుగులో 'గాజుల కిష్టయ్య, అమర ప్రేమ, హేమా హేమీలు, రక్త చరిత్ర 2, విరాట పర్వం' వంటి చిత్రాల్లో నటించారామె.

తాజాగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన 'దేవర' సినిమాలో హీరో ఎన్టీఆర్ తల్లిగా నటించారు జరీనా. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న 'ది రాజా సాబ్' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఆమె ఓ హిందీ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ– ''నేను ప్రస్తుతం ప్రభాస్‌తో 'ది రాజాసాబ్' సినిమాలో నటిస్తున్నాను. తనలాంటి గొప్ప వ్యక్తిని నేను ఇప్పటివరకు ఏ ఇండస్ట్రీలోనూ చూడలేదు. నేనొక స్టార్ హీరో అనే భావన ఉండదు. సెట్‌లో ప్రతి ఒక్కరి గురించి ఆలోచిస్తాడు. అందర్నీ సమానంగా చూస్తాడు. ఎవరైనా ఆకలితో ఉన్నారని తెలిస్తే ఇంటికి ఫోన్ చేసి 40–50 మందికి భోజనాలు తెప్పిస్తాడు. తను నిజమైన డార్లింగ్. మరో జన్మంటూ ఉంటే నాకు ఇద్దరు కొడుకులు ఉండాలి. అందులో తప్పకుండా ప్రభాస్‌లాంటి కొడుకు కావాలని కోరుకుంటాను'' అంటూ ప్రభాస్‌పై ప్రశంసలు కురిపించారామె. ప్రభాస్ హీరోగా, నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్న 'ది రాజా సాబ్' సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. 2025 ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ మూవీకి సంగీతం: తమన్.



వర్షం నాకు చాలా ప్రత్యేకం

- త్రిష

'నా కెరీర్‌లో 'వర్షం' సినిమా చాలా ప్రత్యేకం' అన్నారు హీరోయిన్ త్రిష. ఇటీవల ఓ టీవీ షోలో తల్లి ఉమతో కలిసి పాల్గొన్నారు త్రిష. 'మీ కెరీర్‌లో బాగా ఇబ్బంది పడిన సినిమా ఏంటి?' అంటూ త్రిషని ప్రశ్నించారు యాంకర్. ఇందుకు ఆమె సమాధానం ఇస్తూ–''నా కెరీర్‌లో 'వర్షం' మూవీ చాలా స్పెషల్. అలాగే ఎక్కువ ఇబ్బంది పడ్డ సినిమా కూడా అదే. నా కెరీర్ ఆరంభంలో 'వర్షం' సినిమా కోసం ఎంతో కష్టపడ్డాను. ఈ చిత్రం కోసం దాదాపు 45 రోజులు వర్షంలో షూటింగ్ చేశాం. ఆ సమయంలో తడవడంతో జలుబు, జ్వరంతో ఇబ్బంది పడ్డాను. ఒక దశలో సినిమా మానేసి వెళ్లిపోవాలనిపించింది. అయితే ఆ చిత్రం ఘనవిజయం సాధించడంతో నా కష్టం మరచిపోయాను. తెలుగులో నాకు బ్రేక్ ఇచ్చిన సినిమా 'వర్షం'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... త్రిష సోలో హీరోయిన్‌గా తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయమైన డైరెక్ట్ చిత్రం 'వర్షం'. తరుణ్ హీరోగా తమిళ్, తెలుగు భాషల్లో తెరకెక్కిన 'నీ మనసు నాకు తెలుసు' (2003) చిత్రంలో శ్రియ ఓ హీరోయిన్ కాగా త్రిష మరో కథానాయికగా నటించారు. ప్రభాస్ హీరోగా శోభన్ దర్శకత్వం వహించిన 'వర్షం' చిత్రంలో సోలో హీరోయిన్‌గా నటించారు త్రిష. 2004 సంక్రాంతి కానుకగా జనవరి 14న రిలీజైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'వర్షం'తో సూపర్‌హిట్ జోడీ అనిపించుకున్న ప్రభాస్–త్రిష ఆ తర్వాత 'పౌర్ణమి' (2006), 'బుజ్జిగాడు' (2008) వంటి చిత్రాల్లో నటించారు. ఇక 'వర్షం' తర్వాత తెలుగులో త్రిష బిజీ హీరోయిన్ అయ్యారు. ఆ చిత్రం తర్వాత తెలుగులో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, మహేశ్‌బాబు, పవన్ కల్యాణ్, రవితేజ, గోపీచంద్, నితిన్, సిద్ధార్థ్ వంటి హీరోలకి జోడీగా నటించారు త్రిష. రెండు దశాబ్దాల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నటించిన త్రిష ఇప్పటికీ బిజీ హీరోయిన్‌గా దూసుకెళుతున్నారు. అలాగే యువ హీరోయిన్లకు సైతం గట్టి పోటీ ఇస్తున్నారు. ప్రస్తుతం త్రిష నటిస్తున్న తెలుగు చిత్రం 'విశ్వంభర'. ఈ మూవీలో చిరంజీవికి జోడీగా నటిస్తున్నారామె. 'స్టాలిన్' (2006) సినిమా తర్వాత చిరంజీవి–త్రిష కలిసి నటిస్తున్న చిత్రం ఇదే. వచ్చే ఏడాది వేసవిలో 'విశ్వంభర' విడుదల కానుందని టాక్. అదే విధంగా ప్రస్తుతం పలు తమిళ, మలయాళ సినిమాల్లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు త్రిష.



● '96'లో త్రిష, విజయ్ సేతుపతి

సీక్వెల్ సిద్ధం

తమిళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ '96'కు సీక్వెల్ త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందన్న టాక్ కోలీవుడ్‌లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సేతుపతి, త్రిష హీరో హీరోయిన్లుగా నటించిన రొమాంటిక్ డ్రామా '96'. సి. ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో నందగోపాల్ నిర్మించిన ఈ చిత్రం 2018లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్ తీయాలని సి.ప్రేమ్‌కుమార్ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. '96' సీక్వెల్ స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఈ స్క్రిప్ట్ పనులు దాదాపు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది ప్రారంభంలోనే '96' సినిమా సీక్వెల్ సెట్స్‌పైకి వెళ్లనుందని కోలీవుడ్ భోగట్టా. అలాగే '96'లో హీరో హీరోయిన్లుగా నటించిన విజయ్ సేతుపతి, త్రిష సీక్వెల్‌లోనూ నటిస్తారని, ఆల్రెడీ షూటింగ్ కాల్షీట్స్ కూడా కేటాయించారని, త్వరలోనే ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందని ప్రచారం సాగుతోంది. మరోవైపు తమిళ '96' సినిమా తెలుగులో 'జాను'గా రీమేక్ అయ్యింది. ఈ సినిమాకు సి.ప్రేమ్‌కుమారే దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో శర్వానంద్, సమంత హీరో హీరోయిన్లుగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

తుది దశలో హరిహర వీరమల్లు



● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, నాజర్, రఘుబాబు ఈ చిత్రంలోని ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఏ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. 'హరి హర వీరమల్లు పార్ట్ 1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' సినిమా మార్చి 28న విడుదల కానుంది. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుందని, త్వరలోనే విజయవాడలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభిస్తాం అని మేకర్స్ తెలిపారు. పవన్ కల్యాణ్‌తో పాటు రెండొందల మంది ఆర్టిస్టులు ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని, ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా చిత్రీకరణ పూర్తవుతుందని కూడా మేకర్స్ వెల్లడించారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమాకు సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి.

ఒసేయ్ అరుంధతి!



● 'వెన్నెల' కిశోర్, మోనికా, కమల్ కామరాజు

'వెన్నెల' కిశోర్, మోనికా చౌహాన్, కమల్ కామరాజు, 'చిత్రం' శ్రీను ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'ఒసేయ్ అరుంధతి'. విక్రాంత్ కుమార్ దర్శకత్వం వహించారు. పద్మ నారాయణ ప్రొడక్షన్స్‌పై ప్రణయ్ రెడ్డి గూడూరు నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో 'ఒసేయ్ అరుంధతి' టీజర్‌ను విడుదల చేశారు. ప్రణయ్ రెడ్డి గూడూరు మాట్లాడుతూ– ''ఫ్యామిలీ కామెడీ థ్రిల్లర్‌గా 'ఒసేయ్ అరుంధతి' నిర్మించాం. త్వరలో మా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు. విక్రాంత్ కుమార్ మాట్లాడుతూ– ''ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన అరుంధతి పిల్లాడితో పాటు ఇంటి బాధ్యతలను చూసుకుంటూ ఉంటుంది. ఓసారి సత్యనారాయణ స్వామి వ్రతం చేయాలనుకుంటుంది. అయితే అనుకోకుండా ఆమెకు ఓ సమస్య వస్తుంది. ఆ సమస్య నుంచి తనని తాను కాపాడుకుంటూ ఇంటి పరువును ఎలా కాపాడుకుంది? అనేదే 'ఒసేయ్ అరుంధతి' చిత్రకథ. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది'' అన్నారు.

దేవా... కాస్త ముందుగానే...



● 'దేవా'లో షాహిద్ కపూర్

అనుకున్న సమయానికంటే ముందుగానే 'దేవా' థియేటర్స్‌లోకి వస్తున్నాడు. షాహిద్ కపూర్ టైటిల్ రోల్‌లో నటించిన యాక్షన్ చిత్రం 'దేవా'. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించారు. మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూని హిందీలో దర్శకుడిగా పరిచయం చేస్తూ, జీ స్టూడియోస్ పతాకంపై సిద్ధార్థ్‌రాయ్ కపూర్ ఈ సినిమాను నిర్మించారు. కాగా 'దేవా' సినిమాను గత ఏడాదే రిలీజ్ చేయాలని అనుకున్నారు... కానీ కుదర్లేదు. దీంతో 2025 ఫిబ్రవరి రిలీజ్‌ను ప్లాన్ చేసుకున్నారు. కానీ ఇప్పుడు అనుకున్న సమయానికంటే ముందుగానే... అంటే జనవరి 31నే 'దేవా' సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఓ హై ప్రొఫైల్ కేసును పరిశోధిస్తున్న దేవా అనే పోలీసాఫీసర్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాడు? ఈ క్రమంలో ఓ జర్నలిస్టు దేవాకు ఏ విధంగా సహాయం చేసింది? అన్నది ఈ సినిమా కథనం. ఈ చిత్రంలో జర్నలిస్టు పాత్రలో పూజా హెగ్డే నటించారు.



బోల్డ్ వీక్

తెగించిన వాడికి తెడ్డే అన్నట్టు బిగ్ బాస్ ఆఖరి దశకు చేరుకునే సమయంలో బాగా బోల్డ్ కంటెంట్‌తో ముందుకు వెళుతోంది. ఈ వారమంతా నామినేషన్స్ దగ్గర నుండి ఎలిమినేషన్ వరకు ఈ బోల్డ్ కంటెంట్‌తోనే నడిచిందని చెప్పవచ్చు. ముందుగా ఈ వారం చివరి చీఫ్ కంటెండర్ కోసం జరిగిన పోటీలో పార్టిసిపెంట్స్ పదజాలం బాగా బోల్డ్‌గా నడిచింది. ముఖ్యంగా చీఫ్ కంటెండర్‌గా గెలిచిన రోహిణి, అదే ఎన్నిక కోసం పోటీ పడిన విష్ణుల మధ్య జరిగిన సంభాషణంతా సాలిడ్ బోల్డ్. విష్ణు ఓపెన్‌గా రోహిణి క్యారెక్టర్‌పై నింద వేస్తే, రోహిణి ఏకంగా విష్ణుని నువ్వు ఒకరిని ఇష్టపడి, వారు దొరక్క ఇంకొకరి కోసం ప్రయత్నించావని తీవ్రంగా ఆరోపించింది. ఓ రకంగా ఇటువంటి టివి బుల్లితెరలో అదీ తెలుగు ఎంటర్టైన్మెంట్ మీడియాలో చాలా కొత్త అని చెప్పవచ్చు. ప్రేక్షకుల పరంగా పరమ చెత్త అని చెప్పవచ్చు. నాలుగు గోడల మధ్య ఆవేశపడితే ఇంటి గుట్టవుతుంది, అదే లక్షలాది ప్రేక్షకుల మధ్య అసభ్యంగా మాట్లాడితే అదే గుట్టు రట్టవుతుంది. ఈ విషయం కంటెస్టెంట్స్‌కు తెలిసినా తెలియకపోయినా బిగ్ బాస్‌కు మాత్రం తెలుసు. ఎందుకంటే అదే బిగ్ బాస్‌కు లాభదాయకం కాబట్టి. ఇక వారాంతం ఎపిసోడ్‌లో కంటెస్టెంట్లు ఇతర కంటెస్టెంట్లపై కంప్లైంట్లను ఓ చక్కటి ఆట రూపేణా చూపడం కొంతవరకు బావుంది. ఈ వారం యష్మి ఎలిమినేట్ అవడం అటు కంటెస్టెంట్లకు ఇటు యష్మికి ఏమాత్రం బాధ కలిగించలేదన్నది వాస్తవం. యష్మి వెళ్తూ, వెళ్తూ బిగ్ బాంబ్ రూపేణా గౌతమ్‌ను నేరుగా నామినేట్ చేసింది. ఈ వారం ఓ విషయమైతే చెప్పుకోవాలి... హౌస్‌లో గ్రూపిజం సరిగ్గా ఉందో లేదో కానీ బయట సోషల్ మీడియాలో మాత్రం బిగ్ బాస్‌పై కుల, ప్రాంత, మత తత్వాలతో కొట్టుకు చస్తున్నారు కొందరు అమాయక సోషలోళ్లు. ఏ సంబంధం లేని వారి కోసం తమ విలువైన టైమ్ వెచ్చించి, అర్థం లేని కార్యక్రమం కోసం తమ జీవితాలను వ్యర్థం చేసుకుంటున్న సోషలోళ్లు... మీకు హాట్సాఫ్. దీనికంతటికీ కారణజన్ముడు ఆ బిగ్ బాస్ మహానుభావుడని వేరే చెప్పాలా.

- ఇంటూరు హరికృష్ణ



● అనన్యా పాండే

ఆ తర్వాతే అన్నీ అర్థమవుతాయి

'మనం ఇష్టపడే వారి కోసం ఎంత మారినా పర్వాలేదనిపిస్తుంది' అంటున్నారు హీరోయిన్ అనన్యా పాండే. విజయ్ దేవరకొండ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన 'లైగర్' సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారీ నార్త్ బ్యూటీ. 2022 ఆగస్టు 25న ఈ చిత్రం విడుదలైంది. 'లైగర్' తర్వాత తెలుగులో మరో సినిమా చేయలేదామె. అయితే హిందీలో మాత్రం వరుసగా సినిమాలు చేస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో రిలేషన్‌షిప్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''గతంలో నేను రిలేషన్‌షిప్‌లో ఉన్నాను. ఎదుటి వ్యక్తి కోసం నేనెంతగానో మారాను. చాలా విషయాల్లో రాజీపడ్డాను. రిలేషన్‌షిప్ ప్రారంభమైనప్పుడు ఎదుటి వ్యక్తి మెప్పు పొందడం, వారి దృష్టిని ఆకర్షించడం కోసం ఏదైనా చేయాలనిపిస్తుంది. మనం ఎంత మారినా ఫర్వాలేదనిపిస్తుంది. అయితే మనం మారుతున్నామనే విషయం ఆరంభంలో మనకు అర్థం కాదు. ఇది సహజంగానే ఉన్నట్లు అనిపిస్తుంది. ప్రేమలో ఉన్నప్పుడు లోపాలు తెలియవు. ఏదీ మనకు సమస్యగా అనిపించదు. ఆ బంధం నుంచి మనం బయటకు వచ్చినప్పుడే అన్నీ అర్థం అవుతాయి. రిలేషన్‌షిప్‌లో నేను నిజాయతీగా ఉంటాను. ఎదుటి వ్యక్తి నుంచీ అంతే నిజాయతీ లభిస్తే బాగుంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య నమ్మకం ఉంటేనే ఏ బంధమైనా బలపడుతుంది. నాకు కాబోయే వ్యక్తి సింప్లిసిటీగా, నన్ను అర్థం చేసుకునే వాడై ఉండాలి'' అని తెలిపారు అనన్యా పాండే. ఇదిలా ఉంటే నటుడు ఆదిత్యరాయ్ కపూర్‌తో అనన్య ప్రేమలో ఉన్నట్లు గతంలో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే ఇటీవల వీరిద్దరూ విడిపోయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రిలేషన్‌షిప్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు బాలీవుడ్‌లో వైరల్‌గా మారాయి. కాగా ప్రస్తుతం 'శంకరా' అనే సినిమాలో నటిస్తున్నారు అనన్యా పాండే. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు.

అందుకే తిరస్కరించాను!



● మల్లికా శెరావత్

''ది రాయల్స్' సిరీస్‌లో ఇషాన్ కట్టర్ తల్లి పాత్రలో నేను నటించాల్సి ఉంది. అయితే నాకు చెప్పిన కథకి, ఫైనల్ స్క్రిప్ట్‌కి సంబంధం లేదనిపించింది... అందుకే 'ది రాయల్స్' అవకాశాన్ని తిరస్కరించాను'' అని చెప్పారు బాలీవుడ్ నటి మల్లికా శెరావత్. రాజ్ శాండిల్య దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో'. గత నెల 11న విడుదలైన ఈ సినిమాలో చందా రాణి అనే పాత్రలో తనదైన నటనతో అలరించారు మల్లికా శెరావత్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ– ''ఇషాన్ కట్టర్ లీడ్ రోల్‌లో 'ది రాయల్స్' సిరీస్‌ని రూపొందించాలని నెట్‌ఫ్లిక్స్ సంస్థ భావించింది. ఇందులో ఇషాన్ తల్లి పాత్రలో నటించమని మేకర్స్ నన్ను సంప్రదించారు. నా పాత్ర, కథ ఎంతో నచ్చడంతో చేయాలని నిర్ణయించుకున్నాను. అయితే ఫైనల్‌గా స్క్రిప్ట్ పేపర్ మీదకు వచ్చేసరికి ఎన్నో మార్పులు జరిగాయి. చెప్పిన దానికి, రాసిన దానికి సంబంధం లేదనిపించింది. దీంతో వాళ్లు నన్ను మోసం చేశారనిపించి, నేను చేయనని తిరస్కరించాను'' అని తెలిపారు. అలాగే తన వ్యక్తిగత విషయం గురించి కూడా ఆమె స్పందిస్తూ– ''గతంలో నేను ఓ వ్యక్తితో ప్రేమలో ఉన్నాను. అయితే అది బ్రేకప్ అయింది. ప్రస్తుతానికి సింగిల్‌గానే ఉన్నాను. వివాహంపై నాకు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మంచి మనసు ఉన్న వ్యక్తిని భర్తగా పొందడం కష్టమే. నా ఆరోగ్యంపట్ల నేనెప్పుడూ జాగ్రత్తగా ఉంటాను. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటాను. అలాగే మంచి భోజనం తింటా, సమయానికి నిద్రపోతా'' అని తెలిపారు మల్లికా శెరావత్.

బిజినెస్ రీల్

మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్‌తో బీఈఎంఎల్ జోడీ

న్యూఢిల్లీ: సముద్ర పరిశ్రమకు సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రభుత్వ రంగ బీఈఎంఎల్ బుధవారం తెలిపింది. మెరైన్ రంగంలోకి తన నైపుణ్యాన్ని విస్తరించే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించింది. ఒప్పందంలో భాగంగా ప్రత్యేకంగా సముద్ర సంబంధ వ్యూహాత్మక యంత్రాల రూపకల్పన, తయారీకి సాంకేతిక మద్దతును అందిస్తామని బీఈఎంఎల్ వెల్లడించింది. వినూత్న సాంకేతికతలు, వ్యవస్థల అభివృద్ధి, పరీక్ష, ధృవీకరణను సులభతరం చేస్తూ బీఈఎంఎల్ పరిశోధన బృందానికి ప్రత్యేక సౌకర్యాలను మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ అందుబాటులో ఉంచుతుంది.

టెక్ మహీంద్రా, అమెజాన్ వెబ్ సర్వీసెస్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: ఐటీ సంస్థ టెక్ మహీంద్రా తాజాగా అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో (ఏడబ్ల్యూఎస్) ఒక



వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా టెలికం నెట్‌వర్క్‌లను రూపాంతరం చేసే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదిరింది. అధునాతన ఏఐ పరిష్కారాలను వినియోగించి నెట్‌వర్క్ సామర్థ్యాన్ని, కస్టమర్ అనుభవాలను మెరుగుపరచడానికి ఇరు సంస్థలు కృషిచేస్తాయి. కమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్లు, ఎంటర్‌ప్రైజ్ కస్టమర్ల కోసం రూపొందించిన అటానమస్ నెట్‌వర్క్స్ ఆపరేషన్స్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయడానికి అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో టెక్ మహీంద్రా బహుళ-సంవత్సరాల వ్యూహాత్మక సహకార ఒప్పందంపై సంతకం చేసింది.

వేవ్‌టెక్ హీలియంలో రిలయన్స్‌కు 21% వాటాలు

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన హీలియం గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి సంస్థ వేవ్‌టెక్ హీలియంలో (డబ్ల్యూహెచ్ఐ) 21 శాతం వాటాలు కొనుగోలు చేసినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. ఇందుకోసం 12 మిలియన్ డాలర్లు వెచ్చించినట్లు వివరించింది. 2021లో ఏర్పాటైన డబ్ల్యూహెచ్ఐ .. 2024 నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించింది. శాస్త్రీయ పరిశోధనలు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఫైబర్ ఆప్టిక్స్ మొదలైన విభాగాల్లో హీలియంను ఉపయోగిస్తారు. ఏఐ, డేటా సెంటర్లు పెరుగుతున్న నేపథ్యంలో సెమీకండక్టర్ల తయారీ కోసం హీలియం డిమాండ్ గణనీయంగా పెరుగుతుందనే అంచనాలు ఉన్నాయి.

జిందాల్ వరల్డ్ వైడ్ బంపర్ ఫలితాలు

లాభంలో 35 శాతం వృద్ధి

హైదరాబాద్: టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ తయారీ సంస్థ జిందాల్ వరల్డ్ వైడ్ లిమిటెడ్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు చూపించింది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 46 శాతం పెరిగి రూ.570 కోట్లకు దూసుకుపోయింది. వ్యాపార కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకోవడం, దేశ విదేశీ మార్కెట్ల నుంచి ఫినిష్డ్ ఫ్యాబ్రిక్‌కు డిమాండ్ పెరగడం అనుకూలించినట్టు తెలిపింది. ఎబిటా 38 శాతం వృద్ధితో 48 కోట్లుగా నమోదైంది. నికర లాభం సైతం 35 శాతం పెరిగి 17.3 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.12.8 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు తొలి ఆరు నెలల కాలానికి ఆదాయం 32 శాతం పెరిగి 1,058 కోట్లుగా నమోదైంది. నికర లాభం 34 శాతం వృద్ధితో 35.4 కోట్లకు చేరింది.

బీఎస్ఈలో జిందాల్ వరల్డ్‌వైడ్ షేరు 2 శాతం పెరిగి రూ.324 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-11-2024

విశాఖ	585-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595-00
విజయవాడ	600-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	595-00
వరంగల్	597-00
రిటైల్ ధర	6.55

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,210
ఎన్ఎస్ఈ	1,16,894
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,30,725
ఎఫ్ఐఐ	- 11,7556
డీఐఐ	+ 8,718

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.97	$ 68.72
బ్రెంట్	72.68	$ 72.03

గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ రూ.7,500 కోట్ల పెట్టుబడులు



- కొత్త వ్యాపారాల్లోకి ప్రవేశం
- గ్రీన్ హైడ్రోజన్, ఇంధన స్టోరేజీ, రీసైకిల్ పట్ల ఆసక్తి
- మీడియాకు వెల్లడించిన జంషెడ్ గోద్రేజ్

ముంబై: జంషెడ్ గోద్రేజ్ ఆధ్వర్యంలోని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ (జీఈజీ) రానున్న మూడేళ్లలో వివిధ వ్యాపారాల్లో రూ.7,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. ప్రస్తుత తయారీ సామర్థ్యాల విస్తరణ, మార్కెటింగ్, పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ), టెక్నాలజీపై వ్యయం చేయనున్నట్టు తెలిపింది. గోద్రేజ్ గ్రూప్ ఇటీవలే పరస్పర అంగీకారంతో రెండు గ్రూపులుగా విడిపోవడం తెలిసిందే. ఆది గోద్రేజ్, నాదిర్ గోద్రేజ్ ఆధ్వర్యంలో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్, జంషెడ్ గోద్రేజ్ ఆధ్వర్యంలో జీఈజీ గ్రూప్ వేరయ్యాయి. లాక్‌లు (తాళాలు), రిఫ్రిజిరేటర్లు, కన్జ్యూమర్ డ్యూరబుల్ గూడ్స్, ఫర్నిచర్ తదితర వ్యాపారాల్లో జీఈజీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రా, ఏరోస్పేస్ రంగంలోనూ వ్యాపారాలు నిర్వహిస్తోంది. గోద్రేజ్ గ్రూప్ రెండుగా విడిపోయినప్పటికీ వినియోగదారుల పరంగా ఎలాంటి మార్పుల్లేవని జంషెడ్ గోద్రేజ్ మీడియాకు తెలిపారు. వ్యాపారాల వృద్ధికి కొత్త విభాగాలను గుర్తించినట్టు చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్, ఇంధన స్టోరేజీ, నిర్మాణ రంగ మెటీరియల్స్ రీసైక్లింగ్ తమ గ్రూప్‌నకు భవిష్యత్ వృద్ధి విభాగాలుగా ఉంటాయని చెప్పారు. ఇందులో భాగంగా యూఎస్‌కు చెందిన రెండు స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేసినట్టు తెలిపారు. ఇవి మినహా ఇతర కొత్త వ్యాపార ప్రణాళికలేవీ లేవన్నారు. ఇంజనీరింగ్, డిజైన్ ఆధారిత దిగ్గజ గ్రూప్‌గా జీఈజీని మార్చడం తమఉద్దేశ్యమని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నైరికా హోల్కర్ తెలిపారు. జంషెడ్ గోద్రేజ్ సోదరి స్మితాకృష్ణ కుమార్తెనే హోల్కర్. 2032 నాటికి గ్రూప్ ఆదాయంలో సగం మేర గ్రీన్ ఉత్పత్తుల ద్వారానే వస్తుందన్నారు. ప్రస్తుతం గ్రూప్ వార్షిక టర్నోవర్ రూ.16,000 కోట్లుగా ఉండగా, ఇందులో రూ.10,000 కోట్లు కన్జ్యూమర్ వ్యాపారాల నుంచి, మిగిలిన రూ.6,000 కోట్లు 13 ఇతర వ్యాపారాల నుంచి సమకూరుతున్నట్టు చెప్పారు. ఈ టర్నోవర్‌ను రూ.20,000 కోట్లకు తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

మూడు క్లస్టర్లుగా గ్రూపు వ్యాపారం

వ్యాపారాలను మూడు క్లస్టర్లుగా విభజిస్తున్నట్టు జంషెడ్ గోద్రేజ్ తెలిపారు. ''కన్జ్యూమర్ ఫస్ట్ వ్యాపారం కింద గృహోపకరణాలు, లాక్‌లు ఉంటాయి. నేషన్ ఫస్ట్ కింద ఏరోస్పేస్, అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్ తదితర వ్యాపారాలు, ఫ్యూచర్ ఫస్ట్ కిందకు గ్రీన్ హైడ్రోజన్, జింక్-మాంగనీస్ బ్యాటరీ, రీసైకిల్డ్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ వస్తాయి''అని వివరించారు. కంపెనీ వృద్ధి ప్రణాళికల్లో బ్యాటరీ స్టోరేజీ కూడా ఉన్నట్టు చెప్పారు. ''నేడు ప్రపంచంలో అధిక శాతం బ్యాటరీలు లిథియం ఐయాన్ లేదా సోడియం ఐయాన్ ఆధారితమైనవి. మేము వీటికి భిన్నమైన జింక్, మాంగనీస్ కెమిస్ట్రీపై దృష్టి సారించాం. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన పైలట్ ప్లాంట్ ఇప్పటికే పని మొదలు పెట్టింది. బ్యాటరీ స్టోరేజీ ద్వారా దేశ ఇంధన పరివర్తనలో కీలక పాత్ర పోషించనున్నాం''అని వెల్లడించారు. జీఈజీ గ్రూప్ పరిధిలో పెద్ద వ్యాపారాలున్నప్పటికీ ఒక్క లిస్టెడ్ కంపెనీ లేకపోవడం గమనార్హం. సమీప భవిష్యత్తులోనూ ఇందులో మార్పు ఉండదని జంషెడ్ గోద్రేజ్ స్పష్టం చేశారు. బలమైన వ్యాపారాలు కావడంతో, నగదు ప్రవాహాలు కూడా మెరుగ్గా ఉన్నాయంటూ.. దీంతో పెట్టుబడులకు కావాల్సిన నిధులను అంతర్గతంగానే సమకూర్చుకోగలమని చెప్పారు. అందుకే నిధుల కోసం ప్రజల ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడలేదన్నారు. ఇప్పటి వరకు అయితే గ్రూప్ కంపెనీలకు సంబంధించి ఐపీవో ప్రణాళికల్లేవని స్పష్టం చేశారు.

సెయిల్‌తో జాన్ కాకెరిల్ అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ: ఉక్కు దిగ్గజం సెయిల్‌తో ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ సంస్థ జాన్ కాకెరిల్ ఇండియా (జేసీఐఎల్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దేశీయంగా ఉక్కు పరిశ్రమకు సంబంధించి అధునాతన సొల్యూషన్స్‌ను సంయుక్తంగా ఆవిష్కరించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఎంవోయూ ప్రకారం ఇరు సంస్థలు పర్యావరణహిత విధానాలను ప్రోత్సహిస్తూ ఇనుము, ఉక్కు తయారీకి వినూత్న విధానాలను అన్వేషిస్తాయి. తయారీ ప్రక్రియల్లో హరిత హైడ్రోజన్ వినియోగించడం, సెయిల్ భవిష్యత్ ప్రాజెక్టుల్లో జాన్ కాకెరిల్ ప్రాసెసింగ్ టెక్నాలజీలను ఉపయోగించడం వంటి అంశాలను పరిశీలిస్తాయి.

గూగుల్‌పై విచారణకు సీసీఐ ఆదేశం

న్యూఢిల్లీ: ప్లే స్టోర్‌లో రియల్ మనీ గేమింగ్ యాప్‌ల నమోదుకు సంబంధించి అన్యాయమైన వ్యాపార పద్ధతులను అవలంభించిన ఆరోపణల నేపథ్యంలో గూగుల్, దాని అనుబంధ సంస్థలపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గురువారం విచారణకు ఆదేశించింది. 60 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని డెరెక్టర్ జనరల్‌ను ఆదేశించింది. గూగుల్ తన ఆధిపత్య స్థానాన్ని దుర్వినియోగం చేసిందని, ఎంపిక చేసిన గేమింగ్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని.. తద్వారా పోటీని వక్రీకరించిందని ఆరోపిస్తూ వింజో గేమ్స్ చేసిన ఫిర్యాదు ఆధారంగా సీసీఐ ఈ విచారణకు ఆదేశించింది.

మళ్లీ రూ.90,000 స్థాయికి వెండి

గురువారం రూ.4,900 డౌన్

న్యూఢిల్లీ: వెండి ధర పెరుగుదల ఒక్క రోజుకు పరిమితమైంది. దేశ రాజధానిలో గురువారం కేజీ వెండి ధర ఒకేరోజు రూ.4,900 పడిపోయి రూ.90,900కు పడిపోయింది. స్టాకిస్టులు, రిటైలర్లు భారీ అమ్మకాలు, కాయిన్ మార్కెట్ బలహీనత దీనికి ప్రధాన కారణం. వెండి కేజీ ధర న్యూఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో బుధవారం ఒకేరోజు రికార్డు స్థాయిలో రూ.5,200 పెరిగి రూ.95,800కు చేరిన



సంగతి తెలిసిందే. వెండి ధర ఒకేరోజు ఈ స్థాయిలో ఎగయడం ఒక రికార్డు. తద్వారా ఈ మెటల్ ధర రెండు వారాల తర్వాత తిరిగి రూ.95,000పైకి చేరింది. ఇక 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.100 తగ్గి రూ.78,700కు చేరింది. అనిశ్చితి అంతర్జాతీయ పరిస్థితుల్లో పసిడి, వెండి ధరలు అనిశ్చితికి గురికావచ్చన్నది నిపుణుల అంచనా.

డాక్టర్ రెడ్డీస్ ఇమ్యునో-ఆంకాలజీ ఔషధం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా రంగ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్.. పునరావృతమయ్యే లేదా



మెటాస్టాటిక్ నాసోఫారింజియల్ కార్సినోమా చికిత్స కోసం భారత్‌లో తొలిసారిగా టోరిపాలిమాబ్ అనే ఇమ్యునో-ఆంకాలజీ ఔషధాన్ని విడుదల చేసింది. నాసోఫారింజియల్ కార్సినోమా అనేది తల, మెడ క్యాన్సర్‌కు సంబంధించింది. ఇది గొంతు పైభాగంపై చోటుచేసుకుంటుంది. తరువాతి తరం ప్రోగ్రామ్డ్ సెల్ డెత్ ప్రొటీన్ 1 (పీడీ-1) అయిన టోరిపాలిమాబ్ సంప్రదాయ చికిత్సతో పోలిస్తే అత్యుత్తమ ఫలితాలను ప్రదర్శించిందని రెడ్డీస్ వెల్లడించింది. భారత్‌లో జైటోర్వి బ్రాండ్ పేరుతో ఈ ఔషధాన్ని మార్కెట్ చేయనున్నట్లు తెలిపింది. ఇమ్యునో-ఆంకాలజీ అనేది ఒక క్యాన్సర్ చికిత్స విధానం. ఇది క్యాన్సర్‌ను నిరోధించడానికి, నియంత్రించడానికి, తొలగించడానికి రోగనిరోధక వ్యవస్థ శక్తిని ఉపయోగిస్తుంది. చైనా, యూఎస్ తర్వాత ఈ ఔషధం అందుబాటులోకి వచ్చిన మూడవ దేశం భారత్ కావడం విశేషం.

ఏకైక ఇమ్యునో-ఆంకాలజీ..

పునరావృతమయ్యే లేదా మెటాస్టాటిక్ నాసోఫారింజియల్ కార్సినోమా చికిత్సకై యూఎస్ ఫుడ్, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ఎఫ్‌డీఏ), యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ (ఈఎంఏ), మెడిసిన్స్, హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్ రెగ్యులేటరీ ఏజెన్సీ (ఎంహెచ్ఆర్ఏ) వంటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ నియంత్రణ సంస్థలు ఆమోదించిన ఏకైక ఇమ్యునో-ఆంకాలజీ ఔషధం ఇదేనని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. టోరిపాలిమాబ్ కోసం 2023లో కంపెనీ షాంఘై జున్షి బయోసైన్సెస్‌తో లైసెన్స్, వాణిజ్యీకరణ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం భారత్, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, లాటిన్ అమెరికాతో సహా 21 దేశాల్లో టోరిపాలిమాబ్‌ను అభివృద్ధి చేయడానికి, అలాగే వాణిజ్యీకరించడానికి డాక్టర్ రెడ్డీస్ ప్రత్యేక హక్కులను పొందింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇతర తొమ్మిది దేశాల్లో అందుబాటులోకి తేవడానికి లైసెన్స్ పరిధి విస్తరణకు సైతం ఈ ఒప్పందం అనుమతిస్తుందని కంపెనీ వివరించింది.

సముద్ర గర్భ మైనింగ్ వేలం ప్రారంభం

విక్రయానికి 13 మైన్స్

న్యూఢిల్లీ: సముద్ర గర్భ ప్రాంతాల్లో ఖనిజ నిక్షేపాల వేలం మొదటి రౌండ్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. వీటిలో 13 మైన్స్‌ను విక్రయానికి ఉంచడం జరిగింది. ఈ మైన్స్‌లో మూడు సున్నపు మట్టి, మూడు నిర్మాణ ఇసుక, ఏడు పాలీమెటాలిక్ నాడ్యూల్స్-క్రస్ట్‌లు ఉన్నాయి. సముద్రగర్భ ఖనిజ వనరుల అన్వేషణ విషయంలో భారత్ పురోగతిని ఈ కేటాయింపులు సూచిస్తాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. ఈ ఖనిజాలు మౌలిక సదుపాయాల అభివృద్ధి, హైటెక్ తయారీ, గ్రీన్ ఎనర్జీ పరివర్తనకు కీలకం కావడం గమనార్హం. వేలానికి సిద్ధమైన ఆఫ్‌షోర్ ప్రాంతాలలో ప్రాదేశిక జలాలు, కాంటినెంటల్ షెల్ఫ్, ప్రత్యేక ఆర్థిక మండలి, దేశంలోని ఇతర సముద్ర మండలాలు ఉన్నాయి.



ఖనిజ సంపద పటిష్టతను సూచిస్తోంది: మంత్రి కిషన్ రెడ్డి

వేలం ప్రారంభ కార్యక్రమంలో బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఆఫ్‌షోర్ బ్లాకుల అన్వేషణ వల్ల దేశంలోని ఖనిజ సంపద మరింత పటిష్టం అవుతుందని తెలిపారు. భారతదేశంలో కీలకమైన ఖనిజాల కోసం డిమాండ్ పెరుగుతోందని వివరించారు. లిథియం డిమాండ్ ఎనిమిది రెట్లు పెరుగుతుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత్ త్వరలో క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

భాగస్వాములకోసం అన్వేషణ: వీఎల్ కాతా రావు

ఖనిజ అన్వేషణ, అభివృద్ధి విభాగంలో భాగస్వాముల కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు ఈ సందర్భంగా తెలిపారు. ఖనిజాలపై పరిశోధన- అభివృద్ధిపై కూడా దృష్టి సారించినట్లు తెలిపారు. సముద్ర గర్భ మైనింగ్ వేలం పక్రియ ప్రారంభం నేపథ్యంలో దేశ, విదేశాల్లో రెండు మూడు రోడ్‌షోలు చేయడానికి తాము సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. గనుల అదనపు కార్యదర్శి సంజయ్ లోహియా మాట్లాడుతూ, ఆఫ్‌షోర్ మినరల్ బ్లాక్‌లను విజయవంతంగా వేలం వేయడానికి అవసరమైన అన్ని నిబంధనలను పూర్తి చేసినట్లు చెప్పారు. ఆఫ్‌షోర్ ప్రాంతాలలో మైనింగ్‌ను చేపట్టే చర్యలు తీసుకోవడమే మనకు సవాలు అని ఆయన పేర్కొంటూ, అయితే ఆయా చర్యల్లో విజయవంతం అవుతామన్న భరోసాను వ్యక్తం చేశారు. కోబాల్ట్, నికెల్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, పాలీమెటాలిక్ నాడ్యూల్స్ వంటి అధిక డిమాండ్ నేపథ్యంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి అలాగే సప్లై చైన్‌ను స్థిరీకరించడానికి భారత్ విభిన్న ఖనిజ వనరులను అభివృద్ధి చేయాలని గనుల మంత్రిత్వ శాఖ తెలిపింది.

గ్లోబల్ లీడర్‌గా ఎదగడమే లక్ష్యం

ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 2002ను పార్లమెంటు గత ఏడాది ఆగస్టులో సవరించింది. ఆఫ్‌షోర్ ప్రాంతాలలో ఖనిజ బ్లాకుల కేటాయింపు విధానంగా వేలాన్ని తప్పనిసరి చేసింది. వనరుల అన్వేషణ-వెలికితీత కోసం ఉత్పత్తి లీజులు, మిశ్రమ లైసెన్స్‌ల మంజూరును క్రమబద్ధీకరణ వంటి చర్యలను తీసుకోడానికి ప్రభుత్వాన్ని ఈ సవరణ అనుమతిస్తుంది. భారత్ సముద్రగర్భంలో ఖనిజాల అన్వేషణలో అడుగుపెట్టినప్పుడు, దాని పారిశ్రామిక-గ్రీన్ ఎనర్జీ రంగాలను పెంపొందించడమే కాకుండా కీలకమైన ఖనిజాలలో గ్లోబల్ లీడర్‌గా తన స్థానాన్ని పొందడం కూడా లక్ష్యంగా పెట్టుకుంది.

చర్చల దశలోనే టెస్లా, స్టార్‌లింక్ పెట్టుబడులు

మీడియాతో వాణిజ్య శాఖ మంత్రి పియుష్ గోయల్

న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికన్ టెక్ బిలియనీర్ ఎలన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా, స్టార్‌లింక్ పెట్టుబడులకు సంబంధించి ఇంకా ఎటువంటి చర్చ జరగలేదని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియుష్ గోయల్ తెలిపారు. ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు అంశాలూ వేర్వేరు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్నందున, ఏమి జరుగుతుందో తనకు వ్యక్తిగతంగా తెలియదని అన్నారు. ''నాకు తెలిసినంత వరకు మేము ఎటువంటి చర్చలు జరపలేదు'అని టెస్లా-స్టార్‌లింక్ పెట్టుబడుల అవకాశాలపై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. '' ఈ రెండు విభాగాలూ వేర్వేరు మంత్రిత్వ శాఖలు నిర్వహణలో ఉన్నాయి. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆటోమొబైల్స్‌ను చూస్తుంది. స్టార్‌లింక్ అంశాలను అంతరిక్ష శాఖ నిర్వహిస్తుంది. కాబట్టి, ఏమి జరుగుతుందో నాకు వ్యక్తిగత పరిజ్ఞానం లేదు'' అని వాణిజ్యమంత్రి స్పష్టం చేశారు.



నేపథ్యం ఇదీ...

ఈ ఏడాది ఏప్రిల్‌లో మస్క్ చివరి క్షణంలో తన భారత్ పర్యటనను రద్దు చేసుకున్నారు. 'టెస్లాలో కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన తక్షణ అవసరం ఉందంటూ పర్యటనకు కారణంగా చెప్పారు. నిజానికి ఈ సమావేశంలో ఆయన ప్రధాని నరేంద్రమెదీతో సమావేశం కావాల్సి ఉంది. భారత్‌లో టెస్లా తయారీ యూనిట్‌ను స్థాపించడానికి ప్రణాళికలు, బిలియన్ల డాలర్ల పెట్టుబడులపై చర్చలు, భారతదేశంలో టెస్లా ఎలక్ట్రిక్ కార్లను విక్రయించడంపై విధాన ప్రకటన వంటి అంశాలు మస్క్ పర్యటనలో భాగమని అప్పట్లో వార్తలు వచ్చాయి. కేవలం ఎలక్ట్రిక్ కార్లు మాత్రమే కాకుండా, ఆయన తన శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారం స్టార్‌లింక్ కోసం భారతీయ మార్కెట్‌పై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. స్టార్‌లింక్ భారతదేశంలో సేవలకు లైసెన్స్ పొందడానికి అన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుందని కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ నెల ప్రారంభంలో తెలిపారు. శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ సేవల ప్రారంభానికి తగిన అన్ని అనుమతులనూ పొందే ప్రక్రియలో ఉందని, వారు ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత లైసెన్స్ పొందుతారని మంత్రి చెప్పారు.

వినియోగించుకోకపోతే.. సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్ మూత

సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌ను ఉపయోగించాలని, లేకుంటే ఈ పథకాన్ని మూసివేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని కేంద్ర మంత్రి పియుష్ గోయల్ మరో కార్యక్రమంలో పరిశ్రమకు స్పష్టం చేశారు.నేషనల్ సింగిల్ విండో సిస్టమ్ (ఎన్ఎస్‌డబ్ల్యూఎస్) అనేది వ్యాపార అవసరాలకు అనుగుణంగా దరఖాస్తులు, ఆమోదాలకు పరిశ్రమ వినియోగించుకునే విధంగా అభివృద్ధి చేసిన ఒక డిజిటల్ ప్లాట్‌ఫామ్. 32 కేంద్ర శాఖలు, 29 రాష్ట్ర ప్రభుత్వాల నుండి అనుమతుల కోసం తగిన అప్లికేషన్ సేవలను అందిస్తుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై డీపీఐఐటీ-సీఐఐ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ, ''ఎన్ఎస్‌డబ్ల్యూఎస్ అవసరమా? లేదా అనే అంశంపై ఎంపిక ఇప్పుడు మీ (పరిశ్రమ) వద్ద ఉంది. మీకు దానిపై ఆసక్తి లేదని మీరు భావిస్తే... సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌ను మూసివేయడానికి వెనకాడబోము. కేంద్రం దాని కోసం చాలా డబ్బు ఖర్చు చేస్తోంది'' అని అన్నారు. ఎన్ఎస్‌డబ్ల్యూఎస్ పరిపూర్ణంగా ఉండకపోవచ్చని, అయితే దానిని మెరుగుపరచడానికి పరిశ్రమ నుండి వచ్చే సూచనలను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని కూడా మంత్రి తెలిపారు. జన్ విశ్వాస్ 2.0 బిల్లు గురించి మాట్లాడుతూ, పరిశ్రమకు రెట్రాస్పెక్టివ్ ప్రయోజనాలను (గతానికి వర్తించే విధంగా) అందించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని చెప్పారు. భారత్‌లో వ్యాపారాలకు సంబంధించి ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు చేయడానికి, ఆయా విభాగాల్లో మరింత మెరుగుదలకు సూచనలు, సలహాలు పొందానికి సీఐఐ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈఓడీబీ)- రెగ్యులేటరీ అఫైర్స్ పోర్టల్‌ను మంత్రి ఈ సందర్భంగా ప్రారంభించారు.

ట్రంప్ 'భారత్ స్నేహితుడే' / సంబంధాల్లో ఎలాంటి సమస్య లేదు

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు మిత్రుడని, భారత్-అమెరికా మధ్య స్నేహం చిగురించి మరింతగా వృద్ధి చెందుతుందని గోయల్ అన్నారు. భారత్-అమెరికా భాగస్వామ్యంలో ఎలాంటి సమస్యలను తాను ఊహించడం లేదని పేర్కొన్న ఆయన, వాషింగ్టన్‌లో కొత్త పరిపాలనలో అమెరికాతో భారత్ సంబంధాలు మరింత బలపడతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 10 సంవత్సరాల ప్రభుత్వ పాలనలో వివిధ కార్యక్రమాలు సంస్కరణలపై మీడియాతో మాట్లాడుతూ, టెస్లా- స్టార్‌లింక్ పెట్టుబడి ప్రణాళికలు, ల్యాప్‌టాప్ దిగుమతి విధానం, యూరోపియన్ యూనియన్ 'ఏకపక్ష' గ్రీన్ ఎకానమీ నిబంధనల వంటి పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, భారత్‌సహా అన్ని ప్రధాన దేశాలలో విదేశీ ఉత్పత్తులపై అత్యధిక సుంకాలను విధిస్తున్నాయని విమర్శించారు. అధికారంలోకి వస్తే, పరస్పర పన్నును ప్రవేశపెడతానని తెలిపారు. కాగా, నేడు ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడైన ప్రధాని మోదీ భారతదేశ అంతర్జాతీయ సంబంధాలను గతంలో కంటే మెరుగ్గా నిర్వహిస్తున్నట్లు గోయల్ ఈ సందర్భంగా అన్నారు. మోదీ నేతృత్వంలో అమెరికాతో భారతదేశ సంబంధాలు ప్రతి సంవత్సరం మెరుగవుతున్నాయని అన్నారు.

ల్యాప్‌టాప్ దిగుమతి విధానంపై కొత్త మార్గదర్శకాలు

భారత్ ల్యాప్‌టాప్ దిగుమతి విధానంపై కొత్త మార్గదర్శకాలు ఎలక్ట్రానిక్స్ -ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలో ఇంకా చర్చల దశలో ఉన్నాయని వాణిజ్య మంత్రి తెలిపారు.

300 చట్టాలు డీక్రిమినలైజ్..

300కుపైగా చట్టాలను డీక్రిమినలైజ్ (నేరపూరిత చర్యల జాబితా నుంచి బయటకు) చేసే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు.

అంతేకాకుండా ఈ ఏడాది మార్చిలో విద్యుత్-వాహన విధానాన్ని ప్రభుత్వం ఆమోదించింది. కనీసం 500 మిలియన్ డాలర్ల పెట్టుబడితో భారతదేశంలో తయారీ యూనిట్లను స్థాపించే కంపెనీలకు దిగుమతి సుంకం రాయితీలను అందించాలన్నది ఈ విధానంలో కీలక అంశం. టెస్లా వంటి ప్రధాన ప్రపంచ సంస్థలను ఆకర్షించే లక్ష్యంతో ఈ చర్య తీసుకోవడం జరిగింది.

ఈవీ ప్యాసింజర్ కార్ల తయారీ విభాగాలను ఏర్పాటు చేసే కంపెనీలు 35,000 అమెరికా డాలర్లు, అంతకంటే ఎక్కువ ధర కలిగిన వాహనాలపై 15 శాతం తక్కువ కస్టమ్స్/ దిగుమతి సుంకంతో పరిమిత సంఖ్యలో కార్లను దిగుమతి చేసుకోవడానికీ పాలసీ అనుమతించింది. ప్రభుత్వం ఆమోద పత్రం జారీ చేసిన తేదీ నుండి ఐదు సంవత్సరాల వ్యవధిలో ఉంటాయని పాలసీ వివరించింది.

పోరాడి ఓడిన సాకేత్ జోడీ



చెంగ్డూ (చైనా): ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మెయిన్ 'డ్రా'లో చోటు కోసం నిర్వహిస్తున్న ఆసియా పసిఫిక్ వైల్డ్ కార్డు ప్లే ఆఫ్ టోర్నీలో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్ విభాగంలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. గురువారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్-ముకుంద్ శశికుమార్ (భారత్) జోడీ 7-6 (7/4), 6-7 (3/7), 8-10తో 'సూపర్ టైబ్రేక్'లో సెటా వతనాబె-టకెరు యుజికి (జపాన్) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. ఒక గంటా 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-ముకుంద్ ద్వయం ఎనిమిది ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. మరో సెమీఫైనల్లో జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ 6-2, 6-4తో జిజియాన్ యాంగ్-బావోలు జెంగ్ (చైనా) ద్వయంపై గెలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. జీవన్-విజయ్... వతనాబె-యుజికి జోడీల మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్ విజేతకు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ మెయిన్ 'డ్రా'లో నేరుగా పోటీపడేందుకు వైల్డ్ కార్డు లభిస్తుంది.

రిత్విక్ జంటకు నిరాశ



సాక్షి, హైదరాబాద్: మయా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ కథ ముగిసింది. పోర్చుగల్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో రిత్విక్ చౌదరీ-శ్రీరామ్ బాలాజీ (భారత్) జంట క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. 'సబనోవ్ బ్రదర్స్' ఇవాన్-మాతెజ్ (సెర్బియా)లతో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ రిత్విక్-బాలాజీ 6-3, 2-6, 6-10తో 'సూపర్ టైబ్రేక్'లో ఓడిపోయింది. 83 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బాలాజీ ఐదు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది.



ఆంధ్రప్రదేశ్ శుభారంభం

బెంగాల్‌పై 6-1 గోల్స్ తేడాతో ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు శుభారంభం చేసింది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం జరిగిన గ్రూప్ 'హెచ్' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 6-1 గోల్స్ తేడాతో బెంగాల్ జట్టును ఓడించింది. ఆంధ్రప్రదేశ్ తరఫున మునిపల్లి నాగనందిని (22వ, 43వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... పరికి లక్ష్మి (15వ నిమిషంలో), చిల్లారు నాగతేజ (38వ నిమిషంలో), కెప్టెన్ కుప్పా తులసీ (46వ నిమిషంలో), రాగుల నాగమణి (60వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. బెంగాల్ జట్టుకు శ్రేష్ఠ ఛటర్జీ (43వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది. గురువారమే జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో గత ఏడాది రన్నరప్ జార్ఖండ్ 5-0తో ఛత్తీస్‌గఢ్ జట్టుపై, ఉత్తరాఖండ్ 3-1తో రాజస్తాన్ జట్టుపై, కర్ణాటక 5-0తో జమ్మూ కశ్మీర్ జట్టుపై, ఒడిశా 5-0తో హిమాచల్ ప్రదేశ్ జట్టుపై గెలిచాయి. గుజరాత్, పంజాబ్ జట్ల మధ్య మ్యాచ్ 2-2తో 'డ్రా'గా ముగిసింది. జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ జట్లు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి.

15న బెంగళూరులో డబ్ల్యూపీఎల్ వేలం

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు సంబంధించిన క్రికెటర్ల మినీ వేలం వచ్చే నెల 15న బెంగళూరులో నిర్వహించనున్నారు. వచ్చే సీజన్ ఫిబ్రవరి-మార్చి నెలలో జరుగుతుంది. ఐదు ఫ్రాంచైజీల మొత్తం బడ్జెట్ రూ. 15 కోట్లు. గత సీజన్ రూ. 13.5 కోట్ల కంటే కొంచెం పెరిగింది. ఒక్కో ఫ్రాంచైజీ వద్ద తక్కువ మొత్తమే ఉన్నప్పటికీ పలువురు స్టార్ క్రికెటర్లు వేలానికి రానున్నారు. ఇంగ్లండ్ కెప్టెన్ హీథెర్ నైట్, న్యూజిలాండ్ పేసర్ లీ తహుహు, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డియాండ్ర డాటిన్ తదితర టాప్ స్టార్లు వేలంలో ఉన్నారు.



వీరితో పాటు భారత్‌కు చెందిన స్నేహ్ రాణా, పూనమ్ యాదవ్, వేద కృష్ణమూర్తిలు కూడా వేలంలోకి వచ్చారు. గత రెండు సీజన్లు (2023, 2024)గా రన్నరప్‌తో సరిపెట్టుకుంటున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ చేతిలో అందరికంటే కనిష్ఠంగా రూ.2.5 కోట్లు మాత్రమే ఉన్నాయి. గుజరాత్ జెయింట్స్ చేతిలో గరిష్ఠంగా రూ. 4.4 కోట్లు అందుబాటులో ఉన్నాయి. డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వద్ద రూ. 3.25 కోట్లున్నాయి. వేలానికి ముందు ఫ్రాంచైజీల మధ్య జరిగే బదిలీలకు సంబంధించిన గడువు ఈ నెలలో ముగియగా... ఒక్క డ్యానీ వ్యాట్ (ఇంగ్లండ్) బదిలీ జరిగింది. యూపీ వారియర్స్ నుంచి ఆర్‌సీబీ ఆమెను కొనుక్కుంది.

విలియమ్సన్ సెంచరీ మిస్

న్యూజిలాండ్ 319/8 ● ఇంగ్లండ్‌తో తొలి టెస్టు



క్రైస్ట్‌చర్చ్: గాయం నుంచి కోలుకొని తిరిగి మైదానంలో అడుగు పెట్టిన న్యూజిలాండ్ సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (197 బంతుల్లో 93; 10 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో విలియమ్సన్ రాణించడంతో న్యూజిలాండ్ భారీ స్కోరు నమోదు చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. ఇటీవల భారత్‌లో భారత్‌పై 3 మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్ జట్టు... ఇంగ్లండ్‌పై అదే జోరు కనబర్చింది. కళాత్మక ఆటతో ఆకట్టుకున్న విలియమ్సన్ శతకానికి 7 పరుగుల దూరంలో అవుటయ్యాడు. కెప్టెన్ టామ్ లాథమ్ (54 బంతుల్లో 47; 6 ఫోర్లు) వేగంగా ఆడగా.. గ్లెన్ ఫిలిప్స్ (41 బ్యాటింగ్; 4 ఫోర్లు, ఒక సిక్సర్), రచిన్ రవీంద్ర (34; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కాన్వే (2) విఫలం కాగా.. డారిల్ మిచెల్ (19), బ్లండెల్ (17) ఎక్కువ సేపు నిలువలేకపోయారు. ఒకదశలో 199/3తో పటిష్ఠ స్థితిలో నిలిచిన న్యూజిలాండ్... చివరి సెషన్‌లో ఐదు వికెట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ బౌలర్లలో షోయబ్ బషీర్ 4... అట్కిన్సన్, కార్స్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. ఫిలిప్స్‌తో పాటు టిమ్ సౌతీ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (సి) పోప్ (బి) కార్స్ 47; కాన్వే (సి అండ్ బి) అట్కిన్సన్ 2; విలియమ్సన్ (సి) క్రాలీ (బి) అట్కిన్సన్ 93; రచిన్ రవీంద్ర (సి) క్రాలీ (బి) బషీర్ 34; మిచెల్ (సి) బ్రూక్ (బి) కార్స్ 19; బ్లండెల్ (సి) అట్కిన్సన్ (బి) బషీర్ 17; ఫిలిప్స్ (బ్యాటింగ్) 41; నాథన్ స్మిత్ (సి) రూట్ (బి) బషీర్ 3; హెన్రీ (సి) డకెట్ (బి) బషీర్ 18; సౌతీ (బ్యాటింగ్) 10; ఎక్స్‌ట్రాలు 35; **మొత్తం (83 ఓవర్లలో 8 వికెట్లకు) 319. వికెట్ల పతనం:** 1-4, 2-62, 3-130, 4-199, 5-227, 6-246, 7-252, 8-298.
బౌలింగ్: వోక్స్ 16-4-54-0; అట్కిన్సన్ 18-2-61-2; కార్స్15-0-57-2; స్టోక్స్ 13-1-59-0; బషీర్ 20-1-69-4; బెథెల్ 1-0-5-0.

వెస్టిండీస్ మహిళల జట్టు కెప్టెన్‌గా హేలీ మాథ్యూస్

సెయింట్ జాన్స్: వచ్చే నెలలో భారత్‌లో పర్యటించే వెస్టిండీస్ మహిళల జట్టును శుక్రవారం ప్రకటించారు. ఆల్‌రౌండర్ హేలీ మాథ్యూస్ నేతృత్వంలోని 15 మందితో కూడిన ఈ జట్టు భారత్‌లో పరిమిత ఓవర్ల సిరీస్‌లలో పాల్గొంటుంది. ముందుగా నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో డిసెంబర్ 15 నుంచి మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్ జరుగుతుంది. అనంతరం వడోదర ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో వన్డే సిరీస్ 22న మొదలవుతుంది.



ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా వన్డే సిరీస్ జరుగుతుండటంతో ఇరు జట్లకు పాయింట్లు కీలకం కానున్నాయి. 2016లో చివరిసారిగా భారత పర్యటనకు వచ్చిన కరీబియన్ జట్టు 3-0తో టి20 సిరీస్‌ను గెలుచుకోగా, ఆతిథ్య భారత్ 3-0తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. సీనియర్ ఆల్‌రౌండర్, మాజీ కెప్టెన్ స్టెఫానీ టేలర్ గాయంతో ఈ పర్యటనకు గైర్హాజరు కానుంది.
వెస్టిండీస్ మహిళల జట్టు: హేలీ మాథ్యూస్ (కెప్టెన్), షెమైన్ క్యాంప్‌బెల్, ఆలియా అలెన్, షమీలియా కానెల్, నెరిసా, డియాండ్రా డాటిన్, అఫీ ఫ్లెచర్, షబిక గజ్నబీ, చినెల్లి హెన్రీ, జైదా జేమ్స్, కియానా జోసెఫ్, మాండీ మంగ్రూ, అష్మిని మునిసర్, కరిష్మా, రషాదా విలియమ్స్.

నిత్య, శివానిలకు పసిడి పతకాలు



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్‌గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్ల పసిడి పతకాల వేట కొనసాగుతోంది. రాజ్‌కోట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం తెలంగాణ స్విమ్మర్లు కర్రా శివాని, నిత్య సాగిశ్రీ బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. అండర్-14 బాలికల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్ ఫైనల్లో శివాని 2 నిమిషాల 33.36 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. శివాని గచ్చిబౌలి స్టేడియంలోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్‌పూల్‌లో కోచ్ ఆయుశ్ యాదవ్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. అండర్-17 బాలికల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్ ఫైనల్లో నిత్య సాగిశ్రీ 2 నిమిషాల 27.95 సెకన్లతో అగ్ర స్థానాన్ని దక్కించుకుంది. నిత్య హైదరాబాద్‌లోని జియాన్ స్పోర్ట్స్ స్విమ్మింగ్ అకాడమీలో కోచ్ జాన్ సిద్దిఖి వద్ద శిక్షణ తీసుకుంటోంది. మరో రెండు రోజులపాటు కొనసాగే ఈ టోర్నీలో ఇప్పటి వరకు తెలంగాణ స్విమ్మర్లు పది పతకాలు సాధించారు.

స్వర్ణ విజేతను ప్రోత్సహించే తీరిదేనా?

- హిమాచల్ సర్కారును తలంటిన సుప్రీం కోర్టు
- కబడ్డీ ప్లేయర్ పూజ ఠాకూర్‌కు వెంటనే ఉద్యోగం ఇవ్వాలని ఆదేశం



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో (2014)లో స్వర్ణ పతక విజేత పట్ల హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును సుప్రీం కోర్టు తప్పుబట్టింది. పూజ ఠాకూర్ అనే క్రీడాకారిణి ఇంచ్‌వాన్ (దక్షిణ కొరియా) ఆసియా క్రీడల్లో పసిడి పతకం నెగ్గిన భారత కబడ్డీ జట్టు సభ్యురాలు. అయితే స్పోర్ట్స్ కోటా కింద గ్రేడ్-1 ఉద్యోగానికి అర్హురాలైన ఆమెకు ఎక్సైజ్-టాక్సేషన్ ఆఫీసర్ ఉద్యోగం ఇచ్చినట్లే ఇచ్చి నియామకం మాత్రం జరపలేదు. దీని కోసం ఏళ్ల తరబడి హిమాచల్ సీఎం కార్యాలయం చుట్టూ ఆమె తిరుగుతోంది. జూలై 2015 నుంచి ఆమె చేస్తున్న పోరాటానికి స్పందించిన రాష్ట్ర హైకోర్టు సింగిల్ జడ్జి... ఆమెను ఎక్సైజ్-టాక్సేషన్ ఆఫీసర్‌గా నియమించాలని తీర్పు ఇచ్చారు. అయినా సరే నియామకం జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీలు చేసింది. శుక్రవారం విచారణ సందర్భంగా జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిలతో కూడిన ద్విసభ్య బెంచ్ వెంటనే ఆమెను ప్రభుత్వ ఉద్యోగంలో నియమించాలని ఆదేశించింది. 'క్రీడాకారులకు మీరిచ్చే ప్రోత్సాహం ఇదేనా? ముఖ్యమంత్రి ప్రకటనలు, హామీలు కాదు... ఆచరణాత్మక నిర్ణయాలు తీసుకోవాలి. ఓ చాంపియన్ క్రీడాకారిణి పట్ల మీరు వ్యవహరించిన తీరు గర్హనీయం' అని తీర్పు సందర్భంగా బెంచ్ అభిప్రాయపడింది. హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పును యథాతథంగా అమలు చేయాలని... ఇందులో జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు తెలిపింది. ఇన్నేళ్లయినా రాష్ట్ర ప్రభుత్వం పూజ ఠాకూర్ నియామకానికి సంబంధించి ఏ చర్యలు చేపట్టకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. జూలై 2015 నుంచే సినియారిటీ సహా ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కు లోబడి పొందే అన్ని ప్రయోజనాలకు ఆమె అర్హురాలని సుప్రీం బెంచ్ తీర్పులో వెల్లడించింది.

కమ్రాన్ సెంచరీ: పాక్‌దే సిరీస్

మూడో వన్డేలో జింబాబ్వే పరాజయం



బులవాయో: తొలి వన్డేలో జింబాబ్వే చేతిలో అనూహ్య పరాజయం ఎదుర్కొన్న పాకిస్తాన్ జట్టు... ఆ తర్వాత తిరిగి పుంజుకొని వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సంపూర్ణ ఆధిపత్యం కనబరిచి సిరీస్‌ను పట్టేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన ఆఖరి వన్డేలో పాకిస్తాన్ జట్టు 99 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించి 2-1తో సిరీస్‌ను కై వసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. కెరీర్‌లో ఏడో వన్డే ఆడుతున్న కమ్రాన్ గులామ్ (99 బంతుల్లో 103; 10 ఫోర్లు, 4 సిక్సర్లు) తొలి సెంచరీతో అదరగొట్టాడు. అబ్దుల్లా షఫీక్ (50; 5 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధ శతకం చేశాడు. కెప్టెన్ రిజ్వాన్ (37; 4 ఫోర్లు, ఒక సిక్సర్), సయీమ్ అయూబ్ (31; 3 ఫోర్లు, 1 సిక్స్), సల్మాన్ ఆఘా (30; 3 ఫోర్లు, 1 సిక్స్) తయ్యబ్ తాహిర్ (29 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. జింబాబ్వే బౌలర్లలో సికందర్ రజా, రిచర్డ్ నగరవా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో జింబాబ్వే 40.1 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (63 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో పోరాడినా ఫలితం లేకపోయింది. ఆల్‌రౌండర్ సికందర్ రజా (16) ఎక్కువసేపు నిలవలేకపోగా... బెనెట్ (37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాస్త పోరాడాడు. పాకిస్తాన్ బౌలర్లలో సయీమ్ అయూబ్, హారీస్ రవుఫ్, అబ్రార్ అహ్మద్, జమాల్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. కమ్రాన్ గులామ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సయీమ్ అయూబ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య ఆదివారం తొలి టి20 జరగనుంది.



యు ముంబాపై తెలుగు టైటాన్స్ గెలుపు

నోయిడా: స్టార్ రెయిడర్‌లు ఆశిష్ కుమార్, విజయ్ చెరో 10 పాయింట్లతో విజృంభించడంతో ప్రో కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు మళ్లీ గెలుపు బాట పట్టింది. గత మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓడిన టైటాన్స్... గురువారం జరిగిన పోరులో 41-35 పాయింట్ల తేడాతో మాజీ చాంపియన్ యు ముంబాపై ఘనవిజయం సాధించింది. అటు రెయిడింగ్, ఇటు డిఫెన్స్‌లో ఆకట్టుకున్న తెలుగు టైటాన్స్ జట్టు ప్రత్యర్థిని మూడుసార్లు ఆలౌట్ చేసి సత్తా చాటగా... యు ముంబా జట్టు టైటాన్స్‌ను ఒకేసారి ఆలౌట్ చేయగలిగింది. తాజా లీగ్‌లో ఇప్పటి వరకు 14 మ్యాచ్‌లాడిన తెలుగు టైటాన్స్ 9 విజయాలు, 5 పరాజయాలతో 48 పాయింట్లు సాధించి రెండో స్థానానికి ఎగబాకింది. మరోవైపు 14 మ్యాచ్‌ల్లో 8 విజయాలు, 5 పరాజయాలు, ఒక 'టై'తో 46 పాయింట్లతో ఉన్న యు ముంబా మూడో స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 33-29తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 8 గంటలకు), గుజరాత్ జెయింట్స్‌తో పుణేరి పల్టన్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

భారత క్రికెట్‌కు సిద్ధార్థ్ కౌల్ వీడ్కోలు

న్యూఢిల్లీ: పంజాబ్‌కు చెందిన పేస్ బౌలర్ సిద్ధార్థ్ కౌల్ భారత క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. టీమిండియా తరఫున 3 వన్డేలు, 3 టి20లు ఆడిన సిద్ధార్థ్ గురువారం తన నిర్ణయాన్ని ప్రకటించాడు. భారత క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవడంతో ప్రపంచ లీగ్‌లలో సిద్ధార్థ్ కౌల్ పాల్గొనవచ్చు. 2008లో విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజాతో కలిసి అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన సిద్ధార్థ్ కౌల్... పదేళ్ల ఎదురుచూపు తర్వాత టీమిండియాలో చోటు దక్కించుకున్నా ఎక్కువ కాలం కొనసాగలేకపోయాడు. 34 ఏళ్ల సిద్ధార్థ్ ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ డేర్‌డెవిల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. పంజాబ్ తరఫున 88 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన సిద్ధార్థ్ 297 వికెట్లు పడగొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో అత్యధిక వికెట్లు (155) తీసిన బౌలర్‌గా కౌల్ రికార్డుల్లోకి ఎక్కాడు.



విన్నర్స్ ట్రోఫీతో 8 జట్ల కెప్టెన్లు

యువ ఆటగాళ్ల ఆసియా సమరం

నేటి నుంచి ఏసీసీ అండర్-19 ఆసియా కప్
- అమాన్ సారథ్యంలో టీమిండియా సిద్ధం
- ఉదయం గం. 10:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అండర్-19 ఆసియా కప్ 11వ ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో 8 జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీ పడుతున్నాయి. పాకిస్తాన్, యూఏఈ, జపాన్‌తో కలిసి భారత జట్టు గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగుతుండగా... శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, నేపాల్ గ్రూప్ 'బి'లో ఉన్నాయి. ఈ టోర్నీలో మొత్తం 15 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. బంగ్లాదేశ్ డిఫెండింగ్ చాంపియన్‌గా ఉంది. శుక్రవారం బంగ్లాదేశ్‌తో అఫ్గానిస్తాన్... శ్రీలంకతో నేపాల్ తలపడతాయి. దుబాయ్, షార్జాలలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు ఏసీసీ ఆసియా కప్‌ను 10 సార్లు నిర్వహించగా... అందులో ఎనిమిదిసార్లు భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. డిసెంబర్ 8న జరగనున్న తుది పోరుతో టోర్నమెంట్ ముగుస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు సాధించేందుకు ఆటగాళ్లకు ఈ టోర్నీ ఎంతో ఉపయోగపడనుంది. గతంలో అండర్-19 స్థాయిలో మెరుపులు మెరిపించి... ఆ తర్వాత గ్లోబల్ స్టార్స్‌గా ఎదిగిన ప్లేయర్లు ఎందరో ఉన్నారు. ప్రస్తుతం యువ భారత జట్టుకు మొహమ్మద్ అమాన్ సారథ్యం వహిస్తుండగా... కిరణ్ చోర్మలే వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. టోర్నీలో భాగంగా భారత జట్టు శనివారం తమ తొలి పోరులో పాకిస్తాన్ జట్టుతో తలపడనుంది. అనంతరం డిసెంబర్ 2న జపాన్‌తో, 4న ఆతిథ్య యూఏఈతో మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్ దశ ముగిశాక రెండు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి.

భారత అండర్-19 జట్టు: మొహమ్మద్ అమాన్ (కెప్టెన్), కిరణ్ చోర్మలే (వైస్ కెప్టెన్), ఆయుశ్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ, ఆండ్రీ సిద్ధార్థ్, కేపీ కార్తికేయ, ప్రణవ్ పంత్, హార్దిక్ రాజ్, నిఖిల్ కుమార్, హర్‌వంశ్ సింగ్, అనురాగ్, ఇనాన్, సమర్థ్ నాగరాజ్, యుధాజిత్ గుహ, చేతన్ శర్మ.



దక్షిణ కొరియాలో రికార్డు స్థాయిలో మంచుకురిసింది. గత 120 ఏళ్లలో కేవలం మూడు సార్లు మాత్రమే ఇంతటి భారీ స్థాయిలో మంచు కురిసిందని అధికారులు తెలిపారు. గియోంగ్గి ప్రావిన్స్ రాజధాని సువోన్ నగరంలో గురువారం కనిపించిన దృశ్యమిదీ..



రష్యా వైమానిక దళానికి చెందిన సు-34 బాంబర్ విమానం ఇటీవల ఉక్రెయిన్‌లోని గుర్తు తెలియని ప్రాంతంలోని లక్ష్యంపైకి బాంబును జార విడిచింది. ఆ ఫొటోను రష్యా రక్షణ శాఖ గురువారం విడుదల చేసింది.

అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు

ట్రంప్ బెదిరింపు నేపథ్యంలో కెనడా యోచన

ఒట్టావా: కెనడా దిగుమతులపై అధిక పన్నుల భారం వేస్తానని కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో కెనడా సైతం దీటుగా స్పందించడంపై దృష్టి సారించింది. అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించాలనే విషయాన్ని పరిశీలిస్తోంది. దక్షిణ, ఉత్తర సరిహద్దుల గుండా మాదకద్రవ్యాలు, వలసదారుల అక్రమచొరబాట్లను నిలువరించకపోతే అటు మెక్సికో, అటు కెనడా దిగుమతులపై ఏకంగా 25 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ అమెరికా ఎన్నికల ప్రచారంవేళ ఓటర్లకు వాగ్దానాలు చేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలో అమెరికాతో వాణిజ్యం బలోపేతంపై ఉప ప్రధాని, ఆర్థిక శాఖ మంత్రి క్రిస్టినా ఫ్రీలాండ్, అంతర్గత వ్యవహారాలు, ఇతర శాఖల మంత్రులు, అమెరికాలో కెనడా రాయబారి కిస్టెన్ హిల్‌మ్యాన్‌లతో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గురువారం అత్యవసరంగా సమావేశమయ్యారు. అమెరికాతో వాణిజ్యాన్ని కొనసాగిస్తూ అధిక పన్నులు మోపడంపై చర్చించారు. ఐక్య ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఆయన నొక్కి చెప్పారు. అయితే కెనడాను మెక్సికోను ఒకే గాటిన కట్టడం అన్యాయమని మంత్రులు జస్టిన్ వద్ద ప్రస్తావించారు. కెనడా నుంచి వలసలను తగ్గించడానికి, వనరులను అందించడానికి, ట్రంప్ పరిపాలనతో కలిసి పనిచేయడానికి సిద్ధమేనని ఈ సందర్భంగా ట్రూడో అన్నారు. మాదక ద్రవ్యాలు తమ దేశం సమస్య కాదని, సుంకాలు రెండు దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని కెనడా మంత్రులు అభిప్రాయపడ్డారు. అమెరికాకు దిగుమతి అవుతున్న చాలా ఉత్పత్తులు కెనడా నుంచే వస్తున్నాయి. ప్రతిరోజూ దాదాపు రూ.22,000 కోట్ల విలువైన వస్తు సేవలు కెనడా నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ముడిచమురు అవసరాల్లో 60 శాతం కెనడానే తీరుస్తోంది. 85 శాతం అమెరికా విద్యుత్ ఉపకరణాలు కెనడా నుంచే వస్తున్నాయి. 34 అత్యంత విలువైన ఖనిజధాతువులు, లోహాలు కెనడా నుంచి దిగుమతి అవుతున్నాయి.

ప్రతీకార సుంకాల పరిశీలన..

అమెరికా నుంచి దిగుమతి అయ్యే కొన్ని రకాల ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలను విధించే అవకాశాలను కెనడా పరిశీలిస్తోందని సీనియర్ అధికారి ఒకరు గురువారం వెల్లడించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి కెనడా సిద్ధమవుతోందని, ప్రతీకారంగా ఏ వస్తువులపై సుంకాలు విధించాలనే విషయంపై చర్చిస్తోందని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో అధిక సుంకాలు విధించినప్పుడు, ఇతర దేశాలు ప్రతీకార సుంకాలతో ప్రతిస్పందించాయి. గతంలోనూ 2018లో కెనడా నుంచి దిగుమతి అయిన స్టీల్, అల్యూమినియంపై అమెరికా అదనపు పన్నులు విధించింది. దీనికి ప్రతికా కెనడా సైతం అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై వేలకోట్ల పన్నులను ముక్కుపిండి వసూలుచేసింది.

మెక్సికోతో ట్రంప్ చర్చలు

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌తో అద్భుతమైన చర్చ జరిగిందని ట్రంప్ బుధవారం చెప్పారు. ''వలసదారులు అమెరికా దక్షిణ సరిహద్దు గుండా లోపలికి అక్రమంగా చొరబడకుండా ఇకపై మెక్సికో సమర్థవంతంగా అడ్డుకోనుంది. ఈ చర్యలు తక్షణం అమల్లోకి వస్తాయి. ఈ చర్యలు అమెరికా చేపడుతున్న అక్రమ ఆక్రమణ నిరోధక కార్యక్రమాలకు ఎంతగానో దోహదపడుతుంది. క్లాడియా షీన్‌బామ్‌కు ధన్యవాదాలు''అని ట్రంప్ పోస్ట్‌చేశారు. ''అమెరికాలోకి భారీగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చేపట్టాల్సిన ఉమ్మడి చర్యలపై క్లాడియాతో చర్చించా''అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ భేటీ తర్వాత అమెరికా అధిక పన్నుల భారం నుంచి మెక్సికోకు ఉపశమనం లభిస్తుందో లేదో తెలియరాలేదు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక తీసుకునే నిర్ణయాలపై ఇది ఆధారపడి ఉంటుంది.

ట్రంప్ కేబినెట్ నామినీలకు బాంబు బెదిరింపులు

వాషింగ్టన్: కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మంత్రివర్గ సభ్యులుగా నామినేట్ చేస్తున్న పలువురు నేతలు, ప్రముఖులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. రక్షణ, గృహనిర్మాణం, వ్యవసాయం, కార్మిక శాఖల మంత్రులతోపాటు పలువురు విభాగాలకు అధిపతులుగా ట్రంప్ ఎంపిక చేసిన తొమ్మిది మందికీ ఈ బెదిరింపులు వచ్చాయి. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా ఎంపికైన రిపబ్లికన్ నాయకురాలు ఎలీస్ స్టెఫానిక్ సైతం బెదిరింపులను ఎదుర్కొన్న వారిలో ఉన్నారు. బాంబుతో పేల్చేస్తామని తమ ఇంటికి బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చిందని ఎలీస్ చెప్పారు. థ్యాంక్స్ గివింగ్ కోసం వాషింగ్టన్ డీసీ నుంచి న్యూయార్క్‌కు భర్త, కుమారుడితో కలిసి కారులో వెళ్తుండగా ఆమెకు ఈ బెదిరింపు సందేశం అందింది. రక్షణ మంత్రిగా నామినేట్ అయిన పీట్ హెగ్సెత్‌కు సైతం బెదిరింపు సందేశం వచ్చింది. పర్యావరణ పరిరక్షణ ఏజెన్సీ అడ్మినిస్ట్రేటర్‌గా ట్రంప్ నామినేట్ చేసిన లీ జెల్డిన్, వ్యవసాయ మంత్రిగా నామినేట్ అయిన బ్రూక్ రోలిన్స్‌కూ బుధవారం ఉదయం బెదిరింపు కాల్స్ వచ్చాయి. గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఎంపికైన స్కాట్ టర్నర్, కార్మిక మంత్రిగా ఎంపికైన లోరీ చావెజ్ డెర్మర్‌కు బెదిరింపులు వచ్చాయి. ఇటీవల అమెరికా అటార్నీ జనరల్ పదవి నామినేషన్ నుంచి చివరి నిమిషంలో తప్పుకున్న ఫ్లోరిడా రిపబ్లికన్ నాయకుడు మాట్ గేట్జ్‌ను, వాణిజ్య మంత్రి నామినేట్ అయిన హోవార్డ్ లుట్నిక్‌ను ఆగంతకులు లక్ష్యంగా చేసుకున్నారు. గేట్జ్ స్థానంలో ఎంపికైన పామ్ బోండీతో పాటు శ్వేతసౌధం చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూజీ వైల్స్, సీఐఏ డైరెక్టర్‌గా నామినేట్ అయిన జాన్ రాట్‌క్లిఫ్‌కు బెదిరింపులు వచ్చాయి. అధికార రిపబ్లికన్ పార్టీ నేతలతోపాటు విపక్ష డెమొక్రాట్లకూ బాంబు బెదిరింపు కాల్స్ రావడం గమనార్హం .ఈ ఘటనలను అధ్యక్షుడు బైడెన్‌కు వివరించినట్లు వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. ట్రంప్ బృందంతో ఫెడరల్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంప్రదింపులు జరుపుతోందని, అమెరికా పార్లమెంట్ భద్రతాబలగాలతో కలిసి పరిస్థితిపై సమీక్ష జరుపుతున్నామని శ్వేతసౌధం వెల్లడించింది.

మా ప్రధాని అరెస్టు వారెంట్‌ను రద్దు చేయండి

అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును ఆశ్రయించిన ఇజ్రాయెల్

టెల్ అవీవ్: యుద్ధ నేరాల కేసులో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును అరెస్టు చేయాలంటూ జారీ అయిన అరెస్ట్‌వారెంట్‌పై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును ఇజ్రాయెల్ ఆశ్రయించింది. తీర్పు వచ్చే వరకు ప్రధాని నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి గాలెంట్‌పై అరెస్టు వారెంట్లను నిలిపివేయాలని గురువారం న్యాయస్థానాన్ని ఇజ్రాయెల్ కోరింది. తమ అభ్యర్థనపై నిర్ణయం వెలువడేదాకా వారెంట్ అమలును నిలుపుదల చేయాలని వేడుకుంది. గాజా స్ట్రిప్‌లో యుద్ధం చేస్తూ వేలాది మంది అమాయక పాలస్తీనియన్ల మరణానికి కారణమవుతూ ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని, అందుకే నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి గాలెంట్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేస్తున్నట్లు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ప్రకటించడం తెల్సిందే. హమాస్ సైనిక విభాగ సారథి మొహమ్మద్ డెయిఫ్‌పైనా ఇదే తరహాలో అరెస్టు వారెంట్ జారీ చేసింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అధికార పరిధి, అరెస్టు వారెంట్ల చట్టబద్ధతను తాము సవాలు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అభ్యర్థనను కోర్టు తిరస్కరిస్తే, ఇజ్రాయెల్ ప్రభుత్వం పట్ల అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు, ఐక్యరాజ్య సమితి ఎంత పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇజ్రాయెల్ మిత్రదేశాలకు అర్థమవుతుందని వ్యాఖ్యానించింది. 2023 అక్టోబర్ 8 నుంచి 2024 మే 20 వరకు మానవాళికి వ్యతిరేకంగా చేసిన యుద్ధ నేరాలకు సంబంధించి బెంజమిన్ నెతన్యాహు, యోవ్ గాలెంట్‌లపై అరెస్టు వారెంట్లు జారీచేశారు. ఈ చర్యను నెతన్యాహు, ఇతర ఇజ్రాయెల్ రాజకీయ నాయకులు తీవ్రంగా ఖండించారు. అమెరికా, ఫ్రాన్స్‌లు నెతన్యాహుకు మద్దతు పలికాయి. వారెంట్ల జారీని తప్పుబట్టాయి. మిత్రదేశాలైన బ్రిటన్, కెనడా మాత్రం కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటించడం విశేషం. ఈ నేపథ్యంలో హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం యూదుల పట్ల వివక్ష చూపిస్తోందని నెతన్యాహు ఆరోపించారు.

ఢిల్లీలో ఈడీ బృందంపై దాడి

ఒక అధికారికి గాయాలు

న్యూఢిల్లీ: సైబర్ క్రైంకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో సోదాలకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులపై దాడి జరిగిందని అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీలోని ఓ ఫాంహౌస్‌లో తనిఖీల సందర్భంగా జరిగిన దాడిలో ఒక అధికారి గాయపడ్డారని వెల్లడించాయి. ప్రథమ చికిత్స అనంతరం ఆయన యథా ప్రకారం తనిఖీల్లో పాల్గొన్నారని చెప్పాయి. నైరుతి ఢిల్లీలోని కపుషెరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బజ్వాసన్ ప్రాంతంలో చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ) అశోక్ కుమార్ శర్మకు చెందిన ఫాంహౌస్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి అశోక్ కుమార్ శర్మ బంధువు యశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అధికారులపై దాడిలో శర్మ కూడా పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. పీవైపైపీఎల్ అనే యాప్ ద్వారా శర్మ, యశ్ మరికొందరు సీఏలు ముఠాగా ఏర్పడి ఇతరుల బ్యాంకు అకౌంట్ వివరాలను తెలుసుకోవడం, క్యూఆర్ కోడ్ చీటింగ్, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో మోసం వంటి నేరాలకు పాల్పడుతున్నారు.

ఢిల్లీలో పేలుడు.. ఒకరికి గాయాలు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో ఉన్న పీవీఆర్ ప్రశాంత్ విహార్ వద్ద గురువారం సంభవించిన పేలుడులో ఒకరు గాయపడ్డారు. పార్కు వద్ద ఉన్న స్వీట్ దుకాణం వద్ద తక్కువ తీవ్రత కలిగిన పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. అక్టోబర్ 20న ఇదే ప్రాంతంలో జరిగిన పేలుడులో సీఆర్‌పీఎఫ్ స్కూలు ప్రహరీ దెబ్బతిందని గుర్తు చేశారు. గురువారం ఉదయం 11.45 ప్రాంతంలో జరిగిన పేలుడు కారణంగా త్రీ వీలర్ డ్రైవర్ చేతన్ కుష్వాహ(28) స్వల్పంగా గాయపడ్డాడన్నారు. పేలుడుతో ఆ ప్రాంతంలో భారీగా పొగ అలుముకోవడంతో జనం ఆందోళన చెందారన్నారు. దర్యాప్తు చేపట్టామని చెప్పారు.



ఇటీవలి ఉప ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఘన విజయం సాధించిన ప్రియాంకా గాంధీ గురువారం పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ వెలుపల సోదరుడు, ఎంపీ రాహుల్ గాంధీ ఇలా ఆమెను సరదాగా సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీస్తూ కనిపించారు

ఇస్కాన్‌పై నిషేధానికి బంగ్లాదేశ్ హైకోర్టు నో

ఢాకా: బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందంటూ నిషేధం కోరుతూ దాఖలైన పిటిషన్‌ను బంగ్లాదేశ్ హైకోర్టు గురువారం కొట్టేసింది. దేశద్రోహం ఆరోపణలపై హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్ట్, తదనంతర పరిణామాలపై వార్తపత్రికల్లో వచ్చిన కథనాలను సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాది మొహమ్మద్ మునీరుద్దీన్ సమర్పించినప్పటికీ హైకోర్టు ఇస్కాన్‌పై నిషేధానికి నిరాకరించింది. సుప్రీంకోర్టు న్యాయవాది మొనియుజ్జమాన్ తదితరులు దాఖలుచేసిన పిటిషన్‌ను జస్టిస్ ఫరా మొహబూబ్, జస్టిస్ దెబాశిష్ రాయ్ చౌదరీల హైకోర్టు ధర్మాసనం విచారించింది. కృష్ణదాస్‌ను కోర్టులో హాజరుపరిచేందుకు తరలిస్తున్న సమయంలో ఛట్టోగ్రామ్‌లో జరిగిన ఘర్షణలు, గాయపడిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) సైపుల్ ఇస్లాం మరణం తదితరాలను ప్రభుత్వ లాయర్లు ప్రస్తావించారు. ఇస్కాన్ మద్దతుదారులు, పోలీసుల మధ్య ఘర్షణలు, వేర్వేరు ప్రాంతాల్లో మైనారిటీ హిందువులపై దాడులకు సంబంధించిన నివేదికను అటార్నీ జనరల్ మొహమ్మద్ అసదుజ్జమాన్ హైకోర్టుకు సమర్పించారు. వీటిని పరిశీలించిన కోర్టు ఇస్కాన్‌పై నిషేధం అక్కర్లేదని తేల్చిచెప్పింది. ''ఉద్రిక్తతలను సద్దుమణిగేలా చేస్తూ ప్రభుత్వం తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ అంశంలో కోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు''అని జడ్జి మహబూబ్ అన్నారు. పీపీ హత్య, ఇస్కాన్ ఆగడాలలతో 33 మందిని అరెస్ట్‌చేశామని, ఈ నేపథ్యంలో ఇస్కాన్‌పై నిషేధం విధించాలంటూ అదనపు అటార్నీ జనరల్ అనీక్ ఆర్ హాఖ్, డిప్యూటీ అటార్నీ జనరల్ అసదుద్దీన్ చేసిన వాదనలను హైకోర్టు తోసిపుచ్చింది. ''శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణగా నిలబడాలి'అని కోర్టు ఆదేశించింది. తీర్పును ఇస్కాన్ బంగ్లాదేశ్ స్వాగతించింది. ''మత, సంక్షోభానికి దారితీసే ఎలాంటి కార్యకలాపాల్లో ఇస్కాన్ బంగ్లాదేశ్ భాగస్వామిగా లేదు. ఐక్యత, మత సామరస్యం గురించి మాత్రమే ఇస్కాన్ ప్రభోదిస్తుంది. తాజా ఘటనలతో ఇస్కాన్‌కు ముడిపెడుతూ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. మా సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు ఇతరులు చేస్తున్న కుట్ర ఇది''అని ఇస్కాన్ బంగ్లాదేశ్ అధ్యక్షుడు సత్యరంజన్ బారోయ్, ప్రధాన కార్యదర్శి చారుచంద్ర దాస్ బ్రహ్మచారి మీడియా సమావేశంలో అన్నారు. మరోవైపు కృష్ణదాస్‌ను వెంటనే విడుదలచేయాలని ఢిల్లీలో ప్రవాసజీవితం గడుపుతున్న బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా డిమాండ్‌చేశారు. తీర్పును నిరసిస్తూ మాజీ ప్రధాని ఖలీదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ లాయర్ల విభాగమైన జాతీయతావాది అయిన్‌జీబీ ఫోరమ్ సభ్యులు గురువారం సుప్రీంకోర్టు బార్ వద్ద ఆందోళనకు దిగారు.

కాల్పుల విరమణ ఉల్లంఘన లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడి

బీరుట్: హెజ్‌బొల్లా సాయుధ సంస్థ బుధవారం కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ తమపైకి రాకెట్లను ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేస్తోందని ఆరోపించిన ఇజ్రాయెల్ గురువారం లెబనాన్‌లో వైమానిక దాడి జరిపింది. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. దక్షిణ లెబనాన్‌లో సురక్షిత ప్రాంతాల నుంచి ఇళ్లకు తిరిగి వస్తున్న వారిపై దాడి జరిపామని ఇజ్రాయెల్ తెలిపింది. అయితే, దాడిలో ఇద్దరు గాయపడినట్లు లెబనాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతున్నట్లు విశ్వాసం కుదిరితే దశల వారీగా బలగాలను ఉపసంహరించుకుంటామని ఇజ్రాయెల్ పేర్కొంది. దక్షిణ సరిహద్దుల నుంచి ఇజ్రాయెల్ బలగాలు వెనక్కి మళ్లితేనే తమ బలగాలను ఉపసంహరించుకుంటామని లెబనాన్ ప్రభుత్వ తెలిపింది.

ప్రశ్నోత్తరాలు...

విద్యార్థి వీసా ఫీజును ఆస్ట్రేలియా భారీగా పెంచింది

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా ప్రభుత్వం అంతర్జాతీయ విద్యార్థుల వీసా ఫీజును భారీగా పెంచిందని కేంద్రం తెలిపింది. గురువారం రాజ్యసభలో విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రస్తుతం 710 ఆస్ట్రేలియా డాలర్లు(సుమారు రూ.39 వేలు)గా ఉన్న వీసా ఫీజును ఏకంగా 1,600 డాలర్ల (రూ.88 వేల)కు పెంచిందని, వచ్చే ఏడాది జులై ఒకటో తేదీ నుంచి అమలు కానుందని మంత్రి చెప్పారు. ఈ చర్య భారత్ సహా ఇతర దేశాల విద్యార్థులకు పెనుభారంగా మారనుందన్నారు. ఈ నేపథ్యంలో వీసా ఫీజు పెంపును పునఃపరిశీలించాలంటూ ఆస్ట్రేలియా అధికారులను కోరామని ఆయన వివరించారు.

పోక్సో కోర్టుల్లో 1.80 లక్షల కేసుల పరిష్కారం

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే పోక్సో చట్టం అమలుకు ఏర్పాటైన ప్రత్యేక కోర్టులు ఇప్పటి వరకు 1.80 లక్షల కేసుల్ని పరిష్కరించాయని కేంద్రం తెలిపింది. మహిళా శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రీ ఠాకూర్ గురువారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం తెలిపారు. ఇవి కేసులను త్వరత్వరగా పరిష్కరిస్తున్నాయన్నారు. 2019-20 సంవత్సరాల్లో దేశ వ్యాప్తంగా పోక్సో కోర్టులు 272 ఉండగా ప్రస్తుతం 408 పనిచేస్తున్నాయన్నారు. అత్యధికంగా యూపీలో ఏర్పాటైన 74 పోక్సో ప్రత్యేక కోర్టులు 40 వేల కేసుల్ని పరిష్కరించాయన్నారు. ఛండీగఢ్, మణిపూర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఇవి ఏర్పాటు కావాల్సి ఉందని వివరించారు.

దిగువ కోర్టుల్లో 5 వేల పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న సబార్డినేట్, జిల్లా కోర్టుల్లో కలిపి మొత్తం 5,245 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. అదేవిధంగా, మొత్తం 25 హైకోర్టుల్లో కలిపి మంజూరైన 1,114 మంది జడ్జీలకు గాను 364 పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని గురువారం న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యసభలో తెలిపారు. ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీంకోర్టులో ఉండాల్సిన 34 మంది జడ్జీలకు గాను రెండు పోస్టులు ప్రస్తుతం ఖాళీ అయ్యాయని వివరించారు. అఖిల భారత జ్యుడీషియల్ సర్వీస్ ఏర్పాటు ప్రతిపాదనపై 2012 నుంచి ఎలాంటి కదలికా లేదని చెప్పారు.

జడ్జీల ఆస్తి వివరాల వెల్లడి తప్పనిసరి కాదు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను అందించడాన్ని తప్పనిసరి చేస్తూ చట్టం తీసుకువచ్చే ఉద్దేశం లేదని కేంద్రం తెలిపింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. 2023లో న్యాయవ్యవస్థ సంస్కరణలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఉన్నత న్యాయస్థానాల్లోని జడ్జీలు తమ ఆస్తుల వివరాలను సమర్పించడం తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. అయితే, ఉన్నత న్యాయస్థానాల్లో పనిచేసే జడ్జీలు తమ ఆస్తుల వివరాలను వెల్లడించడం స్వచ్ఛందంగానే జరగాలని సుప్రీంకోర్టు 2009లో నిర్ణయించిందని ఆయన గుర్తు చేశారు.

సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ 1,248 మంది మృతి

న్యూఢిల్లీ: సెప్టిక్ ట్యాంకులు, మురుగు కాల్వలను శుద్ధి చేసే క్రమంలో 1993 నుంచి జరిగిన ప్రమాదాల్లో 1,248 మంది ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్రం తెలిపింది. అత్యధికంగా తమిళనాడులో 253 మంది, ఆ తర్వాత గుజరాత్‌లో 183 మంది, యూపీలో 133, ఢిల్లీలో 116 మంది మృతి చెందారని వెల్లడించింది. సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలె గురువారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. సెప్టిక్ ట్యాంకులను, మురుగు కాల్వలను మనుషులతో శుభ్రం చేయించడం చట్ట రీత్యా నేరమని, ఇలాంటివి చేయించిన వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా పడుతుందన్నారు.

కెనడాలో నిఘా నీడన భారత దౌత్యాధికారులు

న్యూఢిల్లీ: కెనడాలోని వాంకూవర్‌లో ఉన్న భారత కాన్సులేట్ సిబ్బందిపై అక్కడి అధికారులు నిఘా వేసి ఉంచారని కేంద్రం తెలిపింది. గురువారం రాజ్యసభలో విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం వెల్లడించారు. ఆడియో, వీడియో నిఘా ఉంచినట్లు కెనడా అధికారులు వాంకూవర్‌లోని భారత కాన్సులేట్ అధికారులకు తెలిపారని ఆయన అన్నారు. మన అధికారుల వ్యక్తిగత ఫోన్ సంభాషణలను సైతం వారు వింటున్నారన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలు సజావుగా సాగాలంటే ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాలను పరస్పరం గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు. కెనడా వైఖరి దౌత్య నిబంధనలు, సంప్రదాయాలను ఉల్లంఘించేలా ఉందన్నారు. మన దౌత్య సిబ్బందికి రక్షణ కల్పించే విషయమై కెనడా ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామన్నారు.

ప్రపంచమంతటా భారత సంస్కృతీ సౌరభాలు: మోదీ

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కతితీ సౌరభాలు వెల్లివిరుస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యకం చేశారు. ఇతర దేశాల్లో మన సంస్కృతి ప్రతిధ్వనిస్తోందని పేర్కొన్నారు. వివిధ దేశాల్లో తాను పర్యటించిన సమయంలో అక్కడ ప్రదర్శించిన భారతీయ సంస్కృతి కళారూపాలకు సంబంధించిన జ్ఞాపకాలను మోదీ గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. తాను ఏ దేశానికి వెళ్లినా అక్కడ భారతీయ చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి పట్ల ప్రజల్లో అంతులేని ఉత్సాహాన్ని గమనించానని, అది తనకు ఎంతో సంతోషం కలిగించిందని తెలిపారు. ఆస్ట్రియాలో వందేమాతరం ఆలాపన, పోలాండ్, రష్యాలో గార్బా నృత్యప్రదర్శన, భూటాన్‌లో దాండియా రాస్, సింగపూర్‌లో భరతనాట్యం, లావోస్, బ్రెజిల్‌లో రామాయణ ప్రదర్శన, భూటాన్‌లో ఆలపించిన భారతీయ జానపద గీతాలను మోదీ 'ఎక్స్'లో పంచుకున్నారు.

లష్కరే ఉగ్రవాదిని భారత్‌కు అప్పగించిన రువాండా

ఇంటర్ పోల్ సాయంతో ఎన్ఐఏ, సీబీఐల ఆపరేషన్

న్యూఢిల్లీ: బెంగళూరులో హింసాత్మక కార్యకలాపాలకు పథకం రచిస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఉగ్రవాదిని ఆఫ్రికా దేశం రువాండా భారత్‌కు అప్పగించింది. ఇంటర్ పోల్ సాయంతో ఎన్ఐఏ, సీబీఐల ఉమ్మడి ఆపరేషన్ ఫలితంగా పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబాకు చెందిన సల్మాన్ రెహ్మాన్ ఖాన్‌ను గురువారం భారత్‌కు తీసుకువచ్చారు. పోక్సో కేసులో సల్మాన్ రెహ్మాన్ ఖాన్ 2018-22 మధ్యన జైలు జీవితం గడిపాడు. అనంతరం లష్కరే ఉగ్రవాది టి.నసీర్ ప్రభావంతో ఇతడు ఉగ్రబాట పట్టాడు. దేశంలో ఉగ్రవాద వ్యాప్తికి కుట్ర పన్నాడనే ఆరోపణలపై ఇతడిపై బెంగళూరులోని హెబ్బాళ పోలీస్ స్టేషన్‌లో ఎన్ఐఏ 2023లో ఫిర్యాదు చేసింది. బెంగళూరులో రెహ్మాన్‌తో సంబంధం ఉన్న ఉగ్ర మాడ్యూల్ గుట్టును పోలీసులు రట్టు చేయడంతో ఇతడు దేశం నుంచి పరారయ్యాడు. ఎన్ఐఏ వినతి మేరకు ఇంటర్ పోల్ సాయంతో సీబీఐ రెహ్మాన్‌పై రెడ్ నోటీస్ జారీ చేసింది. రువాండా అధికారులు ఇతడిని దేశ రాజధాని కిగాలిలో ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న ఎన్ఐఏ అధికారులు కిగాలి నుంచి రెహ్మాన్‌ను గురువారం ఢిల్లీకి తీసుకువచ్చారని సీబీఐ తెలిపింది.

దశరాజ యుద్ధానికి కారణమైన పురోహితుడు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునను దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక,సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞయాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన తాత్విక చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికితోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధా న్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్థుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం, పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పడ' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అధర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతోపాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలింపకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా 'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుక. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు బాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్, అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞయాగాలు, బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలో మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4)పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
3. వీటిలో తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి 2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి 4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల-కుండలు తయారు చేసేవారు
   2) నిషాద - చేపలు పట్టేవారు
   3) కైవర్త - బుట్టలు అల్లేవారు
   4) వేణ - వేటాడేవారు
8. కింద ఇచ్చిన జాబితాల నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి?

జాబితా -1	జాబితా-2
ఎ) సూత	1) మంగలి
బి) దౌహిత్రి	2) వధించరానిది(ఆవు)
సి) గోఘన	3) రథకారుడు
డి) అఘన్య	4) కూతురు
ఇ) వాప్త	5) అతిథి

	కోడ్స్: ఎ బి సి డి ఇ		కోడ్స్: ఎ బి సి డి ఇ
1	5 4 1 2 3	2	3 4 5 2 1
3	3 4 1 2 5	4	1 2 3 4 5

9. దశరాజ యుద్ధానికి కారకుడైన పురోహితుడు?
   1) దుర్వాసుడు 2) విశ్వామిత్రుడు
   3) యజ్ఞవల్క్య 4) సుదాసు
10. వైదిక యుగ పాలనా విభాగాలను సరైన ఆరోహణ క్రమంలో అమర్చండి?
   1) రాష్ట్ర, జన, విశ్, గ్రామ, కుల
   2) జన, రాష్ట్ర, గ్రామ, కుల, విశ్
   3) కుల, గ్రామ, విశ్, జన, రాష్ట్ర
   4) కుల, గ్రామ, విశ్, రాష్ట్ర, జన

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2; 9) 2; 10) 3.

స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు..

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

తెలుగు - కంటెంట్ (ఎస్ఏ/ఎల్పీ)

సంధులు - వ్యాకరణ పరిభాషలు

డీఎస్సీ అభ్యర్థులు శ్రద్ధగా చదవాల్సిన వ్యాకరణాంశాలు సంధులు, వ్యాకరణ పరిభాషలు. వీటిపై ఎక్కువ ప్రశ్నలు రావచ్చు. స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్స్ అభ్యర్థులందరూ వీటిని తప్పకుండా అధ్యయనం చేయాలి. **సంధులు:** I. సంస్కృత సంధులు, II. తెలుగు సంధులు.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి 2. గుణ సంధి
3. వృద్ధి సంధి 4. యణాదేశ సంధి
5. జశ్త్వ సంధి 6. శ్చుత్వ సంధి
7. అనునాసిక సంధి 8. విసర్గ సంధి
9. పరసవర్ణ సంధి 10. పరరూప సంధి

II. **తెలుగు సంధులు:**

1. ఉత్వ సంధి 2. ఇత్వ సంధి
3. అత్వ సంధి 4. యడాగమ సంధి
5. టుగాగమ సంధి 6. రుగాగమ సంధి
7. దుగాగమ సంధి 8. నుగాగమ సంధి
9. ద్విరుక్తటకార సంధి 10. సరళాదేశ సంధి
11. గ, స, డ, ద, వా దేశ సంధి
12. ఆమ్రేడిత సంధి 13. పుంప్వాదేశ సంధి
14. త్రిక సంధి 15. పడ్వాది సంధి
16. ప్రాంతాది సంధి 17. లు, ల, నల సంధి

సంధులకు సంబంధించి ఒక పదాన్నిచ్చి దాన్ని సరిగా విడదీయమని అడుగుతారు. లేదా విభజించిన రూపాన్నిచ్చి సరిగా కలుపమని అడుగుతారు. సంధి సూత్రాలు రాయాల్సిన అవసరం లేకపోయినా అవగాహన కోసం సూత్రాలు తెలుసుకోవడం మంచిది.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి

అ-ఇ-ఉ-ఋలకు అవే అచ్చులు పరమైనా వాటి దీర్ఘాలు ఏకాదేశమవడాన్ని సవర్ణ దీర్ఘ సంధి అంటారు.

ఉదా: రామ + ఆజ్ఞ = రామాజ్ఞ
మహి + ఈశుడు = మహీశుడు
గురు + ఉపదేశం = గురూపదేశం
పితృ + ఋణం = పితౄణం

2. గుణ సంధి: అకారానికి ఇ-ఉ-ఋలు పరమైతే క్రమంగా ఏ-ఓ-అర్‌లు ఏకాదేశ మవడాన్ని గుణసంధి అంటారు.

ఉదా: సూర్య + ఉదయం = సూర్యోదయం
మహా + ఈశ్వరుడు = మహేశ్వరుడు
ఇతర + ఇతర = ఇతరేతర
రాజ + ఋషి = రాజర్షి

3. వృద్ధి సంధి: అకారానికి ఏ, ఐలు పరమైతే ఐకారాన్ని; ఓ, ఔలు పరమైతే ఔకారాన్ని; ఋ, ౠలు పరమైతే ఆర్ ఏకాదేశమవడాన్ని వృద్ధి సంధి అంటారు. ఐ, ఔలను వృద్ధులు అంటారు.

ఉదా: భువన + ఏక = భువనైక
అఖండ + ఐశ్వర్యం = అఖండైశ్వర్యం
పాప + ఓఘం = పాపౌఘం
పరమ + ఔషధం = పరమౌషధం
ఋణ + ఋణం = ఋణార్ణం

4. యణాదేశ సంధి: ఇ-ఉ-ఋలకు అసవర్ణాచ్చులు పరమైతే క్రమంగా య-వ-రలు ఆదేశమవడాన్ని యణాదేశ సంధి అంటారు. ''ఇకోయణచిః'' : ఇక్కులకు (ఇ-ఉ-ఋ) యణ్ణులు (య-వ-ర) పరమవుతున్నందు వల్ల ఇది యణాదేశ సంధి.

ఉదా: జయంతి + ఉత్సవం = జయంత్యుత్సవం
హిందూ + ఆర్యులు = హిందార్వ్యులు
పితృ + ఆర్జితం = పిత్రార్జితం

5. జశ్త్వ సంధి: క-చ-ట-త-పలకు అచ్చులు కానీ, హ-య-వ-ర-లు కానీ, వర్గ తృతీయ చతుర్థ పంచమాక్షరాలు కానీ, పరమైతే గ, జ, డ, ద, బలు ఆదేశమవడాన్ని జశ్త్వసంధి అంటారు.

ఉదా: తత్ + అరణ్య భూములు = తదరణ్య భూములు
అచ్ + అంతం = అజంతం
వాక్ + ఈశుడు = వాగీశుడు
కకుప్ + అంతం = కకుబంతం
సత్ + భావం = సద్భావం

6. శ్చుత్వ సంధి: సకారత వర్గాలకు శకారచ వర్గాలు పరమైనప్పుడు శకారచ వర్గాలే ఆదేశమవడాన్ని శ్చుత్వ సంధి అంటారు.

(సకార-త థ ద ధ న) (త వర్గం)
(శకార - చ ఛ జ ఝ ఞ) (చ వర్గం)
తపస్ + శమము = తపశ్శమము
(స్(స)+శ= శ్శ)
సత్+చరిత్ర=సచ్చరిత్ర(త్ (త) - చ= చ్చ)
సత్+జనుడు= సజ్జనుడు(త్ (త)+జ= జ్జ)
విద్యుత్+శక్తి=విద్యుచ్ఛక్తి(త్ (త)+ శ=చ్ఛ)

7. అనునాసిక సంధి: వర్గ ప్రథమాక్షరాలకు (క-చ-ట-త-ప)'న, మ' అనునాసికాలు పరమైనప్పుడు ఆయా వర్గానునాసికాలు వికల్పంగా రావడాన్ని అనునాసిక సంధి అంటారు. మయాది ప్రత్యయాలకు నిత్యముగా వస్తాయి.

ఉదా: వాక్ + మయం = వాఙ్మయం
(క-ఙ=నిత్యం)
జగత్ + నాటకం = జగన్నాటకం
= జగద్నాటకం (వికల్పం)
(అనునాసికం రానప్పుడు వర్గ తృతీయాక్షరం (త-ద-వికల్పం)
మృట్ + మయం = మృణ్మయం,
మృడ్మయం (టకు అనునాసికం రానప్పుడు డకారం వికల్పం)

8. విసర్గ సంధి: అకారం పూర్వముందున్న విసర్గకు వర్గ తృతీయ, చతుర్థ, పంచమాక్షరాలు అ-హ-య-వ-ర-లలు పరమైనప్పుడు విసర్గ - ఓకారంగా మారుతుంది. (వర్గ తృతీయాక్షరాలు- గ, జ, డ, బ, లు వర్గ చతుర్థాక్షరాలు (ఘ, ఝ, ఢ, ధ, భ, లు)

వర్గ పంచమాక్షరాలు: ఙ- ఞ- ణ- న-మ్ (అనునాసికాలు) హ-య-వ-ర-లలు పరమైనప్పుడు మాత్రమే విసర్గ ఓకారంగా మారుతుంది. కొన్నిసార్లు రేఫ వస్తుంది.

ఉదా: అయః + మయం = అయోమయం
(యః + మ = ఓ)
ఇతః + అధికం = ఇతోధికం (తః+అ = ఓ)
చతుః + ఆత్మ = చతురాత్మ
(తుః + ఆ = 'ర' కారం వచ్చింది)
తపః ఫలము = తపఃఫలం (ఫ కారం వర్గ ద్వితీయాక్షరమైనందు వల్ల విసర్గలో మార్పు లేదు).

9. పర సవర్ణ సంధి: పదాంతం ముందున్న 'త' కారానికి లకారం పరమైనప్పుడు 'ల'కారమే ఆదేశంగా రావడాన్ని పర సవర్ణ సంధి అంటారు. (త్ – తకారానికి లకారం వస్తే 'ల్ల' కారం వస్తుంది)

ఉదా: భగవత్ + లీల = భగవల్లీల
(త్ + ల = ల్ల)
ఉత్ + లేఖనం = ఉల్లేఖనం (త్+లే = ల్లే)
విద్యుత్ + లత = విద్యుల్లత (త్ + ల = ల్ల)
సుహృత్ + లాభం = సుహృల్లాభం
(త్ + లా = ల్లా)

10. పరరూప సంధి: హల్లుల్లోని అకారానికి అకారం పరమైతే రెండో పదంలోని మొదటి అచ్చు ఏకాదేశమవుతుంది. దీన్ని పరరూపసంధి అంటారు.

ఉదా: సార + అంగము = సారంగము
(ర్ + అ = రకారంలోని అకారానికి 'అ' కారం పరమై రకారానికి దీర్ఘం వచ్చింది)
సీమ + అంతము = సీమంతము
(మ్ + అకారానికి అకారం పరమై అకార దీర్ఘం వచ్చింది)

తెలుగు సంధులు

1. ఉత్వ సంధి: ఉత్తునకచ్చుపరమైనప్పుడు సంధి నిత్యముగా వస్తుంది (హ్రస్వమైన ఉకారానికి మాత్రమే ఇది వర్తిస్తుంది)

ఉదా: రాముడు + అతడు = రాముడతడు (డులోని ఉ కారానికి అకారం పరమై అకారం నిత్యంగా వచ్చింది)

- ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణంబులందున్న ఉకారానికి సంధి వైకల్పికం అవుతుంది.
- ప్రథమా విభక్తి కాకుండా ఇతర విభక్తుల్లో శత్రర్థకమైన 'చున్' ప్రత్యయంలోని ఉకారానికి సంధి వైకల్పికమని అర్థం.
- వైకల్పికమంటే ఒకసారి సంధి జరిగిన రూపం, మరోసారి సంధి జరగని రూపం సిద్ధిస్తుంది.

ఉదా: నన్నున్ + అడిగె = నన్నడిగె
(సంధి జరిగిన రూపం)
నన్నునడిగె (సంధి జరగని రూపం)

2. ఇత్వ సంధి: ఇత్తునకు సంధి వైకల్పికం. ఏమ్యాదుల్లో ఇత్తునకు సంధి వైకల్పికం (ఏమి, మరి, అది, అవి, ఇది, ఇవి, కాన్) మొదలైనవి ఏమ్యాదులు.

ఉదా: ఏమి + అంటివి:
ఏమంటివి, (సంధి జరిగిన) ఏమియంటివి (సంధి జరుగని)

- మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధి నిత్యం.

ఉదా: చూచితిరి + ఇపుడు = చూచితిరిప్పుడు

- క్త్వార్థంబైన ఇత్తునకు సంధి లేదు.
  భూతకాలిక అసమాపక క్రియ క్త్వార్థంబు

ఉదా: వచ్చి + ఇచ్చి = వచ్చియిచ్చి (సంధి లేనందువల్ల యడాగమ రూపం)

3. అత్వ సంధి: అత్తునకు సంధి బహుళం.

- బహుళమంటే నిత్యం, నిషేధం, వైకల్పికం, అన్యవిధం అనే నాలుగు కార్యాలు ఉంటాయి.

నిత్యంగా జరిగేవి

ఉదా: రామ + అయ్య = రామయ్య (నిత్యం)

సంధి జరగని నిషేధ రూపం

ఉదా: దూత + ఇతడు = దూతయితడు
(యడాగమ రూపం)

వైకల్పికంగా జరగడం: సంధి జరిగిన రూపం, సంధి జరగని యడాగమ రూపం రెండూ వస్తాయి.

ఉదా: మేన + అల్లుడు = మేనల్లుడు
(సంధి జరిగిన రూపం)
మేనయల్లుడు (సంధి జరుగని యడాగమ రూపం)

అన్యవిధం: సూత్రంలో సూచించని విధంగా కొన్ని హల్లులు వచ్చి చేరతాయి.

ఉదా: తామర + ఆకు = తామరప్రాకు
పుగాగమం అన్య విధంగా వచ్చి చేరింది.

4. యడాగమ సంధి: సంధి లేని చోట స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు యడాగమంబగు. సంధి జరిగే అవకాశం లేనప్పుడు పర స్వరానికి ముందు 'య్' కారం ఆగమంగా వచ్చి చేరుతుంది.

ఉదా: వెల + (య్) ఆలు = వెలయాలు
మా + (య్) అమ్మ = మాయమ్మ

5. టుగాగమ సంధి: కర్మధాయంలో ఉత్తునకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబగుతుంది.

వివరణ: నామవాచక, విశేషణాలకు సంబంధించిన సమాసం కర్మధారయ సమాసం. ఇందులో పరస్వరానికి ముందు 'ట్' కారం ఆగమంగా వస్తుంది.

ఉదా: కఱకు+ (ట్) అమ్ము = కఱకుటమ్ము

- కర్మధారయమున పేర్వాది శబ్దాలకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబువిభాషనగు.

పేర్వాదులు: పేరు, పొదరు, చిగురు, తలిరు.

ఉదా: పేరు + ఉరము = పేరుటురము
(టుగాగగం రానప్పుడు)

6. రుగాగమ సంధి: కర్మధారయంబున 'పేరాది' శబ్దాలకు 'ఆలు'శబ్దం పరమైనప్పుడు రుగాగమంబగు.

పేరాది శబ్దాలు: పేద, బీద, ముగ్ధ, కొమ, జవ, మనుమ, ఐదవ మొదలైనవి.

ఉదా: పేద (ర్) + ఆలు = పేదరాలు
పరస్వరానికి ముందు 'ర్' కారం చేరి పేదరాలు రూపం వచ్చింది.
మనుమ(ర్) + ఆలు = మనుమరాలు

- కర్మధారయంబున తత్సమ పదాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు అత్వంబునకు ఉత్వంబు రుగాగమవుతుంది.

(**తత్సమ శబ్దాలు:** ధీర, గుణవంత, ధనవంత, సంపన్న, గంభీర, ధైర్యవంత మొదలైనవి)

ఉదా: ధీర + ఆలు = ధీరు+ ర్ + ఆలు
= ధీరురాలు
గుణవంత + ఆలు =
గుణవంతు + ర్ +ఆలు= గుణవంతురాలు

7. దుగాగమ సంధి: నీ-నా-తన శబ్దాలకు ఉత్తర పదంబు పరమైనప్పుడు దుగాగమంబు విభాషనగు.

ఉదా: నా + (దు) విభుడు = నాదువిభుడు
(సంధి జరిగిన రూపం)
నా విభుడు (సంధి జరగని రూపం)
తన + (దు) కోపం = తనదు కోపం
(సంధి జరిగిన రూపం)
తన కోపం (సంధి జరగని రూపం)

8. నుగాగమ సంధి: ఉదంత తద్ధర్మార్థ విశేషణానికి అచ్చుపరమైనప్పుడు నుగామమంబగు.

తద్ధర్మార్థకాలు: భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో జరిగే క్రియలు. హ్రస్వమైన ఉకారం చివర ఉన్న తద్ధర్మార్థక క్రియలకు అచ్చుపరమైతే నుగాగమం వస్తుందని సూత్రార్థం.

ఉదా: చేయు + (న్) ఎడ = చేయునెడ
వ్రాయు + (న్) అది = వ్రాయునది

- షష్ఠీ తత్పురుష సమాస మందలి ఉకార, ఋకారంబులకు అచ్చుపరమైనప్పుడు నుగాగమంబగు.

ఉదా: రాజు + (న్) ఆనతి = రాజునానతి
చెరువు + (న్) ఉదకం = చెరువునుదకం

9. ద్విరుక్తటకార సంధి: కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల 'ఱ, డ'లకు అచ్చు పరమైనప్పుడు ద్విరుక్తటకారం ఆదేశమవుతుంది.

ఉదా: కు (ఱు) (ట్ట్)+ ఉసురు = కుట్టుసురు
చిఱు + (ట్ట్) ఎలుక = చిట్టెలుక
కడు + (ట్ట్) ఎదురు = కట్టెదురు
నడు + (ట్ట్) ఇల్లు = నట్టిల్లు
నిడు + ఊర్పు = నిట్టూర్పు

వివరణ: ద్విరుక్తటకారమంటే ద్విత్వటకారమని అర్థం. ద్విత్వటకారం ఆదేశంగా వచ్చి ఈ రూపాలు వచ్చాయి.

10. సరళాదేశ సంధి: ద్రుత ప్రకృతికం మీది పరుషాలకు సరళములగు.

ఉదా: పూచెను + కలువలు, పూచెను గలువలు: పరుషమైన కకారం సరళంగా (గ) మారింది.

- ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషణలు విభాషనగు. పూచెను + గలువలు -పూచెంగలువలు;పూచెన్గలువలు: పూచెనుగలువలు, పూచెఁగలువలు అనే నాలుగు రూపాలు వస్తాయి. సమాసములందు స్వత్వ సంశ్లేషణ రూపాలుండవు. అర సున్నా రూపం మరో సూత్రంతో నిషేధానికి గురైంది. 'పూచెంగలువలు'అనే ఒక్క రూపం మాత్రమే మిగులుతుంది.

11. గ, స, డ, ద, వా దేశ సంధి:

1. ప్రథమం మీది పరుషాలకు గ, స, డ, ద, వలు బహుళముగానగు. ప్రథమావిభక్తిలో ఉన్న పదాలకు పరమైన పదాల్లో ఉన్న పరుషాలకు (కచటతపలకు క్రమంగా గ, స, డ, వలు) బహుళంగా వస్తాయి.

ఉదా: వాడు + కొట్టె = వాడు గొట్టె
అపుడు + చనియె = అపుడుసనియె

2. ద్వంద్వ సమాసాల్లో పదాలపై పరుషాలకు గ, స, డ, ద, వలు ప్రాయికంగా వస్తాయి.

ఉదా: తల్లి + తండ్రి = తల్లిదండ్రులు

3. తెనుగుల మీది సాంస్కృతిక పరుషాలకు గ, స, డ, ద, వలు రావు. తెలుగు పదాలకు పరంగా వచ్చిన తత్సమ పదాల్లోని పరుషాలకు గ, స, డ, ద, వలు రావు.

ఉదా: వాడు + కంసారి = వాడు కంసారి
వీడు + చక్రపాణి = వీడు చక్రపాణి
(ఈ ఉదాహరణలో క, చ అనే పరుషాలకు గ,స,లు రాలేదు)

12. ఆమ్రేడిత సంధి:

1. అచ్చునకు ఆమ్రేడితం పరమైనప్పుడు సంధి తరచుగానగు. ద్విరుక్తం పదరూపం ఆమ్రేడితం. ఒక పదాన్ని రెండుసార్లు ఉచ్చరించినప్పుడు రెండోసారి ఉచ్చరించినదాన్ని ఆమ్రేడితమంటారు.

ఉదా: ఔర + ఔర (ఆమ్రేడితం) ఔరౌర
ఆహా + ఆహా = ఆహాహా

2. ఆమ్రేడితం పరమైనప్పుడు కడాదుల తొలి అచ్చు మీది వర్ణంబులకెల్లా అదంతంబగు ద్విరుక్తటకారంబగు (**కడాదులు:** కడ, చివర, తుద, మొదలు, తెరువు, నడుమ మొదలైనవి)

ఉదా: క(డ)ట్ట + కడ = కట్టకడ
చివ(ట్ట)ర + చివర = చిట్టచివర
కడాదుల్లో తొలి అచ్చు తర్వాత వర్ణాలన్నింటికీ లోపం వచ్చి వాటి స్థానంలో అదంతమైన ద్విత్వట్టకారం వచ్చింది.

3. అందదుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగా గ్రాహ్యములు.

ఉదా: అందుకు + అదుకు = అందదుకు
చెర + చెర = చెచ్చెర లాంటి రూపాలు యథావిధిగా గ్రహించవచ్చని చిన్నయ సూరి అభిప్రాయం.

13. పుంప్వాదేశ సంధి: కర్మధారయమందలి ము వర్ణానికి 'పుంపు'లగు ము వర్ణానికి 'పువర్ణం' బిందు పూర్వక పువర్ణం (ంపు) రెండు రూపాలు వస్తాయి.

ఉదా: సరసము + మాట = 1. సరసపు మాట
2. సరసంపు మాట
విరసము + వచనం = 1. విరసపు వచనం
2. విరసంపు వచనం

14. త్రిక సంధి:

1. ఆ, ఈ, ఏ అనే సర్వనామాలను త్రికములు అంటారు. **ఉదా:** ఆ + కన్య
2. త్రికంబు మీది అసంయుక్త హల్లునకు ద్విత్వం బహుళంగా వస్తుంది.
   ఉదా: ఆ + క్కన్య
3. ద్విరుక్తంబగు హల్లు పరమైనప్పుడు ఆచ్చికంబగు దీర్ఘం హ్రస్వం అవుతుంది.

ఉదా: ఆ + క్కన్య = అక్కన్య మూడు సూత్రాలతో - అక్కన్య రూపం వస్తుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ-మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
శుక్రవారం । 29-11-2024

మహారత్న హోదా ఉన్న కంపెనీలు ఏవి?

భారత పారిశ్రామిక రంగం

మహారత్నాలు

ఏడాదికి సరాసరి 25 వేల కోట్ల టర్నోవర్, 5 వేల కోట్ల ప్రాఫిట్ ఉన్న ప్రభుత్వ రంగ కంపెనీలను మహారత్నాలుగా ప్రకటిస్తారు. 2009 డిసెంబర్ నుంచి కంపెనీలకు మహారత్న హోదా ఇస్తున్నారు. ఈ హోదా ఉన్న పరిశ్రమలు నికర విలువలో 15శాతం వరకు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఉదా।। వ్యాపార ఒప్పందాలు, అదనపు సిబ్బంది నియామకాలు, యంత్రాల కొనుగోలు మొదలైన విషయాల్లో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఈ హోదా ఉన్న పరిశ్రమలు ఏడు. అవి..

1. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)
2. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)
3. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ)
4. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ)
5. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఏఐఎల్)
6. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జీఏఐఎల్)
7. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)

నవరత్నాలు

ఏడాదికి సరాసరి 10 వేల కోట్ల టర్నోవర్, 1000 కోట్ల ప్రాఫిట్ ఉన్న ప్రభుత్వ పరిశ్రమలను నవరత్నాలుగా ప్రకటిస్తారు. వీటిని 1997 జులై నుంచి గుర్తిస్తున్నారు. ఈ హోదా ఉన్న పరిశ్రమలు నికర విలువలో 15శాతం వరకు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవచ్చు.

నవరత్న హోదా ఉన్న కంపెనీలు..

1. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)
2. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)
3. కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐఎల్)
4. ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్)
5. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)
6. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)
7. మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్)
8. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎండీసీ)
9. నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఎల్‌సీఓ)
10. నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఎల్)
11. ఆయిల్ ఇండియా లిమిటెడ్(ఓఐఎల్)
12. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఎఫ్‌సీఎల్)
13. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)
14. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)
15. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీఎల్)
16. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌సీఐఎల్)
17. నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌బీసీసీ)

దేశంలోని వివిధ సంస్థలు వాటి ప్రధాన కార్యాలయాలు

1. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్-ముంబై
2. ఇండియన్ పెట్రో కెమికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్- వడోదర
3. ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ - ఆల్వే
4. నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ - న్యూఢిల్లీ
5. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ -పనాజీ
6. నేషనల్ కెమికల్ లేబొరేటరీ - పుణే
7. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ - కోల్‌కతా
8. సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - జోథ్‌పూర్
9. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ - నాగపూర్
10. సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - కాసర్‌గఢ్
11. సెంట్రల్ సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ -డెహ్రాడూన్
12. కాటన్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - ముంబై
13. నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ గ్రౌండ్ నట్ -జునాగఢ్
14. ఆటమిక్ ఎనర్జీ కమిషన్ -ముంబై
15. నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - నాగపూర్
16. ఇండియన్ గ్రాస్‌లాండ్ అండ్ ఫాడేర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - ఝాన్సీ
17. ఆంత్రోపాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా - కోల్‌కతా
18. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ - అహ్మదాబాద్

మాదిరి ప్రశ్నలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

1. రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో స్థాపించని ఇనుము-ఉక్కు కర్మాగారం?
   1) భిలాయ్ 2) దుర్గాపూర్
   3) రూర్కెలా 4) బొకారో
2. హిందూస్తాన్ ఫొటోఫిల్మ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ ఎక్కడ ఉంది?
   1) అజ్మీర్ 2) ఉదకమండలం
   3) ముస్సోరీ 4) బెంగళూరు
3. దేశంలో అతి పురాతన పరిశ్రమ?
   1) ఇనుము- ఉక్కు కర్మాగారం
   2) అల్యూమినియం కర్మాగారం
   3) నూలు పరిశ్రమ
   4) పంచదార పరిశ్రమ
4. శివకాశీ దేనికి ప్రసిద్ధి?
   1) అగ్గిపుల్లలు 2) ఆటబొమ్మలు
   3) లక్క 4) కాగితం
5. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) ముంబై 2) కోల్‌కతా
   3) న్యూఢిల్లీ 4) భోపాల్
6. ఫిరోజాబాద్‌లో కేంద్రీకృతమైన పరిశ్రమ?
   1) సిమెంట్ పరిశ్రమ
   2) రాగి పరిశ్రమ
   3) ఇనుము-ఉక్కు పరిశ్రమ
   4) గాజు పరిశ్రమ
7. హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎక్కడ ఉంది?
   1) విశాఖపట్నం 2) రాంచీ
   3) శ్రీనగర్ 4) బెంగళూరు
8. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఎక్కడ ఉంది?
   1) మద్రాస్ 2) బెంగళూరు
   3) హైదరాబాద్ 4) న్యూఢిల్లీ
9. రిషికేష్ దేనికి ప్రసిద్ధి?
   1) ఎరువులు
   2) సూక్ష్మజీవి నాశకాలు
   3) ఫొటోఫిల్మ్‌లు
   4) ఉన్ని దుస్తులు
10. రూర్కెలా కర్మాగారం ఏ నది ఒడ్డున ఉంది?
   1) భద్రా నది 2) సువర్ణరేఖ నది
   3) దామోదర్ నది 4) బ్రాహ్మిణి నది
11. స్పాంజ్ ఐరన్ ఉత్పత్తి జరిగే ప్రదేశం?
   1) విశాఖపట్నం 2) భద్రావతి
   3) పాల్వంచ 4) బళ్లారి
12. ఎలక్ట్రిక్ రైలు ఇంజన్ల తయారీ పరిశ్రమ ఎక్కడ ఉంది?
   1) పెంబర్తి 2) పెరంబదూర్
   3) వారణాసి 4) చిత్తరంజన్
13. గోల్డెన్ ఫైబర్ అని దేన్ని పిలుస్తారు?
   1) జనుము 2) సింథటిక్
   3) పట్టు 4) ఉన్ని
14. 1919లో ఇండియన్ ఐరన్ స్టీల్ కంపెనీని ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) కర్ణాటకలోని భద్రావతి
   2) బెంగాల్‌లోని బర్నాపూర్
   3) తమిళనాడులోని సేలం
   4) ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ తీరం
15. దేశంలో మొదటి యాంటీ బయోటిక్ పరిశ్రమను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) పింప్రి 2) సింద్రి
   3) రాణికేట్ 4) రాణిపేట
16. దేశంలో మొదటి ప్రభుత్వ రంగ చమురు శుద్ధి కర్మాగారం ఏది?
   1) దిగ్బాయ్ 2) గౌహతి
   3) ముంబై 4) విశాఖపట్నం
17. మొట్ట మొదటి సిమెంట్ పరిశ్రమను దేశంలో ఎక్కడ ఎప్పుడు నిర్మించారు?
   1) మహారాష్ట్ర (1912)
   2) గుజరాత్ (1912)
   3) ఆంధ్రప్రదేశ్ (1905)
   4) చెన్నై (1904)
18. దేశంలో మొట్టమొదటి ఉన్ని వస్త్ర పరిశ్రమను ఎక్కడ నెలకొల్పారు?
   1) పోర్టుగ్లాస్టర్ 2) లాల్ఇమ్లీ
   3) రిష్రా 4) హౌరా
19. భారత్‌లో జనపనార మిల్లులు ఎక్కువగా ఉన్న



రాష్ట్రం?
   1) ఉత్తరప్రదేశ్ 2) బిహార్
   3) పశ్చిమబెంగాల్ 4) జార్ఖండ్
20. మొట్టమొదటి ఉన్ని వస్త్రాగారం ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) కాన్పూర్ 2) లక్నో
   3) ధరివాల్ 4) శ్రీనగర్
21. విమానాల పరికరాలు, విడిభాగాలు ఎక్కడ తయారవుతాయి?
   1) హైదరాబాద్ 2) కోల్‌కతా
   3) లక్నో 4) గోవా
22. దుర్గాపూర్ ఇనుము-ఉక్కు కర్మాగారం ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఒడిశా 2) జార్ఖండ్
   3) మధ్యప్రదేశ్ 4) పశ్చిమ బెంగాల్
23. భిలాయ్ ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని ఏ దేశ సహకారంతో నిర్మించారు?
   1) యూఎస్ఏ 2) యూఎస్ఎస్ఆర్
   3) యూకే 4) జర్మనీ
24. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఎప్పుడు స్థాపించారు?
   1) 1961 2) 1973
   3) 1971 4) 1959
25. హిందూస్థాన్ ఫొటోఫిల్మ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ ఎక్కడ ఉంది?
   1) నాగపూర్ 2) ముంబై
   3) ఊటీ 4) బెంగళూరు
26. 'భారత హెవీ ప్లేట్స్ అండ్ వెస్సల్స్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) పాల్వంచ 2) బెంగళూరు
   3) భోపాల్ 4) విశాఖపట్నం
27. రక్షణ సామగ్రిని ఉత్పత్తి చేసే ప్రాగాటూల్స్ ఎక్కడ ఉంది?
   1) సికింద్రాబాద్ 2) భోపాల్
   3) రూప్ నారాయణ్‌పూర్
   4) హరిద్వారా
28. కిందివాటిలో మహారత్న హోదా లేని సంస్థ ఏది?
   1) ఎన్‌టీపీసీ 2) బీహెచ్ఈఎల్
   3) హెచ్ఏఎల్ 4) ఓఎన్‌జీసీ
29. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ఎక్కడ ఉంది?
   1) ఆల్వే 2) పనాజీ
   3) జోథ్‌పూర్ 4) నాగపూర్
30. నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ గ్రౌండ్ నట్ ఎక్కడ ఉంది?
   1) వడోదర 2) కోల్‌కతా
   3) జునాగఢ్ 4) పుణే
31. భారతదేశ ప్రభుత్వ రంగ సంస్థలకు ఏ సంవత్సరం నుంచి నవరత్న హోదా ప్రకటిస్తున్నారు?
   1) 2009 2) 1991
   3) 2007 4) 1997
32. అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ఎక్కడ స్థాపించారు?
   1) జాయక్ నగర్ 2) వార్‌బోర్న్
   3) చెన్నై 4) భిలాయ్
33. దేశంలో మొట్ట మొదటి ఎరువుల పరిశ్రమ ను ఎక్కడ ప్రారంభించారు?
   1) రామగుండం 2) రాణిపేట
   3) తాల్చేర్ 4) పానిపట్
34. విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఛత్తీస్‌గఢ్ 2) కేరళ
   3) పశ్చిమబెంగాల్ 4) కర్ణాటక
35. దేశంలో మొదటి కాగిత పరిశ్రమను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) అహ్మదాబాద్ 2) రిష్రా
   3) సేరంపూర్ 4) చిత్తరంజన్

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 1; 5) 3; 6) 4; 7) 2; 8) 3; 9) 2; 10) 4; 11) 3; 12) 4; 13) 1; 14) 2; 15) 1; 16) 2; 17) 4; 18) 2; 19) 3; 20) 1; 21) 3; 22) 4; 23) 2; 24) 2; 25) 3; 26) 4; 27) 1; 28) 3; 29) 2; 30) 3; 31) 4; 32) 1; 33) 2; 34) 4; 35) 3.

What is Miloni's overall percentage?

MODEL QUESTIONS

BANK EXAMS

QUANTITATIVE APTITUDE

1. The length of a rectangle is three-fifth the side of a square. The radius of a circle is equal to side of the square. The circumference of the circle is 132 cm. What is the area of the rectangle if the breadth of the rectangle is 8 cm.?
   a) 112.4 sq.cm.
   b) 104.2 sq.cm.
   c) 100.8 sq.cm
   d) 114.0 sq.cm.
   e) None of these
2. Five- ninth of a number is equal to twenty five percent of second number. Second number is equal to one-fourth of third number. The value of third number is 2960. What is 30 percent of first number?
   a) 88.8 b) 99.9 c) 66.6
   d) 77.7 e) None of these
3. The respective ratio between present age of Manoj and Wasim is 3:11. Wasim is 12 years younger than Rehana. Rehana's age after 7 years will be 85 years. What is the present age of Manoj's father who is 25 years older than Manoj?
   a) 43 years b) 67 years
   c) 45 years d) 69 years
   e) None of these.
4. Dinesh's monthly income is four times Suresh's monthly income. Suresh's monthly income is twenty percent more than Jyothi's monthly income. Jyothi's monthly income is Rs.22,000/. What is Dinesh's monthly income?
   a) Rs. 1,06,500/- b) Rs. 1,05,600/-
   c) Rs. 1,04,500/- d) Rs. 1,05,400/-
   e) None of these
5. Smallest side of a right angled triangle is 8 cm less than the side of a square of perimeter 56 cm. Second largest side of the right angled triangle is 4 cm less than the length of rectangle of area 96 sq.cm. and breadth 8 cm. What is the largest side of the right angled triangle?
   a) 20cm b) 12cm c) 10cm
   d) 15cm e) None of these
6. The ratio between the adjacent angles of a parallelogram is 7:8 respectively. Also the ratio between the angles of quadrilateral is 5:6:7:12. What is the sum of the smaller angle of parallelogram and second largest angle of the quadrilateral?
   a) 168° b) 228° c) 156°
   d) 224° e) None of these
7. Raju runs 1250 meters on Monday and Friday. Other days he runs 1500 meters except Sunday(He does not run on Sunday). How many kilometers will he run in 3 weeks (first day starting from Monday)?
   a) 12.5kms b) 20.5 kms
   c) 8.5 kms d) 25.5 kms
   e) None of these
8. The sum of nine consecutive odd numbers of set-A is 621. What is the sum of different set of six consecutive even numbers whose lowest number is 15 more than the lowest number of set-A?
   a) 498 b) 468 c) 478
   d) 488 e) None of these
9. In a school there are 250 students out of whom 12 percent are girls. Each girl's monthly fee is Rs. 450/- and each boy's monthly fee is 24 percent more than a girl. What is the total monthly fee of a girl and boys together?
   a) Rs. 1,36,620/- b) Rs. 1,36,260/-
   c) Rs. 1,32,660/- d) Rs. 1,32,460/-
   e) None of these
10. The average speed of a train is $\frac{10}{7}$ times the average speed of a car. The car covers a distance of 588 kms in 6 hours. How much distance will the train cover in 13 hours?
   a) 1750kms b) 1760kms
   c) 1720kms d) 1820kms
   e) None of these
11. What would be the cost of laying a carpet on a floor which has, its length and breadth in the respective ratio of 32:21 and where its perimeter is 212 feet, if the cost per square foot of laying the carpet is Rs. 2.5?
   a) Rs. 6,720/- b) Rs.5,420/-
   c) Rs. 7,390/- d) Rs. 7,890/-
   e) None of these.
12. The simple interest accrued on a amount at the end of five years at 12.5 p.c.p.a is Rs. 1,575/-, what is the amount?
   a) Rs. 2,050/-
   b) Rs. 2,550/-
   c) Rs. 2,250/-
   d) Rs.2,520/-
   e) None of these
13. A 260 meters long train crosses a platform thrice its length in 80 seconds. What is the speed of the train in Kms/hour?
   a) 52.4 b) 46.8 c) 35.1
   d) 64.1 e) None of these
14. If the cost of 8 erasers and 5 sharpeners is Rs.31/-, what will be the cost of 24 erasers and 10 sharpeners?
   a) Rs.62/- b) Rs.84/-
   c) Rs.78/- d) Rs.80/-
   e) Cannot be determined
15. In how many different ways can the letters of the word 'PRETTY' be arranged?
   a) 120 b) 36 c) 360
   d) 720 e) None of these
16. A boat while travelling upstream covers a distance of 18 kms. at the speed of 3 Kms/hr. whereas while travelling downstream it covers the same distance at the speed of 9 kms/hr. what is he speed of the boat in still waters?
   a) 3 kms/hr b) 5 kms/hr
   c) 7kms/hr d) 8 kms/hr
   e) None of these
17. What is the area of a circle whose circumference is 132cms.?
   a) 1562 sq.cms. b) 1386 sq.cms.
   c) 1434 sq.cms. d) 1643 sq.cms.
   e) None of these
18. Shreya's bought an article and sold it for 125% percent of its cost price. What was the cost price of the article, if Shreyas sold it for Rs.30,750/-?
   a) Rs.24,600/- b) Rs.24,640/-
   c) Rs.24,250/- d) 23,200/-
   e) None of these
19. The ages of Mira Tina and Sania are in the ratio of 6:4:7 respectively. If the sum of their ages is 34 years, what is Sania's age?
   a) 12 years b) 10 years
   c) 18 years d) 20 years
   e) None of these
20. A basket contains three red and four green balls. If four balls are drawn at random from the basket, what is the probability that two are red and two are green?
   a) $\frac{4}{7}$ b) $\frac{2}{7}$ c) $\frac{18}{35}$
   d) $\frac{3}{14}$ e) None of these

Direction (Q. 21-25): Each of the questions given below consists of a question and two statements numbered I and II given below. You have to decide whether the data provided in the statements is sufficient to answer the question Read both the statements and

Give answer (a): If the data in the statement I alone is sufficient to answer the question, while the data in statement II alone is not sufficient to answer the question.

Give answer (b): If the data in the statement II alone is sufficient to answer the question, while the data in statement I alone is not sufficient to answer the question

Give answer (c): If the data statement I alone or in statement II alone is sufficient to answer the question.

Give answer (d): if the data in both the statements I and II is not sufficient to answer the question.

Give answer (e): If the data in both statements I and II together is necessary to answer the question.

21. What is the product of X and Y?
   I) Y=X–28 II) –42 –12=X
22. What is the rate of interest % p.(a).?
   I) An amount double itself in five years at simple interest.
   II) Simple interest of Rs.1,600/- is obtained in two years on an amount of Rs.4,000/-
23. In how many hours can an A alone complete the piece of work?
   I) B alone can complete the piece of work in 28 hours.
   II) A,B and C together can complete the piece of work in 18 hours.
24. What will Anjali's age be five years from now?
   I) Anjali's present age is twice Tosha's present age.
   II) Tosha who is half Anjali's present age, was 21 years old five years ago.
25. What is the perimeter of the square?
   I) The measure of one of its side is 10 cms.
   II) The measure of its diagonal is 10 cms.

Direction (Q. 26-30): Study the following table carefully to answer the questions that follow:

Percentage of marks obtained by five students in three subjects

Subject (Max. Marks)	Maths (150)	Science (100)	English (50)
Student			
Miloni	94	83	74
Satish	72	88	68
Rachana	86	75	66
Purab	90	61	82
Mansi	68	67	72

26. What are the total marks obtained by Satish in all the subjects together?
   a) 230 b) 232 c) 228
   d) 226 e) None
27. What are the average marks obtained by all the students in Maths?
   a) 137 b) 123 c) 127
   d) 132 e) None
28. What is Miloni's overall percentage in the exam?
   a) 75 b) 79 c) 87
   d) 85 e) None
29. What is the respective ratio of marks obtained by Purab in Science and English together to the marks obtained by Rachana in the same subjects?
   a) 17:18 b) 11:13
   c) 15:19 d) 21:23
   e) None
30. How many students have highest scored more than one subject?
   a) None b) One c) Three
   d) Two e) Four

(Q.31-35): Study the table carefully to answer the questions that follow-

Product of People	Total No.	Percentage of People		
		Men	Women	Children
A	46280	35	25	40
B	45540	25	35	40
C	32240	25	55	20
D	60430	20	50	30
E	36230	10	20	70
F	53990	40	40	20

31. What is the total number of children selecting Product E?
   a) 27172 b) 25361
   c) 23413 d) 21781
   e) None
32. What is the average number of women selecting all the Products together?
   a) 20859 b) 18765
   c) 19076 d) 17383
   e) None
33. What is the respective ratio of total number of women selecting Product A to those selecting Product D?
   a) 1:3 b) 42:51
   c) 2314:6043
   d) 413:678
   e) None
34. Number of children selecting Product C forms what percent of those selecting Product B? (rounded of to two digits after decimal)
   a) 35.40 b) 287.10
   c) 59.71 d) 185.40
   e) None
35. Total number of men selecting Product F forms approximately what percent of the total number of people selecting all the Products together?
   a) 19 b)14 c) 3
   d) 23 e) 8

KEY

1) c; 2) b; 3) a; 4) b; 5) c; 6) a; 7) d; 8) e; 9) b; 10) d; 11) a; 12) d; 13) b; 14) e; 15) c; 16) e; 17) b; 18) a; 19) e; 20) c; 21) e; 22) c; 23) d; 24) b; 25) c; 26) a; 27) b; 28) c; 29) a; 30) a; 31) b; 32) d; 33) c; 34) a; 35) e.